

ఈనాడు

విజయవాడ 16-8-2017 బుధవారం సిటీ సంపుటి 44 . సంచిక 7

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 14+20 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Anantapur, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam,Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



భారత్ జోడో

ఎర్రకోటపై ఎగిరిన మువ్వన్నెల జెండా



ఎర్రకోట పైనుంచి జాతినుద్దేశించి ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

- అభివృద్ధిలో అందర్నీ కలుపుకొని వెళ్లాలి
- మతవిశ్వాసాల పేరుతో హింసను మన దేశం సహించదు
- పెద్ద నోట్ల రద్దుతో రూ.1.75లక్షల కోట్ల నల్లధనాన్ని వెలికితీశాం: ప్రధాని మోదీ
- వచ్చే ఐదేళ్లలో నవభారత నిర్మాణం సాధ్యం కావాలని పిలుపు

2లో

'భారత్ జోడో (సమైక్య భారతావని) అనేది నేటి మన నినాదం కావాలి. మన దేశాన్ని ముందుకు నడిపించేందుకు ప్రతిఒక్కరూ కలిసికట్టుగా ముందుకు నడవాలి. నాడు క్విట్ ఇండియా పేరిట భారత్ ఛోడో అంటూ నినదించారు. అయితే, ఇప్పుడు భారత్ జోడో అంటూ చేయి చేయి కలిపి ముందడుగేయాలి. 'సమృద్ధ భారత్' సాధనకు బలమైన ఆర్థిక వ్యవస్థ కావాలి. 21వ శతాబ్దంలోకి భారత్ దూసుకెళ్లాలి. అద్భుత సామర్థ్యాలు, మానవవనరుల బలం, సహజ సంపద, శ్రామికశక్తి మనసొంతం.'

ఫ్లాష్... ఫ్లాష్...



మంగళవారం అర్ధరాత్రి దాటాక 2.40 గంటల ప్రాంతంలో.. బోరు బావి నుంచి సురక్షితంగా బయటపడిన ఏడాదిన్నర వయసు బాలుడు చంద్రశేఖర్‌కు 108 వాహనంలో ప్రాథమిక చికిత్స అందజేస్తున్న దృశ్యం

బోరును జయించిన బాలుడు

- బోరుబావిలో పది గంటలపాటు నరకయాతన
- తెల్లవారుఝాము 2.40 గంటలకు క్షేమంగా బయటకు
- వినుకొండ మండలం ఉమ్మడివరంలో ఘటన

12లో

మెట్టనింట జలసిరి

- 4 దశాబ్దాల కల సాకారం
- పురుషోత్తపట్నం ఎత్తిపోతల ప్రారంభోత్సవంలో సీఎం
- కాపులకు ఇచ్చిన హామీని అమలు చేస్తా
- నా నిజాయతీని నిరూపించుకుంటా
- జగ్గంపేట సభలో చంద్రబాబు

ఈనాడు - రాజమహేంద్రవరం, కాకినాడ

తూర్పుగోదావరి జిల్లాలో మెట్ట ప్రాంత రైతుల నాలుగు దశాబ్దాల కలను పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా నెరవేర్చుతున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఎత్తిపోతల వద్ద ఏర్పాటు చేసిన రెండు మోటార్లను స్విచ్ ఆన్ చేసిన అనంతరం చంద్రబాబు గోదావరిలో పూలు, పసుపు కుంకుమలు చల్లి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసి ప్రతి ఎకరాకు నీరిందించాలని భావిస్తోందని తెలిపారు. వాటర్‌గ్రిడ్ (మిగతా 2లో)



పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ప్రారంభం అనంతరం గోదావరికి పూజలు చేసి పూలు చల్లుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు



360 టీఎంసీల వృథా

- గోదావరి నుంచి సముద్రంలోకి...
- కృష్ణా మాత్రం నిరాశాజనకం
- శ్రీశైలంలోకి నీరు వచ్చింది లేదు

2లో

రెండు నెలల్లో నిరుద్యోగ భృతి

- 3 నెలల్లో 28 ప్రాజెక్టులు
- విజయదశమిలోగా అన్న క్యాంటీన్లు
- సమరయోధుల పింఛను రూ.15వేలకు పెంపు
- స్వాతంత్ర్య వేడుకల్లో సీఎం

11లో

ఇదీ సంగతి!



పదేళ్లలో ఒక్కరోజైనా అలా మాట్లాడనివ్వకపోతిరి!

పేదలను లూటీ చేసిన వారు నేడు ప్రశాంతంగా నిద్రించలేని పరిస్థితి ఉంది. దీనివల్ల.. కష్టపడేవారు, నిజాయతీపరుల్లో విశ్వాసం పెరుగుతోంది. తన మంచితనానికి గుర్తింపు దక్కిందని నిజాయతీపరులు అనుకుంటున్నారు. ఇదో కొత్త ఆశాకిరణం. ఎన్నో ఏళ్లుగా మూలనపడిన బినామీ సంపదను స్వాధీనం చేసుకొనే చట్టాన్ని మేం వచ్చిన తర్వాత ఆచరణలోకి తీసుకొచ్చాం. ఇంత కొద్ది సమయంలోనే రూ.800 కోట్లకుమించిన బినామీ ఆస్తులను స్వాధీనం చేసుకున్నాం.

మదిలోని ఆలోచనకు మహత్తర శక్తి ఉంది. ఇంట్లో మనం చేసుకొనే వంట భగవంతుడి ముందుపెట్టినప్పుడు అది ప్రసాద రూపాన్ని సంతరించుకుంటుంది. అలాగే మనం చేసే ప్రతి పనీ భరత మాత కోసం, దేశ శ్రేయస్సు కోసం, పేదరిక నిర్మూలనకోసం అన్న భావనతో చేస్తే దాని పరిణామాలు అధికస్థాయిలో ఉంటాయి.

రాబోయే 2018 జనవరి 1 సామాన్యమైంది కాదు. 21వ శతాబ్దంలో పుట్టిన వారికి 18 ఏళ్లు నిండుతాయి. దేశ భవితను తీర్చిదిద్దే అవకాశం వారికి దక్కింది.

స్వతంత్ర భారతావనికి ఈ ఏడాది చాలా ప్రత్యేకం. గత వారం మనం క్విట్ ఇండియా ఉద్యమ 75వ వసంతాన్ని జరుపుకొన్నాం. చంపారన్ సత్యాగ్రహం, సబర్మతీ ఆశ్రమ శత వార్షికోత్సవాలను జరుపుకొంటున్నాం. స్వరాజ్యం నా జన్మహక్కని లోకమాన్య తిలక్ నినదించి కూడా ఈ ఏడాదే వందేళ్లు పూర్తయింది. గణేశ్ ఉత్సవాలకు ఇది 125 వార్షికోత్సవం. దేశ హితం కోసం మనం పునరంకితమయ్యేలా ఇవి ప్రేరణ నింపుతున్నాయి.

2022 నాటికి స్వాతంత్రం సిద్ధించి 75 ఏళ్లవుతుంది. 1942 నుంచి 1947 వరకు దేశంలో సమష్టి సంకల్పం ప్రస్ఫుటమైంది. ఫలితంగా ఆంగ్లేయులు మన దేశాన్ని వదిలిపెట్టివెళ్లారు. 75 ఏళ్ల స్వాతంత్ర్య ఉత్సవాలు జరుపుకోవడానికి ఇంకా ఐదేళ్లు ఉన్నాయి. సమష్టి సంకల్ప శక్తి ద్వారా 2022 నాటికి స్వాతంత్ర్య సమరయోధుల కలలను సాకారం చేసే దిశగా నవభారతాన్ని ఆవిష్కరించాలి.

భారత్ జోడో


ఎర్రకోట పైనుంచి ప్రసంగించిన అనంతరం చిన్నారులతో సరదాగా ముచ్చటిస్తున్న ప్రధాని మోదీ

ఈనాడు – దిల్లీ

స్వాతంత్ర సాధన కోసం భారత్ చోడో నినదించినట్లుగానే ఇప్పుడు భారత్ జోడో నినాదంతో ముందుకెళ్లాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారు.. అభివృద్ధిలో అందర్నీ కలుపుకొని వెళ్లాలని అభిప్రాయపడ్డారు. మతవిశ్వాసాల పేరుతో హింసాత్మక చర్యలను సహించేది లేదని హెచ్చరించారు. భారత్ ఇలాంటి సంస్కృతిని అంగీకరించదని స్పష్టం చేశారు. కులతత్వాన్ని, మతతత్వాన్ని కాలకూట విషంగా అభివర్ణించారు. 71వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఆయన ఎర్ర కోట బురుజుల నుంచి జాతినుద్దేశించి ప్రసంగించారు. 56 నిమిషాల పాటు సాగిన ఈ ప్రసంగంలో ఆధార్ నుంచి అంతరిక్షం దాకా అన్ని అంశాలనూ స్పృశించారు. 75 ఏళ్ల స్వాతంత్ర్యదినోత్సవం జరుపుకొనే 2022 నాటికి దేశంలో ప్రతి పేదకూ పక్కా ఇళ్లు నిర్మించేలా పని చేయాలని పిలుపునిచ్చారు. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ అమలు, నల్లధనంపై కొరడా సహా తన ప్రభుత్వం చేపట్టిన అనేక సంస్కరణలను, పథకాలను ప్రస్తావించారు. అవినీతిపై పోరాటం ఆగదన్నారు.

హింసతో అట్టుడుకుతున్న కశ్మీర్‌లోని ప్రజల హృదయాలను స్పృశించేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రయత్నించారు. తిట్లు, తూటాలతో సమస్యలు పరిష్కారం కావని పేర్కొన్నారు. కశ్మీరీలను అక్కున చేర్చుకోవడం ద్వారానే అవి సమసిపోతాయన్నారు. ఉగ్రవాదంపై పోరులో ఉదాశీనత ఉండదని చెప్పారు.

ప్రధాని హోదాలో ఆయన చేసిన నాలుగో స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగమిది. అన్నింటి కన్నా ఇదే అత్యంత చిన్న ప్రసంగం. తన ట్రేడ్‌మార్క్ అర చేతుల కుర్తా, చుడీదార్ పైజామా, రాజస్థానీ తలపాగాతో ఈ వేడులకు ప్రధాని విచ్చేశారు. ఈ కార్యక్రమానికి పాఠశాలల విద్యార్థులతోపాటు వేల మంది ప్రేక్షకులు హాజరయ్యారు. మంగళవారం జన్మాష్టమి కూడా కావడంతో పలువురు చిన్నారులు కృష్ణుడి వేషధారణలో వచ్చి అలరించారు. ప్రధాని ప్రసంగంలోని ప్రధానాంశాలివీ..

అంజలి..

● నేడు జాతి యావత్తు స్వాతంత్ర్య దినోత్సవం తోపాటు జన్మాష్టమిని కూడా జరుపుకొంటోంది. అనేకమంది బాల కన్నయ్యలు ఇక్కడికి తరలి వచ్చారు. సుదర్శన చక్రధారి మోహన్ (కృష్ణుడు) మొదలు చరఖధారి మోహన్ (మహాత్మా గాంధీ) వరకూ ఘనమైన సాంస్కృతిక, చారిత్రక వారసత్వం మన సొంతం. అది మనకు గర్వకారణం. దేశ స్వాతంత్ర్యం, ప్రతిష్ఠ కోసం ప్రాణత్యాగం చేసిన, అనేక బాధలను అనుభవించిన మహనీయులకు శిరస్సు వంచి అంజలి ఘటిస్తున్నా.

విపత్తులతో ఇబ్బందులు..

● మంచి వర్షాల వల్ల దేశం సుసంపన్నమవుతుంది. అయితే వాతావరణ మార్పుల వల్ల కొన్నిసార్లు అవి ప్రకృతి విపత్తులుగా మారుతున్నాయి. దేశంలోని పలు ప్రాంతాలు ఇటీవల వీటి తాకిడికి గురయ్యాయి. ఒక ఆసుపత్రిలో.. మన చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. దేశవాసులంతా బాధిత కుటుంబాలకు సంఘీభావం తెలిపారు. ఈ సంక్షోభ సమయంలో యావత్ ప్రజల క్షేమం కోసం సర్వశక్తులూ ఒడ్డుతానని దేశవాసులకు హామీ ఇస్తున్నా.

చిన్నాపెద్దా తేడా లేదు..

125 కోట్ల ప్రజల సామూహిక శక్తి ఎంతో మనకు తెలుసు. శ్రీకృష్ణుడు చాలా శక్తిమంతుడు. కానీ గోపాలకులు వచ్చి ఆయనకు మద్దతుగా నిలబడినప్పుడే ఆయన గోవర్ధన పర్వతాన్ని నిలబెట్టారు. శ్రీరామచంద్రుడు లంకకు వెళ్లేటప్పుడు వానరసేన సాయం చేసి రామసేతును నిర్మించాయి. మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ కూడా సామూహిక శక్తిని జ్వలింపజేసి.. నూలు, చరఖాతో దేశానికి స్వాతంత్ర్యం అందించారు. రామసేతు నిర్మాణంలో ఉడతకూడా సాయం చేసింది. 125 కోట్ల దేశ ప్రజల్లో చిన్న, పెద్ద అన్న తేడా లేదు. అందరూ కృషిచేసి 2022 కల్లా దేశంలో మార్పును తీసుకురావాలి. భద్రమైన, సుభిక్షమైన, బలమైన దేశాన్ని ఆవిష్కరించాలి. ఆ నవీన భారతంలో అందరికీ సమానావకాశాలు ఉండాలి. ప్రపంచ యవనికపై దేశానికి మంచి పేరు తీసుకురావడంలో ఆధునిక శాస్త్ర సాంకేతిక రంగం ముఖ్య పాత్ర పోషించాలి.

యథా భావం.. తథా ఫలితం..

కురుక్షేత్ర యుద్ధంలో అర్జునుడు శ్రీకృష్ణుడికి ఎన్నో ప్రశ్నలు వేశాడు. అందుకు కృష్ణుడు స్పందిస్తూ మనసులోని భావనను బట్టి ఫలితం ఉంటుందని చెప్పారు. మనం ఉజ్వల భారతం కోసం సంకల్పబద్ధులమైతే.. ఇప్పటివరకూ మునిగి తేలిన నైరాశ్యం నుంచి బయటపడి ఆత్మవిశ్వాసంతో ముందడుగువేస్తాం.

● నడుస్తోంది... నడవనివ్వు... అన్న భావనను వదిలిపెట్టాలి. ఆ జమానాకు కాలం చెల్లింది. ఇప్పుడు మార్పు మొదలైంది. మార్పు జరుగుతోంది. దేన్నైనా మార్చగలను అన్న విశ్వాసం మనస్సులో ఉంటే మనం ఏదైనా సాధించగలుగుతాం. మనం చేసే పనిలో చిత్తశుద్ధి, త్యాగం ఉంటే కచ్చితంగా మార్పు సాధ్యమవుతుంది.

● దేశ భద్రతే మా ప్రాథమిక లక్ష్యం. సముద్రమైనా, సరిహద్దులైనా, సైబర్ అయినా, అంతరిక్షమైనా ప్రతిరంగంలో భారత్ సుభద్రంగా ఉంది. దేశ వ్యతిరేకుల కుట్రలను తిప్పికొట్టే శక్తి మనకుంది.

● మూడుపర్యాయాలు తలాక్ అనడం ద్వారా భార్యను విడిచి పెట్టేసే పోకడలకు వ్యతిరేకంగా ఉద్యమాలుచేపట్టిన మహిళలను హృదయపూర్వకంగా అభినందిస్తున్నా.

● జిల్లా స్థాయిలో డయాలిసిస్ కేంద్రాలను ఏర్పాటు చేస్తాం. 350-400 జిల్లాల్లో ఇప్పటికే ఉచిత డయాలిసిస్ సేవలు మొదలయ్యాయి.

● నిరుపేదలందరికీ... పక్కా ఇళ్లు... కరెంటు, నీటి వసతి ఉండే భారత్‌ను నిర్మించుకుందాం. రైతులంతా నిశ్చింతగా నిదురించగలిగే భారతావనిని సుసాధ్యం చేసుకుందాం. యువత, మహిళాశక్తి తమ తమ కలలను సాకారం చేసుకునేందుకు పుష్కలమైన అవకాశాలను కల్పించే దేశాన్ని ఏర్పాటు చేసుకుందాం. తీవ్రవాదం, మతతత్వాలకు అతీమైన భారత్‌ను... పరిశుభ్రమైన, ఆరోగ్యంతో కళకళలాడే దేశాన్ని నిర్మించుకుందాం. 'టీమ్ ఇండియా" సరికొత్త వాగ్దానాలతో ముందడుగేయాల్సిందిగా ఆశిస్తున్నాను. పిలుపునిస్తున్నాను.

కశ్మీర్‌ను స్వర్గధామం చేస్తాం

● జమ్మూకశ్మీర్ అభివృద్ధి, అక్కడి సామాన్యప్రజల కలలను సాకారం చేయడంపై అక్కడి ప్రభుత్వానికే కాదు.. మాకూ బాధ్యత ఉంది. ఆ రాష్ట్రాన్ని తిరిగి స్వర్గధామంగా చేసేందుకు కట్టుబడి ఉన్నాం. కశ్మీర్‌పై మాటల యుద్ధం, రాజకీయాలు జరుగుతున్నాయి. అతికొద్ది మంది వ్యాప్తి చేస్తున్న వేర్పాటువాదంపై ఎలా గెలుపు సాధించాలన్నదానిపై నాకు విస్పష్ట అభిప్రాయాలు ఉన్నాయి. తిట్ల ద్వారా కానీ తూటాల ద్వారా కానీ ఈ సమస్య పరిష్కారం కాదు. అక్కడున్న ప్రతిఒక్కరినీ అక్కున చేర్చుకున్నప్పుడే సమస్య పరిష్కారమవుతుంది. ఈ సంకల్పంతో ముందుకెళుతున్నాం.

● ప్రజాస్వామ్యం ఎన్నికలకే పరిమితం కాకూడదు. నవభారతంలో ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. ప్రజలను వ్యవస్థ నడిపించడంకాకుండా, ప్రజలే వ్యవస్థను నడిపించే ప్రజాస్వామ్య వ్యవస్థను నిర్మించే దిశగా వెళ్తున్నాం.

● "స్వరాజ్యం నా జన్మహక్కు' అంటూ లోకమాన్య తిలక్ గర్జించాడు. మరి స్వాతంత్ర్య భారతావనిలో ఉన్న మనం ఇప్పుడు "సుపరిపాలన నా జన్మహక్కు' అన్న నినాదంతో ముందుకు సాగాలి. సుపరిపాలన(సురాజ్) మన సమష్టి బాధ్యత. పౌరులు తమ విధులను చిత్తశుద్ధితో నిర్వర్తించాలి. అలాగే ప్రభుత్వ కూడా తన బాధ్యతలను కొనసాగించాలి. 'స్వరాజ్" నుంచి 'సురాజ్'కు మన పయనంలో పౌరులు ఎక్కడా వెనకబడకూడదు.

● పెద్దనోట్ల రద్దు ప్రకటన నిజానికి ప్రపంచదేశాలను ఆశ్చర్యంలో ముంచెత్తింది. ఇక మోదీ అధికారానికి ఇదే ఆఖరి రోజు అని చాలా మంది అనుకున్నారు. కానీ.., 125 కోట్ల భారతీయులు స్పందించిన విధానం...చూపిన సహనం...విశ్వసించిన తీరు శ్లాఘనీయం. ఆ సహనం, అపార విశ్వాసమే అవినీతి అంతం దిశగా ఒక్కోచర్యా తీసుకోవడానికి దోహదపడింది.

● పెద్ద నోట్ల రద్దు తర్వాత ఏనాడూ బ్యాంకు వ్యవస్థలోకే రాకుండా ఉండిపోయిన దాదాపు రూ.3 లక్షల కోట్లు వెలుగుచూశాయి. రూ.2లక్షల కోట్ల నల్లధనం బ్యాంకుల్లో డిపాజిట్ అయింది. గతేడాది కేవలం 22 లక్షల మంది ఆదాయపన్ను రిటర్న్‌లను దాఖలు చేయగా ... ఈ దఫా వారి సంఖ్య 56 లక్షలకు చేరిన విషయం గమనార్హం.

● ప్రకటించిన దానికంటే ఆదాయం ఎక్కువగా ఉన్న 18లక్షలకు పైగా ప్రజలను గుర్తించాం. ఆదాయ పన్ను చెల్లింపుదారుల సంఖ్య పెరిగింది. హవాలా కార్యకలాపాలు నిర్వర్తిస్తున్న సుమారు 3 లక్షల డొల్ల కంపెనీల్లో...1.75 లక్షల సంస్థల రిజిస్ట్రేషన్‌లు రద్దయినాయి. నల్లధనంపై మేము మహాసంగ్రామమే చేశాం.

360 టీఎంసీల వృథా

ఈనాడు, అమరావతి: ఒక వైపు నీటి కరవు.. మరో వైపు సముద్రంలోకి వందల టీఎంసీలు వృథాగా పోతున్న దృశ్యం ఈ ఏడాదీ రాష్ట్రంలో కనిపిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో ఒక వైపు కృష్ణా జలాశయాల్లోకి నీరు రాక తాగునీటికి సైతం నీరందడం లేదు. ఆయకట్టు వెలవెలబోతోంది. మరో వైపు గోదావరిలో వందల టీఎంసీల నీరు వృథాగా సముద్రంలో కలుస్తోంది. సాధారణంగా ఆగస్టులో శ్రీశైలం జలాశయం నిండటం అనుభవమే. ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభమై మూడో నెల సగం గడిచింది. 129.72 టీఎంసీల సామర్థ్యం ఉన్న ఆలమట్టి జలాశయంలోకి ఇంతవరకు 154.43 టీఎంసీల నీరు వచ్చింది. అక్కడినుంచి వివిధ మార్గాల్లో బయటకు చేరింది. కర్ణాటకలోని నారాయణపూర్ జలాశయం 37.84 టీఎంసీల పూర్తి నిల్వ సామర్థ్యం కాగా ఇప్పటికే 41 టీఎంసీల నీరు చేరింది. అలాంటిది శ్రీశైలం జలాశయంలోకి ఈ నీటి సంవత్సరంలో వచ్చిన నీరు కేవలం 3.58 టీఎంసీలే. తుంగభద్రలోనూ ఇంత నీటి కరవు ఎప్పుడూ లేదు. వంద టీఎంసీల పూర్తి నిల్వ సామర్థ్యానికి ఇంతవరకు 50 టీఎంసీలే చేరింది. ఈ పరిస్థితుల్లో కృష్ణా పరిధిలోని ఆయకట్టుకు ఎప్పుడు నీరందుతుందనేది అంచనా వేయడమూ కష్టమే. ఆలమట్టి నుంచి నీటిని విడుదల చేయాలని ఇప్పటికే తెలంగాణ కర్ణాటకకు లేఖ రాయగా.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమూ లేఖ రాయడానికి సిద్ధమైంది. మరోవైపు గోదావరిలో కళ కనిపిస్తోంది. సాధారణ పరిస్థితులతో పోలిస్తే అందులోనూ వరద తక్కువగానే ఉన్నప్పటికీ ఇప్పటికే 350 టీఎంసీల నీరు ధవళేశ్వరం కాటన్ బ్యారేజిదాటి గోదావరి పాయల మీదుగా సముద్రంలో కలిసింది. కిందటి నీటి సంవత్సరం మొత్తం మీద అంటే 2016 జూన్ ఒకటి నుంచి 2017 మే 31 వరకు 2896 టీఎంసీల నీళ్లు వృథాగా సముద్రంలో కలిశాయి. గోదావరి నీటి సద్వినియోగంపై రూపొందిస్తున్న ప్రణాళికలు కొలిక్కిరావాల్సి ఉంది. గోదావరి పెన్నా అనుసంధానానికి దాదాపు రూ.60 వేల కోట్లవుతుందని ప్రాథమిక అంచనా. ఈ నెలలోనే ఇందుకు సంబంధించిన లైడార్ సర్వే చేయనున్నారు. ఇదే సమయంలో కృష్ణానదిలోఇంతవరకు వృథా అయింది లేదు. కిందటేడాది నాగార్జునసాగర్ ప్రాజెక్టు దిగువన కురిసిన భారీ వర్షాలకు వివిధ వాగులు పొంగి పులిచింతల ప్రాజెక్టు నిండాక దాదాపు 55 టీఎంసీలు సముద్రంలో కలిశాయి. పులిచింతల దిగువన నీటిని నిల్వ చేసుకునే అవకాశం లేకపోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడింది.

మెట్టనింట జలసిరి

(మొదటి పేజీ తరువాయి)

యాజమాన్యం ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా నీటి నిర్వహణను చేపడుతూ గోదావరి జలాలను శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలు మినహా 11 జిల్లాలకు అందజేస్తున్నట్లు వివరించారు. ఆగస్టులోనే పట్టిసీమ పథకాన్ని జాతికి అంకితం చేశామంటూ ప్రస్తుతం పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. ఏటా ఆగస్టులో ఒక ప్రాజెక్టును ప్రారంభిస్తామన్నారు. సమాజ హితం కోసం ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలు చేపడుతుంటే భూసేకరణ తదితర విషయాల్లో 90 శాతం మంది సహకరిస్తున్నారని తెలిపారు. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం కొందరు అడ్డంకులు సృష్టిస్తున్నారని విమర్శించారు. వాటిని ఎదుర్కొంటూ నిర్దేశిత లక్ష్యం ప్రకారం ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. పురుషోత్తపట్నం పథకం ద్వారా ఏలేరు రిజర్వాయర్‌కు 24 టీఎంసీల నీటి నిల్వ చేరడంతో పాటు మెట్ట, విశాఖ జిల్లాలోని సాగు, తాగు, పారిశ్రామిక అవసరాలకు నీరు పుష్కలంగా అందుతుందన్నారు. పట్టిసీమ, పురుషోత్తపట్నం పథకాలు ఉత్తరాంధ్ర సుజల స్రవంతిలో భాగమేనని పేర్కొన్నారు. ఈ పథకాలను సకాలంలో పూర్తి చేసిన అధికారులు, భూసేకరణకు సహకరించిన రైతులను ముఖ్యమంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం ఎంపీ మాగంటి మురళీమోహన్, స్థానిక ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్, ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, జలవనరుల శాఖ కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, ఈఎన్‌సీ వెంకటేశ్వరరావు, కలెక్టర్ కార్తికేయ మిశ్రా, ఇన్‌ఛార్జి సబ్‌కలెక్టర్ విజయ్‌రామరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల ప్రారంభించినా విడుదల కాని నీరు

పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకానికి సంబంధించి రెండు మోటార్లను మంగళవారం ముఖ్యమంత్రి ప్రారంభించినా వాటి ద్వారా వచ్చే నీరు ప్రెజర్‌మెయిన్ ద్వారా లక్ష్యానికి చేరలేదు. ఇటీవల కురిసిన వర్షాల వల్ల గొట్టాల్లోకి నీరు చేరడంతో అతుకుల (వెల్డింగ్) పనులు పూర్తి కాలేదు. 17 చోట్ల గొట్టాల అతుకుల పనులు చేపట్టడంతో పాటు మూడు మలుపుల వద్ద కొంత మేర గొట్టాలను అమర్చాల్సి ఉంది. ముఖ్యమంత్రి వచ్చే సమయానికి ఈ పనులను పూర్తి చేసి ఎడమ ప్రధాన కాలువ వద్ద ఏర్పాటు చేసిన డెలివరీ పాయింట్ వద్దకు నీరు వెళ్లేలా అధికారులు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. దీంతో చివరి నిమిషంలో డెలివరీ పాయింట్ ప్రాంతంలో ముఖ్యమంత్రి పర్యటన వాయిదా పడింది. దీనిపై చంద్రబాబు అధికారులతో మాట్లాడుతూ పనులు త్వరితగతిన పూర్తి చేసి నీటిని విడుదల చేయాలని ఆదేశించారు. బుధవారం సాయంత్రానికి నీటిని విడుదల చేస్తామని ఎస్ఈ సుగుణాకరరావు తెలిపారు.


పురుషోత్తపట్నం ప్రారంభం సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, చిత్రంలో ఎంపీ మురళీమోహన్, మంత్రి దేవినేని, మెగా ఇంజినీరింగ్ కంపెనీ ఛైర్మన్ పిచ్చిరెడ్డి తదితరులు

ప్రజల కష్టాలు చూసే కాపులకు రిజర్వేషన్లపై హామీ ఇచ్చా...

పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ప్రారంభం అనంతరం మంగళవారం సాయంత్రం జగ్గంపేటలో నిర్వహించిన సభలో సీఎం చంద్రబాబు మాట్లాడారు. 2004లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కాపులకు రిజర్వేషన్లు ఇస్తామని ప్రకటించినా ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. 2009లో కూడా అధికారంలోకి వచ్చిన వారు మళ్లీ ఈ విషయాన్ని పట్టించుకోలేదన్నారు. అప్పుడు ప్రశ్నించని వారు ఈరోజు ఎందుకు ప్రశ్నిస్తున్నారన్నారు. ఎవరో చెబితే తాను కాపుల రిజర్వేషన్ అంశాన్ని ప్రస్తావించలేదని చంద్రబాబు పేర్కొన్నారు. పాదయాత్ర సమయంలో ప్రజల కష్టాలు చూసి తన అధ్యయనం ద్వారా తెలిసిన సమాచారం మేరకే కాపు రిజర్వేషన్ల విషయాన్ని ఎన్నికల ప్రణాళికలో పెట్టినట్లు చెప్పారు. రాజకీయ రిజర్వేషన్లు వద్దని, చదువు, ఉద్యోగాల్లోనే రిజర్వేషన్లు కోరుకుంటున్నామని కాపులు చెప్పారన్నారు. కాపు రిజర్వేషన్లు అమలు చేసి తన నిజాయతీని నిరూపించుకుంటానని సీఎం పేర్కొన్నారు. ఈ సభకు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సభా ప్రాంగణంలో అయిదు అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. రైతులకు ట్రాక్టర్లు, జగ్గంపేట పరిధిలో ఆరు అంబులెన్సులను సరఫరా చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కళా వెంకట్రావ్, జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు పాల్గొన్నారు.

నదుల అనుసంధానంలో రికార్డు సాధించాం

మేఘా ఇంజినీరింగు కంపెనీ వెల్లడి

ఈనాడు, అమరావతి: నదుల అనుసంధానానికి సంబంధించి అనతికాలంలోనే మూడు ప్రాజెక్టులను పూర్తి చేసి తమ కంపెనీ రికార్డు సృష్టించిందని మేఘా ఇంజినీరింగు అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ పేర్కొంది. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాన్ని మంగళవారం ముఖ్యమంత్రి ప్రారంభించిన సందర్భంగా ఈ ప్రాజెక్టును చేపట్టిన కంపెనీ ఇప్పటివరకు మూడు అనుసంధాన ప్రాజెక్టులు పూర్తి చేసినట్లు వెల్లడించింది. మధ్యప్రదేశ్‌లోని నర్మదా-క్షిపర-సింహస్థ ప్రాజెక్టును తొలిసారిగా 2014లో పూర్తి చేసినట్లు తెలిపింది. పట్టిసీమ ఎత్తిపోతలను 163 రోజుల్లో పూర్తి చేసి లిమ్కా బుక్‌లో స్థానం సంపాదించామని.. దీని ద్వారా గోదావరి-కృష్ణా అనుసంధానం సాధ్యమయిందని తెలిపింది. తాజాగా పురుషోత్తపట్నం ఎత్తిపోతల రెండు పంపులను సీఎం ప్రారంభించారని, దీంతో గోదావరి ఏలేరు అనుసంధానం సాకారమవుతోందని పేర్కొంది. ఈఎత్తిపోతలను పూర్తిచేసేందుకు అక్టోబరు 29 వరకు గడువు ఉన్నా సింహభాగం పనులు పూర్తయ్యాయని ప్రకటనలో తెలిపింది.

నేడు, 18న భారీ వర్షాలు

ఈనాడు, విశాఖపట్నం: రాష్ట్రం మీద ప్రభావం చూపిన 3 ఉపరితల ఆవర్తనాలు బలహీనపడినట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం రాయలసీమ నుంచి దక్షిణ తమిళనాడు వరకు సముద్రమట్టానికి 0.9 కి.మీ ఎత్తు వరకు ద్రోణి ఉందని, దీని ప్రభావంతో బుధవారం కోస్తా వ్యాప్తంగా పలుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. అలాగే ఈనెల 17న ఒడిశా, పశ్చిమబంగాను ఆనుకుని బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడే సంకేతాలు వస్తున్నాయని, దీని ప్రభావంతో 18న కోస్తాలో పలుచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరిస్తున్నారు.

బిర బిరా గోదారి...

- తొలుత 700 క్యూసెక్కుల మళ్లింపు
- క్రమేణా సెప్టెంబరు నాటికి పూర్తి స్థాయి పరవళ్లు
- పురుషోత్తపట్నం పథకం తొలిదశను ప్రారంభించిన ముఖ్యమంత్రి
- 2.15 లక్షల ఎకరాలకు ప్రయోజనం చేకూరేలా ప్రణాళిక

ఈనాడు – అమరావతి

స్వాతంత్ర్య దినోత్సవాన గోదావరి నదిని ఏలేరుతో అనుసంధానించే పురుషోత్తపట్నం ఎత్తిపోతల తొలిదశ సాకారమైంది. ఈ ఎత్తిపోతల పథకాన్ని మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. వేగంగా రెండు పంపులను సిద్ధం చేసి 700 క్యూసెక్కుల నీటిని ఏలేరు ఆయకట్టుకు ఎత్తిపోయనున్నారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా ఈ నీరు ఏలేరు ఆయకట్టుకు చేరుతుంది. మిగిలిన పంపులను కూడా యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేస్తున్నారు. రెండో దశ కింద చేపట్టిన ఎత్తిపోతల పనులు కూడా పూర్తికావచ్చాయి. క్రమేణా సెప్టెంబరు నాటికి ఈ రెండు దశల ద్వారా నీరు ఏలేరుకు పరవళ్లు తొక్కనుంది. గోదావరికి కుడి వైపున పట్టిసీమ ఎత్తిపోతల నిర్మించి ఆ నీటిని కృష్ణా నదికి చేర్చి కృష్ణా డెల్టా ఆయకట్టుకు సాకారం చేసినట్లే ఎడమ వైపున పురుషోత్తపట్నం ఎత్తిపోతలను ప్రారంభించారు. తూర్పుగోదావరి జిల్లా మెట్ట ప్రాంతాలతో పాటు విశాఖ జిల్లా తాగు, పారిశ్రామిక అవసరాలు తీర్చేందుకు ఈ పథకం ఉపయోగపడుతుందని జలవనరులశాఖ పేర్కొంటోంది.

రెండు దశల్లో ఏలేరుతో అనుసంధానం... అది ఇలా....


● పురుషోత్తపట్నం వద్ద 10 పంపులతో 3500 క్యూసెక్కులకు పైగా నీటిని ఎత్తిపోస్తారు. ప్రస్తుతం ఇక్కడ రెండు పంపులు పూర్తయ్యాయి. 700 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోయనున్నారు. బుధవారం సాయంత్రానికి నీరు విడుదలవుతుందని అధికారులు పేర్కొంటున్నారు. ఎత్తిపోసిన నీటిని ఇక్కడ ఏర్పాటు చేస్తున్న 5 వరుసల పైపులైను ద్వారా పదికిలోమీటర్ల దాకా తీసుకువెళ్లి పోలవరం ఎడమ కాలువ 1.60 కిలోమీటరు వద్ద కలుపుతారు. ఆ నీరు ఈ కాలువలో 58వ కిలోమీటరు దాటి వెళ్తుంది. అక్కడి నుంచి 2000 క్యూసెక్కుల వరకు నేరుగా ఏలేరు నదికి కలిపి ఓపెన్ ఛానల్ ఆయకట్టుగా ఉన్న ఏలేరు ఆయకట్టుకు అందిస్తారు.

● రెండోదశలో పోలవరం ఎడమ కాలువ 50 కిలోమీటరు వద్ద 1400 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తారు. మొత్తం 8 పంపులను ఏర్పాటు చేసి 13 కిలోమీటర్ల మేర రెండు వరుసల పైపులైను నిర్మించి ఆ నీటిని ఏలేరు జలాశయానికి తరలించనున్నారు. ప్రస్తుతం ఈ పనులు కొలిక్కి వచ్చాయి. పురుషోత్తపట్నం వద్ద క్రమేణా నీటిని ఎత్తిపోసే పంపుల సంఖ్య పెంచుతూ ఆగస్టు నెలాఖరుకు లేదా, సెప్టెంబరులో ఈ ఎత్తిపోతలను కూడా ప్రారంభించి నీటిని ఏలేరుకు తరలిస్తారు.

ఏలేరు ఇక కళకళ... ఏలేరు జలాశయం గత కొన్ని సంవత్సరాలుగా పూర్తి స్థాయిలో నిండటం లేదు. 24 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉన్న ఈ జలాశయం వర్షాలు లేక సగమే నిండుతోంది. ఈ ఏడాది గోదావరి వరద నీటిని మళ్లించే అవకాశంతో పూర్తి స్థాయిలో నిండనుంది. ఇది బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా కూడా ఉపయోగపడుతుందని అధికారులు చెబుతున్నారు. విశాఖకు ఈ ప్రయోజనం దక్కాలంటే ఏలేరు ఎడమ కాలువను ఆధునికీకరించాలి. లేదా పోలవరం ఎడమ కాలువ నిర్మాణం మొత్తం పూర్తి కావాలి.

ఇదీ పథకం స్వరూపం

- రూ.1,638 కోట్ల అంచనా వ్యయంతో పాలనా మోదం.
- రూ.1,551 కోట్ల ఒప్పంద విలువ. మేఘా ఇంజినీరింగు అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ పనులు చేపట్టింది.
- తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం పురుషోత్తపట్నం వద్ద ఎత్తిపోతల నిర్మాణం.
- మొత్తం 10 పంపులతో 3500 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తారు.
- వరద కాలంలో మొత్తం 30 టీఎంసీల నీటిని వినియోగించుకోవాలనేది ప్రణాళిక.
- ఈ పథకంలో పోలవరం ఎడమ కాలువ 58 కిలోమీటరు వరకు ఉన్న ఆయకట్టుతో పాటు ఏలేరు కుడి కాలువ ఆయకట్టు, పిఠాపురం బ్రాంచి కాలువ చివరి ఆయకట్టుకు ప్రయోజనం కలుగుతుంది. దాదాపు 2.15 లక్షల ఎకరాలకు ఈపథకంవల్ల లబ్ధిచేకూరుతుంది.



గ్రహం అనుగ్రహం

16–8–2017 బుధవారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ దక్షిణాయనం వర్ష రుతువు; శ్రావణ మాసం; బహుళ పక్షం
నవమి: మ. 1-30 తదుపరి దశమి
రోహిణి నక్షత్రం: రా. 12-09 తదుపరి మృగశిర
అమృతఘడియలు: రా. 9-10 నుంచి 10-40 వరకు
వర్జ్యం: సా. 4-41 నుంచి 6-11 వరకు తిరిగి తె. 5-22 నుంచి
దుర్ముహూర్తం: ఉ. 11-40 నుంచి 12-30 వరకు
రాహుకాలం: మ. 12-00 నుంచి 1-30 వరకు
సూర్యోదయం: ఉ. 5-46; సూర్యాస్తమయం: సా. 6-23

వాతావరణం

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
హైదరాబాద్	22.1	31.9
గుంటూరు	23.0	37.5
తిరుపతి	23.1	33.8
కర్నూలు	24.7	34.9
ఒంగోలు	24.9	36.3
విజయవాడ	25.9	35.6
తాడేపల్లిగూడెం	26.0	33.0
కడప	26.0	35.0
రాజమహేంద్రవరం	26.0	38.0
విశాఖపట్నం	26.4	33.8
నరసాపురం	26.8	34.6
శ్రీకాకుళం	27.0	35.5
నెల్లూరు	27.0	37.0
అనంతపురం	27.7	32.0

సానుకూలం.. సామరస్యం

- విభజన సమస్యలకు త్వరలో పరిష్కారం

ఈనాడు - హైదరాబాద్

ఉభయ తెలుగు రాష్ట్రాల మధ్య ఉన్న విభజన సమస్యలను సాధ్యమైనంత త్వరగా.. సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవాలని గవర్నర్ నరసింహన్ సమక్షంలో జరిగిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణల ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, కేసీఆర్ నిర్ణయించారు. అంశాలవారిగా విస్తృత స్థాయిలో చర్చించి ఏకాభిప్రాయాన్ని సాధించాలనే ప్రతిపాదనకు అంగీకరించారు. మంగళవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ ఇచ్చిన తేనీటి విందుకు ఇద్దరు సీఎంలు హాజరయ్యారు. సినీ నటుడు పవన్ కళ్యాణ్, రాజకీయ ప్రముఖులు, అధికారులు ఇందులో పాల్గొన్నారు. విందు అనంతరం గవర్నర్ సూచన మేరకు ఇద్దరు సీఎంలు ఆయన నివాసంలో గంటన్నరపాటు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రెండురాష్ట్రాల మధ్య అపరిష్కృతంగా ఉన్న అంశాలపై చర్చించారు. గవర్నర్ మాట్లాడుతూ, విభజన సమస్యలు కొనసాగడం ఇరురాష్ట్రాల అభివృద్ధికి ప్రతిబంధకమని అన్నారు. గతంలో తన సూచన మేరకు మంత్రుల కమిటీని ఏర్పాటు చేసి చర్చించారని, కొన్నింటిపై అంగీకారం కుదిరినా తర్వాత ఆ కమిటీ సమావేశాలు జరగడం లేదని తెలిపారు. ఇకనైనా వాటిపై దృష్టి సారించాలని నరసింహన్ సూచించారు. దీనికి ఇద్దరు సీఎంలు అంగీకరించారు. 9, 10 షెడ్యూలు సంస్థల విభజన, నీటిపారుదల ప్రాజెక్టుల వివాదాలు, భవనాల అప్పగింత ఇతర అంశాలపై చర్చించారు. ఉన్నత విద్యామండలి విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు అనుకూలంగా వ్యవహరిద్దామని చంద్రబాబు చెప్పారు. దీనిపై భిన్నాభిప్రాయాలున్నాయని, న్యాయనిపుణులు, కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారుల సమక్షంలో దీనిపై చర్చించాలని కేసీఆర్ అన్నారు. త్వరలో ఈ సమావేశం జరుపుదామని చెప్పగా చంద్రబాబు అంగీకరించారు. హైదరాబాద్‌లో ఏపీకి కేటాయించిన సచివాలయం, శాసనసభ, మండలి, ఇతర భవనాలను తమకు అప్పగించాలని కేసీఆర్ కోరగా దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని చంద్రబాబు వెల్లడించారు.

ప్రాజెక్టులపై చర్చ

ఈ సందర్భంగా ఇద్దరు సీఎంలు ఏపీలోని పోలవరం, పురుషోత్తమపట్నం తెలంగాణలోని కాళేశ్వరం ప్రాజెక్టుల గురించి చర్చించారు. భూసేకరణ సమస్యాత్మకంగా మారిందని ఇద్దరు సీఎంలు ఈ సందర్భంగా గవర్నర్‌తో చెప్పారు. భూసేకరణ చట్టాలు పకడ్బందీగా ఉండాలని అభిప్రాయం వ్యక్తంచేశారు. కర్ణాటక నుంచి కృష్ణా నదికి నీటి విడుదలపై కర్ణాటక వైఖరిపై సీఎంలు అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం నియోజకవర్గాల పునర్విభజన గురించి చర్చించారు. పాలనసౌలభ్యం, ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండేందుకు అవకాశం కల్పించేలా పునర్విభజన జరగాలని చంద్రబాబు చెప్పగా కేసీఆర్ ఏకీభవించారు. అయితే ప్రధాని దీనిపై అసక్తి చూపడం లేదని కేసీఆర్ వివరించారు. ఇటీవల తమ భేటీ సందర్భంగా ప్రధాని వ్యక్తంచేసిన అభిప్రాయాలను వివరించారు. దీనిపై మరోసారి ప్రధానిని కలిసి చర్చించాలని నిర్ణయించారు. అవసరమైతే ఇద్దరూ ఒకేసారి ప్రధానితో భేటీకావాలనే ప్రతిపాదన గురించి చర్చించారు. ఇద్దరు సీఎంలు సమస్యల పరిష్కారానికి చూపిన చొరవకు గవర్నర్ అభినందనలుతెలిపారు. రెండు రాష్ట్రాల హితవు కోసం కలిసిమెలిసి పనిచేయాలని ఆయన సూచించారు.

నంద్యాల ఉప ఎన్నికపై చర్చ

అంతకుముందు ఇద్దరు సీఎంలు తేనీటి విందు సందర్భంగా ఒకరితో ఒకరు నవ్వుతూ మాట్లాడుకున్నారు. నంద్యాలలో ఉప ఎన్నికల అంశం చర్చకు వచ్చింది. నంద్యాలలో గెలుపు తమదేనని బాబు చెప్పారు. అక్కడ తెదేపా అభ్యర్థిపై కొంత వ్యతిరేకత ఉందని కేసీఆర్ పేర్కొన్నట్లు సమాచారం. హైదరాబాద్‌లో నవంబరులో జరగనున్న ప్రపంచ పారిశ్రామికవేత్తల సదస్సు గురించి సీఎంలు మాట్లాడుకున్నారు. ఇది మంచి అవకాశమని చంద్రబాబు అనగా దానిని సద్వినియోగం చేసుకుంటామని కేసీఆర్ తెలిపారు.

తేనీటి విందులో అపూర్వ కలయికలు

- తేనీటి విందు సందర్భంగా ఆసక్తికరమైన అంశాలు చోటుచేసుకున్నాయి. విందుకు తొలిసారిగా హాజరైన సినీనటుడు పవన్ కళ్యాణ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. విందు ముగిసిన తర్వాత ఆయన ఇద్దరు సీఎంలతో కలిసి గవర్నర్ నివాసంలోకి వెళ్లారు. చర్చల్లో ఆయన పాల్గొననప్పటికీ గవర్నర్, చంద్రబాబులతో ఆయన భేటీ అయినట్లు తెలిసింది.
- విందుకు అందరికంటే ముందు హాజరైన పవన్ వేదిక వద్ద గవర్నర్, ఇద్దరు సీఎంలతో కరచాలనం చేశారు. ఐయాం ఉత్తమ్ అంటూ ఉత్తమ్ కుమార్‌రెడ్డి పవన్‌తో పరిచయం చేసుకోగా, ఐయాం పవన్ అంటూ ఆయన చేయి కలవడంతో అంతా ఒక్కసారిగా నవ్వారు.
- పవన్‌ను గవర్నర్ మంత్రి కేటీఆర్‌కు పరిచయం చేయబోగా తామిద్దం స్నేహితులమేనని కేటీఆర్ చెప్పారు. ఇద్దరూ యువకులే అంటూ గవర్నర్ కేటీఆర్, పవన్‌ల గురించి వ్యాఖ్యానించారు.
- కేటీఆర్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పక్కనే కూర్చున్నారు. దాదాపు అరగంట పాటు ఇద్దరు మాట్లాడుకున్నారు. విందు సందర్భంగా చంద్రబాబు, కేసీఆర్‌లతో పవన్ విడివిడిగా మాట్లాడారు. తెలంగాణలో మాదక ద్రవ్యాల నియంత్రణ చర్యలను పవన్ ప్రశంసించినట్లు తెలిసింది.
- ఉద్దానంలో కిడ్నీ బాధితుల అంశాన్ని చంద్రబాబుతో మాట్లాడినట్లు సమాచారం. ఆ తర్వాత ఏపీ ఆరోగ్యమంత్రి కామినేని శ్రీనివాస్ ఉద్దానంలో తీసుకుంటున్న చర్యలను పవన్‌కు వివరించారు.
- ఇద్దరు సీఎంల భేటీ తర్వాత గవర్నర్ పవన్‌కళ్యాణ్‌తో ప్రత్యేకంగా అరగంట పాటు భేటీ అయ్యారు. రెండు తెలుగురాష్ట్రాల్లో సేవా కార్యక్రమాలు, ఇతర అంశాల గురించి ఈ సందర్భంగా ఆయన చర్చించినట్లు తెలిసింది.
- భాజపా నేత లక్ష్మణ్ పవన్‌తో రాజకీయాల గురించి ప్రస్తావించారు.. అక్టోబరు నుంచి పూర్తిస్థాయిలో రాజకీయాల్లోకి వస్తామని, ఇప్పటికే తెలంగాణలో తమ జనసేన నడుస్తోందని పవన్ వివరించారు.

ప్రముఖుల హాజరు

కేంద్రమంత్రులు బండారు దత్తాత్రేయ, సుజనాచౌదరి, తమిళనాడు మాజీ గవర్నర్ రోశయ్య, ఏపీ శాసన సభాపతి కోడెల, మండలి ఛైర్మన్ చక్రపాణి, తెలంగాణ ఉపముఖ్యమంత్రులు కడియం శ్రీహరి, మహమూద్‌అలీ, ఏపీ మంత్రి కామినేని, తెలంగాణ మంత్రులు తలసాని, లక్ష్మారెడ్డి, జగదీశ్‌రెడ్డి, ఈటల రాజేందర్, పి.మహేందర్‌రెడ్డి, విపక్ష నేతలు జానారెడ్డి, షబ్బీర్‌అలీ, సీపీఐ కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి, ఎంపీలు కేశవరావు, డీఎస్, జితేందర్‌రెడ్డి, రెండు రాష్ట్రాల సీఎస్‌లు దినేష్‌కుమార్, ఎస్పీ సింగ్, తెలంగాణ డీజీపీ అనురాగ్‌శర్మ, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు ఇతర ప్రముఖులు హాజరయ్యారు. గవర్నర్, ఆయన సతీమణి విమలా నరసింహన్‌లు అందరినీ పేరుపేరునా పలకరించారు.



రాజ్‌భవన్‌లో నిర్వహించిన 'ఎట్‌హోం' కార్యక్రమంలో.. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేసీఆర్, చంద్రబాబు, కేంద్రమంత్రి దత్తాత్రేయ, టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఏపీ మంత్రి కామినేని శ్రీనివాస్, తెలంగాణ మంత్రి జగదీష్‌రెడ్డి, భాజపా తెలంగాణ అధ్యక్షుడు లక్ష్మణ్, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌ల ముచ్చట్లు..



మంగళవారం రామోజీ ఫిలింసిటీ కార్పొరేట్ కార్యాలయం వద్ద జాతీయ జెండా ఎగురవేసి వందనం చేస్తున్న రామోజీ గ్రూపు సంస్థల ఛైర్మన్ రామోజీరావు

సీబీఐ అధికారి పెద్దిరాజుకు రాష్ట్రపతి పోలీస్ పతకం

దిల్లీ: విధుల నిర్వహణలో ప్రతిభావంతమైన సేవలు అందించిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బండి పెద్దిరాజుకు రాష్ట్రపతి పోలీసు పతకం లభించింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సీబీఐకి చెందిన ఆరుగురు అధికారులు రాష్ట్రపతి విశిష్ట పోలీస్ సేవా పతకం, 22 మంది అధికారులు రాష్ట్రపతి పోలీస్ సేవా పతకాలను అందుకున్నారు. సీబీఐలో కానిస్టేబుల్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన బండి పెద్దిరాజు ప్రస్తుతం డిప్యూటీ సూపరింటెండెంట్ హోదాలో ఉన్నారు. పలు సంచలనాత్మకమైన కేసుల దర్యాప్తులో కీలకపాత్ర వహించారు. ప్రస్తుతం ఆయన దిల్లీ సీబీఐ విభాగంలో పనిచేస్తున్నారు.

లోటస్‌పాండ్‌లో జాతీయ జెండా ఆవిష్కరణ

ఈనాడు, అమరావతి: హైదరాబాద్ లోటస్‌పాండ్‌లోని వైకాపా కేంద్ర కార్యాలయంలో మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని నిర్వహించారు. పార్టీ సీనియర్ నేత, నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డి జాతీయ పతాకాన్ని, పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. పార్టీ నేతలతో కలిసి ముందుగా మహాత్మాగాంధీ చిత్రపటానికి, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళి అర్పించారు. పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గట్టు శ్రీకాంత్‌రెడ్డి, రెండు రాష్ట్రాల పార్టీ నేతలు పాల్గొన్నారు. ఆంగ్లేయులకు వ్యతిరేకంగా నాడు పోరాటం చేసినట్లే... ఇప్పుడు మనం అవినీతి, అణచివేత, అబద్ధాలు, దొంగ ఆశలు చూపేవారికి వ్యతిరేకంగా పోరాడాలి అని వైకాపా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవాం ట్విట్టర్‌లో ఆయన ఈ వ్యాఖ్య చేశారు.

పాక్ సరిహద్దులో జాతీయ పతాకం రెపరెపలు

- ఎగురవేసిన విజయవాడ పర్వతారోహకులు

విజయవాడ, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య దినోత్సవం రోజున జమ్ముకశ్మీర్‌లోని పాకిస్థాన్ సరిహద్దుల్లో జాతీయ పతాకాన్ని ఎగురవేసి, దేశభక్తిని చాటుకున్నారు విజయవాడకు చెందిన పర్వతారోహకుల బృందం. యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (వైహెచ్‌ఏఐ), విజయవాడకు చెందిన 39 మంది సాహసికులు ఈ నెల 5న ఇక్కడ నుంచి బయల్దేరి జమ్ము కశ్మీర్‌లోని సోనామార్గ్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి హిమాలయ పర్వతశ్రేణిలో రోజుకు రెండు మూడు పర్వతాలను అధిరోహిస్తూ విష్ణు సరోవర్, కృష్ణ సరోవర్, గడ్సర్, సత్సర్, గంగాబల్ తదితర పాక్ ఆక్రమిత కశ్మీర్ సమీపంలో ఉన్న హిమ సరస్సులను చేరుకున్నారు. భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవారం మన జాతీయ పతాకాన్ని అక్కడ ఎగురవేశారు. సరిహద్దులోని వివిధ క్యాంపుల్లో ఉన్న భారత సైన్యం పర్వతారోహకులను అభినందించి అల్పాహారం అందించింది. పర్వతారోహణ చేసిన 39 మంది పేర్లను సైన్యం తమ రికార్డుల్లో నమోదు చేసుకున్నారు. వైహెచ్‌ఏఐ విజయవాడ ఛైర్మన్ ఎన్.విష్ణువర్ధన్ నేతృత్వంలో జరిగిన ఈ సాహస కార్యక్రమంలో ఏపీఎన్‌జీఓ నాయకుడు విద్యాసాగర్, వైహెచ్‌ఏఐ విజయవాడ కోశాధికారి అబ్దుల్ ఖాలిక్, కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.నర్సింహరాజు పాల్గొన్నారు.



జమ్ముకశ్మీర్‌లో పాక్ సరిహద్దు ప్రాంతంలో జాతీయ జెండాను ఎగురవేసిన పర్వతారోహకుల బృందం

నలుగురు భారత సంతతి వ్యాపారులపై ఇంటర్‌పోల్ రెడ్ కార్నర్ తాఖీదులు

జొహాన్నెస్‌బర్గ్: అరుదైన గులాబీ రంగు వజ్రంపై తలెత్తిన న్యాయ వివాదంలో భారత సంతతికి చెందిన నలుగురు దక్షిణాఫ్రికా వ్యాపారులపై ఇంటర్‌పోల్ రెడ్ కార్నర్ తాఖీదులు జారీ అయ్యాయి. ఈ వజ్రం విలువ రూ.250 కోట్లని అంచనా. ఈ తాఖీదుల ప్రకారం జునైద్ మోతి, అతని తండ్రి అబ్బాస్ అబూబాకర్ మోతి, వారి భాగస్వాములు అష్రఫ్ కాకా, సలీమ్ బొబాట్‌లను ఎక్కడ ఉన్నా అరెస్టు చేయటానికి వీలుకలుగుతుంది. ఈ వజ్రాన్ని తన నుంచి దొంగలించారంటూ రష్యాకు చెందిన వ్యాపారి అలీబెక్ ఐజేవ్ ఫిర్యాదు ఆధారంగా తాఖీదు జారీ అయ్యింది. అయితే, రష్యా వ్యాపారే మోసపూరితంగా ఆ వజ్రానికి సంబంధించిన పత్రాలను తమ నుంచి తీసుకున్నారని నిందితులు ఆరోపిస్తున్నారు. రెండేళ్లుగా ఈ వజ్రానికి సంబంధించిన న్యాయ పోరాటాలు ఫ్రాన్స్, లెబనాన్, జింబాబ్వే, దుబాయిల్‌లోనూ జరిగాయని సమాచారం.

ఉద్యోగ ప్రకటనల ఊసేది?

- ఏపీపీఎస్సీకి సమాచారమివ్వని సర్కారు

- నేను గ్రూపు-2 ప్రధాన పరీక్ష రాశాను. గ్రూపు-3 (పంచాయతీ కార్యదర్శి) ప్రధాన పరీక్ష కూడా రాశాను. ఉద్యోగాల రాకపై అంచనాకు రాలేకపోతున్నాను. ఒకవేళ ఈ ప్రయత్నంలో ఉద్యోగం రాకపోతే మున్ముందు రావాల్సిన నోటిఫికేషన్ల ద్వారా మరోసారి ప్రయత్నించాలన్న పట్టుదలతో ఉన్నాను. ఏపీపీఎస్సీ ఇప్పటికే షెడ్యూలు ప్రకటించినా... ఆ ప్రకారం ఉద్యోగ ప్రకటనలు రాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. గతంలో కొన్ని పరీక్షల కోసం 2014 నుంచి సన్నద్ధమవుతుంటే 2016లో నోటిఫికేషన్లు వెలువడ్డాయి. ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకూడదు.
–శ్రీనివాసరావు, మాచర్ల, గుంటూరు జిల్లా.
- 2014లో డిగ్రీ పూర్తిచేశాను. గ్రూపు-2 ప్రధాన పరీక్ష రాశాను. ఉద్యోగం వచ్చే అవకాశం లేదు. ప్రత్యేక శిక్షణ పొందాను. ఏపీపీఎస్సీ ప్రకటించిన ప్రకారం నోటిఫికేషన్లు జారీచేస్తే శిక్షణ కొనసాగించాలనుకుంటున్నాను. ఇతర ఉద్యోగాల కోసం ప్రయత్నించడంలేదు. ప్రభుత్వ ఉద్యోగం చేయాలన్నది నా లక్ష్యం. ఇప్పటికీ హైదరాబాదులోనే ఉండి శిక్షణ పొందుతున్నా.
– రామకృష్ణ, విజయవాడ
- దివ్యాంగుల కోటాలో ప్రభుత్వ ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నా. గ్రూపు-2 ప్రాథమిక పరీక్షలో రెండు మార్కుల తేడాతో ప్రధాన పరీక్షను రాసే అర్హతను కోల్పోయాను. ఏపీపీఎస్సీ నుంచి వెలువడే ఉద్యోగ ప్రకటనల కోసం ఎదురుచూస్తున్నా.
– కృష్ణకుమార్, విజయవాడ
- ఈ నెలాఖరుతో నాకు 42 ఏళ్లు పూర్తవుతాయి. ప్రభుత్వం సడలించిన వయోపరిమితీ 42 ఏళ్లే. ఈనెలలో నోటిఫికేషన్‌లు రాకపోతే ప్రభుత్వోద్యోగానికి పరీక్షలు రాసే అవకాశాన్ని కోల్పోతాను. ఏపీపీఎస్సీ ప్రకటించిన ప్రకారం ఈనెలలోనే ప్రకటనలు జారీచేస్తే నాలాంటి ఎందరికో మేలు జరుగుతుంది.
– వెంకట్రావు, ఒంగోలు

ప్రభుత్వ ఉద్యోగ ప్రకటనల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థుల ఆందోళనలివి. ఉద్యోగ ప్రకటనలను జులై/ఆగస్టు నుంచి జారీచేస్తామని ప్రకటించిన ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ)కు... ప్రభుత్వం నుంచి సానుకూలత కనిపించలేదు. ప్రభుత్వం నుంచి ఖాళీల వివరాలు అందనందున ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. మరో రెండు వారాల్లో ఈ నెల ముగియబోతోంది. ఈ ఏడాది జులై/ఆగస్టు నుంచి వార్షిక ఉద్యోగ ప్రకటనల పట్టిక (షెడ్యూలు) జారీని ప్రారంభించి, డిసెంబరు/జనవరి 2018లోగా 42ఉద్యోగ ప్రకటనలు ఇస్తామని గత ఏప్రిల్‌లో ఏపీపీఎస్సీ ప్రకటించింది. తాత్కాలికంగా ఆయా పరీక్షల తేదీలనూ వెల్లడించింది. ఇందులో భాగంగా అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్, అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్, లెజిస్లేచర్ ఆఫీసర్ (సచివాలయం), టౌన్ ప్లానింగ్ అండ్ బిల్డింగ్ ఓవర్‌సీయర్స్, అసిస్టెంట్ ఆర్కిటెక్చర్ డ్రాఫ్టుమెన్, అసిస్టెంట్ లైబ్రేరియన్ గ్రేడ్-2 ఉద్యోగ ప్రకటనలు ఈ నెలాఖరులోగా రావాల్సి ఉంది. కానీ ఆ అవకాశాలు కనిపించడంలేదు. ఉద్యోగ ప్రకటనల జారీలో జాప్యం జరిగితే వయోపరిమితి పెంపు వంటి డిమాండ్లు కూడా వస్తాయి. గత ఏడాది నవంబరు 5న 34 నుంచి 42 సంవత్సరాలకు వయోపరిమితిని పెంచుతూ జారీచేసిన ఉత్తర్వుల కాలపరిమితి వచ్చేనెల 30వ తేదీతో ముగియనుంది. ఈ విషయాన్ని ప్రభుత్వం గుర్తించాల్సిన అవసరం ఉందని సంబంధిత వర్గాలు సూచిస్తున్నాయి. ప్రస్తుతం పాత, కొత్తవి కలిపి వేర్వేరు శాఖలకు చెందిన 1600 ఉద్యోగ ఖాళీల సమాచారం ఏపీపీఎస్సీ వద్ద ఉంది.

మంత్రివర్గ భేటీలో ఖాళీల భర్తీకి ఆమోదం?

త్వరలో జరిగే మంత్రివర్గ సమావేశంలో ఉద్యోగ ఖాళీల భర్తీకి ఆమోదం లభిస్తుందని ఏపీపీఎస్సీ వర్గాలు భావిస్తున్నాయి. ఇక్కడ తీసుకునే నిర్ణయాన్ని అనుసరించి ఆర్థిక శాఖ జీఓ జారీచేసి, ఆయా శాఖల ద్వారా సామాజిక వర్గాల వివరాలు వస్తే కానీ...ఏపీపీఎస్సీ ప్రకటనలను జారీచేయలేదు. ఉద్యోగ ఖాళీల భర్తీ పట్టిక జారీ సమయంలోనే... ఖాళీల వివరాలను తెలపాలని ఏపీపీఎస్సీ ప్రభుత్వానికి సమాచారాన్ని అందించినా తదుపరి చర్యలు ఇప్పటివరకు కనిపించలేదు. ప్రభుత్వం చొరవ చూపితే ఉద్యోగ ప్రకటనలు కనీసం సెప్టెంబరు నుంచి నవంబరు మధ్యలో వెలువడే అవకాశం ఉందని భావిస్తున్నారు. నెలలపాటు ఉద్యోగ ప్రకటనల జారీలో జాప్యం అనివార్యమైనందున రాత పరీక్షల తేదీలను ఖరారు చేయడం, కేంద్రాలను గుర్తించడం వంటి చర్యలు మళ్లీ మొదటికొచ్చినట్లయింది.

– ఈనాడు, అమరావతి

గువామ్‌పై దాడి ప్రణాళికను కిమ్‌జోంగ్‌కు వివరించిన సైనికాధికారులు

సియోల్, వాషింగ్టన్: గువామ్ ద్వీపంపై క్షిపణులతో ఎలా దాడి చేయవచ్చు అనే విషయమై తమ కార్యాచరణ ప్రణాళికను ఉత్తరకొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్‌కు సైనికాధికారులు వివరించినట్లు ప్యాంగ్‌యాంగ్ అధికారిక మీడియా తెలిపింది. కమాండింగ్ అధికారులతో కిమ్ సోమవారం సుదీర్ఘ సమీక్ష జరిపినట్లు కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ మంగళవారం పేర్కొంది. ప్రస్తుతానికి క్షిపణుల ప్రయోగాన్ని జరపడం లేదని, అమెరికా మూర్ఖంగా రెచ్చగొడితే మాత్రం దేనికైనా వెనుకాడబోమని కిమ్ వ్యాఖ్యానించినట్లు సమాచారం. గువామ్ ద్వీపంపై నాలుగు క్షిపణులతో ఎలా దాడి చేయనున్నామో పూర్తి ప్రణాళికను ఆగస్టు 15నాటికి సిద్ధం చేస్తామని ఉత్తరకొరియా సైన్యం వారం క్రితం ప్రకటించిన సంగతి విదితమే. మరోవైపు అమెరికా రక్షణమంత్రి జిమ్ మాటిస్ వాషింగ్టన్‌లో మాట్లాడుతూ ఉత్తరకొరియా దాడి చేస్తే యుద్ధం తప్పదని హెచ్చరించారు. గువామ్‌కు ప్రమాదకారిగా మారే ఎలాంటి క్షిపణినైనా తమ సైన్యం కుప్పకూల్చేస్తుందన్నారు.

వస్తు సేవల పన్ను నుంచి వెసులుబాటు ఏదీ?

- ఆందోళనలో మత్స్యకారులు, పొగాకు రైతులు
- చేతివృత్తులవారిపైనా భారమే
- వచ్చే నెల జీఎస్టీ మండలి భేటీపై ఆశలు

ఈనాడు, అమరావతి: వస్తు సేవల పన్ను(జీఎస్టీ) నుంచి వెసులుబాటు కోసం మత్స్యకారులు, పొగాకు రైతులు, ఇతర వర్గాలు ఎదురుచూస్తున్నాయి. వీరి నుంచి వచ్చిన విజ్ఞప్తులను రాష్ట్ర ప్రభుత్వం జీఎస్టీ మండలి దృష్టికి తీసుకువెళ్తున్నా సానుకూలత కనిపించడంలేదు. జీఎస్టీలో సంబంధిత వర్గాలకు వెసులుబాటు కల్పించాలని సాక్షాత్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు గత నెలాఖరులో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీకి లేఖ రాశారు. వచ్చేనెల హైదరాబాదులో జరిగే జీఎస్టీ మండలి ద్వారానైనా వెసులుబాటు వస్తుందని ఆశిస్తున్నారు.

ఎండుచేప: జూన్ 30వ తేదీకి ముందు ఎండు చేపపై ఎటువంటి పన్నులేదు. జీఎస్టీ అమల్లోకి వచ్చాక ఐదు శాతం పన్ను విధించారు. దీనివల్ల మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పొగాకు: ముడిపొగాకుపై గతంలో ఎటువంటి పన్నులేదు. జీఎస్టీలో దీనిపై ఐదు శాతం పన్ను విధించారు. దీనిని తొలగించాలని రైతులు కోరుతున్నారు. ప్రాసెసింగ్/ప్యాకింగ్ చేసిన పొగాకుపై 28% పన్ను విధించడంపైనా పునఃపరిశీలన చేయాలని రైతులు, వ్యాపారులు కోరుతున్నారు.

దారపు కండెలు: జీఎస్టీ కింద ఐదు శాతం పన్ను విధించారు.

గ్రానైట్: గ్రానైట్‌పై జీఎస్టీ కింద 28% పన్ను శ్లాబులోనికి చేర్చడంపై వ్యాపారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రంగాన్ని నమ్ముకుని ఐదు లక్షల మంది ప్రత్యక్షంగా...పరోక్షంగా ఉపాధి పొందుతున్నారు.

టీటీడీ: తిరుమల-తిరుపతి దేవస్థాన భక్తులకు అందించే సేవలపై కూడా జీఎస్టీ విధించడాన్ని పునఃపరిశీలించాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం జీఎస్టీ మండలి దృష్టికి ప్రత్యేకంగా తీసుకువెళ్లినప్పటికీ ఫలితం కనిపించడంలేదు. స్వర్ణ దేవాలయం వంటి వాటి గురించి కూడా పరిగణనలోకి తీసుకోవల్సి ఉన్నందువల్ల జీఎస్టీ మండలి సంయమనం పాటిస్తోన్నట్లు తెలుస్తోంది. ధర్మవరం చీరెలపై జీఎస్టీ కింద ఐదు శాతం పన్ను విధించారు. గతంలో లేదు. అయితే....పరోక్షంగా ధర్మవరం చీరెల తయారీపై 13.5% అదనంగా పన్ను పడుతోంది. సిల్క్‌పై 5%, జరీపై 12%, డిజైన్-18%, లేబర్-18%, డిజైన్‌పై 18%, పన్ను పడుతోంది. దీనివల్ల చేతివృత్తుల వారు ఆందోళన చెందుతున్నారు.

ఈనాడు

నవభారతం నిర్మించుకుందాం!

'ప్రతి వ్యక్తి కన్నీటినీ తుడవాలన్నదే మన తరంలోని మహోన్నత వ్యక్తి సమున్నతాశయం'- మొట్టమొదటి స్వాతంత్ర్య దినోత్సవ వేళ జాతిపితను సంస్మరించుకొంటూ తొలి ప్రధాని నెహ్రూ భావోద్వేగ మది. స్వాతంత్ర్యం సిద్ధించాక తన పోరు అవినీతి మీదేనన్న మహాత్మాగాంధీ అర్థాంతరంగా కరకు తుపాకీ గుళ్లకు నేలకొరిగిన దరిమిలా ఏడు దశాబ్దాల ప్రస్థానంలో దేశం- నాటి కట్టుబాట్లు, విలువలు, త్యాగనిరతి, సమష్టి తత్వాలకు చెల్లుకొట్టి, అవినీతి మదాంధ అరాచక నేతలకు వింజామరలు పట్టి ఎంతగానో దిగజారిపోయింది. అంతకుముందు దశాబ్దాలుగా సాధించలేని సంఘటితత్వానికి 'క్విట్ ఇండియా' పిలుపు ద్వారా ఆవాహన పలికిన గాంధీజీ మహా సంకల్పం- అయిదేళ్లు తిరిగేసరికల్లా దేశ స్వాతంత్ర్య సిద్ధికి బాటలుపరచింది. అదే మాదిరిగా నాటి 'భారత్ ఛోడో' నినాదాన్ని 'భారత్ జోడో' గా మలచి ప్రజల నడుమ దేశ భక్తి ప్రపూరిత సంఘటితతత్వాన్ని పేనడం ద్వారా మరో అయిదేళ్లలో దేశ స్వాతంత్ర్య 75వ వార్షికోత్సవాల నాటికి నవభారత్ నిర్మాణం పూర్తికావాలన్న తపన భారత రాష్ట్రపతి, ప్రధానమంత్రుల తాజా సందేశాల్లో ఉట్టిపడుతోంది. రాష్ట్రపతిగా తనదైన ముద్రవేసిన కేఆర్ నారాయణన్ తరహాలోనే- దేశాభివృద్ధి ప్రక్రియలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలూ క్రియాశీల భాగస్వాములు కాగలిగే సమసమాజాన్ని కోవింద్ ప్రస్తావించారు. ప్రభుత్వం పౌరుల భాగస్వామ్యంలో- విధానాల రూపకల్పన అమలులో నైతికత, ఐక్యత, క్రమశిక్షణలపై విశ్వాసం, సంస్కృతి శాస్త్రవిజ్ఞానాల సమన్వయంపై నమ్మకం, విద్య చట్టబద్ధ పాలనల్ని అభివృద్ధి చెయ్యడం ద్వారా నయా భారత్ ఆవిష్కారానికి రాష్ట్రపతి పిలుపిచ్చారు. దేశం కోసం మరణించే మహదవకాశం దక్కకపోయినా, దేశం కోసం బతుకుదామంటూ నిరుడు స్ఫూర్తిదాయక సందేశమిచ్చిన మోదీ- అయిదేళ్ల నవభారత్ అజెండాకు కూడిరావాలని ఉద్బోధిస్తున్నారు. 'ప్రజల వలన ప్రజల చేత ప్రజల కొరకు' అంటున్న ప్రజాస్వామ్యంలో ప్రభుత్వానికి ప్రజలకు మధ్య నిర్మాణాత్మకంగా పెనవడాల్సిన భాగస్వామ్యం డెబ్బయ్యేళ్లుగా కనుమరుగు కావడమే ప్రారబ్ధం. ఎవరికి వారు తమ కుటుంబంతో పాటు సమాజం గురించీ ఆలోచించడం మొదలుపెడితే- అయిదేళ్లలోనే సాధ్యపడుతుంది నవభారత నిర్మాణం!

సుస్థిర ప్రజాస్వామ్య దేశంగా ఇండియా గొప్పగా రాణించడం అద్భుత విజయమే అయినా, తన సహజ శక్తిసామర్థ్యాల మేరకు అది ఎదగలేకపోయిందన్నది నిష్ఠురసత్యం. తలసరి స్థూల దేశీయోత్పత్తి గణాంకాల ఆధారంగా ఇండియాను దిగువ మధ్యాదాయ దేశంగా ప్రపంచ బ్యాంకు గుర్తించిందన్నది గమనార్హం. పొరుగున జనచైనా 8123 డాలర్ల సగటు తలసరి స్థూల దేశీయోత్పత్తితో దూసుకుపోతోంది. శ్రీలంక 3,835 డాలర్లు, బ్రెజిల్ 8,649 డాలర్లు, దక్షిణాఫ్రికా 5,273 డాలర్ల సరసన భారత్ 1,709 డాలర్లతో వెలాతెలాపోతున్నది! మంది ఎక్కువైతే మజ్జిగ పలచన అన్న సామెతకు నకలుగా మరి తొమ్మిదేళ్లలో జన సంఖ్యలో చైనాను అధిగమించనున్న ఇండియాకు మున్ముందు ఎదురుకానున్నవి కఠిన సవాళ్లే! యువశక్తి సంపన్న దేశంగా అగ్రపథాన ఉన్న భారతావని 'సర్వజన హితాయ' భావనకు ఉమ్మడి కట్టుబాటు చాటగలిగితేనే- జపాన్, జర్మనీ, దక్షిణ కొరియాల్లాగా పురోగమించగల వీలుంది. ఆర్థిక సంస్కరణల శకంలో ఊరూవాడా ఊడలు దిగిన అవినీతికి, అది మేటలు వేసిన నల్లధనానికి 'చెక్' చెప్పడంలో మోదీ ప్రభుత్వం చూపుతున్న చొరవ ఎంత ప్రభావాన్వితంగా ఉందో ఎర్రకోట ప్రసంగం గణాంకసహితంగా చాటింది. పెద్దనోట్ల రద్దు దరిమిలా రెండు లక్షల కోట్ల రూపాయల అప్రకటిత ఆదాయం బ్యాంకుల్లోకి వచ్చిందని, అందులో లక్షా 75 వేలకోట్ల రూపాయల మొత్తాన్ని డిపాజిట్ చేసిన 18 లక్షల మంది మీద సమీక్ష జరుగుతోందని ప్రధాని స్పష్టీకరించారు. తక్కువ 'రిస్క్'తో అధిక ప్రయోజనాలు అందించగల పరిశ్రమగా ఎదిగిన అవినీతి- దేశ ప్రగతికి క్యాన్సర్‌లా పరిణమించింది. దానికి జరుగుతున్న శస్త్రచికిత్స- జాతి నైతిక దిక్సూచిని సరిచేస్తే దేశాభివృద్ధి జోరందుకుంటుంది!

నయా భారత్ అన్నది నేడు సర్కారీ సంకల్పమే అయినా, నూట పాతిక కోట్ల జనావళి ఒక్కుమ్మడిగా కదిలితేనే ఆ స్వప్నం సాకారమవుతుందన్నది నిజం. ప్రతి పేదవాడికీ విద్యుత్, మంచినీటి వసతిగల పక్కా ఇల్లు, ఎలాంటి దిగులూ లేకుండా రైతులు నిద్రించగలిగే వీలు, యువజనం తమ కలల్ని సాకారం చేసుకోగలిగేలా విస్తృత అవకాశాలు, కుల మతతత్వాల నుంచి ఉగ్రవాదం నుంచి విముక్తి, అవినీతి బంధుప్రీతితో ఎవరూ రాజీపడని వాతావరణ సృష్టి, స్వచ్ఛమైన ఆరోగ్యవంతమైన సమాజంతో సురాజ్య నిర్మాణం- ఇవీ రాష్ట్రపతి, ప్రధాన మంత్రులు ప్రస్తావిస్తున్న అయిదేళ్ల నయా భారత్ అజెండా లక్ష్యాలు! అందులో మొదటి మూడూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపరంగా సమర్థ విధానాల రూపేణా పట్టాలకెక్కాల్సిన కార్యక్రమాలు, పథకాలు. తక్కిన మూడూ ప్రజల్లో సామాజిక బాధ్యతగా పాదుకొని, ఆరోగ్యకరంగా విస్తరించాల్సిన పౌర ధర్మాలు! ఆధునిక సింగపూర్ నిర్మాతగా లీ క్వాన్ యూ సాధించిన విజయంలో కీలక పాత్ర పోషించింది ఆ దేశ ప్రజలే. అవినీతిని ఏమాత్రం ఉపేక్షించని సమాజాల్లో అభివృద్ధి అద్భుతంగా ఉందన్న వాస్తవం కళ్లకు కడుతున్నదే! ఏదో నడుస్తుందిలే (చల్తాహై) ధోరణిని అధికార శ్రేణుల్లో బదాబదలు చేసిన ప్రధాని మోదీ- ప్రజల ఇతోధిక భాగస్వామ్యానికి పాదుచేసే విధివిధానాలూ ఖరారు చెయ్యాలి. ప్రభుత్వపరంగా చేపట్టిన 70 పథకాల అమలు తీరు పర్యవేక్షణకు నూట పాతిక కోట్ల నిఘా నేత్రాలు విచ్చుకోవాలి. అవినీతి, నిష్క్రియాపరత్వం సహా దశాబ్దాల కసవును ఊడ్చిపారేసి ప్రభుత్వంతో భాగస్వామ్యం ద్వారా ప్రజలు నిర్మించే నవభారతం- రేపటితరం సముజ్జ్వల భవితకు బంగారు సోపానం కావాలి!

వ్యవసాయ పరిశోధనకు చీడ

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు గడచిపోయినా వ్యవసాయ రంగం సానుకూల మార్పులకు పెద్దగా నోచుకోలేదు. భారత వ్యవసాయ పరిశోధనల రంగం సంస్కరణల బాట పట్టడమే లేదు. పరిశోధన ఫలాలు దేశ రైతాంగానికి అందడం లేదు. దీనివల్ల వ్యవసాయరంగంలో ఆధునిక పరిజ్ఞానం రైతులకు చేరడం లేదు. చైనా నుంచి వ్యవసాయ అధునాతన యంత్రాలు భారత్‌లోకి వెల్లువలా వచ్చిపడుతున్నాయి. వాటిని కొనడానికి ప్రభుత్వాలు, రైతులు ఏటా వేలకోట్ల రూపాయలు వెచ్చించాల్సి వస్తోంది. వాటిని స్థానికంగా అభివృద్ధి చేయడానికి శాస్త్రవేత్తలు చొరవ చూపడం లేదు. నిజానికి, మనదేశంలో వ్యవసాయ పరిశోధనలు బ్రిటిష్ హయాములోనే పురుడు పోసుకున్నాయి. 1899లోనే పుణెలో బ్యాక్టీరియోలాజికల్ ప్రయోగశాలను, 1905లో బిహార్‌లోని పూసాలో వ్యవసాయ పరిశోధన సంస్థను ఆంగ్లేయులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పనిచేస్తున్న భారత వ్యవసాయ పరిశోధన మండలి(ఐసీఏఆర్) సైతం 1929లోనే ఇంపీరియల్ వ్యవసాయ పరిశోధన మండలి పేరిట బ్రిటిష్ పాలకులు నెలకొల్పినదే! పరాయి దేశ బ్రిటిష్ పాలకులు ముందుచూపుతో వ్యవసాయ పరిశోధనలకు ప్రాధాన్యం ఇచ్చినప్పటికీ, స్వాతంత్ర్యం వచ్చిన తరవాత ఇన్నేళ్లయినా ఆ వ్యవస్థలు నామమాత్రంగా మిగిలిపోవడం బాధాకరం.

సమస్యల నిలయంగా వర్సిటీలు

స్వాతంత్ర్యం వచ్చిన 13 ఏళ్లకు 1960లో మొదటి రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పంత్‌నగర్‌లో ఏర్పాటైంది. హైదరాబాద్‌లో నిజాం నవాబులు 1946లోనే ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పశువైద్య కళాశాలను ప్రారంభించారు. తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటికీ పశువైద్య, వ్యవసాయ, ఉద్యాన కళాశాలలు, విశ్వవిద్యాలయాలు అనేక సమస్యలతో కునారిల్లుతున్నాయి. దేశ ఆహార భద్రతకు గట్టి హామీ ఇచ్చేందుకు వ్యవసాయ విద్య, పరిశోధనల్లో చేపట్టాల్సిన చర్యలను వివరిస్తూ 1999లోనే 'విజన్-2020' ప్రణాళికను ఐసీఏఆర్ ఘనంగా విడుదల చేసింది. అందులో పెట్టుబడుల నుంచి మానవ వనరుల శిక్షణ వరకు పరిశోధన సంస్థలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను ప్రస్తావించారు. 18 ఏళ్ల తరవాతా ఆ సమస్యలు అలాగే అపరిష్కృతంగా కొనసాగుతున్నాయి. గ్రామీణ భారతంపై అనురక్తి, సేద్యంపట్ల ఆసక్తితో వ్యవసాయ పరిశోధన రంగంలోకి వచ్చేవారే అరుదైపోయారు. ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లు రానివారు తదుపరి ప్రత్యామ్నాయంగా మాత్రమే వ్యవసాయం, ఉద్యానవనం, మత్స్య సంబంధిత డిగ్రీ కోర్సుల్లో చేరుతున్నారు. వృత్తిని బద్ధత, అంకితభావం లోపిస్తున్నవారు అధిక సంఖ్యలో వ్యవసాయరంగంలోని ప్రభుత్వ కొలువుల్లో కుదురుకుంటున్నారన్నది నిష్ఠుర సత్యం. ఆపై వారు కుగ్రామాలకు వెళ్లి, రైతులతో మమేకమై వృత్తిపరమైన సలహాలు ఇవ్వడంపై ఆసక్తి చూపలేకపోతున్నారు. దీనివల్ల శాస్త్రజ్ఞుల పరిశోధన ఫలాలు క్షేత్రస్థాయిలో రైతులకు చేరడమే లేదు. గ్రామాలు, కుగ్రామాల్లో పనిచేయడంకన్నా పట్టణాలు, నగరాల్లోని కార్యాలయాల్లో కుదురుకుని ఉద్యోగంలో నెట్టుకురావాలనుకునేవారే ఎక్కువగా ఉంటున్నారు. ఇలాంటివారి అభ్యర్థనల దరఖాస్తులు, పైరవీలపై ఏం చేయాలో తెలియక వ్యవసాయ పరిశోధన సంస్థల అధిపతులే తల పట్టుకుంటున్నారు. ఉద్యోగ నియామక పత్రం చేతికందిన మరుక్షణం నుంచే తమకు నచ్చిన స్థలాల్లో పోస్టింగు కోసం పైరవీలు చేయించేవారు అధికమయ్యారని ఐసీఏఆర్ అధికారులు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిబ్బందిలో వృత్తి పట్ల నిబద్ధతలేమి కారణంగా వ్యవసాయ రంగంలో అద్భుత ఆవిష్కరణలను ఆశించడమూ అత్యాశే అవుతోంది. శాస్త్ర రంగంలో ప్రపంచ స్థాయి ప్రాధాన్యంగల 'నేచర్' పత్రికలో శాస్త్రవేత్తలు తమ పరిశోధన ఫలితాల గురించి విశ్లేషణలు ప్రచురిస్తుంటారు. మనదేశంలో వేల సంఖ్యలో శాస్త్రవేత్తలు ఉన్నా, ఏడాదికి ఒక్క విశ్లేషణ అయినా



సంస్కరణలు తక్షణావసరం

అందులో చోటుచేసుకొనకపోవడం పరిశోధనల్లో భారత వ్యవసాయ రంగం నాణ్యతాలేమినే ఎండగడుతోంది. ఐసీఏఆర్ అధిపతి ఇటీవల ఓ సదస్సులో దీనిపై శాస్త్రవేత్తలనే నేరుగా ప్రశ్నించారు. అధిక దిగుబడుల సాధన కోసం వేలాది వంగడాలను వ్యవసాయ పరిశోధన సంస్థలు విడుదల చేశాయి. వాటిలో కనీసం 200 వంగడాలనైనా రైతులు సాగుచేయడం లేదు. ముప్పై ఏళ్ల క్రితంనాటి సాంబ మసూరి వరి వంటి వంగడాలనే రైతులు ఇప్పటికీ అధిక విస్తీర్ణంలో సాగుచేస్తున్నారు. వరి విత్తనాలు కొనే రైతుకు కిలోకు పది రూపాయల చొప్పున రాయితీ ఇవ్వాలంటూ కేంద్రం ఏటా అన్ని రాష్ట్రాలకు నిధులు కేటాయిస్తోంది. గత పదేళ్లలో వ్యవసాయ పరిశోధన సంస్థలు విడుదల చేసిన వంగడాన్ని కొంటేనే ఈ రాయితీ ఇవ్వాలని మెలిక పెట్టారు. రైతులు రాయితీని వదులుకోవడానికి సిద్ధమవుతున్నారే తప్ప, శాస్త్రవేత్తలు విడుదల చేసిన కొత్త వంగడాలను తక్కువ ధరకు తీసుకోవడానికి ధైర్యం చేయలేకపోతున్నారు. దేశంలోనే మేలైన ఘాటు మిరప కాయలు పండించే రైతులకు ఆ విత్తనాలను సైతం ప్రైవేటు బహుళజాతి సంస్థలే విక్రయిస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోని రెండు ఉద్యాన విశ్వవిద్యాలయాలు ఇక్కడున్న రైతులకు అధిక దిగుబడులనిచ్చే మిరప విత్తనాలనైనా అందించలేకపోవడానికి కారణాలేమిటో రాష్ట్ర ప్రభుత్వాలు లోతుగా సమీక్షించాలి. 1999నాటి ఐసీఏఆర్ విజన్-2020లో తెలిపిన సమస్యలే నేటికీ కొనసాగుతున్న పరిస్థితుల్లో- అధిక దిగుబడుల సాధన గురించి ఎంత తక్కువగా మాట్లాడుకుంటే అంత మంచిది!

ప్రపంచ భూభాగంలో భారతదేశం వాటా కేవలం 2.3 శాతమే. పైగా దేశంలోని సాగుభూమిలో 80 శాతం తరచూ కరవులు, వరదలు, తుపానుల వంటి విపత్తుల

ఇంటర్ నుంచే సేద్యం!

వ్యవసాయ పరిశోధన రంగంలోకి రావాలన్న ఆసక్తి గల విద్యార్థులకు పదో తరగతి ఉత్తీర్ణులైనప్పటి నుంచే సదవకాశం కల్పించాలి. వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య డిగ్రీల్లో చేరాలనుకునే ఔత్సాహికుల కోసం పదో తరగతి అనంతరం ఆరేళ్ల డిగ్రీ కోర్సును ప్రవేశపెట్టాలి. దీని వల్ల వ్యవసాయం, అనుబంధ రంగాల్లో ఆసక్తి గలవారే ఈ కోర్సుల వైపు మొగ్గుచూపుతారు. ప్రస్తుతం పంజాబ్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఈ తరహా డిగ్రీ కోర్సు ఒకటి ఉంది. దీన్ని దేశమంతా విస్తరించాలి.



దేశంలో వ్యవసాయ పరిశోధన, విద్యారంగానికి కేటాయింపులు (కోట్ల రూపాయల్లో)

సంవత్సరం	నిధులు
1969-74	220
1974-78	430
1980-85	955
1985-90	2,145
1992-97	4,810
1997-2002	6,712
2002-2007	5,368
2007-2012	10,325
2012-2017	13,786

బారిన పడే ప్రాంతాల్లో ఉంది. ప్రపంచ జనాభాలో 18 శాతానికి పైగా ప్రజలు ఇక్కడ నివసిస్తున్నారు. ప్రపంచ వ్యవసాయ స్థూల దేశీయోత్పత్తిలో భారత వ్యవసాయ రంగ వాటా ఎనిమిది శాతమే. అతి తక్కువ భూమి, అధిక జనాభా ఉన్న మనదేశంలో ఆహార భద్రత ఎప్పుడూ ఆందోళనకర అంశమే. ఇప్పటికే దేశ జనాభా 125 కోట్లకు పైబడింది. ఇక చైనాను అధిగమించడమే తరువాయి. ఇక్కడున్న సహజ వనరులను సద్వినియోగం చేసుకుని అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని సగటు రైతుకు అందుబాటులోకి తెస్తేనే అధిక దిగుబడులతో దేశ జనాభాకు ఆహార భద్రత కల్పించగలం. శాస్త్రవేత్తలకు సామాజిక వర్గం ఆధారంగానో, సీనియారిటీ ప్రకారమో పదోన్నతులిచ్చే ప్రస్తుత విధానాన్ని తక్షణం రద్దు చేయాలి. క్షేత్రస్థాయిలో రైతన్నకు బాసటగా నిలిచి సత్ఫలితాలు రాబట్టినవారినే ప్రోత్సహించాలి.

గ్రామానికో శాస్త్రవేత్త

వ్యవసాయ వర్సిటీల ప్రాంతీయ, జాతీయ పరిశోధన సంస్థల్లో పనిచేసే శాస్త్రవేత్తలు సొంత ఆలోచనలతో చేపట్టే ప్రాజెక్టులకు ప్రభుత్వం సమృద్ధిగా నిధులు కేటాయించాలి. అరకొరగా నిధులిచ్చి, వాటిని సంస్థల అధిపతుల చేతుల్లో పెట్టే ప్రస్తుత అహేతుక విధానాలను సంస్కరించాలి. ఏళ్ల తరబడి రసాయన ఎరువుల వినియోగం, ప్రయోగాలతో దేశ ప్రజలు, రైతుల ఆరోగ్యం గుల్లబారుతోంది. సేంద్రియ వ్యవసాయ విధానాలపై పరిశోధనలు చేయడానికి ముందుకొచ్చేవారిని ప్రోత్సహించాలి. ప్రతి శాస్త్రవేత్తకు ఓ గ్రామాన్ని అధికారికంగా దత్తత ఇవ్వాలి. రైతులకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఆ శాస్త్రవేత్త పనిచేసేలా చూడాలి. వీరిపై పాలనపరమైన బాధ్యతలు మోపరాదు. అప్పుడే ఆ శాస్త్రవేత్తలు పైర్ల సంరక్షణ చర్యలపై దృష్టి సారించగలుగుతారు. అనేక సంస్థల్లో పెద్దసంఖ్యలో శాస్త్రవేత్తలు, అధికారులను గుమాస్తా పనులు చేయిస్తున్న దురవస్థ నెలకొంది. పెడపోకడలను తక్షణం దునుమాడాలి. సేద్య విద్య, పరిశోధన రంగంలో ఈ తరహా సంస్కరణలు వచ్చినప్పుడే వ్యవసాయ శాస్త్రవేత్తల పనితీరు మెరుగుపడుతుంది. మెరుగైన వ్యవసాయ దిగుబడులతో గ్రామీణ భారతం కోలుకొంటుంది!

– మంగమూరి శ్రీనివాస్

పిలిచి పదవులిస్తే...



ఎ.సూర్యప్రకాశ్

పార్లమెంటు ఎగువసభ(రాజ్యసభ)కు నియమితులైన కొంత మంది సభ్యులు సభాసమావేశాలకు అసలే హాజరు కాకుండా ఉండటంపై ఈ మధ్య మరోసారి వాడిగా, వేడిగా చర్చ జరిగింది. తీవ్రస్థాయి విమర్శలూ చెలరేగాయి. ఆ నేపథ్యంలో సచిన్ తెందూల్కర్ ఈ నెల మూడున హఠాత్తుగా కాసేపు రాజ్యసభకు హాజరయ్యారు. రాజ్యసభకు నియమితులైన సచిన్ తెందూల్కర్, రేఖ సభ సమావేశాలకు హాజరు కాకపోవడంపై కొంతకాలంగా మీడియా ప్రత్యేక దృష్టి సారించింది. వారి చర్య చట్టసభను అగౌరవపరచడమేనంటూ వివిధ వర్గాలూ ఆరోపిస్తున్నాయి, ఆక్షేపిస్తున్నాయి. సచిన్ తెందూల్కర్ 2012 ఏప్రిల్ 27న రాజ్యసభకు నియమితులయ్యారు. అప్పటి నుంచి రాజ్యసభ 374 రోజులపాటు సమావేశమైంది. అందులో సచిన్ హాజరైంది 24 రోజులు మాత్రమే. 2012లో ఆయన రాజ్యసభకు నియమితుడయ్యాక మొట్టమొదట బడ్జెట్ సమావేశాలు జరిగాయి. ఆ సమావేశాలకూ ఆయన దూరంగానే ఉన్నారు. ఆ ఏడాది వర్షకాల సమావేశాల సందర్భంగా మాత్రం ఒకే ఒక్కరోజు హాజరయ్యారు. ఆ ఏడాది శీతకాల సమావేశాలకు, 2013లో మొదటి, రెండో దఫా బడ్జెట్ సమావేశాలకూ హాజరుకాలేదు. 2014లో రెండో దఫా శీతకాల సమావేశాలు, ప్రత్యేక సమావేశాలు, బడ్జెట్ సమావేశాలకూ గైర్హాజరయ్యారు.

మరో సభ్యురాలు, సినీనటి రేఖ సైతం రాజ్యసభ సమావేశాల పట్ల ఏమాత్రం ఆసక్తి చూపడంలేదు. ఆమెనూ 2012 ఏప్రిల్ 27నాడే నియమించారు. సభ సమావేశమైన 374 రోజుల్లో ఆమె 18 రోజులు మాత్రమే హాజరయ్యారు. 2012, 2013, 2014లలో మూడేసి రోజులు మాత్రమే సభకు వచ్చారు. ప్రస్తుత వర్షకాల సమావేశాల సందర్భంగా ఒకే ఒక్క రోజు హాజరయ్యారు. గడచిన అయిదేళ్లలో సభలో ఆమె ఒక్క ప్రశ్న కూడా అడగలేదు. గొప్ప నటిగా ఆమెను అభిమానించేవారు లక్షల సంఖ్యలో ఉన్నారు. కానీ, పార్లమెంటు సభ్యురాలిగా ఆమె వ్యవహారశైలిని మాత్రం ఎవరూ హర్షించలేకపోతున్నారు. రాజ్యసభకు నియమితులైన సభ్యుల హాజరు విషయంలో అనేక ఏళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. పృథ్వీరాజ్ కపూర్, నర్గీస్ దత్, పండిత్ రవిశంకర్, ఎం.ఎఫ్.హుస్సేన్, ఆర్.కె.నారాయణ్ వంటి ప్రముఖులు ఎంతోమంది 1950ల నుంచి రాజ్యసభకు నియమితులయ్యారు. వారెవరూ సభకు పెద్దగా హాజరైంది లేదు. 1999-2005 మధ్య కాలంలో రాజ్యసభ సభ్యురాలిగా వ్యవహరించిన ప్రముఖ గాయని లతా మంగేష్కర్ హాజరుతీరు మరీ దారుణం. ఆరేళ్ల కాలంలో ఆమె 11 రోజులు మాత్రమే హాజరయ్యారు. 2002-2003 మధ్యకాలంలో ఆమె ఒక్కరోజు మాత్రమే రాజ్యసభకు హాజరయ్యారు.





వివిధ రంగాల్లో నిష్ణాతులమంటూ రాష్ట్రపతి రాజ్యసభకు నియమిస్తున్న కొంత మంది సభ్యులు, సభాకార్యకలాపాల పట్ల ఎంత మాత్రం ఆసక్తి చూపడం లేదు. అసలు, సభకే హాజరు కావడం లేదు. నాటి పృథ్వీరాజ్ కపూర్, నర్గీస్‌దత్ మొదలుకొని నేటి సచిన్ తెందూల్కర్, రేఖ వరకు ఇదే పరిస్థితి! చట్టసభను ఈ విధంగా అగౌరవపరుస్తూ పదవుల్లో కొనసాగవలసిన అవసరం ఉందా అన్నది వారే ఆలోచించుకోవాలంటున్న వ్యాసమిది...

పెద్దల సభపై చిన్నచూపు

సచిన్ తెందూల్కర్ రాజ్యసభకు హాజరుకావడం లేదన్న విషయాన్ని గ్రహించిన మీడియా, 2014 నుంచే ఆయన మీద ఒక కన్నేసి ఉంచింది. మూడేళ్లనాడు ఒక షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి ఆయన విజయవాడ వచ్చారు. అప్పుడు పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు జరుగుతున్నాయి. ఆ కీలకవేళ రాజ్యసభకు హాజరుకావడానికి సమయం లేని ఆయన, ఇతర కార్యక్రమాలకు మాత్రం ఎలా హాజరవుతున్నారని మీడియా ప్రశ్నించింది. 'నన్నే ప్రశ్నిస్తారా' అంటూ ఆనాడు మీడియా మీద తెందూల్కర్ విరుచుకుపడ్డారు. ప్రతీ విషయం మీద ఏదో ఒకటి చెప్పడం మీడియాకు అలవాటైందంటూ ఒక సందర్భంలో ఆయన అసహనం వ్యక్తపరచారు. ఆహా ఓహో అని పొగిడినప్పుడు సచిన్‌కు మీడియా మంచిదనిపించింది. సభకు ఎందుకు హాజరుకావడంలేదని ప్రశ్నిస్తే మాత్రం అది చెడ్డదైపోయిందా? ఆయన ఒక కీలకమైన విషయాన్ని గమనించడం లేదు. రాజ్యాంగంలోని 80(1) (ఎ) అధికరణ ప్రకారం రాష్ట్రపతి 12 మందిని రాజ్యసభ సభ్యులుగా నియమించవచ్చు. సాహిత్యం, విజ్ఞానశాస్త్రం, కళలు, సామాజిక సేవారంగాల్లో ప్రత్యేక పరిజ్ఞానం లేదా విశేష అనుభవం కలిగి ఉన్న వ్యక్తుల్నే ఆ విధంగా రాజ్యసభకు నియమించాలని 80(3) అధికరణ స్పష్టం చేస్తోంది. అందులో క్రీడాకారుణ్ని నియమించవచ్చునని ఎక్కడా లేదు. అయినప్పటికీ ఆ నిబంధనను సడలించి సచిన్‌ను నియమించారు. క్రికెట్‌లో ఉన్నతస్థాయికి చేరి, అసంఖ్యాకుల విశేష అభిమానం చూరగొన్న సచిన్‌కు ఇదివరకటి యూపీఏ ప్రభుత్వం అత్యున్నత పౌర పురస్కారమైన భారతరత్న ప్రదానం చేయడమే కాకుండా, రాజ్యసభకూ నియమించడం వెనక ఒక ప్రత్యేక కారణం ఉంది. దీనివల్ల 2014 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా తన ప్రతిష్ఠ పెరుగుతుందని, అది ఎంతో కొంత సానుకూల ప్రభావం చూపుతుందని ఆనాడు కాంగ్రెస్‌పార్టీ భావించింది. తనను రాజ్యసభకు నియమించాక కాంగ్రెస్ అధినాయకురాలు సోనియా గాంధీని కలిసి కృతజ్ఞతలు తెలిపిన సచిన్- ఎల్.కె.అడ్వాణీ, ప్రకాశ్ కారాట్, చంద్రబాబునాయుడు, నీతీశ్‌కుమార్, మాయావతి వంటి వారిని అసలు పట్టించుకోలేదు. రాజ్యసభకు నియామకం కావడమంటే ట్రోఫీ తీసుకొని ఇంటికిపోవడం కాదని, 130 కోట్ల ప్రజానీకం పట్ల బాధ్యతతో వ్యవహరించడమన్న జావెద్ అఖ్తర్ మాటల్లో ఎంతైనా నిజం ఉంది. ఆయనా అలా రాజ్యసభకు నియుక్తులైనవారే. కానీ, స్వీయబాధ్యత తను ఏనాడూ విస్మరించలేదు. 'భారతరత్న' సచిన్ తెందూల్కర్ పార్లమెంటు ఎగువసభ పట్ల ఇలా అమర్యాదకరంగా వ్యవహరించడం సరికాదు. ఒక్క సచిన్, రేఖ అనే కాదు- రాజ్యసభకు నియుక్తులైన సభ్యులెవరూ ఆ అత్యున్నత సభ పట్లా, దేశ ప్రజానీకం పట్లా నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగనిపని. ఇక మీదట ఏ విధంగా ముందుకెళ్లాలన్నదానిపై నిర్ణయం తీసుకోవలసింది వారే!

(రచయిత– ప్రసార భారతి ఛైర్మన్)

ఈనాడు లేఖలు

చిన్నారులపై దుష్ప్రభావాలు

సమాజం వేగంగా మారిపోతోంది. చరవాణుల ద్వారా సామాజిక మాధ్యమాలకు సులభంగా అనుసంధానమవుతున్న చిన్నారులు వయసుకు తగని విషయాలను తెలుసుకుంటున్నారు. పరిచయాలను పెంచుకుంటున్నారు. ఈ పరిణామాలు చదువులపట్ల వారి శ్రద్ధాసక్తులను దెబ్బతీస్తున్నాయి. ఏకాగ్రత కోల్పోతున్న పిల్లలు ఒత్తిడి, గందరగోళానికి గురై తల్లిదండ్రులకు సమస్యాత్మకంగా మారుతున్నారు. విద్యాబోధన, మార్కుల సాధన వరకే తమ బాధ్యత పరిమితమన్నట్లుగా పాఠశాలలు, కళాశాలలు వ్యవహరిస్తున్నాయి. మారుతున్న రోజులనుబట్టి పిల్లల విషయంలో తల్లిదండ్రుల బాధ్యత రెట్టింపైంది. ప్రేమతో పిల్లల్ని పెంచాలి. అదే సమయంలో ఇంటాబయటా పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిరంతరం కనిపెడుతూ ఉండాలి. ప్రాథమిక విద్య నుంచే అది అలవడాలి. ఈ విషయంలో మనోవైజ్ఞానిక నిపుణుల సేవలను స్వీకరించాలి. వారితో ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేయాలి.

- సరిపల్లి త్రినాథ్, విజయనగరం

వెతలు తీరేదెన్నడు?

రాష్ట్ర ప్రభుత్వం బెల్టుషాపుల ఎత్తివేత, నిరుద్యోగులకు భృతి వంటి అనేక సంక్షేమ చర్యలు చేపడుతోంది. అదేసమయంలో ఏళ్ల తరబడి ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల్లో ఒప్పంద ఉద్యోగులు పడుతున్న బాధలను మాత్రం పట్టించుకోవడం లేదు. నెలకు నాలుగు వేల రూపాయలు వేతనమైనా వీరికి చెల్లించడం లేదు. ఉద్యోగాల క్రమబద్ధీకరణ కోసం వారు చేస్తున్న విజ్ఞప్తులు అరణ్య రోదనలవుతున్నాయి. పూర్తిస్థాయి సిబ్బంది మాదిరిగా విధులు నిర్వహిస్తూ అరకొర వేతనాలు అందుకోవడం ఒకరకంగా వెట్టిని తలపిస్తోంది. ప్రభుత్వం ఇప్పటికైనా ఒప్పంద ఉద్యోగుల సమస్యలపై దృష్టి సారించాలి. అనుభవం, అర్హతల ప్రాతిపదికగా వారి సేవలను క్రమబద్ధీకరించాలి.

- దాసం సత్యవతి, ఉరదాళ్లపాలెం, పశ్చిమగోదావరిజిల్లా

ఆనందానుభవం

ఆనందం అనే పదానికి- సంతోషం, సుఖం, పరమాత్మ అని అర్థాలు చెబుతుంది నిఘంటువు. మనసుకు ఆహ్లాదం కలిగించేది ఏదైనా ఆనందమే! ఎవ్వరైనా ఇష్టపడి కొనసాగించే వ్యాపకాన్నీ ఆనందంగానే పరిగణించవచ్చు. పరులకు హాని కలిగిస్తూ, అదే తనకు సంతోషకరమని భావించడాన్ని 'ఆనందం' అనలేం!

ముష్కరులు తమ ఆనందం కోసం ప్రపంచాన్ని భయభ్రాంతం చేస్తుంటారు. పైగా తమ పనులన్నీ భగవంతుడు మెచ్చే అంశాలుగా భ్రమిస్తూ, ఇతరుల్ని భ్రమింపజేస్తూ ఉంటారు. ఇది ఎవరూ హర్షించే విషయం కాదు. ఇలాంటి చర్యలను లోకం 'ఉగ్రవాదం'గా పరిగణిస్తుంది. వ్యక్తికి గల స్వేచ్ఛ సమాజంలో ఎవరి ఆనందానికీ విఘాతం కలిగించేది కాకూడదు. అది ఎవరో కొందరికి ఆనందం కలిగిస్తే కలిగించవచ్చు కానీ- వ్యక్తి, సంఘ శ్రేయస్సుకు హాని కలిగించేవాటిని ఆనందమని భావించలేం.

సంగీతం, సాహిత్యం, క్రీడలు వంటివి పలువురి సంతోషానికి దోహదపడే అంశాలు. వాటిని సాధన చేసేవారు ఆయా వ్యాపకాలతో ఆనందం పొందుతుంటారు. ఆ సాధనాంశాలు ఎవరికీ హానికరం కావు. అవి అందర్నీ సంతోష తరంగాల్లో ముంచెత్తుతుంటాయి. ఆ సాధనలు ఆనంద ప్రేరకాలు-కారకాలు, సామాజిక ఉద్ధారకాలు! వాటిని సాధన చేయడం ద్వారా వ్యక్తి సుఖానుభూతి అందుకోవచ్చు.

అందరూ సామూహికంగా అనుభవించే సంతోష మార్గమే ఆనందం. వ్యక్తి సంతోషమే సమాజ సౌఖ్యానికి ప్రేరణ అవుతుంది. మానవ జీవితంలో ఆనందం అనేది సంక్రమించే లక్షణం గల ఓ దివ్య వైభవం. ఒకరు నవ్వుతుంటే- ఇతరుల పెదవులపైనా ఆనంద పుష్పాలు వికసించాలి, ఆనందాల సిరులు లాస్యం చేయాలి. సర్వుల ఆనందం-సమాజ వైభవం అంటే అదే!

ఒక వ్యక్తికి భగవంతుడి దివ్యవైభవాన్ని కీర్తిస్తూ గానం చేయడంలో పరవశం కలగవచ్చు. మరో వ్యక్తికి- సాటివాడికి సాయపడటంలో ఆనందం దొరకవచ్చు. ఒకరికి సంగీతం ఆలపిస్తుంటే, వేరొకరికి ఆ ఆలాపనను వింటుంటే మనోక్లేశాలు దూరం కావచ్చు. వినోదాలు ప్రదర్శించడం ద్వారా కొందరికి, ఆ మాయావినోదాల్ని చూడటం వల్ల మరికొందరికి ఆనందానుభవాలు కలుగుతాయి.

మానవ హననానికి దారితీసే మారణాయుధాలు తయారుచేయడంలో ఒక దేశానికి ఆనందం లభించవచ్చు. వాటిని ప్రదర్శించి తన దర్పాన్ని నలువైపులా చాటడం వల్ల ఆ ఆనందం ఇనుమడించవచ్చు. నిజానికి అది పైశాచిక ఆనందం! అందరి మేలూ కోరని, సార్వజనీనం



అంతర్యామి

కాని ఆనందం అసలు ఆనందమే కాదు. ఓ ఉన్మాది అనుభవించే ఆనందం సమస్త మానవాళీ హర్షించే ఆనందం ఎన్నటికీ కాదు.

ఆశాభావ పూరితమైన, మహత్వపూర్ణమైన ఇంద్రియానుభవం ఆనందంలో వ్యక్తమవుతుంది. ఆ ఆనందం ఆ భక్తుడికే పరిమితమైంది. అతడు దైవాంశ సంభూతమైన ఆ ఆనంద వైభవాన్ని తాను అనుభవించి ఇతరులతోనూ పంచుకుంటే, అది మహదానందం!

ఆరోగ్యప్రదాయినిగా ఆనందాన్ని పరిగణిస్తారు. అది ప్రాంతం, ప్రజలపై ఆధారపడి ఉంటుంది. వారు ఆరోగ్యంగా జీవిస్తారు. జాతికి వన్నె తెచ్చే పౌరులుగా రూపొందుతారు. వారి అలవాట్లు, జీవనశైలి గురించి తెలుసుకొని- ఇతరులూ ఆనందాన్వేషణ సాగిస్తారు. శాంతికి, ప్రగతికి కారణమయ్యే ఆనంద మార్గాల్ని అన్వేషించి సాధకుడు తన జీవితాన్ని పండించుకోవాలి.

ఉన్నత స్థానాల్లో ఉండేవారు ఆనందంగా ఉన్నట్లేనా? అది వారి మనోభావాలకు పరిమితమైన అంశం. ఏ పీఠాన్ని, పదవినీ కోరకుండానే ఆనందాన్ని సొంతం చేసుకున్నవారు ఉన్నారు. అటువంటి మానసిక స్థితి- అందరూ కోరదగింది, సాధించదగింది! భారతీయ తత్వచింతనాపరులు అటువంటి ఔన్నత్యాన్ని సాధించి లోకంలో అపార గౌరవాదరాలు పొందగలిగారు.

వ్యక్తిగత స్వేచ్ఛను అనుభవిస్తూనే- మన సంస్కృతి, సంప్రదాయాల ఆచరణ వల్ల ఉన్నతమైన ఆనందం సాధించవచ్చు. సమాజం మెచ్చే ప్రతి పనితోనూ, అటువంటి సంతృప్తికర జీవనాన్ని అనుభవించవచ్చు. అదే అందరి లక్ష్యమూ కావాలి. అందరి ఆనందానికీ అదే హేతువుగా మారుతుంది!

– గోపాలుని రఘుపతిరావు

ఆకర్షణీయం... అత్యాధునికం

- అమరావతిని తీర్చిదిద్దేందుకు కసరత్తు
- ప్రత్యేక వాహక సంస్థ ఏర్పాటు
- ప్రభుత్వానికి సీఆర్‌డీఏ ప్రతిపాదన
- నిధుల సమీకరణకు సిద్ధమవుతున్న ప్రణాళికలు
- అంచనా వ్యయం రూ.1874 కోట్లు
- కేంద్రం ఇచ్చేది రూ.500 కోట్లు

ఈనాడు – అమరావతి



స్మార్ట్ సైకిళ్లు... స్మార్ట్ ఎలక్ట్రికల్ బస్సులు... స్మార్ట్ వాటర్ ట్యాప్‌లు... సోలార్ విద్యుత్ ప్యానళ్లను పైకప్పుగా అమర్చిన బహుళ అంతస్తుల పార్కింగ్ సదుపాయం.. బయో పార్కులు... సెన్సర్లు... థర్మల్ రాడార్లు... ఇలా ఎటు చూసినా స్మార్టే..! రాజధాని అమరావతిలో పరిపాలనా నగరాన్ని అత్యంత ఆకర్షణీయంగా, అత్యాధునికంగా తీర్చిదిద్దేందుకు రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ) సన్నాహాలు చేస్తోంది. అమరావతిని కేంద్ర ప్రభుత్వం ఆకర్షణీయ నగరంగా ఎంపిక చేయడంతో... కేంద్రం నుంచి వచ్చే నిధుల్ని, దానికి రాష్ట్ర ప్రభుత్వం జత చేసే నిధుల్ని మూలధనంగా చూపించి... ఇతర సంస్థల నుంచి మరిన్ని నిధుల సమీకరణకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. స్మార్ట్ సిటీగా ఎంపికైన ఏ నగరానికైనా కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయాలంటే... సంబంధిత నగరపాలక సంస్థ, రాష్ట్ర ప్రభుత్వం కలసి ఒక ప్రత్యేక వాహక సంస్థ (ఎస్పీవీ)ను ఏర్పాటు చేయాలి. సాధారణంగా ఎస్పీవీలో స్థానిక స్వపరిపాలన సంస్థకు 50 శాతం, రాష్ట్ర ప్రభుత్వానికి 50 శాతం వాటా ఉండాలి. అమరావతికి ఇంకా స్వపరిపాలన (యూఎల్‌బీ) సంస్థ లేదు కాబట్టి... సీఆర్‌డీఏ భాగస్వామిగా ఉంటుంది. ఎస్పీవీ ఏర్పాటుకి అనుమతి కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి సీఆర్డీఏ ఇప్పటికే ప్రతిపాదన పంపింది. స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు పర్యవేక్షణకు ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్ (పీఎంసీ)ని నియమించేందుకు త్వరలోనే టెండర్లు పిలవనున్నట్టు సీఆర్‌డీఏ వర్గాలు తెలిపాయి. ఎస్పీవీలో 26 శాతానికి మించకుండా ప్రైవేటు సంస్థలకు వాటా ఇచ్చే వీలుంది. అమరావతి వరకు ప్రస్తుతం ప్రైవేటు సంస్థలకు వాటా ఇచ్చే ఆలోచన లేదని సీఆర్‌డీఏ వర్గాలు పేర్కొన్నాయి.

తొలి విడతలో రూ.200 కోట్లు...!

అమరావతి స్మార్ట్‌సిటీ ప్రాజెక్టుకి కేంద్ర ప్రభుత్వం రూ.500 కోట్లు ఇస్తుంది. దానిలో రూ.200 కోట్లు వెంటనే విడుదల చేసేందుకు సిద్ధంగా ఉంది. ఎస్పీవీ ఏర్పాటు చేయడం కోసం ఎదురు చూస్తోంది. మిగతా రూ.300 కోట్లు... ఏటా రూ.100 కోట్లు చొప్పున వచ్చే మూడేళ్ల పాటు విడుదల చేస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం, సీఆర్‌డీఏలు తమ వాటాగా రూ.500 కోట్లు సమకూర్చాల్సి ఉంటుంది. స్మార్ట్ సిటీ ప్రాజెక్టుల్లో రెండు విభాగాలు ఉంటాయి. నగరంలో నిర్దిష్ట ప్రాంతం (ఏరియా బేస్డ్) అభివృద్ధికి, మొత్తం నగరాభివృద్ధిలో (పాన్‌సిటీ) భాగంగా చేపట్టే ప్రాజెక్టుల్ని ప్రతిపాదించాలి. ఏరియా బేస్డ్ కింద 900 ఎకరాల్లో నిర్మించే పరిపాలా నగరాన్ని సీఆర్‌డీఏ ప్రతిపాదించింది. పాన్‌సిటీ డెవలప్‌మెంట్‌లో భాగంగా నగరంలో కొన్ని ఆకర్షణీయ ప్రాజెక్టులు చేపడతామని పేర్కొంది. ఏరియా బేస్డ్ డెవలప్‌మెంట్ ప్రతిపాదనలకు రూ.1418.90 కోట్లు, పాన్ సిటీ డెవలప్‌మెంట్‌కి రూ.392.89 కోట్లు... మొత్తం కలిపి సుమారు రూ.1,874 కోట్ల మూలధన పెట్టుబడి కావాలని అంచనా. వాటి నిర్వహణకు వచ్చే ఐదేళ్లలో రూ.214.62 కోట్లు ఖర్చవుతుందని సీఆర్‌డీఏ అంచనా వేసింది.

ఇదీ ప్రణాళిక...

- ★ ఎస్పీవీలో కేంద్ర, రాష్ట్రాల భాగస్వామ్యం రూ.1000 కోట్లు
- ★ వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల నుంచి రూ.257.65 కోట్లు. దీనిలో కేంద్ర భారీ పరిశ్రమల శాఖకు చెందిన ఫేమ్ పథకం కింద రూ.112.50 కోట్లు. స్వచ్ఛభారత్ పథకం కింద రూ.12 కోట్లు, అమృత్ కింద రూ.131.65 కోట్లు, సోలార్ సిటీ మిషన్ కింద రూ.51.50 కోట్లు సమకూర్చుకోవాలన్నది ఆలోచన.
- ★ ప్రపంచబ్యాంకు రుణం ద్వారా రూ.56.85 కోట్లు.
- ★ హడ్కో రుణం ద్వారా రూ.119.20 కోట్లు
- ★ జైకా నుంచి రుణం ద్వారా రూ.268.30 కోట్లు
- ★ ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్య (పీపీపీ) ప్రాజెక్టుల ద్వారా రూ.122 కోట్లు.

అవినీతిపై పోరాడే వారికి సహకరిస్తా

- మాటల్లో వాడి పెంచిన కమల్‌హాసన్



చెన్నై: కొన్ని రోజులుగా అవినీతి అంశంపై గొంతెత్తుతున్న విశ్వనటుడు కమల్‌హాసన్ తాజాగా మాటల వాడిని పెంచారు. అవినీతిపై పోరాడేవారికి సహకరిస్తానని, ఎవరూ ముందుకు రాకపోతే ప్రత్యామ్నాయ మార్గాలను వెతుక్కుంటానని మంగళవారం కుండబద్దలు కొట్టారు. సామాజిక మాధ్యమంలో వరుస ట్వీట్లు చేసిన కమల్.. తమిళనాడు ప్రభుత్వం, ముఖ్యమంత్రిని లక్ష్యంగా చేసుకుని ఈ వ్యాఖ్యలు చేసినట్లు స్పష్టమవుతోంది. రాష్ట్రంలో అన్నాడీఎంకే, డీఎంకేలు మొద్దుబారిపోయాయని ఆయన వ్యాఖ్యానించారు. దుర్ఘటనలు, అవి నీతి, అక్రమాలు జరిగితే ప్రభుత్వాలను రద్దుచేయాలని కోరుతున్న నేపథ్యంలో తమిళనాడులో అలాంటివి చాలా జరిగాయని కమల్ ప్రస్తావించారు. వాటిపై ముఖ్యమంత్రి రాజీనామాకు ప్రతిపక్షాలు డిమాండ్ చేయటం లేదని వ్యాఖ్యానించారు. ఈ విషయంపై మంగళవారం వరుస ట్వీట్ల ద్వారా ప్రజాభిప్రాయాన్ని కోరారు. ఎవరైతే అవినీతికి వ్యతిరేకంగా పోరాడాలనుకుంటున్నారో వారందరూ ధైర్యంగా ముందుకు రావాలని కమల్ కోరారు. ఈ అంశంపై నూతన జాతీయ ఉద్యమం ప్రారంభించాలని పిలుపునిచ్చారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో చిన్నపిల్లలు మృతి చెందడంతో అక్కడి ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని కాంగ్రెస్ కోరుతోందని గుర్తుచేశారు. తమిళనాడులో ఇలాంటి పరిస్థితి లేదన్నారు. ప్రజలకు మంచి పాలన అందాలన్నదే తన లక్ష్యమన్నారు. తనతో ఏకీభవిస్తూ అన్నాడీఎంకే, డీఎంకే, ఇతర పార్టీలేవైనా ముందుకొస్తే సహకరించడానికి సిద్ధమని కమల్‌హాసన్ పేర్కొన్నారు. ఇటీవల డీఎంకే పత్రిక మురసొలి వజ్రోత్సవాల్లో ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు స్టాలిన్‌తో కమల్ వేదిక పంచుకున్నారు. అంతకు ముందు రాష్ట్ర ప్రభుత్వంలో అవినీతి రాజ్యమేలుతోందని బిగ్‌బాస్ వివాదం సందర్భంగా కమల్ తీవ్రవ్యాఖ్యలుచేశారు. దీంతో కొన్నిరోజులుగా మంత్రులు, కమల్‌హాసన్ మధ్య మాటల యుద్ధం కొనసాగింది.

రూ.వెయ్యి కోట్లతో వంతెనల పునర్నిర్మాణం

- ఏఐఐబీకి ప్రతిపాదనలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో 342 వంతెనల పునర్నిర్మాణానికి రూ.వెయ్యి కోట్లతో రహదారులు, భవనాలు శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఆసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఏఐఐబీ) నుంచి పొందే ఆర్థిక సహకారంతో ఈ వంతెనల పనులు చేపట్టనున్నారు. ఈ మేరకు ఏఐఐబీకి ప్రతిపాదనలు అందజేశామని ఆర్ అండ్ బీ ముఖ్య ఇంజినీర్ సిహెచ్.వి.సోమశేఖర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తమ శాఖ పరిధిలో రహదారి భద్రతకీ, ప్రయాణానికీ ఏ మాత్రం అనువుగా లేని వంతెనలు, బలహీనంగా ఉన్న వాటినీ గుర్తించామన్నారు. వాటిని దశలవారీగా పునర్నిర్మాణం చేస్తామని చెప్పారు. త్వరలో ఏఐఐబీ బృందం రాష్ట్రానికి వచ్చి ప్రభుత్వంతో ఇందుకు సంబంధించిన ప్రాజెక్టు గురించి చర్చించనుందని తెలిపారు. పునర్నిర్మాణం అయ్యే వరకూ వంతెనలకు అవసరమైన మరమ్మతులకు సంబంధించి ప్రణాళికేతర వ్యయం నుంచి నిధులు సమకూరుస్తామన్నారు. ఆర్ అండ్ బీ శాఖ అందించే వంతెన డిజైన్ల ప్రకారం చూస్తే వాటి మన్నిక 80ఏళ్లు ఉంటుందన్నారు. పంచాయతీరాజ్ శాఖ నుంచి తీసుకొనే రహదారులపై ఉండే వంతెనల డిజైన్లు తమ శాఖ ప్రమాణాలకు తగ్గట్టు ఉండవని వివరించారు.

'యూఎస్‌బీ పరికరాల'తో సమాచార చౌర్యం!

మెల్‌బోర్న్: కంప్యూటర్‌తో ఇతర పరికరాలను అనుసంధానించేందుకు యూఎస్‌బీ పోర్టులను ఉపయోగించడం సర్వసాధారణమైన విషయం. ప్రత్యక్ష అనుసంధానం ఉండటం వల్ల సమాచార చౌర్యానికి ఈ పద్ధతిలో వీలు లేదనే భావన ఉంది. అయితే ఇది నిజం కాదని ఆస్ట్రేలియాలోని అడిలైడ్ విశ్వవిద్యాలయ పరిశోధకులు చెబుతున్నారు. ఒకే యూఎస్‌బీ హబ్‌లో పక్కన ఉండే పోర్టుకు హానికారక పరికరాలను అనుసంధానించడం ద్వారా సమాచారాన్ని దోచుకునేందుకు అవకాశమున్నట్లు తమ పరిశోధనలో వెల్లడైందని తెలిపారు. పాస్‌వర్డ్‌ల వంటి సున్నితమైన సమాచారం కూడా బయటకు పొక్కవచ్చని పేర్కొన్నారు. ఒక యూఎస్‌బీ పోర్ట్ డేటాలైన్లలో చోటుచేసుకునే వోల్టేజ్ హెచ్చుతగ్గులను పక్కన ఉండే పోర్ట్ ద్వారా గమనించవచ్చని అన్నారు. యూఎస్‌బీకి అనుసంధానించే ఓ చవకైన విద్యుద్‌దీపానికి కొన్ని మార్పులు చేసి.. కీబోర్డు ద్వారా టైప్ చేసిన సమాచారమంతా తాము దొంగలించగలిగామని పరిశోధకులు తెలిపారు.



బొమ్మనహళ్లి లోతట్టు ప్రాంత రహదారిపై మోకాలు లోతు నీటిలో నడిచి వెళుతున్న జనం



పెద్ద కాలువను తలపిస్తున్న ఐటీ, బీటీ సంస్థలున్న కోరమంగళ ప్రాంతంలోని ఓ రహదారి

బెంగళూరులో కుంభవృష్టి

- చురుగ్గా మారిన 'నైరుతి' • మరో రెండు రోజులూ వర్షాలే

ఎలక్ట్రానిక్ సిటీ (బెంగళూరు), న్యూస్‌టుడే: నైరుతి రుతుపవనాలు ఒక్కసారిగా చురుగ్గా మారడంతో వానదేవుడు విజృంభించాడు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు కురిసిన కుంభవృష్టితో బెంగళూరు నగరం అతలాకుతలమైంది. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ఇళ్లల్లోకి నీరు చేరింది. తీవ్ర నష్టం వాటిల్లింది. మరో రెండు రోజుల పాటు ఇదే తరహాలో వర్షం కురిసే అవకాశాలున్నట్లు ప్రాంతీయ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. దక్షిణ, మధ్య కర్ణాటక ప్రాంతంలో రుతుపవనాలు చురుగ్గా ఉండగా మిగిలిన ప్రాంతాల్లో బలహీనపడ్డాయి. నగరంలోని హెచ్.ఎ.ఎల్. విమానాశ్రయం ప్రాంతంలో రికార్డు స్థాయిలో వర్షం కురిసింది. ఇక్కడ 143.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. 2012లో ఇక్కడ 107.3 మిల్లీమీటర్ల వర్షం అత్యధికం కాగా.. ఇపుడు ఆ రికార్డు తుడిచిపెట్టుకుపోయింది. మొత్తంపై బెంగళూరులో 14 సెంటీమీటర్లు, మండ్యలో 13 సెంటీమీటర్ల అత్యధిక వర్షపాతం నమోదైంది. కావేరి పరివాహక ప్రాంతానికి ఇదెంతో ఊపునిచ్చే అంశమైనా.. బెంగళూరు వాసికి మాత్రం ఇబ్బందులకు గురి చేసింది. మంగళవారం స్వాతంత్య్ర దిన వేడుకలూ చిత్తడిలోనే సాగాయి. లోతట్టు ప్రాంతాల రహదారులపై నుంచి వాననీరు కదలక పోవడంతో జనం కొన్ని చోట్ల మోకాలిలోతు నీటిలోనే నడచి వెళ్లక తప్పలేదు. బృహత్ బెంగళూరు మహానగర పాలికె, బెంగళూరు అభివృద్ధి సంస్థలు రంగంలోకి దిగి సహాయక చర్యలు కొనసాగించాయి.



కొబ్బరితో చేసిన బొమ్మలు, గరిటెలు

సెప్టెంబరు 2న కొబ్బరి పండగ

ఈనాడు, అమరావతి: ప్రపంచ కొబ్బరి దినోత్సవం సందర్భంగా సెప్టెంబరు 2న విజయవాడలో 'కొబ్బరి పండగ' నిర్వహిస్తున్నట్లు కొబ్బరి అభివృద్ధి బోర్డు డిప్యూటీ డైరక్టర్ ఆర్.జైనాథ్ తెలిపారు. విజయవాడలో జరుగుతున్న ఆర్గానిక్, నర్సరీ మేళాలో బోర్డు ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారు. కొబ్బరి పాల పొడి, టెండర్ కోకోనట్, నీరా, ఫ్లేవర్డ్ మిక్స్‌తోపాటు వివిధ రకాల ఆకృతులతో రూపొందించిన బొమ్మలను ఇక్కడ ఉంచారు. కొబ్బరితో ఎన్నో రకాల ఉత్పత్తులు తయారు చేయొచ్చని ఆయన వివరించారు.

ప్రజల భాషలో రిజిస్ట్రేషన్ సేవలు

- రిజిస్ట్రేషన్ సందేహాలు తీర్చేలా 'కరదీపిక'
- దస్తావేజు రాసుకోవడంపైనా అవగాహన
- త్వరలో విడుదల కానున్న పుస్తకం

ఈనాడు – అమరావతి

దస్తావేజుల్లో ఉన్న భాష ఒక పట్టాన ఎవరికీ కొరుకుడుపడదు. లేఖర్లు రాసే ఆ భాష, వాక్యనిర్మాణం ఈ తరంవాళ్లకే కాదు పెద్దవాళ్లకీ గందరగోళమే. అలాగే రిజిస్ట్రేషన్ సేవలు, నిబంధనలను అర్థం చేసుకోవడం కష్టమే అనుకొంటారు. అందుకే దస్తావేజు లేఖర్లు, రిజిస్ట్రేషన్ వ్యవహారాలు తెలిసినవాళ్లు సూచించిన విధంగా పనులు చేసుకొంటూ ఉంటారు. రిజిస్ట్రేషన్ సేవలు, దీంతో ముడిపడి ఉన్న వ్యవహారాలను అందరికీ అర్థమయ్యేలా తేలికైన భాషలో రూపొందించి ప్రత్యేకంగా పుస్తకాన్ని తీసుకొస్తున్నారు. 'కరదీపిక' పేరుతో స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ ఈ పుస్తకాన్ని రూపొందించింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పనులు చేయించుకోవడానికి మధ్యవర్తులపై ఆధారపడటం, చిన్నపాటి సేవలకు కార్యాలయం చుట్టూ తిరగడం లాంటివి చేస్తున్నారని... వారికి అవగాహన ఉంటే ఎంత సులభంగా పనులు పూర్తి చేసుకోవచ్చో తెలియజెప్పడమే ఈ పుస్తకం ఉద్దేశమని ఉన్నతాధికారులు చెబుతున్నారు.

ఆన్‌లైన్‌లోనూ చదువుకోవచ్చు

రిజిస్ట్రేషన్ శాఖ ఎన్ని రకాల సేవలు అందిస్తున్నదో తెలియజేయడంతోపాటు క్రయవిక్రయాల సమయంలోనూ, వివిధ లావాదేవీలకు సంబంధించిన దస్తావేజులను ఏ విధంగా రూపొందించుకోవాలి? స్టాంపు డ్యూటీలు ఏ విధంగా ఉంటాయి? మార్కెట్ విలువల నిబంధనలేమిటి? లాంటి వివరాలను 'కరదీపిక'లో పొందుపరిచారు. ఈ పుస్తకంలో వివరాలను సగటు పౌరుడికి రిజిస్ట్రేషన్‌లో వచ్చే సందేహాలను నివృత్తి చేసేలా తీర్చిదిద్దారు. రిజిస్ట్రేషన్ శాఖ అధికారులే వివిధ సందర్భాల్లో తమ ముందుకు వచ్చి తరచూ అడిగే సందేహాలన్నింటినీ క్రోడీకరించి వాటికి సమాధానాలు సిద్ధం చేసుకొన్నారు. అలాగే ప్రశ్నలు, ఉప ప్రశ్నలను వేసుకొని వాటికి సమాధానాలు రాసుకొన్నారు. ఈ వివరాలన్నింటినీ ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా రాశారు. అలాగే దస్తావేజులు రాసుకోవడంపై ప్రజలకు ఎక్కువ సందేహాలు వస్తున్నాయని అధికారులు తెలిపారు. అందులో వాడే భాష గతకాలంలో మాదిరే ఉండాలా? వాడుక భాష వినియోగించవచ్చా? అని నేటి యువత అడుగుతోందని ఉన్నతాధికారులు తెలిపారు. అలాగే దస్తావేజుల్లో పొందుపరచుకోవల్సిన వివరాలు, నిబంధనలతోపాటు వాటికి జత చేయాల్సిన పత్రాల గురించి కూడా ఇందులో తెలిపారు. రిజిస్ట్రేషన్ సందర్భంలో కొనుగోలుదారులు ఏయే విషయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలి? పరిశీలించుకోవల్సిన పత్రాలను వివరాలను ఇందులో తెలిపారు. రిజిస్ట్రేషన్ రుసుముల వివరాలను, చెల్లింపుల ప్రక్రియను కూడా వెల్లడించారు. ఆస్తుల క్రయవిక్రయాలతోపాటు పవర్ ఆఫ్ అటార్నీ అంటే ఏమిటి? ఇందులో ఎన్ని రకాలుంటాయి? వాటిని ఏ విధంగా రాసుకొంటారు? వీలునామా అంటే ఏమిటి? ఆ పత్రాన్ని రిజిస్ట్రేషన్ చేయాలంటే ఎంత చెల్లించాలి? రిజిస్ట్రేషన్ తప్పనిసరా? అసలు వీలునామా ఎవరు రాయవచ్చు? లాంటి పలు సందేహాలకు ఈ పుస్తకం సమాధానం ఇస్తుంది. ఈ శాఖ అందిస్తున్న ఇ-సేవలు వివరాల్నీ తెలియజేశారు. ఇటీవలే ముఖ్యమంత్రి దగ్గర కరదీపికను లాంఛనంగా విడుదల చేశారు. ప్రస్తుతం రిజిస్ట్రేషన్ శాఖ వెబ్‌సైట్‌ను ఆధునికీకరిస్తున్నారు. త్వరలోనే ఈ వెబ్‌సైట్ కొత్త రూపు తీసుకొంటుంది. అందులో కరదీపికను ఉంచనున్నారు. ఆన్‌లైన్‌లో దీన్ని చదువుకొనే అవకాశం ఉంటుంది. పుస్తక రూపంలో ఏ విధంగా అందుబాటులోకి తీసుకురావాలి? ఎంత ధరను నిర్ణయించాలనే అంశంపై త్వరలో స్పష్టత రానుంది.



ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శిద్దా రాఘవరావు. చిత్రంలో అంబికా కృష్ణ తదితరులు

రాష్ట్రంలో ఆర్యవైశ్యులకు పెద్దపీట

- మంత్రి శిద్దా రాఘవరావు వెల్లడి

చాగలమర్రి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో తెదేపా ప్రభుత్వం ఆర్యవైశ్యులకు పెద్దపీట వేసిందని మంత్రి శిద్దా రాఘవరావు పేర్కొన్నారు. మంత్రివర్గంలో చోటుతోపాటు.. ఎన్నో ఛైర్మన్లు, కార్పొరేషన్లను కూడా ఆర్యవైశ్యులకు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ ఘనత ఒక్క చంద్రబాబుకే దక్కుతుందన్నారు. మంగళవారం మంత్రి శిద్దా, సినీపరిశ్రమ అభివృద్ధి ఛైర్మన్ అంబికా కృష్ణ, జిల్లా తెదేపా అధ్యక్షుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లుతో కలిసి నంద్యాల అమ్మవారిశాల వీధిలో పర్యటించారు. స్థానిక ఆర్యవైశ్య నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటుచేసిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిద్దా రాఘవరావు మాట్లాడుతూ.. నంద్యాల నియోజకవర్గంలో అత్యధిక జనాభా ఉండే వారిలో ఆర్యవైశ్యులు కూడా ఉన్నారని, వారి అభ్యున్నతికి ఎల్లవేళలా తమ పార్టీ ముందుండి కృషి చేస్తోందని తెలిపారు. ప్రతిపక్షాల వారు చెప్పే అబద్ధాలను నమ్మవద్దని కోరారు. నంద్యాలలో దాదాపు రూ.1,100 కోట్లతో అభివృద్ధి పనులు జరుగున్నాయని వివరించారు.

శ్రీవారి ఆలయంలో గోకులాష్టమి ఆస్థానం

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి ఆలయంలో గోకులాష్టమి ఆస్థానం మంగళవారం రాత్రి వైభవంగా జరిగింది. మందిరంలోని బంగారు వాకిలి ముందు శ్రీదేవి, భూదేవి సమేత ఉగ్ర శ్రీనివాసమూర్తికి, శ్రీకృష్ణ స్వామికి అర్చకులు ఏకాంతంగా తిరుమంజనం నిర్వహించారు. అభిషేక నివేదన అనంతరం ఉగ్ర శ్రీనివాసమూర్తి దేవేరులతో కలిసి ఆనంద నిలయంలోకి వేంచేశారు. ఘంటా మండపంలో బంగారు సర్వభూపాల వాహనంలో వెన్నముద్ద చేత ధరించిన శ్రీకృష్ణస్వామిని శయన భంగిమలో అలంకరించారు. ఈ సందర్భంగా జీయంగార్లు, వైష్ణవాచార్యులు శ్రీకృష్ణస్వామివారికి దివ్యప్రబంధ పారాయణం నివేదించారు. అనంతరం తులసిమాలలతో అర్చకులు శ్రీకృష్ణుని అర్చించారు. శ్రీమద్భాగవతం తృతీయ అధ్యాయంలోని శ్రీకృష్ణావతార ఘట్టాన్ని అర్చకులు పఠించారు. హారతి, నైవేద్యాలు సమర్పించడంతో గోకులాష్టమి ఆస్థానం వైభవంగా ముగిసింది. తిరుమలలో బుధవారం ఉట్లోత్సవం జరుగనుంది. సుప్రభాతం, తోమాల, అర్చన, సహస్ర కలశాభిషేకం మినహా ఇతర ఆర్జిత సేవలన్నింటినీ తితిదే రద్దుచేసింది. ఉదయం గోగర్భం జలాశయం వద్ద ఉద్యానవనంలో కాళీయమర్దనుడు అవతారంలోని శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించింది.

పోలవరం పనుల్లోకి మరో ప్రధాన గుత్తేదారు?

- స్పిల్ ఛానల్ కాంక్రీటు పనుల్లో వేగం పెంచేందుకు
- మేఘా ఇంజినీరింగుతో సాగుతున్న చర్చలు
- త్వరలోనే కొలిక్కి

ఈనాడు, అమరావతి: పోలవరం ప్రాజెక్టు పనుల్లోకి మరో ప్రధాన గుత్తేదారు సంస్థ రాబోతున్నట్లు సమాచారం. ఇందుకు అవసరమైన ప్రాథమిక చర్చలు సాగుతున్నాయి. 2018 జూన్‌కల్లా ప్రాజెక్టులో కాఫర్ డ్యాం నిర్మించి నీళ్లు నిలబెట్టి, గ్రావిటీ ద్వారా అందించాలనే పట్టుదలతో ఉన్న ప్రభుత్వం ప్రధాన గుత్తేదారు ట్రాన్స్‌ట్రాయ్‌పై ఆ మేరకు ఒత్తిడి పెంచుతోంది. డ్యాంలోని వివిధ కీలక పనులు వివిధ సంస్థలకు అప్పగించి త్వరగా పూర్తిచేయాలనే తలంపుతో అధికారులు వ్యవహరిస్తున్నారు. ఒప్పందంలో భాగంగా సాంకేతిక నైపుణ్యమున్న ఎల్ అండ్ టీ బావర్ కంపెనీకి డయాఫ్రం వాల్ పనులు ఇప్పటికే అప్పజెప్పారు. ఆ ఒక్కదానితోనే నేరుగా ఎస్క్రో ఖాతా తెరిచి పనులు చేయిస్తూ బిల్లులు చెల్లిస్తున్నారు. స్పిల్ వే కాంక్రీటు పనులను పుట్జ్‌మీయిస్టర్, కాఫర్ డ్యాం పనులను కెల్లర్ సంస్థ ఇప్పటికే ప్రారంభించాయి. వీటికి చెల్లింపులు ట్రాన్స్‌ట్రాయ్ ద్వారానే జరుగుతున్నాయి. గేట్ల ఫ్యాబ్రికేషన్ పనులు వేరే సంస్థ చేపట్టి కొలిక్కి తెచ్చేసింది. ఒకవైపు స్పిల్ వే కాంక్రీటు పనులు సాగుతున్నాయి. మరోవైపు స్పిల్ ఛానల్ కాంక్రీటు పనులు చేపట్టవలసి ఉంది. ఒక్క స్పిల్ ఛానల్‌లోనే దాదాపు 18లక్షల క్యూబిక్ మీటర్ల కాంక్రీటు పని చేయాల్సి ఉంది. ఇప్పటికీ అది ప్రారంభించలేదు. అక్కడ మట్టి తవ్వకం పనులూ పూర్తిచేయాలి. ప్రస్తుతం వర్షాలు పడుతుండటంతో మట్టి తవ్వకం పనుల్లో వేగం కొంత తగ్గింది. ఈ నేపథ్యంలో స్పిల్ ఛానల్‌లోని కాంక్రీటు పనిని అనుభవమున్న మేఘా ఇంజినీరింగు కంపెనీకి అప్పజెప్పాలనే యోచనతో ప్రధాన గుత్తేదారు సంస్థతో పాటు ప్రభుత్వంలోని కొందరు ముఖ్య అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మధ్యే మేఘా ప్రతినిధులు పోలవరం ప్రాజెక్టులో స్పిల్ ఛానల్ పనులు పరిశీలించి అక్కడ అవసరమైన కొలతలు తీసుకుని వెళ్లినట్లు తెలిసింది. వీరితో ప్రాథమిక చర్చలు సాగుతున్నాయి. ఒక్క స్పిల్ ఛానల్ కాంక్రీటు పనులే వీరికి అప్పగిస్తారా లేక ఇతరత్రా కూడా కలిపి ఇస్తారా, చెల్లింపుల విధానం ఎలా ఉంటుంది, ఇందులో రెండు వైపులా నిబంధనలు, షరతులు ఎలా ఉంటాయనే అంశాలు తేలాల్సి ఉంది. వీలైనంత త్వరగా స్పిల్ ఛానల్ పనుల వేగమూ పెంచాలని తలపోస్తున్నారు. ప్రస్తుత ఒప్పంద ధరల ప్రకారం లెక్కిస్తే దాదాపు రూ.600కోట్ల నుంచి రూ.700కోట్ల వరకు పనిని ఆ సంస్థకు అప్పజెప్పే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఛత్తీస్‌గఢ్‌లో పేలుడు

ముగ్గురు భద్రత సిబ్బందికి గాయాలు

రాయ్‌పుర్: ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు జరిపిన బాంబు పేలుడులో ప్రత్యేక కార్యదళాని (ఎస్‌టీఎఫ్)కి చెందిన ముగ్గురు సిబ్బంది గాయపడ్డారు. మెరుగుపరిచిన విస్ఫోటక పరికరంతో సుకమా జిల్లాలో మంగళవారం నక్సల్స్ ఈ విధ్వంసానికి పాల్పడ్డట్లు పోలీసులు తెలిపారు. స్వాతంత్య్ర దినోత్సవ నేపథ్యంలో చేపట్టిన మావోయిస్టు నిరోధక ఆపరేషన్‌లో పాల్గొని భద్రత సిబ్బంది తిరిగి వస్తుండగా ఈ ఘటన జరిగినట్లు పేర్కొన్నారు. తీవ్రంగా గాయపడ్డ కట్టం రామ అనే కానిస్టేబుల్‌ను రాయ్‌పుర్‌లోని ఆసుపత్రికి వాయుమార్గంలో తరలించినట్లు అధికారులు పేర్కొన్నారు. పేలుడు జరిపి పారిపోయిన మావోయిస్టుల కోసం గాలింపు చేపట్టినట్లు తెలిపారు. అంతకు ముందు జాండీ గ్రామంలోనూ పేలుడు సంభవించిందని.. ఘటనలో ఎవరూ గాయపడినట్లు నివేదిక అందలేదని అధికారులు పేర్కొన్నారు.

జీఎస్టీ సర్వర్‌లో వివరాల నమోదులో సమస్యలు

- వ్యాపారులకు తప్పని పాట్లు

ఈనాడు, అమరావతి: జీఎస్టీ సర్వర్‌లో వివరాల నమోదుకు సాంకేతిక అవరోధాలు తలెత్తుతున్నాయి. దీనివల్ల వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు జీఎస్టీ మండలి సమావేశాలలో తీసుకుంటున్న నిర్ణయాలు, నియమ నిబంధనల్లో మార్పులు మరికొన్ని సమస్యలు సృష్టిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 1.95 లక్షల మంది వ్యాపారులు జీఎస్టీ పరిధిలోకి వచ్చారు. కొత్తగా 50వేల మంది వ్యాపారులు జీఎస్టీ కింద పేర్లను నమోదు చేయించుకున్నారు. జీఎస్టీ పరిధిలోకి వచ్చిన వ్యాపారులు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే వివరాల్ని నమోదు చేయాలి. ఈ ప్రక్రియలో ఇతరుల ప్రమేయం లేదు. చిరునామా మారినా.. అందుకు తగినట్లు పత్రాల సమాచారాన్ని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నా, రిజిస్ట్రేషన్ అనంతరం తదుపరి వివరాలు సర్వర్‌లో నమోదు చేయాలన్నా సకాలంలో జరగడం లేదని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీఎస్టీ నుంచి మినహాయింపు పొందిన వివరాలు ఉంటే వాటి గురించి కూడా అందులో నమోదుచేయాలి. దేశవ్యాప్తంగా ఇలాంటి ప్రక్రియ కొనసాగుతున్నందున సాంకేతిక సమస్యలు తప్పడం లేదని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఆన్‌లైన్ విధానంలో చేస్తున్న మార్పుల గురించి ఆంగ్లంలో ఉండడం, దీనిపై ప్రచారంలో జాప్యం, ప్రత్యేక శ్రద్ధ తీసుకోకపోవడంవల్ల ఈ సమస్యలు తలెత్తుతున్నాయని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. మరోవైపు 3బి రిటర్నుల దాఖలు మొదలైంది. అలాగే జీఎస్టీ ఆర్1 కింద వ్యాపారుల వివరాలు నమోదు చేసే ప్రక్రియ కొనసాగుతోంది. దీంతో అప్పుడప్పుడు సర్వర్ మొరాయిస్తోంది. అంతర్జాల సమస్యలూ తలెత్తుతున్నాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంది. పలువురు వ్యాపారులు అవసరం ఉన్నా లేకున్నా ఆన్‌లైన్ ముందు కూర్చుని చేస్తున్న పొరపాట్లూ సమస్యలకు దారితీస్తున్నాయని సమాచారం.

ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టారు



నంద్యాలలో జెండా వందనం చేస్తున్న వైకాపా అధినేత జగన్

- ఉపఎన్నికలో విస్తృతంగా డబ్బుల పంపకం
- నంద్యాల ప్రచారంలో చంద్రబాబుపై జగన్ ధ్వజం

నంద్యాల, న్యూస్‌టుడే: 'పిల్లలకు కాస్తోకూస్తో ఉద్యోగాలు రావాలంటే ప్రత్యేక హోదా రావాలి. ఎన్నికలకు ముందు ప్రత్యేక హోదా పదేళ్లు కాదు... 15 ఏళ్లకు తెస్తానన్నారు. ఎన్నికల తర్వాత పక్క రాష్ట్రంలో ఎమ్మెల్యేల కొనుగోలుకు డబ్బులు పంచుతూ ఆడియో వీడియో, టేపులకు దొరికారు. సీబీఐ విచారణ చేయకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రధాని మోదీ కాళ్లు పట్టుకున్నారు. ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టారు...' అని వైకాపా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి విమర్శించారు. ఆయన ఐదో రోజు మంగళవారం నంద్యాల పట్టణంలోని బొమ్మల సత్రం, గాంధీనగర్, మూలసాగరంలో పర్యటించారు. "ఉపఎన్నికలు వచ్చినందువల్లే ముఖ్యమంత్రి, ఆయన కుమారుడు నంద్యాలకు వచ్చారు. డబ్బుల సంచులు తీసుకొచ్చారు. రూ.100 కోట్ల పంపకాలు జరుగుతున్నాయి. కార్పొరేటర్ల నుంచి చిన్నచిన్న నాయకులను నీరేటెంతా అని కొనుగోలు చేస్తున్నారు. ఎమ్మెల్యేలను, చిన్నచితకా నాయకులను కొనుగోలు చేయడం అయిపోయింది. ఇప్పుడు ప్రజలను కొనుగోలు చేసేందుకు డబ్బు మూటలు తెస్తున్నారు. ప్రతి సామాజిక వర్గాన్ని ఎర వేసి బుజ్జగిస్తున్నారు. ఈ రెండింటికి లొంగని వారిని బెదిరిస్తున్నారు. ముఖ్యమంత్రికి ఒక్క నంద్యాలలోనే ఇంత దారుణపరిస్థితి ఎందుకొచ్చిందంటే...మూడున్నరేళ్లలో ఆయన ఇచ్చిన ఒక్క వాగ్దానం కూడా నెరవేర్చలేనందుకే. ప్రతి సామాజిక వర్గాన్ని సీఎం మోసం చేశారు. ఆయన చేసిన మోసాలను కప్పిపుచ్చుకునేందుకే నంద్యాలలో మరోసారి వాగ్దానాలు చేస్తున్నారు..." అని జగన్ తీవ్ర ఆరోపణలతో ధ్వజమెత్తారు. "రైతుల రుణాలు మాఫీ చేస్తానని చెప్పారు. ఇచ్చిన సొమ్ములు వడ్డీలకే సరిపోలేదు. బ్యాంకుల గడప ఎక్కలేని పరిస్థితి రైతులకు వచ్చింది. ఆయన మాటలు నమ్మి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు లేవు. మినుము, కంది, పసుపు పంటలకు గిట్టుబాటు ధర ఉందా. మిరప పంట వేసుకునే పరిస్థితి ఉందా. పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు రూ.5 వేల కోట్ల ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేస్తానన్నారు. ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేశారా? .." అని జగన్ ప్రశ్నించారు. "డ్వాక్రా సంఘాలను తానే కనిపెట్టానని చెప్పే ముఖ్యమంత్రి డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు ఒక్క రూపాయి అయినా రుణమాఫీ చేశారా? ముఖ్యమంత్రి హోదాలో కర్నూలుకు వచ్చి ఐఐఐటీ, ఉర్దూ విశ్వవిద్యాలయం, ఫుడ్‌పార్కు, అపెరల్ పార్కు, పరిశ్రమల కారిడార్, సిమెంట్ హబ్ వంటివి ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారని.... వీటిలో ఒక్కటైనా నెరవేర్చారా? ..." అని అడిగారు. తెదేపా చేసిన మోసం మీద, వంచన మీద ఓటు వేయాలని కోరారు. ఓటు వేస్తే ఇంటింటికీ మారుతీ కారు, కిలో బంగారం ఇస్తానని హామీ ఇస్తారని ఎద్దేవా చేశారు. మాట చెప్పి మోసం చేస్తే... వారిని కాలర్ పట్టుకుని ప్రశ్నించినప్పుడే రాజకీయాల్లో మార్పు వస్తుందన్నారు. ధర్మ పోరాటంలో ధర్మం వైపు ఉండాలని, న్యాయం వైపు నిలవాలని కోరారు. వైకాపా అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి, పురపాలక ఛైర్‌పర్సన్ దేశం సులోచన, రాజగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శిల్పా చక్రపాణిరెడ్డి రాజీనామా ఆమోదం

ఈనాడు అమరావతి: శిల్పా చక్రపాణిరెడ్డి శాసన మండలి సభ్యత్వానికి చేసిన రాజీనామాను శాసన మండలి ఉపాధ్యక్షుడు రెడ్డి సుబ్రమణ్యం ఆమోదించారు. శాసన మండలి నిబంధనల్ని అనుసరించే రాజీనామాను ఆమోదించానని, సోమవారమే నిర్ణయం తీసుకున్నానని ఆయన 'ఈనాడు'కి తెలిపారు. "శిల్పా చక్రపాణిరెడ్డి ఈ నెల 3న ఈమెయిల్, వాట్సాప్‌ల ద్వారా రాజీనామా లేఖ పంపించారు. 4న రాజీనామా లేఖను వైకాపా నాయకుడొకరు శాసనసభ కార్యదర్శికి అందజేశారు. ఈ నెల 8న చక్రపాణిరెడ్డితో ఫోన్‌లో మాట్లాడాను. తాను అన్నీ ఆలోచించి తీసుకున్న నిర్ణయమేనని, రాజీనామాకే కట్టుబడి ఉన్నానని చక్రపాణిరెడ్డి తెలిపారు. దాంతో ఆయన రాజీనామా లేఖను ఆమోదించాను' ' అని సుబ్రమణ్యం మంగళవారం తెలిపారు.

నంద్యాల ఉపఎన్నికల ఫలితాలతో వైకాపా జెండా పీకేయడం ఖాయం

మంత్రులు అచ్చెన్నాయుడు, ఆనందబాబు

ఈనాడు, అమరావతి: నంద్యాల ఉపఎన్నికల ఫలితాల తర్వాత వైకాపా జెండా పీకేయడం ఖాయమని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి అచ్చెన్నాయుడు జోస్యం చెప్పారు. గుంటూరులోని రాష్ట్ర తెదేపా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వద్ద అవినీతి సొమ్ము ఉందని...ఆ డబ్బుతో నంద్యాల ఎన్నికల్లో గెలవాలనుకుంటున్నారని జగన్ చేసిన విమర్శలను తిప్పికొట్టారు. దొంగే...దొంగ...దొంగ అని అరిచిన విధంగా జగన్ తీరు ఉందని ఎద్దేవా చేశారు. ప్రతి రోజూ అక్కడ ఓటర్లకు డబ్బులు పంపిణీ చేస్తూ పట్టుపడుతోంది వైకాపా నాయకులు, కార్యకర్తలేనని అన్నారు. ప్రతిపక్షనేతగా ఒక్కరోజు కూడా నంద్యాల అభివృద్ధిపై, అక్కడ ప్రజల సమస్యలను ప్రస్తావించలేదన్నారు. తీరా ఉపఎన్నికలు వచ్చే సరికి అక్కడే తిష్ట వేసి ప్రచారం చేస్తూ సీఎం చంద్రబాబును నోటికొచ్చినట్లు ఆడిపోసుకుంటున్నారని ధ్వజమెత్తారు. కాపులను బీసీల్లో చేర్చి చంద్రబాబు చరిత్రలో నిలిచిపోతారన్నారు. రాజకీయాల్లో రిజర్వేషన్లు అవసరం లేదని... విద్య, ఉద్యోగాల్లో మాత్రమే కల్పించాలని కాపు ముఖ్యనేతలు కోరడంతో దీనికి మార్గం మరింత సుగమం అయిందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. సాంఘిక సంక్షేమశాఖ మంత్రి నక్కా ఆనందబాబు మాట్లాడుతూ నంద్యాల ఎన్నికల్లో ఓటమి ఖాయమని ముందే గ్రహించిన జగన్... సీఎం చంద్రబాబును నోటికొచ్చినట్లు విమర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

జగన్ ఆస్తి ఎంతో అందరికీ తెలిసిందే: సోమిరెడ్డి

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: జగన్‌కు లోటస్‌పాండ్, బెంగళూరులో విశాలమైన ఇళ్లు ఉండగా... తనకు ఏ ఆస్తులు లేవని మోసపూరిత మాటలు చెబుతూ ముఖ్యమంత్రి చంద్రబాబును విమర్శించడం ఎంత వరకు సబబు అని వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రశ్నించారు. నంద్యాల పట్టణంలో మంగళవారం బాల్‌కొండ హాల్‌లో సగర (ఉప్పర) సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సోమిరెడ్డి మాట్లాడారు. జగన్‌కు అక్రమంగా రూ.కోట్ల ఆస్తి ఉన్నందుకే వాటిని అటాచ్ చేశారని తెలిపారు. ప్రజల ముందుకు వచ్చి ఆయన తనకు ఆస్తులు లేవు. ... మీడియా లేదంటే... ఇప్పుడు ఉన్న పత్రిక, మీడియా ఎవరిదని ప్రశ్నించారు. రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్, ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి, ఎమ్మెల్సీ ఎన్ఎండీ ఫరూక్ మాట్లాడుతూ.. సగర కులాల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామన్నారు.

శిల్పాను ఓడించేందుకే జగన్ కుట్ర పన్నారు

రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్ మల్లెల లింగారెడ్డి

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: వైకాపా అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డిని ఓడించేందుకే ఆ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి నంద్యాల ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి చంద్రబాబుపై అసందర్భ, అసత్య వ్యాఖ్యలు చేస్తున్నారని పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్ మల్లెల లింగారెడ్డి ఆరోపించారు. మంగళవారం నంద్యాలలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. వ్యాపారులు, మేధావులు ఉన్న నంద్యాలలో ఏ పార్టీ అధినేత అయినా ముఖ్యమంత్రిని నడిరోడ్డుపై కాల్చమని, ఉరి తీయమని మాట్లాడతారా? అని ప్రశ్నించారు. నంద్యాలను పులివెందులలా చేస్తానంటున్నారని, తద్వారా నంద్యాలలో ఫ్యాక్షన్‌ను ప్రోత్సహించడానికి పునాదులు వేస్తున్నారని ఆరోపించారు. గతంలో శిల్పా తెదేపాలో చేరారనే అక్కసుతో ఇలాంటి వ్యాఖ్యలు చేసి ఓడించి కసి తీర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారని జగన్‌పై ధ్వజమెత్తారు. ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ జూపూడి ప్రభాకర్‌రావు మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం దళితుల అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నదని వివరించారు.

సహేతుక కారణాలుంటే వెంటనే వైద్య వీసాలు

మంత్రి సుష్మాస్వరాజ్

దిల్లీ: సహేతుక కారణాలున్న పెండింగ్ కేసుల్లో వైద్యం నిమిత్తం వచ్చేందుకు పాకిస్థానీ దేశస్థులకు వీసాలను మంజూరు చేస్తామని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మాస్వరాజ్ మంగళవారం నాడిక్కడ స్పష్టం చేశారు. "వైద్యం నిమిత్తం వచ్చేందుకు సరైన కారణాలున్నట్లయితే...మా వద్ద పెండింగ్‌లో ఉన్న వీసాలను ఈ స్వాతంత్ర్యదినోత్సవ శుభ తరుణాన మంజూరు చేసేస్తామని ఆమె ట్విటర్‌లో పేర్కొన్నారు. పాకిస్థాన్ విదేశీవ్యవహారాల సలహాదారు సర్తాజ్ అజీజ్ సిఫారసు చేసిన దరఖాస్తులకు మాత్రమే వైద్య వీసాలు మంజూరు చేస్తామంటూ కొన్ని వారాల క్రితం సుష్మాస్వరాజ్ ప్రకటించిన విషయం గమనార్హం. అయితే, సర్తాజ్ అజీజ్ ఇప్పుడు ఆ పదవిలో లేరు. ఈ నేపథ్యంలో సుష్మాస్వరాజ్ తాజాగా ట్విటర్‌లో పై వ్యాఖ్యలు చేశారు.

ఉపముఖ్యమంత్రి కేఈకి స్వల్ప అస్వస్థత

కర్నూలు, న్యూస్‌టుడే: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి స్వల్ప అస్వస్థతతో ఆస్పత్రిలో చేరారు. జ్వరం ఎక్కువగా ఉండటంతో మంగళవారం నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. ఆయనను కలెక్టర్ సత్యనారాయణతోపాటు పెద్దాస్పత్రి పర్యవేక్షకులు డాక్టర్ చంద్రశేఖర్ పరామర్శించారు.

అంతుచిక్కని ఓటర్ల నాడి..!

- అభిప్రాయ సేకరణలో నాయకులు తలమునకలు
- రిటర్నింగ్ అధికారికి పెరుగుతున్న ఫిర్యాదులు

ఈనాడు, అమరావతి: నంద్యాల నుంచి ఈనాడు ప్రత్యేక ప్రతినిధి: నంద్యాల నియోజకవర్గం ఉపఎన్నిక పోలింగ్ దగ్గర పడుతోంది. ఓటర్ల నాడి పట్టుకోవడానికి ప్రధానపక్షాలు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నా అంతు చిక్కడం లేదు. ఈ నియోజకవర్గంలో ప్రధాన నేతల కుటుంబాలకు ప్రత్యేకంగా వర్గాలున్నాయి. సాధారణ ఓటర్లు తమ అభిప్రాయాలను వెల్లడించేందుకు ఆసక్తి చూపడం లేదు. అందరూ గుంభనంగా వ్యవహరిస్తున్నారు. రాజకీయపార్టీలు రోజువారీగా తమ గెలుపుపై అంచనాలు వేసుకునేందుకు అభిప్రాయసేకరణ చేస్తున్నాయి. తెదేపా తరపున ప్రత్యేకంగా సర్వే బృందాలు వార్డులు, గ్రామాల్లో పర్యటిస్తున్నాయి. వైకాపా తరపున ఆ పార్టీ రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ బృందం పని చేస్తోంది. సర్వేలు, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం కొనసాగిస్తోంది. సరైన అంచనాలు అందకపోవడంతో పోటీ చేస్తున్న ప్రధాన పార్టీలకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి.

ఎమ్మెల్యేలు, నాయకులతో కిక్కిరిసి..: రాబోయే సాధారణ ఎన్నికలకు ఈ విజయం నాందిగా తెదేపా, వైకాపాలు భావిస్తున్నందున నంద్యాల ఉప ఎన్నిక కీలకంగా మారింది. రాజకీయనాయకులు, వారి అనుచరుల వాహనాలతో నంద్యాల పట్టణంలో రహదారులు కిక్కిరిసిపోతున్నాయి. అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, అయా పార్టీల్లోని కీలక నేతలందరూ ఇక్కడే మకాం వేసి, ప్రచార బాధ్యతలు చూస్తున్నారు. తెదేపా, వైకాపాలకు చెందిన రాష్ట్రంలోని దాదాపు 45-50మంది ఎమ్మెల్యేలు ఇక్కడే ఉంటున్నారు. వైకాపా అధినేత జగన్ ఏకంగా నంద్యాలలోనే మకాం వేసి, ఈనెల 9నుంచి ప్రచారం చేస్తున్నారు. 13రోజుల పాటు ఇక్కడే ఉండేలా ఆయన ప్రణాళిక వేసుకున్నారు. తెదేపా తరపున మంత్రులు, ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారాలు చేస్తున్నారు. వర్గాల వారీగా ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ ఉపఎన్నికపై రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు విదేశాల్లోని తెలుగువారు ఆసక్తి చూపుతున్నారు. తమ బంధువుల ద్వారా సమాచారం తెలుసుకుంటున్నారు.

ముమ్మరంగా రోడ్ల విస్తరణ పనులు

నంద్యాల పట్టణంలో రోడ్ల విస్తరణ, ఇతర నిర్మాణాల పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ పనులు పూర్తయితే పట్టణ ముఖచిత్రమే మారిపోతుందని తెదేపా వర్గాలు ప్రచారం చేస్తున్నాయి. అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు, భవిష్యత్తులో చేపట్టబోయే ప్రగతి పనులను తెదేపా విరివిగా ప్రచారం చేస్తోంది. నంద్యాల వాసులు అభివృద్ధిని కోరుకుంటున్నారని, ఈ పనులు చేస్తున్న తమ పార్టీకే విజయమని తెదేపా నాయకులు పేర్కొంటున్నారు. 2014 సాధారణ ఎన్నికలతో పోల్చితే ఈసారి ఓటర్ల సంఖ్య తగ్గింది. గత సాధారణ ఎన్నికల్లో 2,42,742 మంది ఉండగా.. ప్రస్తుతం 2,18,858 మంది ఓటర్లు ఉన్నారు. బోగస్ ఓట్ల తొలగింపుపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టడంతో ఓటర్ల సంఖ్య తగ్గింది.

ఫిర్యాదుల పరంపర

తెదేపా, వైకాపా నాయకులు ఉప ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో ఎలాంటి చిన్నఘటన చోటుచేసుకున్నా రిటర్నింగ్ అధికారికి పరస్పరం ఫిర్యాదులు చేస్తున్నారు. ఇప్పటివరకు 79 ఫిర్యాదులు అందాయి. వీటిపై విచారణ జరిపిన అధికారులు చర్యలకు సిద్ధమవుతున్నారు. ఇటీవల ఓ పార్టీ వారు డబ్బులు పంపిణీ చేస్తున్నారని ఫిర్యాదు అందడంతో విచారణ జరిపారు. దీనికి సంబంధించి తదుపరి చర్యలకు సిద్ధమయ్యారు. సున్నితమైన పోలింగ్ కేంద్రాలు అధికంగా ఉన్నందున అక్కడ కేంద్ర బలగాలను మోహరిస్తున్నారు. తొలిసారిగా ఈ ఉపఎన్నికలో ఈవీఎంలతో పాటు వీవీప్యాట్స్‌ను వినియోగిస్తున్నారు.

ఐడబ్ల్యూపీ వెసులుబాటు కొంత భారాన్నే తగ్గిస్తుంది!



ఈనాడు, హైదరాబాద్: అమెరికా వీసాలకు సంబంధించి వివిధ అంశాలపై 'అమెరికాయానం' పేరిట పాఠకుల నుంచి 'ఈనాడు' ఆహ్వానించిన ప్రశ్నలకు.. హైదరాబాద్‌లోని అమెరికన్ కాన్సులేట్ జనరల్ అధికారులు సమాధానాలిచ్చారు. అవి ఇలా ఉన్నాయి...

నేను, నా భార్య సీనియర్ సిటిజన్లం. పదేళ్లు చెల్లుబాటయ్యే మా వీసాలు 2018 మార్చితో కాలం తీరనున్నాయి. 2018 జూన్‌లో అమెరికా వెళ్లాలనుకుంటున్నాం. బి1/బి2 వీసాదారులకు ఇమిగ్రేషన్ క్లియరెన్స్ అవసరం లేదని మునుపటి వీసాలో నమోదు చేశారు. ఆ వీసాలపై మేము అమెరికా పర్యటించవచ్చా? - రమణారావు

2018 మార్చిలో మీ బి1/బి2 వీసాల కాలం తీరనున్న దృష్ట్యా పునరుద్ధరణకు దరఖాస్తు చేసుకోవచ్చు. కాలం తీరటానికి ఎంత ముందుగానైనా పునరుద్ధరణ చేసుకోవచ్చు. ఇంటర్వ్యూ మినహాయింపు పథకం(ఐడబ్ల్యూపీ) కింద మీరు అర్హులా? కాదా? అన్నది తెలుసుకునేందుకు https://www.ustraveldocs.com/ in చూడండి. ఐడబ్ల్యూపీ అన్నది పూర్తిస్థాయి ఇంటర్వ్యూతో పోలిస్తే కొంత భారం తగ్గుతుంది. వీసాదారులు దరఖాస్తులను వ్యక్తిగతంగా హాజరై అందజేయాల్సి ఉంటుంది. ఐడబ్ల్యూపీకి అర్హత పొందకపోతే వ్యక్తిగతంగా ఇంటర్వ్యూకు హాజరయ్యేందుకు మీరు ఆ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

2018 జూన్ వరకు చెల్లుబాటయ్యే హెచ్1-బి వీసా ఉంది. ఐ-797, ఐ-129 పత్రాలూ ఉన్నాయి. కాగా నేను ఆ సంస్థను ఈ ఏడాది మార్చిలోనే వదిలేశాను. ఆ కంపెనీ పేరిట ఉన్న హెచ్1-బి పత్రాల ద్వారా అమెరికా వెళ్లవచ్చా? అవకాశం ఉంటే, అందుకు సంబంధించిన విధి విధానాలేమిటి? - రవికిరణ్

హెచ్1-బి వీసాపై మీ పిటిషన్ నంబరు, చెల్లుబాటు తేదీ, కంపెనీ వివరాలు, పిటిషనర్ పేరు తదితరాలు నమోదు చేసి ఉంటాయి. మీరు ఆ సంస్థ, పిటిషనర్ సంస్థలోనే పని చేయటం లేనందున అమెరికాలోని నూతన యాజమాన్యం లేదా పిటిషనర్ విధిగా మీ పక్షాన ఉద్యోగ పిటిషన్ దాఖలు చేయాలి. యాజమాన్యం దాఖలు చేసిన ఆ పిటిషన్‌ను సమీక్షిస్తారు. అన్నీ సానుకూలంగా ఉంటే అమెరికా రాష్ట్రాల సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్(యూఎస్‌సీఐఎస్) ఆమోదిస్తుంది. వర్క్ వీసాకు సంబంధించిన మరింత సమాచారం కోసం https://www.uscis.gov/workingunitedstates/workingUS ను పరిశీలించండి.

2014లో బి1/బి2 వీసా పొందాను. 2015లో నా పాస్‌పోర్టు పోయింది. నూతన పాస్‌పోర్టును పొందాను. వీసా కోసం రెండు దఫాలు దరఖాస్తు చేస్తే తిరస్కరించారు. పోగొట్టుకున్న పాస్‌పోర్టు ఇటీవల దొరికింది. ఆ పాస్‌పోర్టులోనే అమెరికా వీసా స్టాంపింగ్ ఉంది. ఆ వీసా, పాస్‌పోర్టు రెండూ 2024 వరకు చెల్లుబాటవుతాయి. తిరిగి పొందిన ఆ పాస్‌పోర్టులోని వీసాను చెల్లుబాటు చేసుకోవచ్చా? -వి.విఠల్

మునుపటి ఇంటర్వ్యూల్లో అమెరికా వీసాతో ఉన్న పాస్‌పోర్టును పోగొట్టుకున్నట్లు మీరు చెప్పారు. అమెరికా వెళ్లేందుకు ఆ వీసా ఇక చెల్లుబాటులో ఉండదు. అమెరికా వెళ్లాలనుకుంటే మీరు మరో దఫా వీసా కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. వ్యక్తుల నాన్ ఇమిగ్రెంట్ వీసా దరఖాస్తులు తిరస్కరించినప్పటికీ మళ్లీ దరఖాస్తు చేసుకునేందుకు అర్హులే. మునుపు వీసా తిరస్కార కారణాలను వివరించటంతోపాటు అప్పటికన్నా మెరుగైన పరిణామాలున్నాయంటేనే దరఖాస్తు చేసుకోవాలన్నది మా సూచన.

2012 వరకు చెల్లుబాటు అయ్యేలా గ్రీన్‌కార్డు ఉండేది. ఆర్థిక మాంద్యం తదితర కారణాలతో భారతదేశం వచ్చేశాను. 2005 వరకు చెల్లుబాటు అయ్యేలా అమెరికాలోని డిపార్టుమెంటు ఆఫ్ హోం ల్యాండ్ సెక్యూరిటీ నుంచి పునఃప్రవేశ అనుమతిని పొందాను. దాన్ని అప్పట్లో వినియోగించలేదు. దాన్ని ఇప్పుడు చెల్లుబాటు చేసుకునేందుకు అవకాశం ఉందా? -జేఎంఆర్

పునః ప్రవేశ అనుమతి 2005లోనే కాలం తీరిన దృష్ట్యా మీరు రిటర్నింగ్ రెసిడెంట్(ఎస్‌బి-1) వీసా కోసం దరఖాస్తు చేసుకోవాలి. హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ ఎస్‌బి-1 వీసా వ్యవహారాలను పర్యవేక్షించదు. దిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయం మాత్రమే ఆ వీసా ప్రక్రియను నిర్వహిస్తుంది. మరింత సమాచారం కోసం https:// in.usembassy.gov/visas/ immigrantvisas/ returninigresidentvisa/ ను పరిశీలించండి.

- వీసాలపై నిర్దుష్టమైన అంశాలు, తిరస్కారాలపై సందేహాలను support-india@ustraveldocs.comకు ఈ-మెయిల్ చేయండి.
- మరింత సమాచారం కోసం హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ వెబ్‌సైట్ http://hyderabad.usconsulate.gov ను సంప్రదించవచ్చు.
- హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ అందించే వీసా తదితర సేవలకు సంబంధించిన ప్రశ్నలను usvisa@eenadu.net కు పంపగలరు.

నేడు డీజీపీ కార్యాలయం ప్రారంభం

- సీఎం చేతుల మీదుగా ఆవిష్కరణ
- రూ.40 కోట్లతో నిర్మాణం
- 1.10 లక్షల చ.అడుగుల విస్తీర్ణం



ఏపీ పోలీసు ప్రధాన కార్యాలయం



కార్యాలయ లోపలి భాగం అందాలు

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పోలీసు ప్రధాన కార్యాలయాన్ని (డీజీపీ కార్యాలయం) ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం ప్రారంభించనున్నారు. మంగళగిరి ఏపీఎస్పీ పటాలంలో దాదాపు ఆరెకరాల విస్తీర్ణంలో రూ.40 కోట్ల వ్యయంతో ఈ భవనాన్ని నిర్మించారు. దీని నిర్మాణానికి పది నెలల సమయం పట్టింది. రాష్ట్ర విభజన తర్వాత విజయవాడలోని న్యాయస్థానాల సముదాయానికి సమీపంలో డీజీపీ క్యాంపు కార్యాలయాన్ని ఏర్పాటుచేశారు. ఇక్కడ డీజీపీతో పాటు అదనపు డీజీపీ, ఐజీ స్థాయి అధికారులకు మాత్రమే ఛాంబర్లు ఉన్నాయి. దీంతో కొన్ని విభాగాల అధిపతులు ఇప్పటికీ హైదరాబాద్ నుంచే కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. బస్టాండు ప్రాంగణంలో ఏర్పాటుచేసిన సీఐడీ కార్యాలయానికి తగిన వసతులు లేవు. నూతన భవనం అందుబాటులోకి రావడంతో ఇకపై డీజీపీ కార్యాలయం పరిధిలోని అన్ని విభాగాల అధిపతులు ఇక్కడి నుంచే కార్యకలాపాలు నిర్వహించనున్నారు.

పోలీసు ప్రధాన కార్యాలయం నిర్మాణ విశేషాలు

- ★ నిర్మిత ప్రాంతం: మొత్తం 1.10 లక్షల చ.అడుగులు, ఒక్కో అంతస్తులో: 21,200 చ.అడుగులు
- ★ ఎన్ని అంతస్తులు: జీ ప్లస్ 4
- ★ ఏ అంతస్తులో ఏ కార్యాలయం:
- ★ గ్రౌండ్‌తో పాటు మొదటి అంతస్తులో సీఐడీ కార్యాలయం
- ★ రెండు, మూడు అంతస్తుల్లో అదనపు డీజీపీ, ఐజీ స్థాయి అధికారుల కార్యాలయాలు
- ★ నాలుగో అంతస్తులో డీజీపీ కార్యాలయం, పేషీ, సమావేశమందిరం

భవనం ప్రత్యేకతలు

- ★ ఒక్కో దాంట్లో 80 మందితో సమావేశం నిర్వహించుకునేందుకు వీలుగా మొత్తం మూడు సమావేశ మందిరాలు
- ★ ఒకేసారి వంద కార్లను పార్కు చేసుకునేందుకు వీలుగా స్థలం
- ★ భవనం అంతర్భాగంలో కేవలం ఐదు శాతమే గోడలు, మిగతా 95 శాతం అద్దాలతోనే నిర్మితం
- ★ విశాలమైన ఉద్యానవనం, భవనం చుట్టూ పచ్చదనం
- ★ మూడు వైపులా కొండలు, మరోవైపు జాతీయ రహదారి
- ★ ఏ గదిలోకి ప్రవేశించాలన్నా బయోమెట్రిక్ తప్పనిసరి. వేలిముద్ర వేస్తేనే తలుపులు తెరుచుకుంటాయి.
- ★ భవనం మొత్తానికి వైఫై సౌకర్యం. పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్, వీడియోవాల్స్ ఏర్పాటు చేశారు.

యువత ఉద్యమిస్తేనే మార్పు

'హసన్' స్మారకోపన్యాసంలో వక్తల పిలుపు

ఈనాడు, హైదరాబాద్: మానవత్వం ప్రధాన అజెండాగా యువత ఏకమై దేశ రాజకీయ వ్యవస్థలో మార్పులు తీసుకురావాల్సిన అవసరముందని వక్తలు పేర్కొన్నారు. ఉద్యమస్ఫూర్తితో యువత దేశవ్యాప్తంగా భారీ ప్రదర్శన నిర్వహించి సమాజంలో మార్పులు తీసుకురావొచ్చన్నారు. మోదీ సర్కారు హామీ ఇచ్చిన రెండు కోట్ల ఉద్యోగాల కోసం భగత్‌సింగ్ జయంతి (సెప్టెంబరు 28) రోజున అహ్మదాబాద్‌తోపాటు ప్రధాన నగరాల్లో భారీ ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జీఎస్టీతో పన్నులు తగ్గుతాయని భావిస్తే... చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, అసంఘటిత కార్మికుల ఉనికికి ప్రమాదం ఏర్పడిందని విమర్శించారు. మంగళవారమిక్కడ లామకాన్‌లో 'ప్రస్తుత పరిస్థితుల్లో మార్పులు కోరుతూ యువత ఉద్యమం అవసరముందా?' అనే అంశంపై 4వ హసన్ స్మారకోపన్యాసం జరిగింది. ఇందులో జేఎన్‌యూ విద్యార్థి యూనియన్ మాజీ అధ్యక్షురాలు షెహ్లా రషీద్, సామాజిక కార్యకర్త జిగ్నేష్ మేవానీ, ప్రతీక్ సిన్హా మాట్లాడారు. జాతీయత, మతం కన్నా మానవత్వం ప్రధానమని తెలిపారు. పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా, మహిళలకు గౌరవం లభించేలా కులాలను ఏకం చేస్తూ ఉద్యమాలు చేయాలన్నారు. గుజరాత్‌లో ప్రజాసమస్యలకు కాంగ్రెస్, భాజపాలు సమాధానం చెప్పే పరిస్థితుల్లో లేవన్నారు. కనీసం వెయ్యి మందితో కలిపి భాజపాకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించలేని దుస్థితి ఉందని పేర్కొన్నారు. శాస్త్రవేత్త, పర్యావరణవేత్త హసన్ పేరిట ఏటా ఆగస్టు 15న లామకాన్‌లో స్మారకోపన్యాస కార్యక్రమం జరుగుతుంది.

పదోన్నతి వచ్చింది.. జీతం తగ్గింది!

ధర్నాకు సిద్ధమవుతున్న అధ్యాపకులు

ఈనాడు, అమరావతి: పదోన్నతి వస్తే వేతనం పెరుగుతోంది. కానీ.. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అధ్యాపకులుగా ఉంటూ పదోన్నతి పొందిన వారికి వేతనం తగ్గడం గమనార్హం. కొన్నేళ్ల నుంచి ఈ సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తోన్నా ఫలితం లేదని వీరు ఆవేదన చెందుతున్నారు. తదుపరి చర్యల్లో భాగంగా విజయవాడలో గురువారం ధర్నాకు సిద్ధమవుతున్నారు. అధ్యాపకులు పేర్కొంటోన్న ప్రకారం... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నెట్/సెట్/పీహెచ్‌డీ అర్హత కలిగిన జూనియర్ కళాశాలల అధ్యాపకులు 450 మంది 2010 నవంబరు నుంచి మే 2013 మధ్య కాలంలో డిగ్రీ కళాశాలల లెక్చరర్లుగా పదోన్నతి పొందారు. విద్యార్హతల ప్రకారం వీరు యూజీసీ వేతనాల్ని పొందేందుకు అర్హులు. వీరికి పదోన్నతుల్ని కల్పించే సమయంలో జూనియర్ కళాశాలల్లో రాష్ట్ర వేతన స్కేళ్ళలో పొందుతున్న వేతనాన్ని యూజీసీ స్కేళ్ళలో స్థిరీకరించలేదు. డిగ్రీ కళాశాలల అధ్యాపకుల కనీస వేతనమైన 15600+6000, 15600-39100 ఇస్తూ 'ఫిట్‌మెంట్ ఫార్ములా'ను పెండింగులో ఉంచుతున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీనివల్ల గతంలో జూనియర్ కళాశాలలో అధ్యాపకులుగా ఉన్న సమయంలో పొందుతోన్న వేతనం కంటే తక్కువగా తీసుకుంటున్నామన్నారు. 2011లో అప్పటి కళాశాల విద్యాశాఖ కమిషనర్ ఈ సమస్యను పరిష్కరించేందుకు కొత్త ప్రతిపాదనల్ని ప్రభుత్వానికి పంపారు. దీని ప్రకారం తెలంగాణ ప్రభుత్వం 2015లో అధికారిక ఉత్తర్వుల్ని జారీచేసింది. ఇదే అంశంపై అప్పటి ప్రతిపాదనలు సరిగ్గా లేవంటూ ఏపీ ఉన్నత విద్యామండలి కొత్త ప్రతిపాదనల్ని ప్రభుత్వానికి పంపింది. దీనివల్ల పదోన్నతి అధ్యాపకులు కనిష్ఠంగా రూ.5,740 నుంచి గరిష్ఠంగా 11,240 వరకు నష్టపోతున్నారు.

పెట్టుబడుల నవోదయం!

ఈనాడు - అమరావతి

ఆంధ్రప్రదేశ్‌కు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) రాక ఆశాజనకంగా ఉంది. గత ఆర్థిక సంవత్సరంలో రూ.14,077 కోట్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయి. ఇండియన్ బ్రాండ్ ఈక్విటీ ఫౌండేషన్ సంస్థ ఈ వివరాలు వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వానికి చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రియల్ పాలసీ, ప్రమోషన్ గణాంకాలను ఉటంకిస్తూ ఈ వివరాలు వెల్లడించింది. గతేడాది దేశంలోకి వచ్చిన మొత్తం విదేశీ పెట్టుబడుల్లో ఆంధ్రప్రదేశ్ 4 శాతం వాటా దక్కించుకుంది. ఇది పెట్టుబడుల రాక సరళిని పెంచడానికి దోహదపడే అంశమని అధికారవర్గాలు అభిప్రాయపడుతున్నారు. 2014లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడినప్పటి నుంచీ రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి పలు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ ఏడాది జనవరిలో విశాఖలో నిర్వహించిన భాగస్వామ్య సదస్సు ద్వారా ప్రభుత్వం ఏకంగా 156.18 బిలియన్ డాలర్ల విలువైన పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలు చేసుకుంది. ఇవి కాకుండా.. హెచ్‌సీఎల్, కియా మోటార్స్ వంటి పెద్దపెద్ద సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చాయి.

దక్షిణాది రాష్ట్రాలతో పోటీ!: విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంలో ఆంధ్రప్రదేశ్ దక్షిణాది రాష్ట్రాలతో పోటీ పడడానికి సిద్ధమవుతోంది. ఎఫ్‌డీఐలను ఆకర్షించడంలో ఎప్పటి నుంచో తమిళనాడు, కర్ణాటకలు ముందంజలో ఉన్నాయి. మరోవైపు, అవిభాజ్య ఆంధ్రప్రదేశ్ నుంచి విడిపోయి ఏర్పడిన కొత్త రాష్ట్రం మనది కావడంతో ఇక్కడ పరిశ్రమలు పెట్టడానికి తగిన అనుకూల వాతావరణం కల్పించడం ప్రభుత్వానికి సవాల్‌గా మారింది. అదేసమయంలో ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులు పెట్టడానికి అనుకూలమనే సందేశం ఇవ్వడంలోనూ ప్రభుత్వం సఫలీకృతమైంది. విదేశాల్లో రోడ్‌షోలు నిర్వహించడం, వివిధ అంతర్జాతీయ ఆర్థిక సదస్సులు, ప్రదర్శనల్లో రాష్ట్రం తరఫున స్టాల్స్ పెట్టి అక్కడి పారిశ్రామికవేత్తలకు రాష్ట్రంలోని అనుకూల వాతావరణం గురించి వివరించడం వంటి చర్యలు లాభించాయి. ఫలితంగా దక్షిణ కొరియాకు చెందిన 'కియా' లాంటి దిగ్గజ ఆటోమొబైల్ సంస్థ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి వచ్చింది. దాంతో పాటు అమెరికా, చైనా, జపాన్, స్విట్జర్లాండ్ తదితర దేశాలకు చెందిన పలు కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి వస్తున్నాయి. 'సులభతర వాణిజ్య నిర్వహణ'లో వరుసగా రెండు పర్యాయాలు దేశంలోనే అగ్రస్థానంలో నిలవడం కూడా ఆంధ్రప్రదేశ్‌కు సానుకూల అంశంగా మారింది.

గత నాలుగేళ్లలో రాష్ట్రానికి వచ్చిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల వివరాలు

సంవత్సరం	వచ్చిన ఎఫ్‌డీఐలు (రూ.కోట్లలో)
2013-14	4,348
2014-15	8,780
2015-16	9,979
2016-17	14,077

దక్షిణాది రాష్ట్రాలకు వచ్చిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (మిలియన్ డాలర్లలో)

సంవత్సరం	ఆంధ్రప్రదేశ్	తమిళనాడు	కర్ణాటక	కేరళ
2013-14	678	12,595	11,422	411
2014-15	1,369	23,361	21,255	1,418
2016-17	1,556	29,781	26,791	589

వసుంధర

మూడుచెంచాల పెరుగు... ఎంతో మేలు

చాలామంది అమ్మాయిలు బరువు పెరుగుతామనే భయంతో పెరుగు తీసుకోరు. కానీ అది అపోహేనంటారు నిపుణులు. ఎందుకంటే.. ఇందులోని పోషకాలు మరెన్నో విధాలుగా మేలు చేయటమే కాదు బరువు తగ్గించేందుకు కూడా దోహదం చేస్తాయని ఇప్పుడిప్పుడే గుర్తిస్తున్నారు. అధిక మోతాదులో క్యాల్షియం అందించే పెరుగు నిజంగా సూపర్‌ఫుడ్డేనట. రోజూ కనీసం మూడు చెంచాల పెరుగు తీసుకోవడం వల్ల శరీరంలో



మంచి బ్యాక్టీరియా పెరుగుతుంది. ఇది జీర్ణ వ్యవస్థలో ఉండే ఇన్ఫెక్షన్లను అదుపులో ఉంచుతుంది. పైగా డైటరీ ఫ్యాట్ గ్రహించుకోవడాన్ని కూడా తగ్గిస్తుంది. ఫలితంగా ఆకలి అదుపులో ఉంటుంది. రోజులో కనీసం మూడు చెంచాల పెరుగు తినడం వల్ల దానిలోని క్యాల్షియం శరీరంలోని కొవ్వుకణాలను బయటకు పంపిస్తుంది. అలానే అమినో ఆమ్లాలు కొవ్వుని కరిగించడంలో కీలకంగానూ పనిచేస్తాయి. ఫలితంగా వ్యాధినిరోధక శక్తి పెరుగుతుంది. కడుపు ఉబ్బరం కూడా తగ్గుతుంది. పెరుగులో అధికమోతాదులో పొటాషియం, ఫాస్ఫరస్, రైబోఫ్లేవిన్, అయోడిన్, జింక్, విటమిన్ బీ5, బీ12 వంటి పోషకాలు ఉంటాయి. బీ12 నాడీవ్యవస్థను దృఢంగా మారుస్తుంది. ఇందులోని మాంసకృత్తులూ, అమినో ఆమ్లాలూ అధిక బరువును అదుపులో ఉంచేందుకు సాయపడతాయట. అలా పెరుగు బరువు తగ్గేందుకూ మేలే!

ప్రణాళికతోనే ఏదయినా!

కాలంతో పాటూ మనమూ పోటీపడాలంటే... ప్రతి పనీ పక్కాగా ఉండాలి. అది సాధ్యం కావాలంటే.. వేసుకునే ప్రణాళిక అంతే వాస్తవికంగా, ఆచరణాత్మకంగా ఉండాలి. అందుకోసం ఏం చేయాలంటే...



రేపేం చేయాలనుకున్నామో ముందుగా అనుకోవడం మంచిదే...కానీ అలా ఏ రోజుకారోజు లెక్కేసుకుని చేయడం కంటే వారం మొత్తానికి ప్రణాళిక ఒక్కసారే వేసుకోవడం మంచి పద్ధతి. అందులో కేవలం చేయాల్సిన పనుల వివరాలే కాదు.. కుటుంబానికీ, స్నేహితులకూ, మీ ఏకాంతానికంటూ కొంత సమయం పెట్టుకోవడం కూడా తప్పనిసరే. అప్పుడే అది వాస్తవిక ప్రణాళిక అవుతుంది.

ప్రణాళిక వేసుకున్నప్పుడు తు.చ తప్పకుండా చేయాలనుకోవడం మంచిదే కానీ కొన్నిసార్లు అప్పటికప్పుడు తీసుకోవలసిన నిర్ణయాలూ, చేయాల్సిన పనులూ ఎదురవుతుంటాయి. ఆ సర్దుబాట్లకూ, మార్పులకూ ఎప్పుడూ సిద్ధంగా ఉండాలి.

మార్పు ఒక్కసారే కనిపించాలనుకోవడం పొరబాటు. లేదంటే ప్రణాళికాబద్ధంగా ఆ దిశగా అడుగులు వేయాలి. ఉదాహరణకు మీరు రోజూ వ్యాయామం చేయాలనుకుంటారు. మొదటి రోజే ఆరేడు కిలోమీటర్లు నడిచి తరవాత రోజు మానేయడం కాదు....ప్రారంభంలో అరకిలోమీటరు నడిచి అది క్రమంగా ఆరేడు కిలోమీటర్లకు చేరుకోవాలి. అప్పుడే మీరు కోరుకున్న లక్ష్యం చేరుకోగలుగుతారు

తాడాట... ఆడేద్దాం

అటు ఇంటినీ, ఇటు ఆఫీసునీ సమన్వయం చేసుకునే క్రమంలో మహిళలకు కాస్త ఒత్తిడి ఎక్కువే. దాని ఫలితమే అధికబరువు. ఇతర అనారోగ్య సమస్యలు. వాటిని తగ్గించుకోవాలంటే మొదటిదశగా ఆహారంలో మార్పులు చేసుకుంటూ రోజూ కొంత సమయాన్ని వ్యాయామానికి కేటాయించడం తప్పనిసరి అంటారు నిపుణులు.

బరువు తగ్గాలని చాలా ప్రణాళికలే వేసుకుంటారు కానీ ఉదయం లేవాలంటే మాత్రం బద్ధకం. దీనికి కారణం రాత్రంతా కలత నిద్ర, ఆలస్యంగా నిద్రపోవడం, తీసుకున్న ఆహారం సరిగా జీర్ణం కాకపోవడం వంటివన్నీ కారణాలు కావొచ్చు. అందుకే ముందు మీరు రోజూ తినే సమయాన్ని ఓ అరగంట ముందుకు మార్చుకోండి. ఉదాహరణకు రోజూ తొమ్మిదిగంటలకి మీ భోజన సమయం అయితే ఈ సారి మీరు ఎనిమిదన్నరకే తినేయండి. ఆపై కనీసం ఓ పావుగంట నడవండి. దీనివల్ల జీర్ణప్రక్రియ సక్రమంగా జరుగుతుంది. పొట్ట చుట్టూ ఉన్న కొవ్వూ కరుగుతుంది. ఫలితంగా ఒత్తిడీ అదుపులో ఉంటుంది.

శరీరంలో చెడు కొలెస్ట్రాల్ పోవాలంటే పీచుశాతం ఎక్కువగా ఉన్న పదార్థాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఒకవేళ భోజనానికి బదులు జంక్‌ఫుడ్, బయటి ఆహారం తీసుకుంటే.. కాసేపాగి తాడాట ఆడండి. ఫ్యాటీ లివర్ వంటి వ్యాధులూ ఇబ్బంది పెట్టవు. రక్తంలో కొలెస్ట్రాల్ ఉన్నవారూ ఇలా చేస్తే ఆ సమస్య తగ్గుతుంది.

అవును ఒత్తిడిగా ఉన్నప్పుడు మీరేం చేస్తారు. ఉన్నచోటే కదలకుండా తలపట్టుకుని కూర్చుంటారా... టీల మీద టీలు లాగించేస్తారా... వద్దు.. మీకు నచ్చిన పని చేయండి. లేదా ఏదో ఒక వ్యాయామం చేసేందుకు ప్రయత్నించండి.



కొత్తగా ఏదో చేసేయాలనుంటుంది! ప్రజలందరికీ గుర్తుండిపోయే గొప్ప పథకం ఒక్కటైనా తేవాలని గుండె కొట్లాడుతుంటుంది. ఐఏఎస్ శిక్షణ సమయంలో ప్రతి విద్యార్థిలోనూ ఈ తహతహ సహజం. కానీ సర్వీసులో చేరాక అవినీతీ, నిర్లక్ష్య వైఖరీ, రాజకీయ ఒత్తిడి... ఇవన్నీ తట్టుకుని ఆశయాలూ నిలుపుకోవడం ఓ పెద్దసవాలు... అందులోనూ కొత్తదార్లు తొక్కడం.. గట్టి సంకల్పం ఉంటేకానీ సాధ్యం కాదు. వాకాటి కరుణకి అది నిండుగా ఉందంటారు ఆమె ఎక్కడ పనిచేసినా. తెలంగాణ రాష్ట్ర స్త్రీ, శిశుసంక్షేమ శాఖ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టారామె. పదవి కొత్తది. కానీ ఆమె చూపే వినూత్నత ఎప్పట్లాగే పాతదే!! అదే ఆమెకు తాజాగా తెలంగాణా ప్రభుత్వం నుంచి స్టేట్ ఎక్సలెన్స్ అవార్డుని తెచ్చిపెట్టింది.

కొత్తదనాల కరుణమ్మ!

ఓ రాష్ట్రం అభివృద్ధి సాధిస్తోందా లేదా అని చెప్పే ప్రధాన సూచికల్లో ఒకటి ప్రసవాసుపత్రుల్లో మాతా, శిశు మరణాల రేటు! ఏ వ్యాధో, ప్రమాదమో ఏర్పడి ఓ వ్యక్తి మరణించడమన్నది ప్రపంచంలో చాలా చిన్న విషయం. కానీ కాన్పులాంటి సహజ ప్రక్రియకూ మరణాలే జరుగుతోంటే.. దాన్ని ప్రభుత్వ యంత్రాంగ లోపంగానే చూస్తారు! అందుకే నాలుగు నెలల కిందట స్త్రీ, శిశు సంక్షేమ కమిషనర్‌గా పదవి చేపట్టినప్పటి నుంచి వాకాటి కరుణ మాతా, శిశు మరణాల రేటుపైనే దృష్టిపెట్టారు. తెలంగాణలో ఇదేమంత ఎక్కువగా లేదు కానీ.. ఇప్పుడు సాధిస్తున్న అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లాలని భావించారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌తో చర్చించి 'అమ్మ ఒడి' పథకానికి రూపకల్పన చేశారు! దీనికింద గర్భిణులకి ప్రభుత్వమే రూ.12 వేలు ఇస్తుంది. తెలంగాణలో ఇదో కొత్త ప్రయోగం!! అదొక్కటేకాదు.. కరుణ కమిషనర్‌గా వచ్చాక జిల్లాల్లోని ప్రసవాసుపత్రులూ, వార్డుల తీరే మారిపోయింది. శుభ్రంగా, స్వచ్ఛంగా కనిపిస్తున్నాయి. కాస్త డబ్బులుంటే ఏ ప్రయివేటు ఆసుపత్రికో వెళ్లాలనుకునే వాళ్లు ప్రభుత్వ దవాఖానాలకే వస్తున్నారు. గత మూడునెలల్లో ఇక్కడ ప్రసవం కోసం వచ్చే గర్భిణుల సంఖ్య నాలుగురెట్లు పెరిగింది. అంటే.. ఇదివరకు పదివేలమందే వస్తే ఇప్పుడు నలభైవేల మంది వస్తున్నారు. 'ఇదే వైద్య సేవలు ప్రైవేటు ఆసుపత్రిలోనైతే కనీసం పాతికవేలు చెల్లించుకోవాలి! ఆ రకంగా 40 వేల మంది ద్వారా కోటిరూపాయల ఖర్చు ఆదాచేసినట్టే కదా!' అంటారు కరుణ తనదైన గణితశాస్త్ర బుర్రతో!!

ఆ మాటలే నడిపిస్తున్నాయి.. కరుణ నిజంగానే గణితశాస్త్ర మేధావి. అందులో ఎంఫిల్ చేశారు. 1990ల నాటి అందరు యువతుల్లాగే ఐటీ వైపు వెళ్లాలని కలలు కన్నారు. వెళ్లారు కూడా. ఇంతలో సివిల్స్ రాసి చూడాలనుకున్నారు. కానీ రాలేదు. వెంటనే గ్రూప్ వన్‌కి హాజరై విజయం సాధించారు. అలా నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అధికారిణిగా బాధ్యతలు చేపట్టారు. జాయింట్ కలెక్టర్ స్థాయిదాకా వెళ్లాక.. సివిల్స్ రాసి ఐఏఎస్ అయ్యారు. ఐటీలో ఉన్న కరుణ.. ప్రజాసేవకురాలిగా రావడానికి ప్రధాన కారణం ఆమె తండ్రి ప్రోత్సాహమే. తెలుగు సాహిత్యంలో ఏకాస్త పరిచయం ఉన్న వారికైనా 'వాకాటి' ఇంటిపేరు వినగానే పాండురంగారావే గుర్తుకొస్తారు. ప్రసిద్ధ రచయిత, పాత్రికేయుడాయన. 'ఆ రోజు నాకు బాగా గుర్తుంది. పీజీ చేస్తున్నాను. నాన్న ఓ పత్రికలో వ్యాసాలు రాస్తుండేవారు! ఓ ప్రసిద్ధ విద్యావేత్తని కలంతో చెండాడుతున్నారు. ఆ రాతలు చూసి నాకు చాలా భయమేసింది. 'ఇవన్నీ మనకెందుకు నాన్నా!' అన్నా. ఆయన ఒకటే మాట చెప్పారు. 'నిజం నీవైపుంటే నీకు అన్నీ ఉన్నట్టే. ప్రపంచం మొత్తం నిన్ను వ్యతిరేకించినా భయపడాల్సిన అవసరం లేదమ్మా!' అని. వాటి అర్థమేంటో అప్పట్లో నాకు తెలియదు. అధికారినయ్యాకే అర్థం కావడం మొదలైంది..' అంటారు కరుణ. తండ్రి ఉద్యోగరీత్యా కరుణ దిల్లీలోనే పుట్టిపెరిగారు. కొంత కాలం విశాఖలో ఉన్న ఆ కుటుంబం, తర్వాత హైదరాబాద్‌లో స్థిరపడింది. ఇక్కడి సెయింట్ ఫ్రాన్సిస్‌లోనే చదువుకున్నారు కరుణ.

ఆ ఆత్మహత్యలే కదలించాయి! 'ఎనిమిదేళ్ల కిందటి మాట. నేను వరంగల్ జాయింట్ కలెక్టర్‌గా ఉన్నా. ప్రతిరోజూ ఎవరో ఒక బక్కజీవి వచ్చి భూమి కబ్జా అయిందని భోరుమనేవాడు! సరే.. అతనికేదైనా సాయం చేద్దామని దస్త్రాల్లో చూస్తే భూమి వ్యాజ్యాల్లో ఉండేది. అంటే కబ్జాదారు భూమి లాక్కున్నది కాకుండా వ్యాజ్యం కూడా వేశాడన్నమాట! నమ్ముకున్న భూమి కబ్జాకు గురైతే తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకున్న బక్కజీవుల వార్తలూ నన్ను నిలవనీయలేదు..' అని గుర్తు చేసుకుంటారామె. ఇలాంటి కబ్జా కేసుల్ని న్యాయస్థానాల్లో ప్రభుత్వమే వాదించేలా 'భూమి' పథకం తీసుకొచ్చారు కరుణ. రెండేళ్లలోనే అలా 250 ఎకరాల భూముల్ని విడిపించారామె!! ఇప్పుడీ పథకం రెండు తెలుగు రాష్ట్రాల్లోని 16 జిల్లాల్లో అమల్లో ఉంది! అదొక్కటే కాదు.. అక్కడున్న గుడుంబా నిర్మూలనకోసం మహిళా సంఘాలూ, సర్పంచులతో కలిసి పనిచేశారు. ఆ సమస్యను తొంభైశాతం వరకూ తగ్గించారు. అలాగే వరంగల్‌లో అనాథలైన పేదలకు ఆమె తీసుకొచ్చిన గుప్పెడు బియ్యం కార్యక్రమం కూడా ఎంతోమందిని కదిలించింది! స్వయంసహాయక సంఘాల ద్వారా చేపట్టిన ఆ పథకం.. ఎంతోమంది అన్నార్తులకు మేలుచేసింది. స్వయం సహాయక బృందాల్లోని ప్రతి సభ్యురాలు రోజూ గుప్పెడు బియ్యాన్ని తీసిపెట్టి.. నెలగడిచిన తరవాత పంచే ఏర్పాటు చేశారామె.

ఇదో అద్భుతం! ఏటూరు గ్రామం.. గోదావరి తీర ప్రాంతం. చుట్టూ బంగారంలాంటి ఇసుక. స్వాతంత్ర్యానికి ముందు నుంచే ఆ ఇసుకతో వ్యాపారులు లక్షలు ఆర్జిస్తున్నారు. ప్రభుత్వం కూడా కోట్లు కళ్ల చూస్తుంది. కానీ అదే నేలపై ఉండే గ్రామస్థుల్లో మాత్రం కడుపేదరికం! ఇక్కడ దాదాపు 570 కుటుంబాలున్నాయి. అందులో ఎనభైశాతం మంది ఇసుక తరలించే కూలీలే. ప్రతి ఇంటా ఆకలి కేకలే! వరంగల్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన వెంటనే దానిపైనే దృష్టిపెట్టారు కరుణ. కూలీల నుంచి నేరుగా ప్రభుత్వమే ఇసుక తీసుకునేలా సరికొత్త పథకానికి శ్రీకారం చుట్టారు. మన తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడా చేయని ప్రయోగమిది. ఆ విషయం ఎలా పొక్కిందో ఏమో ఇసుక మాఫియా రంగంలోకి దిగింది. బెదిరింపులు మొదలయ్యాయి. మాఫియాతో అంటకాగే రాజకీయనాయకులు నేరుగా కరుణతో తలపడ్డారు. కరుణ తన దూకుడు మరింతగా పెంచారు. కూలీలందరినీ క్వారీ సంఘంగా ఏర్పాటు చేశారు. ఆ సంఘం నుంచి ప్రభుత్వ ఖనిజ కార్పొరేషనే కరుణ ఇసుకని కొనే ఏర్పాటుచేశారు. దాంతో ప్రతి కూలీకి ఒక్కో క్యూబిక్ మీటరు ఇసుకకి రూ.70 రావడం మొదలైంది. ప్రతి కుటుంబానికి నికరాదాయం దాదాపు 20 వేలు వస్తోంది ఇప్పుడు కూడా! ఆ డబ్బుని కూడా ఆ ఇంటి స్త్రీల ఖాతాల్లోకి వెళ్లేలా చూశారామె! వరంగల్‌లో ఇలాంటి విజయాలెన్నో నమోదుచేసి తాజాగా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కమిషనర్ అయ్యారు.

'ఇది నా బాధ్యత!' కరుణ భర్త శ్రీకాంత్ కార్పొరేట్ కన్సల్టెంట్. ఆ దంపతులకిద్దరు పిల్లలు.. ఇంటర్ చదువుతున్నారు. ఆమె ప్రభుత్వ అధికారిణిగా వినూత్న ఆలోచనలతో వెళ్తున్నారని అన్నప్పుడు ఆమె అస్సలు ఒప్పుకోరు. 'ప్రజల కోణం నుంచి ఆలోచిస్తే ఇవేవీ వినూత్నం కాదు. అవసరం అంతే! ఓ కాగితంముక్క పట్టుకుని ఎన్నో కిలోమీటర్ల నుంచి ఇక్కడికొస్తారు. వారి సమస్యలు తీర్చాలంటే నేను మొక్కుబడిగా ఒకేదారిలో నడిస్తే చాలదు. ఇంకేదైనా చేయగలమేమో అని ఆలోచించాలి. నేను అదే చేస్తున్నా. ఎప్పుడూ మంచినే నమ్ముతా. అది అందరిలోనూ ఉంటుంది.. పిలిస్తే పలుకుతుంది. కాకపోతే మనం ఎలా పిలుస్తామన్నదే ముఖ్యం!' అంటారామె. ఆమె కష్టమే ఇప్పుడు కరుణకు స్టేట్ ఎక్సలెన్స్ అవార్డును తెచ్చిపెట్టింది. 'ఈ విజయం నాకు సహకరించిన ప్రతీఒక్కరికీ దక్కుతుంది..' అంటారామె.

సహకారం : **హిదాయతుల్లా బిజాపూర్,** ఈనాడు, విశాఖ







చిన్నచిన్న వేడుకలకు వేసుకునే దుస్తులనగానే ఎంబ్రాయిడరీ చేసినవీ, కాస్త పట్టు తరహావీ ఎంచుకోవడం మనలో చాలామంది చేసేదే. కానీ ఈసారి ప్రింట్లు ప్రయత్నించి చూడండి. ఆహ్లాదకరంగా ఉంటాయి. ఆకట్టుకుంటాయి. చెప్పాలంటే వీటిని రోజువారీగానే కాదు.. పార్టీవేర్‌గానూ ప్రయత్నించడం ఇప్పటి ట్రెండ్. అయితే ఎలా ఎంచుకోవాలో చెబుతున్నారు డిజైనర్ సౌమ్యారెడ్డి.

ప్రింట్లు... ఆ ప్రత్యేకతే వేరు!





ఒకప్పుడు ప్రింట్ల దుస్తుల్ని కేవలం క్యాజువల్ వేర్‌గానే పరిగణించేవారు. కానీ ఇప్పుడు వీటికి పండుగలూ, వేడుకల్లో ఉపయోగించేలా అదనపు హంగులూ జత చేసి రూపొందిస్తున్నారు. అలాంటివాటిల్లో వస్త్రాలపై విరబూసిన పూల సొగసులతో పాటూ జంతువులూ, చెట్లూ, జియోమెట్రిక్ ఆకృతులూ, అంకెలూ.. ఇలాంటివెన్నో ఇప్పుడు సందడి చేస్తున్నాయి. ఈ తరహా ప్రింట్లు పొడవాటి గౌన్‌లూ, అనార్కలీలూ, ట్యూనిక్‌లూ, చీరలకోసం ఎంచుకోవచ్చు. ఈ డిజిటల్ ప్రింట్లు సాధారణంగా షిఫాన్, జార్జెట్ వంటి వస్త్ర రకాల్లో ఎక్కువగా కనిపించడం మామూలే. కానీ ఇప్పుడు చేనేత పట్టూ, నూలు వస్త్రాలమీదకూ కొత్తందాన్ని తెచ్చిపెడుతున్నాయి. ఇవేకాదు హ్యాండ్ ప్రింట్లలో బాతిక్, మైకా, షిబోరీ, ఇకత్, కలంకారీ వంటి ప్రింట్లూ టై అండ్ డై రకాల్లో బాందినీ, లెహేరియా వంటి డిజైన్లూ వావ్ అనిపిస్తున్నాయి.




ఆహ్లాదకరంగా...

ఎంబ్రాయిడరీల హంగామా కాస్తా భారీగా ఉంటుందనుకున్నప్పుడు.. చూడ్డానికి అలానే కనిపించే సింపుల్ మైకా ప్రింట్లను ప్రయత్నించొచ్చు. బంగారు, వెండి రంగుల్లో మాత్రమే ఈ ప్రింట్ కనిపిస్తుంది. షిఫాన్, సింథటిక్ వంటి రకాలతో మరింత అందంగా కనిపించే దీన్ని లెహెంగాలూ, పరికిణీలకు వాడుకోవచ్చు. టై అండ్ డై రకాలైన బాందినీ, లెహేరియా వంటివి ప్రింట్లలా మెప్పిస్తాయి. బాందినీ డిజైను గుండ్రంగా ఉంటే, లెహేరియా ఏటవాలు డిజైన్లతో వర్ణ వైవిధ్యంగా కనిపిస్తుంది. ఇక బాతిక్ ప్రింట్లను కాలేజీకెళ్లే అమ్మాయిలు కుర్తీల చేతులపై, అంచులుగా, గౌనులుగా, కుర్తీలుగా ఎంచుకోవచ్చు. అలానే ఎలాంటి డిజైను లేని సాదా రంగు దుస్తులపై బాతిక్ ప్రింట్లున్న చున్నీని ప్రయత్నిస్తే ఆ అందమే వేరు.

కలంకారీ కళగా..

పై ప్రింట్ల రకాల్లో ప్రత్యేక స్థానం కలంకారీదే. చెప్పాలంటే ఇప్పుడు వీటిదే హవా. రాధాకృష్ణుల బొమ్మలూ, అమ్మవారి ముఖాకృతులూ, చిలుకలూ వంటి డిజైన్లు ఇండోవెస్ట్రన్, ఫ్యూజన్ శైలి దుస్తుల మీద కొత్తగా కనిపిస్తున్నాయి. సాధారణ రోజులతో పాటు పెళ్లిళ్ల వంటి వేడుకలకూ, మెహెందీ, పూజల వేళ ఈ డిజైన్లు సంప్రదాయ సౌరభాల్ని వెదజల్లుతాయి. అలానే కలంకారీని అప్లిక్‌వర్క్‌లా పట్టు, రాసిల్క్, నూలు వంటి వస్త్రరకాల దుస్తులపై డిజైన్ చేయించుకోవచ్చు. నేరుగా బ్లవుజులకు, చీరలకు డిజైన్‌లానూ వాడుకోవచ్చు.

బంగారం వెండి



15న ముగింపు-క్రితం

తమిళనాడు (రూ. లలో)		
ఆర్నమెంట్ (గ్రా)	2,769	2,769
వెండి (గ్రా)	42.20	42.20

	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమండ్రి		విశాఖపట్నం	
బంగారం(24క్యా)	-------	-------	-------	30,100	-------	29,900	29,620	29,620	30,060	30,060
ఆర్నమెంట్	-------	-------	-------	28,000	-------	27,780	27,690	27,690	27,750	27,750
వెండి(కిలో)	-------	-------	-------	40,500	-------	40,000	39,500	39,500	40,500	40,500

పంద్రాగస్టు 2017 రాత్రి 12 గంటలకి కాస్త అటూఇటూ.. 70వ స్వాతంత్ర్య దినం పుట్టిన తొలి నిమిషాలు.. అది హైదరాబాద్ నగరం. అందులో మనందరికీ బాగా తెలిసిన శిల్పారామం. దాని ఎదురుగా ఉండే సిగ్నల్ పక్కన ఓ ఖాళీ స్థలం ఉంటుంది. అదిగో అక్కడ మొదలైంది ఆ నడక. సుమారు ఐదొందలమంది అమ్మాయిలు.. అర్ధరాత్రివేళ 'మాకూ కావాలి స్వేచ్ఛ' అని నినదిస్తూ నడిచారు.

ఆ అర్ధరాత్రి నడక వెనక..!



అర్ధరాత్రివేళ రోడ్డుపై ఓ పెద్ద జాతీయ జెండాని అటూఇటూ ఊపినట్టే అనిపించి ఉంటుంది.. ఆకాశం నుంచి ఎవరైనా ఈ యాత్రని చూసుంటే. పన్నెండు గంటలకు ఈ యాత్ర కదిలింది.. 'వీవాంట్ ఫ్రీడమ్ అండ్ స్పేస్' అనే నినాదంతో పోలీసు అధికారిణి స్వాతీలక్రా ప్రారంభించిన ఈ నడక లక్ష్యం, మూలం ఏమిటో తెలుసుకుందాం.

మూడేళ్లకిందట.. నగరాల్లోని పార్కులూ, మైదానాలూ, రోడ్లను 'పబ్లిక్ స్పేసస్' అని అంటాం కదా.. మహిళలకు కనీసం పగటిపూటైనా ఈ పార్కుల్లాంటివాటికి వెళ్లే అవకాశం ఉందా? ఉంటుంది.. కానీ వెళితే ఎవరు ఏ రకంగా మాట్లాడతారో అని భయం. 'మీతోపాటూ మేమూ పార్కులూ, రోడ్ల వెంట స్వేచ్ఛగా నడవడానికి లేదా?' అనే ప్రశ్నే ఈ 'స్వేచ్ఛా యాత్ర'కి మూలం. ఇంతమంది అర్ధరాత్రి నడిచి.. మిగతా అమ్మాయిలకి ధైర్యాన్ని ఇవ్వడమే దీని లక్ష్యం! మూడేళ్లకిందట 'మహతి ఎంటర్‌టైన్‌మెంట్స్' సంస్థ తరఫున దీన్ని ప్రారంభించారు.. విక్కీ గోకవరపు. ఆయనో పాత్రికేయుడు. ఈ యాత్రలో ఐదొందలమంది పాల్గొంటున్నారని అనుకున్నాం కదా! వీళ్లందరికీ నలుగురు నేతృత్వం వహించారు. వాళ్లు.. 'ఐ విల్ గో అవుట్' ప్రచార కార్యక్రమం తరఫున వర్ష భార్గవి, పారిశ్రామికవేత్త మోహినీ చౌహాన్, వాయిస్ ఫర్ గర్ల్స్ సంస్థ సంచాలకురాలు అనూషా భరద్వాజ్, రైస్ బకెట్ ఛాలెంజ్ రూపకర్త మంజులతా కళానిధి, సామాజిక కార్యకర్త గాయత్రీ స్వరూప్! 'నిర్భయ ఘటన చూశాక రేపు నా పాపకీ పద్దెనిమిదేళ్లు నిండితే ఇలాగే జరుగుతుందా..? అనే భయం ప్రతి తండ్రిలాగే నన్నూ వణికించింది. అర్ధరాత్రి తిరగడం ఇంత పాపమా అనిపించింది. ఆ తర్వాతి ఏడాదే.. మీడియాలో ఉన్న నా స్నేహితురాళ్లతో మాట్లాడి వాళ్ల సహకారంతో 2015 స్వాతంత్ర్యదినోత్సవాన తొలిసారి ఈ కార్యక్రమం నిర్వహించాను. ఇప్పటికీ కొనసాగిస్తున్నాం..' అని వివరించారు విక్కీ.

ఒక్కో అనుభవం.. 'హేయ్..! ఈ రోజు 'తిరంగ'లో భాగంగా నేను తెల్లటి దుస్తులు వేసుకున్నా. నిజానికి.. నేను ఈ రంగు వాడి దాదాపు పదిహేనేళ్లవుతోంది!' అని చెప్పడం మొదలుపెట్టారు ఈ కార్యక్రమంలో ప్రధాన యాత్రికురాలిగా పాల్గొంటున్న వర్ష భార్గవి. 'ఓ రోజు నేను ఇంటర్వ్యూకి వెళుతున్నా. తెల్లటి దుస్తులు వేసుకున్నా. బస్టాండ్‌కి వెళ్తుంటే ఓ ఆకతాయి నోటి నిండా కిళ్లీ వేసుకుని నామీద ఉమ్మేశాడు. నేను అరిచేలోపు ఎర్రగా గారపట్టిన పళ్లతో నవ్వుతూ వెళ్లిపోయాడు. ఏడుస్తూనే ఇంటికొచ్చి దుస్తులు మార్చుకుని మళ్లీ వెళ్లా. అప్పటికే ఇంటర్వ్యూ సమయం అయిపోయింది. అప్పటి నుంచి తెల్లటి దుస్తులు వేసుకోవడం మానేశా. ఈ ఏడాది మహిళలు బయట ధైర్యంగా నడవాలని కోరుతూ 'ఐ విల్ గో అవుట్' అనే ప్రచార కార్యక్రమం మొదలుపెట్టాను. ఆ ధైర్యంతోనే పదిహేనేళ్ల తర్వాత ఇలా తెల్లటి దుస్తులు వేసుకుని ఈ కార్యక్రమానికి వచ్చా..!' అని చెప్పారామె!!

అలా ముగిసింది.. ఈ యాత్ర మూడు కిలోమీటర్లే సాగినా.. అమ్మాయిల చర్చలూ, పాటలూ, చర్చలూ, నినాదాలూ, నవ్వులతో ఇది ముగియడానికి గంటపైనే పట్టింది. 'మేం కలిసి కట్టుగా ఇంతసేపు ఎంత ధైర్యంగా నడిచామో! మళ్లీ ఒంటరిగా ఎవరిళ్లకి వాళ్లం వెళ్లాలంటే ఎప్పుడూ ఉండే జంకే తలెత్తింది. అలా ధైర్యంగా వెళ్లే రోజులు రావాలనే నేనీ యాత్రలో పాల్గొన్నా!!' అని చెప్పారు మంజులతా కళానిధి. 'నేను ఒంటరిగా వెళ్లగలను కానీ.. ఈ యాత్రకు వచ్చిన మరో నలుగురు అమ్మాయిల్ని వాళ్ల ఇళ్లల్లో దింపా' అన్నారామె. మిగతావాళ్లూ ఇదే చేశారు.

సీఈఓలూ.. పొదుపు చేయాలి

- అప్పుడే కంపెనీల వృద్ధి
- ఇన్ఫోసిస్ మూర్తి పిలుపు
- మోదీ ఆలోచనపై ప్రశంసలు



బెంగళూరు: కంపెనీల వృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లాలంటే.. పొదుపు చర్యలు చేపట్టాలని సంస్థల చీఫ్ ఎగ్జిక్యూటివ్‌లు, ఇతర ఉన్నతాధికార్లకు ఇన్ఫోసిస్ సహ-వ్యవస్థాపకుడు ఎన్.ఆర్. నారాయణమూర్తి సూచించారు. 'మీరు సంపాదిస్తున్న దాని కంటే తక్కువ వ్యయాలు పెట్టడం చాలా ముఖ్యం. అంటే ఛైర్మన్, సీఈఓ స్థాయి వ్యక్తి నుంచి కింది స్థాయి వ్యక్తి వరకు ప్రతి ఒక్కరు పొదుపు చేయాలి. అపుడే కంపెనీలు వృద్ధి చెందుతాయ'ని మంగళవారమిక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో పేర్కొన్నారు. ఖర్చు చేసే ప్రతీ పైసా మీద అత్యుత్తమ విలువను పొందాలని తెలిపారు. సమయం తగ్గించుకుని.. నాణ్యతను ఎలా పెంచాలని యజమానులకు ఉద్యోగులు సైతం ప్రశ్నించవచ్చని అన్నారు. 'ఒక్కసారి పొదుపు చర్యలు చేపట్టడం మొదలుపెడితే.. వ్యయాలు నియంత్రణలో ఉన్నాయి. కంపెనీల ఆదాయాలు పెరుగుతాయ'న్నారు. కంపెనీలు వాడే సాంకేతిక పరిజ్ఞానం, ఉద్యోగులకిచ్చే శిక్షణలు సైతం ఆదాయాల వృద్ధికి ఊతమిస్తాయని మూర్తి వివరించారు. 71వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ చేసిన ప్రసంగంపై మూర్తి ప్రశంసల జల్లులు కురిపించారు. ముఖ్యంగా మోదీ ప్రస్తావించిన ఓ ఆలోచనను ప్రముఖంగా పేర్కొన్నారు. 'ప్రధాని ఎపుడు మాట్లాడినా.. చాలా విజ్ఞానాన్ని పంచుతారు. ఆయన తీసుకొచ్చిన పోటీతత్వంతో కూడిన సహకార సమాఖ్య అనేది చాలా అద్భుతమైన ఆలోచన'ని అన్నారు. 'నేను చాలా ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసినందు వల్ల దేశాభివృద్ధికి రాష్ట్రాలు చాలా ముఖ్యమని నాకు తెలుసు. ముఖ్యమంత్రులు, రాష్ట్ర ప్రభుత్వాల ప్రాముఖ్యం నాకు తెలుసు. అందుకే సహకార సమాఖ్యపై దృష్టి సారించాం. తాజాగా ఇపుడు పోటీతత్వ సహకార సమాఖ్య అవసరం ఉంద'ని మోదీ జాతినుద్దేశించి ప్రసంగించారు. ఈ వ్యాఖ్యలను మూర్తి మెచ్చుకున్నారు. దీని వల్ల రాష్ట్రాలు ఒక దానితో ఒకటి పోటీపడి పెట్టుబడులదార్లను, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ఆకర్షిస్తాయని.. తద్వారా ఉద్యోగాల సృష్టి జరుగుతుందని తెలిపారు.

జియో ఉచిత ఫోన్‌తో 'టెలికాం'పై ప్రభావం

- ఆదాయాలు క్షీణించొచ్చు ● డాట్‌కు వొడాఫోన్ లేఖ

దిల్లీ: జియో ఇవ్వనున్న 'ఉచిత' ఫోన్ వల్ల ఇతర కంపెనీల ఆదాయాలు తగ్గిపోయే అవకాశం ఉందని వొడాఫోన్ అంచనా వేస్తోంది. 'కొత్త ఆపరేటరు ఇప్పటికే డేటా ధరల విషయంలో ఒత్తిడి తీసుకొచ్చారు. తాజాగా ఉచితఫోన్‌నూ ప్రకటించారు. దీని వల్ల ప్రస్తుత ఆపరేటర్ల ఆదాయాలు క్షీణించే అవకాశం ఉంద'ని టెలికాం కమిషన్ సభ్యుడు(ఫైనాన్స్) అనురాధ మిత్రాకు రాసిన లేఖలో వొడాఫోన్ పేర్కొంది. రూ.1500 చెల్లించి మూడేళ్ల తర్వాత ఆ డబ్బును వెనక్కి తీసుకునే పద్ధతిలో ఒక 4జీ ఫీచర్ ఫోన్‌ను రిలయన్స్ ఇండస్ట్రీస్ అధిపతి ముకేశ్ అంబానీ ఇటీవలే ప్రకటించిన సంగతి తెలిసిందే. 'టెలికాం సేవల ఆదాయాల్లో క్షీణత కొనసాగుతోంది. జూన్ 2017తో ముగిసిన త్రైమాసికంలోనూ 3.41 శాతం మేర అవి తగ్గాయ'ని వొడాఫోన్ పేర్కొంది. అదే సమయంలో స్పెక్ట్రమ్ చెల్లింపులపై వడ్డీ రేటును తగ్గించాలని కూడా విజ్ఞప్తి చేసింది. 'ఆపరేటర్లపై భారాన్ని తగ్గించేందుకు స్పెక్ట్రమ్ చెల్లింపులపై వడ్డీ రేటును తగ్గించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతమున్న 10 శాతం నుంచి 6.25 శాతానికి; వాయిదా పడ్డ చెల్లింపుపై 6.5 శాతంగా వర్తింపజేయాలని కోరుతోంది. మార్కెట్ ధరకు స్పెక్ట్రమ్‌ను కొనుగోలు చేసినప్పటికీ.. ప్రభుత్వం టెలికాం ఆపరేటర్లపై భారీ స్థాయిలో భారాన్ని మోపుతోందని వొడాఫోన్ తెలిపింది. ఇంకా టెలికాం రంగంపై విధిస్తున్న వివిధ పన్నుల విషయంలోనూ కొంత ఊరటనివ్వాలని కోరింది.

రూ.92,000 కోట్లు

ప్రభుత్వ బ్యాంక్‌లకు ఉద్దేశపూర్వక ఎగవేతదార్ల బకాయిలు

దిల్లీ: 2016-17 ముగిసే నాటికి ప్రభుత్వ రంగ బ్యాంకులకు ఉద్దేశపూర్వక ఎగవేతదారుల బకాయిలు రూ.92,376 కోట్లకు పెరిగాయి. 2015-16 మార్చికి నమోదైన రూ.76,685 కోట్లతో పోలిస్తే ఇవి 20.4 శాతం అధికమయ్యాయి. ఆర్థిక శాఖ గణాంకాల ప్రకారం.. వార్షిక ప్రాతిపదికన ఉద్దేశపూర్వక ఎగవేతదారుల సంఖ్య 8,167 నుంచి 10 శాతం పెరిగి 8,915కు చేరింది. ఈ 8,915 ఉద్దేశపూర్వక ఎగవేతల్లో.. రూ.32,484 కోట్ల విలువైన 1,914 కేసుల్లో బ్యాంకులు ఎఫ్ఐఆర్ దాఖలు చేశాయి. ఇక 2016-17లో ఎస్‌బీఐ సహా 27 ప్రభుత్వ రంగ బ్యాంకులు రూ.81,683 కోట్ల రుణాలను రద్దు చేశాయి. గత అయిదు ఆర్థిక సంవత్సరాల్లో ఇదే అత్యధికం. 2015-16తో పోలిస్తే ఈ మొత్తం 41 శాతం అధికం.



కోడిగుడ్లు

15వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)

హైదరాబాద్	351	వరంగల్	353
చిల్లరగా (ఒక గుడ్డు)	4.10	విశాఖపట్నం	360
బెంగళూరు	380	చెన్నై	397
16న		చిత్తూరు	390
విజయవాడ/గోదావరి	357	నమక్కల్	384

ఈనాడు బిజినెస్

నేటి మార్కెట్

మదుపర్లు నేడు అప్రమత్తంగా వ్యవహరించే అవకాశం ఉంది. గతవారమంతా నష్టాలు మూటగట్టుకున్న సూచీలు సోమవారం లాభాల్లో ముగియడం సానుకూల అంశంగా భావించొచ్చు. ఇక అదే రోజున విడుదలైన రిటైల్, టోకు ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణ గణాంకాలు మార్కెట్లపై ప్రభావం చూపుతాయనడంలో సందేహం లేదు. మన సూచీలతోపాటే గత వారమంతా నష్టాల్లో ఈదులాడిన ఆసియా మార్కెట్లు మంగళవారం సానుకూలంగా ముగియడం మదుపర్ల సెంటిమెంటును పెంచొచ్చు. వీటికి తోడు ఐరోపా, అమెరికా మార్కెట్లు కూడా సానుకూలంగా చలించడాన్నీ వారు గమనించొచ్చు. సోమవారం ఫలితాలు వెల్లడించిన కంపెనీల షేర్లపై దృష్టి సారిస్తారు. నిఫ్టీకి నేడు 9,845-9,915 మధ్య నిరోధం, 9760-9,720మధ్య మద్దతు లభించొచ్చని అంచనా.

మూడేళ్ల క్రితమే

ఎలక్ట్రిక్ బస్సు తెచ్చాం

ప్రభుత్వ సబ్సిడీతో కొనుగోళ్లు జరుగుతాయ్



- ప్రత్యేక పథకాలు అవసరం
- రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలు ఆసక్తిగానే ఉన్నాయ్
- దేశీయ బస్సుల విపణిలో 8% వృద్ధి
- జీఎస్‌టీతో స్పష్టత వచ్చింది

వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) అమలులోకి వచ్చిన తర్వాత బస్సుల కొనుగోలుపై ఆపరేటర్లకు స్పష్టత వచ్చిందని, ఇది భవిష్యత్తులో బస్సుల కొనుగోళ్లను పెంచుతుందని దేశంలో బస్సుల తయారీలో అగ్రగామిగా ఉన్న అశోక్ లేలాండ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (ప్రపంచ బస్సుల వ్యాపారం) టి.వెంకటరామన్ చెబుతున్నారు. ఇప్పటి వరకూ ఎక్కువ మంది చాసిస్‌లను కొనుగోలు చేసి బస్సు నిర్మాణ కంపెనీల వద్ద బస్సును తయారు చేయించుకుంటున్నారు. కొత్త పన్నుల వ్యవస్థలో ఈ ధోరణి తగ్గుతుందని, తయారీ కంపెనీల వద్దే పూర్తిగా నిర్మించిన బస్సుల కొనుగోళ్లు పెరుగతాయని చెబుతున్నారు. దేశీయ బస్సుల పరిశ్రమపై 'ఈనాడు'కు ఇచ్చిన ఇంటర్వ్యూలోని ముఖ్యాంశాలు..

'ఈనాడు'తో అశోక్‌లేలాండ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వెంకటరామన్

దేశీయ బస్సు పరిశ్రమపై జీఎస్‌టీ ప్రభావం ఎలా ఉంటుంది?

జీఎస్‌టీ అమల్లోకి వచ్చాక కొనుగోలుదారులకు స్పష్టత లభించింది. ఇప్పటి వరకూ కొనుగోలు నిర్ణయంపై వేచి ఉన్న వారు ప్రస్తుతం నిర్ణయం తీసుకుంటున్నారు. ఇది పరిశ్రమపై సానుకూల ప్రభావాన్ని చూపుతుంది. గుర్తింపు పొందిన బస్సు బాడీని నిర్మించే సంస్థలు దేశంలో 340 ఉన్నాయి. ఆపరేటర్లు కంపెనీల వద్ద చాసిస్‌లు కొనుగోలు చేసి వీరి వద్ద బస్సులను నిర్మిస్తారు. ఎక్సైజ్ సుంకం భారాన్ని తగ్గించుకోవడానికి చూస్తున్నారు. భవిష్యత్తులో ఇటువంటి ప్రయోజనం పొందడం కష్టమవుతుంది. దీంతో కంపెనీల్లోనే నిర్మాణమైన బస్సుల కొనుగోలుకు మొగ్గు చూపుతారు. భవిష్యత్తులో ఆపరేటర్లు కోరుకునే ప్రత్యేక సదుపాయాలు, సౌకర్యాలకు (కస్టమైజ్) అనుగుణంగా బస్సును నిర్మించడానికి బస్సు బాడీ బిల్డింగ్ సంస్థలు సిద్ధం కావాలి. అదే వారికి సవాలు. ప్రస్తుతం స్కూల్ బస్సుల్లో 60% కంపెనీలోనే పూర్తిగా తయారవుతున్నాయి. మధ్య స్థాయి డ్యూటీ వాహనాల (ఎండీవీ) విభాగంలో ఇది 10% మాత్రమే ఉంది. తాజా పరిణామాల నేపథ్యంలో ఈ విభాగంలో కూడా కంపెనీల్లోనే పూర్తిగా నిర్మితమయ్యే బస్సుల సంఖ్య పెరుగుతుంది.

బస్సుల విక్రయాల్లో వృద్ధిరేటు ఎలా ఉంది?

ప్రపంచంలో చైనా తర్వాత భారత్ బస్సులకు అతిపెద్ద మార్కెట్. ప్రస్తుతం రెండు దేశాల్లో జనాభా దాదాపు సమానంగానే ఉంది. చైనాలో ప్రస్తుతం 6.2 లక్షల బస్సులు ఉన్నాయి. భారత్‌లో 4.8 లక్షల బస్సులు మాత్రమే ఉన్నాయి. ప్రజా రవాణా వ్యవస్థలో ఇతర ప్రయాణ సాధనాల కంటే.. చాలా సులభంగా ప్రవేశపెట్టడానికి బస్సు వీలైంది. దేశీయ బస్సుల విక్రయాలు ఏడాదికి 6-8 శాతం పెరగడానికి అవకాశం ఉంది. గత కొద్ది సంవత్సరాలను పరిగణనలోకి తీసుకుంటే.. పరిశ్రమ ఏడాదికి 32 వేల నుంచి 46 వేల బస్సుల వరకూ విక్రయిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో ఏడాది క్రితం ఇదే కాలంతో పోలిస్తే 6-7 శాతం తగ్గాయి. 30 శాతం బస్సులను రాష్ట్ర రవాణా సంస్థలే కొనుగోలు చేస్తాయి. వీటి వద్ద నిధులు లేకపోవడం.. నిర్ణయాల్లో వేచి చూసే ధోరణి విక్రయాలు తగ్గడానికి కారణం.

స్లీపర్ కోచ్‌లకు ఆదరణ ఎలా ఉంది?

స్లీపర్ కోచ్ బస్సుల నియమనిబంధనలను గత ఏడాది ప్రకటించారు. ప్రస్తుతం రోడ్లపై తిరుగుతున్న స్లీపర్ బస్సులకు నిబంధనల ప్రకారం తీసుకోవాల్సిన అనుమతులు లేవు. ఆపరేటర్లు కంపెనీల వద్ద చాసిస్‌లను కొనుగోలు చేసి తమ అవసరాలకు అనుగుణంగా బాడీని, స్లీపర్లు నిర్మిస్తున్నారు. బ్రేక్ వేసినప్పుడు స్లీపర్లు ఏ విధంగా ఉంటే ప్రయాణికులకు తక్కువ అసౌకర్యం కలుగుతుంది, భద్రత మొదలైనవి ముఖ్యాంశాలు. ఈ బస్సులు ఇక తాజాగా ధ్రువీకరణ పొందాల్సి ఉంటుంది. ఎక్కువ దూరం ప్రయాణం చేసే ప్రయాణికులు పెరుగుతున్నందున భవిష్యత్తులో వీటి విక్రయాలు బాగానే ఉంటాయి.

ఎలక్ట్రిక్ బస్సులు రోడ్ల మీదకు ఎప్పుడు వస్తాయి?

మేం మూడేళ్ల క్రితమే దేశంలోకి వర్సా పేరుతో విద్యుత్ (ఎలక్ట్రిక్) బస్సును తీసుకువచ్చాం. యూకేలో మా కంపెనీలో దీన్ని తయారు చేశాం. ఆ తర్వాత 'మేకిన్ ఇండియా' కార్యక్రమానికి అనుగుణంగా 2016, అక్టోబరులో విడుదల చేశాం. ప్రస్తుతం కంపెనీ ఎలక్ట్రిక్ బస్సులను విక్రయించడానికి సిద్ధంగా ఉంది. ఎలక్ట్రిక్ బస్సును కొనుగోలు చేయడానికి సాధారణ బస్సు కంటే మొదట్లో ఎక్కువ ఖర్చవుతుంది. కొనుగోలు చేసే ఆపరేటర్ల కోసం ప్రత్యేక పథకాలను ప్రభుత్వం ప్రవేశపెడితేనే ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేయడానికి ఆపరేటర్లు ముందుకు వస్తారు. దీనిపై ప్రభుత్వంతో చర్చించాం. ఇప్పుడున్న పథకాలు ద్విచక్ర వాహనాలకు, త్రిచక్ర వాహనాలకు ప్రయోజనం చేకూరుస్తాయి. బస్సులు కొనుగోలుదారులకు అనుకూలంగా లేవు. విదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో 2-3 కంపెనీలు దేశంలో ఎలక్ట్రిక్ బస్సులను తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తున్నాయి. ఎలక్ట్రిక్ బస్సులను ఇప్పటికే మేం రాష్ట్ర రవాణా సంస్థలకు ప్రదర్శించాం. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సంస్థలతో కూడా చర్చించాం. రవాణా సంస్థలు సబ్సిడీని కోరుతున్నాయి. 2022 నాటికి 20 వేల ఎలక్ట్రిక్ బస్సులు రోడ్లపై సేవలందించాలని ప్రభుత్వం భావిస్తోంది.

మార్కెట్ అగ్రగామిగా మీ భవిష్యత్ వ్యూహం ఏమిటి?

బస్సుల విభాగంలో దేశంలోనే అశోక్ లేలాండ్ అగ్రస్థానంలో ఉన్న కంపెనీ. ప్రపంచంలో నాలుగో స్థానంలో ఉన్నాం. ప్రపంచంలో మూడో స్థానానికి చేరే వ్యూహంలో భాగంగా ఎగుమతులపై మరింత దృష్టి కేంద్రీకరిస్తున్నాం. తయారైన బస్సుల్లో 50 శాతాన్ని ఎగుమతి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇందుకు విదేశాల్లో పంపిణీదారుల నెట్‌వర్క్‌ను పటిష్ఠం చేసుకుంటున్నాం. దేశీయ బస్సుల విపణిలో మాకు దాదాపు 40 శాతం వాటా ఉంది. మీడియం డ్యూటీ వాహనాల (ఎండీఈ) విభాగంలో 67 శాతం, ఇంటర్మీడియేట్ కమర్షియల్ వేహికల్ (ఐసీవీ) విభాగంలో 30 శాతం వాటా ఉంది. 2016-17లో దేశీయ విపణిలో 20 వేల బస్సులను విక్రయించాం. 13,000 బస్సులను ఎగుమతి చేశాం. దాదాపు 27 మోడళ్లను అశోక్ లేలాండ్ విక్రయిస్తోంది.

డబుల్ డక్కర్లు వస్తాయా?

ప్రస్తుతం డబుల్ డెక్కర్లకు ప్రత్యేకమైన నియమనిబంధనలేమీ లేవు. ప్రస్తుతం వీటి నిబంధనలు చర్చల దశలో ఉన్నాయి. వచ్చే ఏడాదిలో వీటిని తీసుకురావడానికి అవకాశం ఉంది. అప్పుడు రోడ్లపై డబుల్ డెక్కర్లు కూడా కనిపిస్తాయి.

- ఈనాడు, హైదరాబాద్

రిలయన్స్, బీపీలపై రూ.1700 కోట్ల అపరాధ రుసుము

దిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్, ఆ కంపెనీ భాగస్వామి బీపీలపై ప్రభుత్వం 264 మిలియన్ డాలర్ల(దాదాపు రూ.1700 కోట్లు) కొత్త అపరాధ రుసుమును విధించింది. తూర్పు ఆఫ్‌షోర్ కేజీ-డీ6 క్షేత్రాల నుంచి 2015-16లో లక్ష్యం కంటే తక్కువ ఉత్పత్తిని నమోదు చేయడం ఇందుకు నేపథ్యం. ఏప్రిల్ 1, 2010 నుంచి ఆరేళ్ల పాటు లక్ష్యాన్ని అందుకోలేకపోయినందుకు ఇప్పటిదాకా విధించిన మొత్తం అపరాధ రుసుము విలువ 3.02 బి.డాలర్ల(దాదాపు రూ.19,600 కోట్లు)కు చేరినట్లు చమురు శాఖ పేర్కొంది. ప్రొడక్షన్ షేరింగ్ కాంట్రాక్ట్ ప్రకారం.. ప్రభుత్వానికి లాభంలో వాటా ఇచ్చే ముందు గ్యాస్ విక్రయానికయ్యే మొత్తం మూలధనం, నిర్వహణ వ్యయాలను ఆర్ఐఎల్, బీపీ, నికో రిసోర్సెస్‌లు మినహాయించుకోవచ్చు. అయితే లక్ష్యాన్ని చేరనందున ఆ వ్యయాలను మినహాయించడానికి ప్రభుత్వం అనుమతించలేదు. తాజా పరిణామాలపై ఆర్ఐఎల్, బీపీలు స్పందించలేదు.

జులైలో రూ.20,428 కోట్లు

- జీవిత బీమా కొత్త ప్రీమియం 47% పైకి
- ఎల్ఐసీ వాటా రూ.16,255 కోట్లు

దిల్లీ: ఈ ఏడాది జులైలో జీవిత బీమా సంస్థల కొత్త ప్రీమియం ఆకర్షణీయంగా పెరిగింది. 47.40 శాతం వృద్ధితో రూ.20,427.68 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే కాలంలో వసూలైన కొత్త ప్రీమియం రూ.13,854.44 కోట్లు మాత్రమే. ప్రభుత్వరంగ భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) రూ.16,254.91 కోట్ల కొత్త ప్రీమియాన్ని వసూలు చేసింది. గత ఏడాది జులైలో వసూలైన రూ.10,737.92 కోట్లతో పోలిస్తే ఇది 51.40 శాతం ఎక్కువ. ప్రైవేటురంగంలోని 23 జీవిత బీమా సంస్థలకు ఉమ్మడిగా వచ్చిన కొత్త ప్రీమియం రూ.4,172.76 కోట్లు. గత ఏడాది ఇదే కాలంలో వచ్చిన ప్రీమియం రూ.3,116.52 కోట్లతో పోలిస్తే ఇది 34 శాతం అధికం. గత ఏడాది జులైలో సహారా లైఫ్ ఇన్సూరెన్స్ రూ.2.27 కోట్ల కొత్త ప్రీమియాన్ని ఆర్జించగా ఈసారి మాత్రం ఏమీ రాలేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్‌లో అన్ని జీవిత బీమా సంస్థల ప్రీమియం వసూళ్లు 18 శాతం పెరిగి రూ.53,659.66 కోట్లకు చేరాయి. భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఐఆర్‌డీఏఐ) గణాంకాలు ఈ విషయాలను వెల్లడిస్తున్నాయి.

ఇ-వే బిల్లుల నుంచి వినిమయ వస్తువులకు మినహాయింపు

జాబితాలో వంటగ్యాస్, కిరోసిన్

దిల్లీ: జీఎస్‌టీ కింద వస్తు రవాణాకు ఎలక్ట్రానిక్ వే బిల్లుల (ఇ-వే) నిబంధనల నుంచి కొన్ని వినిమయ వస్తువులకు మినహాయింపు లభించింది. వంటగ్యాస్, కిరోసిన్, పసిడి ఆభరణాలు, నగదు వంటివి ఈ జాబితాలో ఉన్నాయి. జులై 1 నుంచి అమల్లోకి వచ్చిన జీఎస్‌టీలో భాగంగా పన్నుల ఎగవేతను నిరోధించే లక్ష్యంతో వాహనంలోని సరకుల విలువ రూ.50000 దాటితే ఖచ్చితంగా ఇ-వే బిల్లు తీసుకోవడాన్ని ప్రభుత్వం తప్పనిసరి చేసింది. ఈ నెల 5న జరిగిన జీఎస్‌టీ కౌన్సిల్ సమావేశంలో ఇ-వే బిల్లుల నుంచి 153 వస్తువులకు మినహాయింపు ఇచ్చినట్లు ఆర్థిక శాఖకు చెందిన సీనియర్ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. ఈ జాబితాలో ఆవులు, గేదెలు, పందులు, చేపలు, పండ్లు, కూరగాయలు, తాజా పాలు, తేనె, విత్తనాలు, తృణధాన్యాలు, పిండి, తమలపాకులు, ఆల్కహాల్ లేని పానీయాలు, ముడి పట్టు, ఖాదీ, మట్టి కుండలు, మట్టి దీపాలు, పూజా సామగ్రి, వినికిడి యంత్రాలు వంటివి ఉన్నాయి. కేశాలు, నిల్వ చేసిన వీర్యం, కండోమ్స్, గర్భనిరోధకాలకు సైతం మినహాయింపు లభించింది. గృహాలకు సరఫరా చేసే వంటగ్యాస్, ప్రజా పంపిణీ వ్యవస్థ కింద విక్రయించే కిరోసిన్‌లకు సైతం ఇ-వే బిల్లుల మినహాయింపు ఇచ్చినట్లు సంబంధిత అధికారి తెలిపారు.

పటిష్ఠ సంస్కరణలు అవసరం: సీఐఐ

దిల్లీ: 2022 కల్లా అభివృద్ధి లక్ష్యాన్ని సాధించాలంటే పటిష్ఠ విధానాలు అవసరమని సీఐఐ అభిప్రాయపడింది. ఇందులో భాగంగా కొత్త పారిశ్రామిక విధానం, ఉద్యోగ సృష్టి, మహిళాసాధికారతకు ప్రాధాన్యమివ్వాలని తెలిపింది. 2022 కల్లా భారత్ సురక్షిత, సంపన్న, సమర్థ దేశంగా అవతరిస్తుందని స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని నరేంద్ర మోదీ ఆశాభావం వ్యక్తం చేయడంపై స్పందిస్తూ పైవిధంగా సీఐఐ అభిప్రాయపడింది. '2022కి నిర్దేశించుకున్న అభివృద్ధి లక్ష్యం సవాలుతో కూడుకున్నది. ఇందుకు ఆర్థిక, సామాజిక రంగాల్లో బలమైన విధానాలు అవసరం. ప్రభుత్వం తన వైపు నుంచి శుభారంభం చేసింది. ఇప్పుడు మనమందరం చేయిచేయి కలిపి అభివృద్ధి సూచీని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉంద'ని సీఐఐ ప్రెసిడెంట్ శోభనా కామినేని తెలిపారు.

పసిడి ధర దిగితే.. దిగుమతే



- స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలున్న దేశాల నుంచి కస్టమ్స్ భారం ఉండదు
- మళ్లీ పెద్దనోట్లు రద్దవుతాయనే కొనుగోళ్లు

ఈనాడు వాణిజ్య విభాగం

బంగారం.. దేశీయులకు ప్రీతిపాత్రమైన ఈ లోహం దిగుమతులు మళ్లీ భారీగా పెరుగుతున్నాయి. అంతర్జాతీయంగా పసిడి ధర తగ్గినప్పుడు, దేశంలోకి దిగుమతి చేసుకోవడం ఎప్పుడూ జరిగే పరిణామమే. వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) వచ్చాక బంగారం ధర భారీగా పెరుగుతుందనే అపోహలు, మళ్లీ పెద్ద నోట్లు (రూ.2,000) రద్దవుతాయనే ఊహాగానాలు, వివాహాది శుభకార్యాలు అధికంగా ఉండటం.. వెరసి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పసిడి దిగుమతులు అధికమయ్యాయి. కొన్ని దేశాలతో ఉన్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల (ఎఫ్‌టీఏ) వల్ల పసిడిపైనా కస్టమ్స్ సుంకం పడనందున, అక్కడ నుంచి ఎక్కువగా తెస్తున్నారు. మాదకద్రవ్యాలు, తీవ్రవాదులకు సహకారం నిరోధించేందుకు దేశ సరిహద్దులతో పాటు నౌకాశ్రయాలు, విమానాశ్రయాల్లో తనిఖీలు పెరిగినందున, పసిడి అక్రమ దిగుమతులు తగ్గుతున్నాయనే చెబుతున్నారు.

అంతర్జాతీయ, దేశీయ ధరల మధ్య తేడా అధికంగా ఉన్నప్పుడే, ఏ సరకు అయినా దొంగచాటుగా (స్మగ్లింగ్) దిగుమతి చేసుకుంటుంటారు. బంగారంపై 10.15 శాతం కస్టమ్స్ సుంకం, మరో 2 శాతం వరకు ఇతర సుంకాలు, ఖర్చుల రూపేణ భారం పడుతున్నాయి.. ఫలితంగా కిలో మేలిమి బంగారం ధర అంతర్జాతీయంగా రూ.26 లక్షల పైన ఉండగా, దేశీయంగా రూ.29 లక్షల పైన ఉంటోంది. అంటే కిలోకు రూ.3 లక్షల మేర ధర ఇక్కడ అధికంగా ఉంటోంది. ఇందువల్లే దొంగచాటుగా తేవడం అధికమవుతోంది. జీఎస్‌టీ అమల్లోకి వచ్చాక, పసిడిపై కస్టమ్స్ సుంకం 10.15 శాతం కొనసాగుతూనే, జీఎస్‌టీ 3 శాతంగా నిర్ణయించారు. అంటే గతంలో కంటే పన్ను భారం 1 శాతం అధికమైంది.

నగదు తగ్గించుకుంటున్నారు: పసిడిపై 13 శాతం పన్ను పడుతున్నా, ఎందుకు కొంటున్నారనే సందేహం వస్తుంది. కారణం.. గత నవంబరులో పెద్ద (రూ.500, 1,000) నోట్ల రద్దు అనంతరం, పాతవి మార్చుకునేందుకు, కొత్తవి పొందేందుకు ఎదురైన కష్టాలు భయపెట్టడమే. సామాన్యుల నుంచి సంపన్నుల వరకు, తమ వద్ద ఉన్న లెక్కలో చూపని నగదు మార్చుకునేందుకు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. దళారులకు 20-30 శాతం మొత్తం అధికంగా ఇచ్చి, కొత్త నోట్లు పొందారు. నోట్ల రద్దు రోజు కూడా బంగారు దుకాణాల్లో అమ్మకాలు వెల్లువెత్తడం గమనార్హం. మళ్లీ ఇప్పుడు రూ.2,000 నోట్లు రద్దవుతాయనే ఊహాగానాలు వస్తున్న నేపథ్యంలో, నగదు ఉంచుకుంటే ఇబ్బందులు తప్పవనే నిర్ణయానికి అత్యధికులు వచ్చేశారు. అందువల్లే రూ.లక్ష, అంతకుమించి నగదు ఉంటే, పసిడి కొంటున్నారని బులియన్ విక్రేతలు చెబుతున్నారు. 20 గ్రాముల నుంచి 100 గ్రాముల వరకు మేలిమి బంగారం కొనుగోళ్లు పెరిగాయని తెలిపారు.

దిగుమతి సుంకం భారం లేనందున..: మన దేశంతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టీఏ) ఉన్న దేశాల నుంచి దిగుమతి అయ్యే ఉత్పత్తులపై సుంకం ఉండదు. ఇక్కడ నుంచి ఎగుమతి చేసినా ఇంతే. ఇవి ఏడాది కేడాది మారుతుంటాయి. ఈ నేపథ్యంలోనే ఇండొనేషియా, మలేసియా నుంచి పసిడి దిగుమతులు ఆగాయి. ఇప్పుడు దక్షిణకొరియా వంతు వచ్చింది. అక్కడ నుంచి వస్తున్న పసిడిపై కస్టమ్స్ సుంకం పడటం లేదు. అందువల్లే అధికారికంగా అక్కడ నుంచి తెస్తున్నారు. ఇక్కడ జీఎస్‌టీ 3 శాతం మాత్రమే పడుతోంది. అందువల్ల అధికారిక దిగుమతులు పెరగడంతో, దిగుమతులు పెరిగినట్లు కనిపిస్తున్నాయి.

ప్రభుత్వ చర్యలు ఇలా

విదేశాల నుంచి దిగుమతి అయ్యే ఉత్పత్తుల ధర, దేశీయ ఉత్పత్తుల కంటే తక్కువ ఉన్నప్పుడు, దేశీయ ధరలతో సమానమయ్యేలా దిగుమతులపై సుంకం (కౌంటర్‌వెయిలింగ్ డ్యూటీ) విధిస్తారు. ఇది పసిడిపై 12.5 శాతంగా ఉండేది. జీఎస్‌టీ వల్ల దీన్ని తొలగించినందున, ఇప్పుడు దిగుమతి అయ్యే పసిడిపై 3 శాతం పన్ను భారమే ఉంటోంది. 2016-17లో దక్షిణ కొరియా నుంచి 470.46 మిలియన్ డాలర్ల పసిడే దిగుమతి కాగా, ఈ ఏడాది జులై 1 నుంచి ఆగస్టు 3 మధ్యే 338.6 మిలియన్ డాలర్ల పసిడి దిగుమతి కావడంతో ప్రభుత్వం అప్రమత్తమై, ఈ విషయంలో దృష్టి సారించింది. 12 టన్నుల పసిడి కొరియా నుంచి అధికారికంగా, పన్ను లేకుండా వచ్చింది.

ప్రభుత్వానికి బులియన్ సంఘాల విన్నపం: కొన్ని దేశాల నుంచి దిగుమతులపై కస్టమ్స్ లేనందున, ధరల్లో తేడా వస్తోందని బులియన్ సంఘాలు ప్రభుత్వానికి విన్నవించాయి. తక్కువకు తెచ్చిన వారు ధర తగ్గించి, విక్రయించగలుగుతున్నారు. పన్నులు కట్టిన వ్యాపారులకు ఇబ్బంది కలుగుతోంది. అందువల్ల కస్టమ్స్ తొలగించి, పూర్తిగా జీఎస్‌టీనే 13 శాతం విధించాలని కోరాయి. స్మగ్లింగ్ నిరోధించాలంటే మాత్రం కస్టమ్స్ సుంకాన్ని 10 శాతం నుంచి 3-4 శాతానికి తగ్గించాలని సూచించాయి. అప్పుడు అంతర్జాతీయ విపణికి, దేశీయ ధరలకు తేడా అధికంగా ఉండదు కనుక, స్మగ్లింగ్ ఆగుతుందని వివరించాయి.

2017-18 ఏప్రిల్-జులైలో పసిడి దిగుమతుల విలువ ..	13.35 బి.డాలర్లు (సుమారు రూ.87,000 కోట్లు)
2016-17 ఏప్రిల్-జులైలో బంగారం దిగుమతులు..	4.97 బి.డాలర్లు (సుమారు రూ.32,300 కోట్లు)
2017 జులైలో దిగుమతి అయిన పసిడి..	2.10 బి.డాలర్లు (రూ.13,700 కోట్లు)
2016 జులైలో వచ్చిన బంగారం విలువ ..	1.07 బి.డాలర్లు (రూ.7,000 కోట్లు)
2016 జులై పసిడి దిగుమతులు..	22 టన్నులు
2017 జులై బంగారం దిగుమతులు..	53.4 టన్నులు
2017 జూన్ పసిడి దిగుమతులు..	72 టన్నులు

పసిడి ధరలు: ఏప్రిల్ నుంచి జులై వరకు అంతర్జాతీయ విపణిలో ఔన్సు (31.10 గ్రాములు) బంగారం ధర 1290 డాలర్ల నుంచి 1220 డాలర్ల మధ్య కదలాడాయి. ధర తగ్గినపుడల్లా, శుభకార్యాల వల్ల దేశీయ కొనుగోళ్లు అధికంగా జరుగుతాయనే అంచనాతో అధికంగా పసిడిని దిగుమతి చేసుకున్నారు.



ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్‌రావత్, వైమానిక దళాధిపతి ఎయిర్‌చీఫ్ మార్షల్ బి.ఎస్.ధనోవాలతో కలసి ఇండియాగేట్ చెంతలోని అమర్ జవాన్ జ్యోతి వద్ద నివాళులర్పిస్తున్న రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్



ఎర్రకోట వద్ద నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొన్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జె.ఎస్.ఖేహర్, మాజీ ప్రధానులు హెచ్.డి.దేవెగౌడ, మన్మోహన్‌సింగ్, కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ తదితరులు



స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొన్న భాజపా అధ్యక్షుడు అమిత్‌షా, కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ, కేంద్ర రవాణామంత్రి నితిన్‌గడ్కరీ తదితరులు



వరదలతో అతలాకుతలమవుతున్నా జాతీయజెండాకు వందనం చేస్తున్న అసోం ప్రజలు

మోదీని ముంచెత్తిన చిన్నారుల ప్రేమ

దిల్లీ: ఆహ్లాదకరమైన వాతావరణం...హాయిగా ప్రశాంతంగా ఉన్న ఉదయపువేళ భారత స్వాతంత్ర్యదిన వేడుకల వేదిక అయిన ఎర్రకోటకు నల్లని రేంజ్ రోవర్ కారులో తరలి వస్తున్న ప్రధానికి అక్కడున్న ఆహూతులంతా కరతాళధ్వనులతో స్వాగతం పలికారు. ముఖ్యంగా అక్కడున్న వేలాది బడిపిల్లలు సంబరంగా చేతులూపుతూ ప్రధానిని స్వాగతించిన దృశ్యం కన్నుల పండువగా ఉంది.

తలపాగా ధరించి రేంజ్‌రోవర్ కారులో నుంచి దిగిన ప్రధాని మోదీని తొలుత రక్షణశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ, సహాయమంత్రి సుభాష్ భమ్రే, రక్షణ కార్యదర్శి సంజయ్ మిత్రాలు ఘనంగా స్వాగతించారు. కార్యదర్శి సంజయ్‌మిత్రా తొలుత ప్రధానికి అక్కడున్న దిల్లీ ప్రాంత సైనిక జనరల్ ఆఫీసర్ కమాండింగ్(జీవోసీ)ను పరిచయం చేశారు. తర్వాత జీవోసీ వెంటరాగా... ముందుకు కదిలిన మోదీ త్రివిధదళాలు, పోలీసుల వందనాన్ని స్వీకరించారు.

భారత సైనిక, వాయుసేన, నౌకాదళాలకు చెందిన ఒక్కో అధికారి, 24 మంది చొప్పున సిబ్బంది సమర్పించిన గౌరవవందనాన్ని స్వీకరించారు. అక్కడి నుంచి ఆయన నేరుగా ఎర్రకోట బురుజు వైపు తరలి వెళ్లారు. సరిగ్గా ఉదయం ఏడున్నర గంటలకు త్రివర్ణ పతాకాన్ని ప్రధాని ఎగురవేశారు. అదే సమయంలో ఎలీట్ 2281 ఫీల్డ్ రెజిమెంట్ (సెరిమోనియల్) కు చెందిన సైనికులు గౌరవ సూచకంగా 21 పర్యాయాలు శతఘ్నులు పేల్చారు. వాయుసేన బ్యాండ్ భారత జాతీయ గీతాన్ని అద్భుతంగా వాయించారు. అనంతరం ప్రధాని ఎర్రకోట బురుజుల నుంచి 57 నిముషాల పాటు ప్రసంగించారు. ఆయన బుల్లెట్ ప్రూఫ్ వేదిక కాకుండా సాధారణ వేదిక నుంచే ప్రసంగం కొనసాగించారు.



అశేష జనవాహినిని ఉద్దేశించి ఎర్రకోటపై ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

ప్రధాని చుట్టూ చిన్నారుల వెల్లువ

ఎర్రకోట నుంచి ప్రసంగం పూర్తయిన వెంటనే తన వాహనశ్రేణిలో వెనుదిరిగి వెళుతున్న ప్రధాని ఒక్కచోట హఠాత్తుగా ఆగిపోయారు. చిన్నారులకు కేటాయించిన ఎన్‌క్లోజర్ నుంచి వెలువడుతున్న హర్షధ్వానాలు...ఆయనను చూడగానే వారిలో పెల్లుబికిన ఆనందోత్సాహాలు చూసిన ప్రధాని ఒక్క క్షణం మైమరచిపోయారు. వెంటనే వాహనం దిగి...భద్రతా వలయాన్ని తప్పించుకుని ముందుకు చిన్నారుల్లోకి వెళ్లిపోయారు. ప్రధాని రావడాన్ని చూసిన పిల్లల సంబరానికి అంతే లేకపోయింది. ఒక్కసారిగా కేరింతలు కొడుతూ...ఆయనతో కరచాలనం చేయడానికి వారు పోటీలు పడ్డారు.

మోదీ ప్రసంగం నిస్సారం: విపక్షం

దిల్లీ, శ్రీనగర్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ మంగళవారం చేసిన ప్రసంగంపై విపక్షం పెదవి విరిచింది. ఇది అత్యంత నిరుత్సాహాన్ని కలిగించిందని కాంగ్రెస్ విమర్శించగా, మోదీ ప్రసంగం ఏమాత్రం ఆకట్టుకునేలా లేదని వామపక్షం పేర్కొంది. వేర్పాటువాదం, ఉగ్రవాదాలతో పాటు సమాజంలో విద్వేషాన్ని రగిల్చే అన్ని రకాల శక్తులపై భారతీయులంతా ముక్తకంఠంతో పోరాటం చేయాలని కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఆమె పతాకావిష్కరణ చేశారు.

సాహసవీరుల వెబ్‌సైట్‌ను ఆవిష్కరించిన ప్రధాని

దిల్లీ: స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి సాహస పురస్కార గ్రహీతల గౌరవార్థం వారి వివరాలతో ప్రత్యేక వెబ్‌సైట్‌ను ప్రధాని మోదీ మంగళవారం ఆవిష్కరించారు. ఇందులో అసమాన ధైర్య సాహసాలను ప్రదర్శించిన స్త్రీ, పురుషులు.. పౌరులు, సైనిక సిబ్బంది వీరోచిత గాథలను పొందుపరిచారు. సాహస పురస్కారాలను అందుకున్న మన హీరోల జ్ఞాపకాలతో ఈ వెబ్‌సైట్‌ను ఆవిష్కరించినట్లు అనంతరం మోదీ ట్వీట్ చేశారు. వారి కథలను పోర్టల్ http://gallantryawards.gov.inలో చూడవచ్చని తెలిపారు.

మిఠాయిలు పంచుకున్న భారత్, చైనా సైనికులు

గ్యాంగ్‌టక్: భారత్, చైనాల మధ్య డోక్లాం విషయమై తీవ్ర ప్రతిష్టంభన కొనసాగుతున్నప్పటికీ అక్కడికి 25 కి.మీ దూరంలో ఉన్న నాథులాలో దీనికి భిన్నమైన పరిస్థితి మంగళవారం నాడు ఆవిష్కృతమైంది. భారత దేశ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నాథులా సరిహద్దుల్లోని ఇరు దేశాల సైనికులు పరస్పరం మిఠాయిలు పంచుకుని అభినందనలు తెలుపుకున్నారు. ప్రతి ఏడాది ఆగస్టు 15న ఇరు దేశాల సైనికాధికారులు భేటీ అవుతుంటారు. అయితే, ఈ దఫా డోక్లాం ఉద్రిక్తత కారణంగా అలాంటి సమావేశం జరగకపోయినా ఇరు దేశాల సైనికులు అనధికారికంగా మిఠాయిలు పంచుకోవటం విశేషం. నాథులాలోని స్థానికులకూ భారతీయ సైనికులు, ఇండో టిబిటెన్ సరిహద్దు బలగాలు(ఐటీబీపీ) మిఠాయిలు పంచిపెట్టారు.

ఆరేళ్ల చిన్నారి ఆదర్శం

శ్రీనగర్: సరిగ్గా ఏడాది క్రితం ఆమె తండ్రి ఉగ్రవాదులపై పోరులో ప్రాణాలు కోల్పోయారు. అంతకు కొద్దిసేపటి క్రితమే ఆయన శ్రీనగర్‌లోని సీఆర్పీఎఫ్ శిబిరంలో జాతీయ జెండాను ఎగురవేశారు. అమరుడైన ఆ అధికారే సీఆర్పీఎఫ్ కమాండర్ ప్రమోద్ కుమార్. మరణానంతరం ఆయనకు కేంద్ర ప్రభుత్వం కీర్తిచక్ర అవార్డును ప్రకటించింది. మంగళవారం అదే సీఆర్పీఎఫ్ శిబిరంలో ప్రమోద్ కుమార్ ఆరేళ్ల కుమార్తె ఆర్నా, భార్య నేహ త్రిపాఠీలు త్రివర్ణపతాకాన్ని ఎగురవేసి జవాన్లకు మిఠాయిలు పంచిపెట్టారు. ఉగ్ర మూకల ఏరివేతలో కష్టనష్టాలకు బెదరవద్దనే సందేశమిచ్చారు.

పాలకాడ్‌లో జెండా ఎగురవేసిన భగవత్

పాలకాడ్/దిల్లీ: కేరళలోని సీపీఎం ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరిస్తూ.. ఆర్ఎస్ఎస్ అధిపతి మోహన్ భగవత్ పాలకాడ్‌లోని ఓ పాఠశాలలో మంగళవారం జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఇక్కడి కర్నగి అమ్మన్ పాఠశాల ప్రభుత్వ ఎయిడెడ్‌ది కావడంతో ప్రజా ప్రతినిధులు లేదా పాఠశాలకు చెందినవారే జెండా ఎగురవేయాలంటూ జిల్లా కలెక్టర్ పి.మేరీకుట్టీ సోమవారం రాత్రి ఆదేశాలిచ్చారు. అయితే భగవత్‌కు ఉన్న రాజ్యాంగ హక్కుల రీత్యా ఆయనచే జాతీయ పతాకావిష్కరణ చేయించాలని పాఠశాల యంత్రాంగం నిర్ణయించినట్లు ఆర్ఎస్ఎస్ ఒక ప్రకటనలో పేర్కొంది. సీపీఎం ప్రభుత్వం నిస్సిగ్గుగా ఇలాంటి ప్రయత్నాలు చేస్తోందంటూ ఆర్ఎస్ఎస్ అఖిల భారతీయ ప్రచార ప్రముఖ్ మన్మోహన్ వైద్య మండిపడ్డారు. స్వాతంత్ర్య దినోత్సవాలను జరుపుకోవడం పౌరుల ప్రాథమిక హక్కని.. దాన్ని ప్రభుత్వం నిరాకరించలేదని పేర్కొన్నారు. కేరళలో విభజన రాజకీయాలను కొనసాగిస్తోందని విమర్శించారు. కాగా ఈ విషయమై అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. కేసు నమోదు చేయాలని పోలీసులకు ఆదేశిస్తామన్నారు. ఆర్ఎస్ఎస్ రెండు రోజుల సమావేశాలు సోమవారం నుంచి కేరళలో జరుగుతుండగా.. వాటి కోసం భగవత్ రాష్ట్రంలోనే ఉన్నారు.

చైనా ఉత్పత్తులను బహిష్కరించండి: ఆర్ఎస్ఎస్

ఇండోర్: వెల్లువలా వచ్చి పడుతున్న చైనా ఉత్పత్తులను బహిష్కరించి.. స్వదేశీ వస్తువులనే వినియోగించాలని ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి సురేష్ భయ్యాజీ జోషి పిలుపునిచ్చారు. భారత్-చైనాల మధ్య ఉద్రిక్తతల వేళ.. ఆయన ఇక్కడ స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో వివిధ కళాశాలల విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. సరిహద్దుల్లో మన సైన్యం పూర్తి సామర్థ్యంతో అప్రమత్తంగా ఉందని.. అలాగే మనం కూడా ఏ దేశ ఆర్థిక బానిసత్వం కిందకు వెళ్లకుండా కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

సర్కార్ ప్రసంగాన్ని ప్రసారం చేయలేదేం: ఏచూరి

దిల్లీ: త్రిపుర ముఖ్యమంత్రి మానిక్ సర్కార్ ప్రసంగాన్ని ప్రసారం చేసేందుకు దూరదర్శన్ తిరస్కరించిందంటూ సీపీఎం మంగళవారం తీవ్రంగా ఆరోపించింది. ఈ తరహా 'అప్రకటిత అత్యయక పరిస్థితి'ని తాము వ్యతిరేకిస్తున్నామని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చెప్పారు. దూరదర్శన్ అనేది భాజపా-ఆరెస్సెస్‌ల ప్రయివేటు ఆస్తి ఏమీ కాదని ఆయన ఆరోపించారు. ప్రతిపక్షాల గళాన్ని నొక్కేయాల్సిందిగా ప్రధానమంత్రి తన అనుయాయులను ఆదేశిస్తున్నారంటూ ఏచూరి మండిపడ్డారు. ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగాన్ని ప్రసారం చేయడానికి ఆల్ ఇండియా రేడియో...దూరదర్శన్‌లు నిరాకరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సీపీఎం పొలిట్‌బ్యూరో మంగళవారం నాడిక్కడ ఒక ప్రకటనలో పేర్కొంది.

చాలామంది కూర్చుని లేవనేలేదు!

శ్రీనగర్: జమ్మూ-కశ్మీర్‌లో ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ జెండా ఎగురవేసిన ప్రధాన కార్యక్రమానికి హాజరైన వారిలో చాలామంది జాతీయగీతాలాపన సమయంలో నిల్చోకుండా కూర్చునే ఉన్నారు. శ్రీనగర్‌లోని బక్షి స్టేడియంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవానికి ప్రజల హాజరు కూడా పలుచగానే ఉంది. ప్రముఖులకు కేటాయించిన ప్రాంతంలో ఉన్న హైకోర్టు న్యాయమూర్తులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు, రాజకీయ పార్టీల నాయకులు మాత్రం జాతీయగీతానికి గౌరవసూచకంగా లేచి నిల్చున్నారు. మిగతా ప్రాంతాల్లో ఉన్నవారిలో ఎక్కువమంది కూర్చునే ఉండిపోయారు.

యూపీ మదర్సాల్లో స్వాతంత్ర్య దినోత్సవాలు

- బరేలీలో జాతీయగీతాలాపనకు కొన్ని దూరం!

లఖ్‌నవూ: ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని లఖ్‌నవూలోని మదర్సాల్లో (ఇస్లామిక్ పాఠశాలలు) మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవాలను నిర్వహించారు. జాతీయగీతాలాపనతో పాటు, జెండాను ఎగురవేశారు. మదర్సాల్లో నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవాలను వీడియో తీయాలంటూ ఇటీవల యూపీ ప్రభుత్వం ఆదేశాలిచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కొంత గందరగోళం నెలకొన్నప్పటికీ చాలామేర మదర్సాలు ప్రభుత్వ ఆదేశాలను పాటించాయి. కొన్ని మాత్రం ఈ విషయమై తమకు అధికారిక సమాచారమేదీ లేదని తెలిపాయి. మదర్సాల్లో సంప్రదాయబద్ధంగా స్వాతంత్ర్య దినోత్సవాలను నిర్వహించినట్లు దారుల్ ఉలోమ్ ఫిరంగిమహల్ అధిపతి, అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డు సభ్యుడు మౌలానా ఖలీద్ రషీద్ ఫిరంగిమహ్లి తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులతో ఈ అంశానికి అనవసర ప్రాధాన్యం ఏర్పడిందని.. మదర్సాలు ఏటా స్వాతంత్ర్య సంబరాలను జరుపుతున్నాయన్నారు. కాగా బరేలీ ప్రాంతంలో అత్యధిక మదర్సాలు ఉత్సవాలను నిర్వహించినప్పటికీ కొన్ని జాతీయగీతాలాపన చేయలేదు. ఈమేరకు మదర్సాల్లో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవాల్లో వీడియో చిత్రీకరణ, జాతీయ గీతాలాపన తదితర అంశాలపై ప్రభుత్వానికి నివేదిక పంపించినట్లు బరేలీ మైనారిటీ సంక్షేమ అధికారి జగ్మోహన్ సింగ్ తెలిపారు.

'బ్లూ వేల్' సమాచారాన్ని తొలగించండి

- గూగుల్, ఫేస్‌బుక్‌లను కోరిన కేంద్రం

దిల్లీ: ఆత్మహత్యలకు పురిగొల్పేలా ఉన్న 'బ్లూ వేల్ ఛాలెంజ్' అనే అంతర్జాల క్రీడకు సంబంధించిన సమాచారం, వెబ్ లింక్‌లను తక్షణమే తొలగించాలని గూగుల్, ఫేస్‌బుక్, వాట్సాప్ తదితర సంస్థలను కేంద్ర ప్రభుత్వం కోరింది. ఈ మేరకు కేంద్ర ఎలక్ట్రానిక్స్, సాంకేతిక సమాచార శాఖ ఆయా సంస్థలకు లేఖలు రాసింది. ఆగస్టు 11వ తేదీతో ఉన్న ఈ లేఖలు ఇన్‌స్టాగ్రామ్, మైక్రోసాఫ్ట్, యాహూ సంస్థలకు కూడా అందాయి. బ్లూవేల్ ఛాలెంజ్ కారణంగా భారత్‌లో కొందరు చిన్నారులు ఆత్మహత్యలు చేసుకున్నట్లుగా నివేదికలు వస్తున్న నేపథ్యంలో.. ఈ తరహాలో ఉన్న అన్ని గేమ్‌లకూ సంబంధించిన సమాచారాన్ని తక్షణమే తొలగించాలని కోరుతున్నట్లు లేఖలో కేంద్రం పేర్కొంది.

కేరళలో బాలుడి ఆత్మహత్యపై విచారణ: కేరళలో ఓ బాలుడి ఆత్మహత్యకు బ్లూ వేల్ ఛాలెంజ్ కారణమై ఉండొచ్చని అతడి తల్లిదండ్రులు సందేహాలు వ్యక్తం చేయడంతో.. అదే కోణంలో రాష్ట్ర పోలీసులు విచారణను ప్రారంభించారు. జులై 26న విలప్పిశాలలో 16ఏళ్ల సదరు బాలుడు ఉరివేసుకుని మరణించాడు. గతేడాది బాలుడు బ్లూవేల్ గేమ్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నాడని అతడి తల్లి మంగళవారం మీడియాకు తెలిపారు. గేమ్ ఆఖరి దశలో హత్య లేదా ఆత్మహత్యకు పాల్పడాల్సి ఉంటుందని అతడు వివరించగా.. తాను అలాంటి క్రీడను ఆడవద్దని కోరానని అన్నారు.

భారతీయతే మనకు గర్వకారణం

- దేశంలో అందరం సమానమే: సీజేఐ జస్టిస్ జేఎస్ ఖేహర్ స్వాతంత్ర్యదినోత్సవ సందేశం

దిల్లీ: రాజ్యాంగం దేశ పౌరులందరికీ సమానమైన స్వేచ్ఛ స్వాతంత్ర్యాలను, అవకాశాలను కల్పించిందని... కులమతాలు, వర్గాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ తాము భారతీయులమని గర్వించాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేఎస్ ఖేహర్ అన్నారు. మంగళవారం దిల్లీలో సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ నిర్వహించిన స్వాతంత్ర్యదిన వేడుకల్లో ఆయన తన సందేశమిచ్చారు. హిందువులు, ముస్లింలు, క్రిస్టియన్లు, బౌద్ధులు, జైనులు...ఎవరి మత విశ్వాసం వారికి గర్వకారణమేనని, అదే సమయంలో భారతీయులుగా కూడా గర్వపడాలని..రాజ్యాంగం అందించే సందేశమిదేనని జస్టిస్ ఖేహర్ తెలిపారు. కెన్యాలో జన్మించిన తాను తొలుత భారత దేశ పౌరుడిని కానని వెల్లడించారు. దేశ పౌరసత్వం పొందిన తర్వాత అందరితో సమానమైన అవకాశాలు లభించాయని తెలిపారు. దేశ పౌరుడిగా ఒకరి కంటే తక్కువనో, ఎక్కువనో భావించవద్దు. అందరూ అందరితో సమానమేనన్నారు. "దళితుడైన మన రాష్ట్రపతి బాల్యం ఓ పూరి గుడిసెలో గడిచింది. రైతు బిడ్డ అయిన ఉపరాష్ట్రపతి పార్టీ పోస్టర్లను అతికిస్తూ రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. మన ప్రధాన మంత్రి ఒకానొక దశలో తేనీటిని విక్రయించారు. భారత ప్రధాన న్యాయమూర్తి ఒకప్పుడు దేశ పౌరుడు కాదు. దేశ పౌరసత్వం లభించిన తర్వాత ఆయన అందరితో సమానమే. సమాన అవకాశాలను అందుకున్నారు. పౌరసత్వం, స్వాతంత్ర్యం అంటే ఇదే. తమ ఆశలు, ఆశయాలు, ఆకాంక్షలు సాధించుకునే స్వేచ్ఛ ప్రతి ఒక్కరికీ ఉంది" అని జస్టిస్ ఖేహర్ వివరించారు. కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ...మత రాజ్యంగా అవతరించకపోవటమే స్వాతంత్ర్య భారత దేశం సాధించిన ప్రధాన విజయాల్లో ఒకటని తెలిపారు. రుగ్వేద కాలం నుంచే లౌకిక భావం మన దేశంలో ఒక ప్రవాహంలా ఉందని చెప్పారు.



ప్రపంచంలోనే అతిపెద్దదైన హెచ్‌డీ వీడియో తెర(556 చదరపు మీటర్లు) గల సింగపూర్‌లోని సన్‌టెక్ కన్వెన్షన్ సెంటర్‌లో కనువిందు చేసిన జాతీయ పతాకం రెపరెపలు

విదేశాల్లోనూ త్రివర్ణ రెపరెపలు

బీజింగ్/మెల్‌బోర్న్: భారతదేశ 71వ స్వాతంత్ర్య దినాన్ని పురస్కరించుకుని విదేశాల్లోని భారతీయులు పెద్ద ఎత్తున వేడుకలు నిర్వహించుకున్నారు. దౌత్య కార్యాలయాల్లో త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. చైనా, ఆస్ట్రేలియా, జపాన్, సింగపూర్, ఈజిప్ట్, ఇజ్రాయెల్, దక్షిణాఫ్రికా, యూఏఈ తదితర దేశాల్లో వేడుకలు ఘనంగా జరిగాయి. యూకేలో స్వాతంత్ర్య పరుగు నిర్వహించారు.

అన్ని రాష్ట్రాల్లో ఘనంగా సంబరాలు: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో, కేంద్రపాలిత ప్రాంతాల్లో భారీ భద్రత ఏర్పాట్ల నడుమ ఘనంగా సంబరాలు నిర్వహించారు.

ప్రధానికి విదేశీ నేతల శుభాకాంక్షలు

దిల్లీ: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశ ప్రజలకు, ప్రధానమంత్రి నరేంద్రమోదీకి వివిధ దేశాల నేతలు శుభాకాంక్షలు తెలిపారు. వీరిలో కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, ఖతార్ ఎమిర్- షేక్ తమీమ్ బిన్ హమద్ అల్ థాని, అఫ్గానిస్థాన్ అధ్యక్షుడు అష్రఫ్ ఘనీ, శ్రీలంక అధ్యక్షుడు మైత్రీపాల సిరిసేన, భూటాన్ ప్రధాని టాబ్గే తదితరులు ఉన్నారు. వీరందరికీ ప్రధాని ట్విటర్ ద్వారా కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయ పర్వదినాన కీచక పర్వం

- పట్టపగలే బాలికపై అత్యాచారం

చండీగఢ్: దేశ ప్రజలందరికీ పవిత్ర దినమైన ఆగస్టు 15న ఓ ఘోరం జరిగిపోయింది. పాఠశాలలో త్రివర్ణ పతాక ఆవిష్కరణకు వెళ్తున్న పన్నెండేళ్ల బాలికను ఓ కామాంధుడు అపహరించుకుపోయి పట్టపగలే కాటేశాడు. యావత్తు దేశం తలదించుకునేలా చేసిన ఈ ఘటన చండీగఢ్ నగరంలోని సెక్టార్ 23లో చోటుచేసుకుంది. ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న స్వాతంత్ర్య దిన వేడుకలకు హాజరయ్యేందుకు 8వ తరగతి విద్యార్థిని వెళుతుండగా సాయుధుడైన ఓ వ్యక్తి అపహరించుకుపోయాడు. సెలవుకారణంగా నిర్మానుష్యంగా ఉన్న చిల్డ్రన్స్ ట్రాఫిక్ పార్కులోకి తీసుకెళ్లి అత్యాచారం చేసి పరారయ్యాడు. జరిగిన ఘోరాన్ని ఆ చిన్నారి తల్లిదండ్రులకు తెలుపగా వారి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడి కోసం గాలిస్తున్నారు. ఐఏఎస్ అధికారి కుమార్తెను రాజకీయ నాయకుడి కుమారుడు వెంబడించి వేధించిన ఘటనపై ప్రజాగ్రహం చల్లారక ముందే మరో ఘోరం నగరంలో, అదీ పట్టపగలే జరగటంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శ్రీశ్రీ రవిశంకర్ చొరవతో 68 మంది తీవ్రవాదుల లొంగుబాటు

ఇంఫాల్: ఈశాన్య రాష్ట్రాల్లో శాంతిస్థాపన కోసం 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' (ఏవోఎల్) వ్యవస్థాపకులు శ్రీశ్రీ రవిశంకర్ గత కొన్నేళ్లుగా చేస్తున్న కృషి కారణంగా మణిపూర్‌లో 68 మంది తీవ్రవాదులు సోమవారం ప్రభుత్వానికి లొంగిపోయారు. ఆయుధాలు, మందుగుండు సామగ్రిని అప్పగించారు. కరడుగట్టిన 11 తీవ్రవాద సంస్థలకు చెందిన సభ్యులు లొంగిపోయేలా చేసినందుకు ఆయనకు మణిపూర్ ముఖ్యమంత్రి బీరేన్‌షా కృతజ్ఞతలు తెలిపారు. తీవ్రవాద సంస్థలతో ప్రభుత్వం త్వరలోనే ఒక ఒప్పందం కుదుర్చుకునే అవకాశాలున్నాయి.

మాజీ ఉద్యోగిపై అబద్ధాలు చెప్పిన సంస్థకు రూ.18.77 కోట్లు జరిమానా

- సింగపూర్‌లో భారత సంతతి వ్యక్తికి అనుకూల తీర్పు

సింగపూర్: ఓ మాజీ ఉద్యోగి పనితీరుపై తప్పుడు సమాచారం ఇచ్చిన సంస్థ ఏకంగా రూ.18.77 కోట్లు (నాలుగు మిలియన్ల సింగపూర్ డాలర్లు) పరిహారం చెల్లించాల్సి వచ్చింది. సింగపూర్‌లో భారత సంతతికి చెందిన 47ఏళ్ల రమేశ్ కృష్ణన్.. 'ఆక్సా ఇన్సూరెన్స్'లో సలహాదారుగా పనిచేశారు. సంస్థ అత్యుత్తమ సలహాదారుల్లో ఒకరిగా ఆయన కొనసాగారు. అయితే 2012లో ఆయన సంస్థను వీడి వేరే ఉద్యోగం వెతుక్కున్నారు. దీంతో ఆయన పనితీరుపై 'ఆక్సా' నుంచి కొత్త సంస్థ సమాచారం కోరింది. దీనికి ఆక్సా ప్రత్యుత్తరమిస్తూ.. 'రమేశ్ 13 నెలల పనితీరు చాలా నిరాశాజనకంగా ఉండేది. ఖాతాదారుల్లో చాలా మంది ఆయన్ను వదిలిపోయేవారు. ఖాతాదారులకు ఆయన తగినవిధంగా తోడ్పడుతున్నారో లేదోనని మేం ఆందోళన పడేవాళ్లం'అని తెలిపింది. దీనిపై రమేశ్ హైకోర్టును ఆశ్రయించారు. అయితే కేసు నిలబడలేదు. అనంతరం అప్పీళ్ల కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీంతో ఆయనపై అబద్ధాలు చెప్పినందుకు భారీ మూల్యం చెల్లించాలని ఆక్సాను కోర్టు ఆదేశించింది.

లద్దాఖ్‌లో చైనా సైన్యం చొరబాటు యత్నం

- రెండు సార్లు అడ్డుకుని వెనక్కు పంపించిన భారత జవాన్లు

లేహ్/దిల్లీ: డోక్లాం ప్రతిష్టంభన ఒకవైపు కొనసాగుతుండగానే మరోవైపు చైనా సైనికులు లద్దాఖ్ ప్రాంతంలో రెండు మార్లు భారత భూభాగంలోకి చొరబడే యత్నం చేశారు. అయితే, వారి ప్రయత్నాలను భారతీయ జవాన్లు సమర్థంగా నిలువరించారు. ఈ సందర్భంగా రెండు పక్షాల మధ్య జరిగిన రాళ్ల దాడిలో ఇరువైపుల వారికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రసిద్ధ ప్యాంగాంగ్ సరస్సు సమీపంలో ఈ ఘటనలు జరిగాయి. మంగళవారం ఉదయం 6గం.లు, 9 గం.ల సమయంలో చైనా సైనికులు రెండు సార్లు భారత భూభాగంలోకి చొరబడుతుండగా భారత జవాన్లు మానవహారంగా ఏర్పడి వారు వస్తున్న మార్గాన్ని అడ్డుకున్నారు. స్వల్ప ఘర్షణ అనంతరం రెండు దేశాల సైనికులు బ్యానర్ డ్రిల్ చేపట్టి ఎవరి స్థావరాలకు వారు తిరిగివెళ్లారు.



ఏ చీర కట్టుకోవాలో చెప్పండి ప్లీజ్

- ట్విట్టర్‌లో సలహా కోరిన అమెరికా దౌత్యవేత్త మేరీకే కార్ల్‌సన్

దిల్లీ: భారత్‌లో అమెరికా దౌత్యవేత్తగా పనిచేస్తున్న మేరీకే కార్ల్‌సన్‌పై దేశవ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. భారతీయ సంప్రదాయాన్ని గౌరవిస్తూ ఆగస్టు 15న ఆమె చీరలు ధరించడాన్ని ట్విట్టర్‌లో అందరూ కొనియాడుతున్నారు. భారత స్వాతంత్ర్య వేడుకల్లో చీర ధరించి పాల్గొనాలనుకుంటున్నానని, ఏది ధరిస్తే బాగుంటుందో మీరే సలహా ఇవ్వండి ప్లీజ్ అంటూ ట్విట్టర్‌లో '÷శారీసెర్చ్' పేరిట ఆమె ఓ విన్నపం చేశారు. పలు రకాల చీరలు కట్టుకుని, వీడియోలను రూపొందించి తన ట్విట్టర్ ఖాతాలో ఉంచారు. అంతిమంగా ఆగస్టు 4 నుంచి నాలుగు రకాల చీరలు జామ్‌దానీ, దుపియన్, కాంజీవరమ్, టస్సర్‌లను ఫైనల్ చేశారు. ఇందులో ఏదో ఒక్కటి సూచిస్తే, అదే కట్టుకుంటానన్నారు మేరీ. దీనిపై దాదాపు 2000 వేల మంది ట్విట్టర్‌లో స్పందించారు. ఎక్కువమంది కోరిక మేరకు కాంజీవరమ్ చీరతో ఎర్రకోట వద్ద మంగళవారం జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ ఫొటోను మంగళవారం తన ట్విట్టర్ ఖాతాలో ఉంచగా, 150 మందికిపైగా రీట్వీట్ చేశారు. తరువాత ఎక్కువమంది సూచించిన టస్సర్ చీర ధరించి, రాష్ట్రపతిభవన్‌లో జరిగిన 'ఎట్ హోం' వేడుకలో పాల్గొన్నారు.

ట్రంప్ సలహా మండలికి దెబ్బ

- రాజీనామా చేసిన ముగ్గురు సీఈవోలు

న్యూయార్క్: హింసకు దారితీసిన శ్వేతజాతీయుల ర్యాలీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తొలుత ఉదాసీనంగా స్పందించడం పట్ల ఆయన బృందంలోనే నిరసనలు వ్యక్తమయ్యాయి. తయారీ రంగంపై అధ్యక్షుడి సలహా మండలిలో సభ్యులైన మెర్క్ ఫార్మా, ఇంటెల్, అండర్ ఆర్మర్ సంస్థల ముఖ్య కార్యనిర్వహణాధికారులు(సీఈవోలు) కెన్నెత్ ఫ్రేజియర్, బ్రియన్ క్రజానిక్, కెవిన్ ప్లాంక్ వారి సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఇటీవల వర్జీనియా రాష్ట్రంలోని చార్లెట్స్‌విల్లేలో శ్వేత జాతీయుల ర్యాలీ, దానికి ప్రతిగా జాతివివక్ష వ్యతిరేక ర్యాలీ జరిగాయి. జాతివివక్ష వ్యతిరేకుల పైకి నాజీ సానుభూతిపరుడిగా అనుమానిస్తున్న ఒకడు కారుతో దూసుకెళ్లడంతో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. 19 మంది గాయపడ్డారు. హింసపై ట్రంప్ తొలుత స్పందిస్తూ- దీనికి 'చాలా కోణాలు' ఉన్నాయంటూ చేసిన వ్యాఖ్యలు పెద్దయెత్తున విమర్శలకు దారితీశాయి.

పోరాడేవారిని గౌరవించాలి: బ్రియన్ క్రజానిక్: తయారీ రంగానికి పూర్వ వైభవం సాధించడమనేది గొప్ప క్రతువని, రాజకీయాల వల్ల ఈ అంశం ప్రాధాన్యం కోల్పోతోందని బ్రియన్ క్రజానిక్(ఇంటెల్) అభిప్రాయపడ్డారు. ఈ అంశం కంటే తమతో విభేదించేవారిపై దాడికి దిగడమే ప్రభుత్వంలోని చాలా మందికి ముఖ్యమైపోయిందని మండిపడ్డారు. సమానత్వం, ఇతర మౌలిక విలువల కోసం పోరాడేవారిని గౌరవించాలని, వారిపై దాడి చేయడం తగదని చెప్పారు. తమ సంస్థ వినూత్న ఆవిష్కరణలు, క్రీడల వ్యవహారాల్లో పాలుపంచుకొంటుందేగాని రాజకీయాల్లో కాదని కెవిన్ ప్లాంక్(అండర్ ఆర్మర్) వ్యాఖ్యానించారు.

ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతిని పెంపొదిద్దాం

వాషింగ్టన్: ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, సుస్థిరతలను పెంపొందించాలని ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంకల్పించారు. ఈ దిశగా కృషి చేసేందుకు మంత్రుల స్థాయిలో చర్చలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ చర్చలతో అమెరికా-భారత్ వ్యూహాత్మక సంప్రదింపుల స్థాయి పెరుగుతుందని అధ్యక్ష భవనం వైట్‌హౌస్ మంగళవారం తెలిపింది. భారత స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో సోమవారం రాత్రి మోదీతో ట్రంప్ ఫోన్‌లో సంభాషించారు. అమెరికా నుంచి భారత్‌కు తొలిసారిగా చేపట్టనున్న ముడిచమురు తరలింపు గురించి ప్రస్తావించారు. నవంబరులో భారత్‌లో జరిగే అంతర్జాతీయ వ్యవస్థాపకత(ఎంట్రిప్రెన్యూయర్‌షిప్) సదస్సు కోసం ట్రంప్, మోదీ ఎదురుచూస్తున్నట్లు వైట్‌హౌస్ తెలిపింది. ఉత్తర కొరియా సమస్యను ఎదుర్కొనేందుకు ప్రపంచ దేశాలను ఏకతాటిపైకి తేవడంలో బలమైన నాయకత్వం అందిస్తున్నారంటూ అమెరికా అధ్యక్షుడికి మోదీ కృతజ్ఞతలు తెలిపారు. భారతీయులకు అమెరికా విదేశాంగ మంత్రి రెక్స్ టిలర్‌సన్ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.



వెర్రితలలు వేస్తున్న జాతి వివక్ష

వర్జీనియా: అమెరికాలో శ్వేత, నల్ల జాతీయుల మధ్య వివక్ష పెరిగిపోతోంది. శనివారం చార్లొట్స్‌విల్లేలో జరిగిన ర్యాలీ హింసాత్మకంగా మారిన సంగతి విదితమే. అప్పటి నుంచి దేశం కోసం పోరాడిన అమరుల విగ్రహాలు ఎక్కడ కనిపించినా తమ జాతికి చెందినవి కాదంటూ విచ్చలవిడిగా ధ్వంసం చేస్తున్నారు. నార్త్ కరోలినాలోని దుర్హంలో గల పాత దుర్హం కౌంటీ కోర్ట్‌హౌస్ వద్ద విగ్రహాన్ని పడగొట్టి ఫొటోకు పోజు ఇస్తున్న అరాచకవాదిని చిత్రంలో చూడవచ్చు.

ఈనాడు సినిమా


అనుష్క

'భాగమతి' ముస్తాబులు

'అరుంధతి', 'రుద్రమదేవి', 'సైజ్ జీరో'.... ఇలా కథానాయిక ప్రాధాన్యం ఉన్న కథలకు కేరాఫ్‌గా నిలిచింది అనుష్క. ఇప్పుడు 'భాగమతి'గా ముస్తాబు అవుతోంది. 'పిల్ల జమిందార్'తో ఆకట్టుకొన్న అశోక్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. యూవీ క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తోంది. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. విజువల్ ఎఫెక్ట్స్‌కి ప్రాధాన్యం ఉన్న కథ ఇది. సాంకేతికంగా ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నారు. త్వరలో ఫస్ట్‌లుక్ విడుదల చేసే పనిలో ఉంది చిత్రబృందం. కళా దర్శకుడు ఎస్.రవీందర్ ఈ చిత్రం కోసం హైదరాబాద్‌లో ఓ ప్రత్యేకమైన సెట్‌ని తీర్చిదిద్దారు. అందులోనే కీలక దృశ్యాల్ని తెరకెక్కించారు. 'భాగమతి' పేరుని చూసి, ఇది చారిత్రక నేపథ్యం ఉన్న కథ అనుకొన్నారు. అయితే... ఇది పక్కా కమర్షియల్ చిత్రమేనని అనుష్క గెటప్, ఆమె నటన కొత్తగా ఉండబోతున్నాయని చిత్రబృందం తెలిపింది. అక్టోబరులో 'భాగమతి' ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలున్నాయి.

ఊళ్ల కోసం రోడ్లు కానీ... రోడ్ల కోసం ఊళ్లు కాదు!
చిత్రం: సొంత ఊరు
- పంపినవారు: జొన్నాదుల నిహారిక, తెనాలి

పంచ్ డైలాగ్


ప్రభాస్

ప్రభాస్‌తో శ్రద్ధాకపూర్


శ్రద్ధా కపూర్

'సాహో'లో ప్రభాస్ సరసన నటించే కథానాయిక ఎవరనే ఉత్కంఠకి తెర పడింది. ఆ అవకాశాన్ని బాలీవుడ్ భామ శ్రద్ధాకపూర్ సొంతం చేసుకొంది. సుజీత్ దర్శకత్వం వహిస్తున్న 'సాహో' తెలుగు, తమిళం, హిందీలో తెరకెక్కబోతోంది. యువీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. మొదట్నుంచీ ఈ సినిమా కోసం బాలీవుడ్ భామని ఎంచుకొనే ప్రయత్నంలో ఉంది చిత్రబృందం. పలువురు కథానాయికల్ని పరిశీలించాక శ్రద్ధాకపూర్‌ని ఎంపిక చేశారు. 'ఆషికి 2'తో పాటు పలు హిందీ చిత్రాల్లో నటించి పేరు తెచ్చుకొంది శ్రద్ధ. ఆమె తెలుగులో నటిస్తున్న తొలి చిత్రం 'సాహో'నే. యాక్షన్‌కి ప్రాధాన్యమున్న ఈ చిత్రం కోసం అంతర్జాతీయ సాంకేతిక నిపుణులు పనిచేస్తున్నారు. విదేశాల్లో యాక్షన్ సన్నివేశాల్ని తెరకెక్కించబోతున్నారు. ప్రభాస్ స్టైలిష్‌గా, ఇదివరకటి కంటే భిన్నంగా తెరపై సందడి చేస్తారని చిత్రబృందం చెబుతోంది. సంగీతం: శంకర్ - ఎహసాన్- లాయ్, కళ: సాబుసిరిల్, ఛాయాగ్రహణం: మది.

స్వాతంత్ర్యం వచ్చెనని సభలే చేసి
సంబరపడగానే సరిపోదోయి
సాధించినదానికి సంతృప్తిని పొంది
అదే విజయమనుకుంటే పొరపాటోయి
ఆగకోయి భారతీయుడా
కదలి సాగవోయి ప్రగతి దారుల

గీతం: పాడవోయి భారతీయుడా...
చిత్రం: వెలుగు నీడలు
రచన: శ్రీశ్రీ
- పంపినవారు: సరికొండ శ్రీనివాస రాజు, వనస్థలిపురం

గీతోపదేశం

చిరునామా:
సినిమా డెస్క్,
ఈనాడు కార్యాలయం,
రామోజీ ఫిలింసిటీ,
అనాజ్‌పూర్,
అబ్దుల్లాపూర్‌మెట్ మండలం,
రంగారెడ్డి జిల్లా- 501512
మెయిల్ ఐడీ:
cinema@eenadu.net

సర్వేంద్రియానాం సర్వం ప్రధానం


రవితేజ

తెలుగు సినిమాల్లో కథానాయకుణ్ని ధీరోదాత్తుడిగానే చూపించాలి. ఏ చిన్న లోపం ఉన్నా అభిమానులు స్వీకరించలేరేమో అనే బెంగ దర్శక నిర్మాతలది. అయితే... ఇప్పుడిప్పుడే ఆ భయాలు, అనుమానాల నుంచి చిత్రసీమ బయట పడుతోంది. కథానాయకుణ్ని కథకు అనుగుణంగా ఎలా తీర్చిదిద్దినా చూడ్డానికి సిద్ధమే అంటోంది. ఆ ధైర్యంతోనే 'రాజా ది గ్రేట్'లో రవితేజ పాత్రని అంధుడిగా చూపించడానికి సిద్ధపడ్డారు అనిల్ రావిపూడి. రవితేజ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'రాజా ది గ్రేట్'. అనిల్ రావిపూడి దర్శకుడు. దిల్‌రాజు నిర్మాత. ఇందులో రవితేజ అంధుడిగా కనిపిస్తారు. ఆ విషయాన్ని టీజర్‌లోనే చెప్పేశాడు దర్శకుడు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవారం 'రాజా ది గ్రేట్' టీజర్‌ని విడుదల చేశారు. 'ఐ యామ్ బ్లైండ్ బట్ ట్రైన్డ్' అంటూ రవితేజ చెప్పిన సంభాషణలోనే కథాంశాన్ని చూచాయగా చెప్పాడు దర్శకుడు. 'సర్వేంద్రియానాం సర్వం ప్రధానం' అనే మరో సంభాషణ టీజర్‌లో వినిపించింది. రాశీఖన్నా కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో రాధిక ఓ కీలక పాత్రలో కనిపించనున్నారు. అక్టోబరులో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తారు.


స్వాతి, రక్షిత్

లండన్ బాబు తిప్పలు

రక్షిత్, స్వాతి జంటగా నటించిన చిత్రం 'లండన్ బాబులు'. చిన్నికృష్ణ దర్శకత్వం వహించారు. మారుతి నిర్మాత. కె సంగీతం అందించిన ఈ చిత్రంలోని ఓ గీతాన్ని మంగళవారం హైదరాబాద్‌లో ప్రముఖ దర్శకుడు హరీష్ శంకర్ విడుదల చేశారు. ప్రచార చిత్రాన్ని తమ్మారెడ్డి భరద్వాజా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "స్వాతి కథల ఎంపిక బాగుంటుంది. తాను ఓ సినిమా ఎంచుకొందంటే కచ్చితంగా అది మంచి కథే అనే నమ్మకం కలుగుతుంది. కొత్త కథాంశంతో తీసే చిత్రాలు బాగా ఆడితే... ఆ స్ఫూర్తితో మరింత మంది నటీనటులు, సాంకేతిక నిపుణులు తెరపైకొస్తార"న్నారు. "ఇప్పుడొస్తున్న చిత్రాల మధ్య 'లండన్ బాబులు' భిన్నంగా ఉంటుంది. రక్షిత్‌కి మంచి పేరొస్తుంది. సెప్టెంబరు తొలి వారంలో ఈ చిత్రాన్ని విడుదల చేస్తామ"న్నారు మారుతి. "లండన్ వెళ్లాలనుకొన్న ఓ యువకుడి కథ ఇది. మారుతి ఇచ్చిన సహకారం మర్చిపోలేనిద"న్నారు దర్శకుడు. ఈ కార్యక్రమంలో మల్లిక్, ఏవీఎస్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

భయపెట్టే 'షాలిని'


కవిత, పార్సిల్ ఫెమ్‌షెరాజ్

ఆమోగ్ దేశపతి, అర్చన, శ్రేయవ్యాస్ నాయకానాయికలుగా నటిస్తున్న చిత్రం 'షాలిని'. పార్సిల్ ఫెమ్‌షెరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. పి.వి.సత్యనారాయణ నిర్మాత. సాయివెంకట్ సమర్పిస్తున్నారు. నవనీత్ స్వరకర్త. హైదరాబాద్‌లో పాటల విజయోత్సవం జరిగింది. ప్రతాని రామకృష్ణగౌడ్, కవిత చిత్రబృందానికి జ్ఞాపికలు అందించారు. దర్శకుడు మాట్లాడుతూ "ప్రతిక్షణం ఉత్కంఠ రేకెత్తిస్తూ సాగే చిత్రమిది. హారర్ చిత్రాల్ని ఇష్టపడే వాళ్లకి 'షాలిని' తప్పకుండా నచ్చుతుంది" అన్నారు. "షెరాజ్ దర్శకత్వంలో మేం నిర్మించిన రెండో చిత్రమిది. వైవిధ్యమైన కథ, కథనాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాడ"న్నారు నిర్మాత. "ప్రేక్షకుల్ని భయపెట్టడంతో పాటు, థ్రిల్‌కి గురి చేసే చిత్రమిది. నవనీత్ స్వరకల్పనలోని గీతాలకి మంచి స్పందన లభించింది. సెప్టెంబరు 1న విడుదలవుతున్న చిత్రం కూడా అందరినీ అలరించేలా ఉంటుంది" అన్నారు సాయివెంకట్. ఈ కార్యక్రమంలో మోహన్‌గౌడ్, అట్లూరి రామకృష్ణ, ఎ.వి.వి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అంతకంటే ఏం కావాలి?


వాణిజ్య చిత్రాల్లో కథానాయిక పాత్రలకి ప్రాధాన్యం ఉండదనే మాటని అస్సలు నమ్మనంటోంది రాశీ ఖన్నా. ఒక పాత్రకి పేరు రావడానికి బోలెడన్ని సన్నివేశాలేమీ అవసరం లేదని చెబుతోందామె. ఎన్టీఆర్, రవితేజ, వరుణ్‌తేజ్ తదితర కథానాయకులతో కలిసి నటిస్తూ దూసుకెళుతోంది రాశి. మరోపక్క తమిళ, మలయాళ భాషల్లోనూ రాణించే ప్రయత్నం చేస్తోంది. నటిగా నిరూపించుకొనేందుకు ప్రత్యేకమైన కథల్ని ఎంచుకోవాలనే ఆలోచన మీకెప్పుడైనా వచ్చిందా? అని అడిగితే... "చేసే ప్రతి సినిమాతోనూ నటిగా నన్ను నేను నిరూపించుకొనే ప్రయత్నం చేస్తుంటా. అంతే తప్ప కథలో నా పాత్రకి ప్రాధాన్యమెంత అని ప్రత్యేకంగా చూడటం అలవాటు లేదు. పైగా ఇప్పుడు కథల తీరుతెన్నుల్లో స్పష్టమైన మార్పులు కనిపిస్తున్నాయి. వాణిజ్య చిత్రాల్లోనూ కథానాయికలకి బలమైన పాత్రలు లభిస్తున్నాయి. అంతకంటే ఏం కావాలి? ఒక మంచి కథయితే చాలు.. అందులోని ప్రతి చిన్న పాత్రకీ పేరొస్తుంది తెలుసా?" అంటోంది రాశీ ఖన్నా.


రాశీ ఖన్నా

బాలీవుడ్‌లో తాజాగా ఓ మూడు చిత్రాలు తెరకెక్కుతున్నాయి. ఇవి ఒక్కటే కాదు వీటితో పాటు చాలా చిత్రాలు సెట్స్‌పై ఉన్నాయి కదా.. ఈ మూడింటికి ఉన్న ప్రత్యేకత ఏంటి అనుకోవచ్చు. 'బరెలీ కీ బర్ఫీ', ఆలియా భట్ ప్రధాన పాత్రలో నటిస్తున్న 'రాజీ', అక్షయ్‌కుమార్ 'ప్యాడ్‌మ్యాన్'... ఈ మూడింటికి ఉన్న కామన్ పాయింట్ ఒకటే.. అదే పుస్తకం. మూస దారిలో కాకుండా కొత్త కథలవైపు చిత్ర పరిశ్రమ అడుగులేస్తోంది. అందుకే బాలీవుడ్ దర్శకనిర్మాతలు ఇప్పుడు పుస్తకాల బాట పట్టారు. పాఠకుల మన్నన పొందిన పుస్తకాలను వెండితెర దృశ్యకావ్యాలుగా మలుస్తున్నారు. ఈ మధ్యే శ్రద్ధాకపూర్, అర్జున్ కపూర్ జంటగా వచ్చిన 'హాఫ్ గర్ల్‌ఫ్రెండ్' ఇదే పేరుతో వచ్చిన చేతన భగత్ నవల ఆధారంగా తెరకెక్కింది. పుస్తకాల ఆధారంగా తెరకెక్కి విజయం అందుకోవడం బాలీవుడ్‌కి కొత్త కాకపోయినా ప్రస్తుతం నడుస్తున్న ఈ తాజా ట్రెండ్‌పై ఓ లుక్కేద్దాం.


ఆలియా భట్

వెండితెర 'పుస్తకం'


'ప్యాడ్‌మ్యాన్'

'ది ఇన్‌గ్రిడియంట్స్ ఆఫ్ లవ్' అనే ఓ ఫ్రెంచ్ పుస్తకం స్ఫూర్తితో 'బరెలీ కీ బర్ఫీ' రూపొందుతోంది. రాజ్‌కుమార్ రావ్, ఆయుష్మాన్ ఖురానా, కృతి సనన్ ప్రధాన పాత్రల్లో ఈ చిత్రం తెరకెక్కుతోంది. 'డియర్ జిందగీ' తర్వాత ఆలియా భట్ నటిస్తున్న చిత్రం 'రాజీ'. హరీందర్ ఎస్ సిక్కా పుస్తకం 'కాలింగ్ షెహ్మత్' ఈ చిత్రానికి ఆధారం. కొత్త తరహా కథల వైపు అడుగులేస్తున్న అక్షయ్ కుమార్ నటిస్తున్న 'ప్యాడ్‌మ్యాన్'ను ట్వింకిల్ ఖన్నా రచించిన 'ది లెజెండ్ ఆఫ్ లక్ష్మీప్రసాద్' స్ఫూర్తితో తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రానికి ఆర్. బాల్కీ దర్శకుడు. ఓ పుస్తకాన్ని వెండితెర పైకి తీసుకురావడం చాలా కష్టమైన పని అంటున్నారు 'బరెలీ కి బర్ఫీ' చిత్ర దర్శకుడు అశ్విన్ లయర్ టేలర్. "ఓ పుస్తకాని ఎన్నో రకాల భావోద్వేగాలతో ఎన్నో ఆసక్తికర మలుపులతో రచయిత రాస్తాడు. కథ చెడిపోకుండా వాటన్నింటిని రెండున్నర గంటల సినిమాలో చూపించడం ఛాలెంజింగ్. పుస్తకంలో రాసింది చిన్న విషయమే అయినా దృశ్యంగా మలచడం వీలుకాకపోవచ్చు. అలాంటి ఎన్నో ప్రతిబంధకాల్ని అధిగమించి వాణిజ్యాంశాలతో సినిమాను తీర్చిదిద్దాల్సి ఉంటుంద"ంటున్నారు అశ్విన్.


'బరెలీ కీ బర్ఫీ'

ఈ కథలపైనా కసరత్తు: వరుణ్ అగర్వాల్ పుస్తకం 'హౌ ఐ బ్రేవ్డ్ అను ఆంటీ అండ్ కో ఫౌండెడ్ ఎ మిలియన్ డాలర్ కంపెనీ'ని వెండితెరకు తీసుకొచ్చే ప్రయత్నాల్లో ఉన్నారు దర్శకుడు నితీష్ తివారి. వికాస్ స్వరూప్ రచించిన 'ది యాక్సిడెంటల్ అప్రెంటీస్'ని శ్రీరామ్ రాఘవన్, విక్రమ్ సంపత్ పుస్తకం 'మై నేమ్ ఈజ్ గౌహర్ జాన్'ను అశుతోష్ గోవారికర్ వెండితెరకు తీసుకురావడానికి సన్నాహాలు చేసుకుంటున్నారు.

పుస్తకాల వైపు ఎందుకీ పయనం: పెద్ద హీరోల నుంచి.. చిన్న హీరోల వరకు, అగ్ర దర్శకుల నుంచి కొత్త వారి వరకు పుస్తకాల్నే నమ్ముకోవడం కొంతమందికి ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఇందులో ఆశ్చర్యపడాల్సిన అవసరం ఏమీ లేదంటున్నారు విశ్లేషకులు. "ఈ రోజుల్లో రచయితలు, మంచి కథలు.. రెండూ కొరతే. అందుకే దర్శకనిర్మాతలకు వేరే దారి లేక ఇలా పుస్తకాల్ని వెండితెరకు తీసుకొస్తున్నార"నేది విశ్లేషకుల మాట.

ఎన్నికల వ్యవస్థపై న్యూటన్ పోరాటం!


రాజ్‌కుమార్ రావ్

వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూ బాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటుడు రాజ్ కుమార్ రావ్. ఈ యువ నటుడు ఇప్పుడు 'న్యూటన్' చిత్రంలో నటిస్తున్నాడు. మన దేశ ఎన్నికల వ్యవస్థ నేపథ్యంగా సాగే చిత్రమిది. అమిత్ వి మసుర్కర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఇప్పటికే 67వ బెర్లిన్ అంతర్జాతీయ చిత్రోత్సవాల్లో ప్రదర్శితమైంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన టీజర్ విడుదలై ఆకట్టుకుంటుంది. "దేశంలో ఎన్నికల ఖర్చు ముప్ఫై వేల కోట్ల రూపాయలు... 84 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు... 90 లక్షల పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. ఎన్నికల విషయంలో భారతదేశం కొత్త రికార్డులు సృష్టిస్తోంది. గూండాలు ఎన్నికల్లో జోక్యం చేసుకోకుండా చూడాలి" అంటూ ఈ ట్రైలర్ సాగుతుంది. దేశ ఎన్నికల వ్యవస్థను మార్చడానికి ఓ సాధారణ ప్రభుత్వ ఉద్యోగి పోరాటమే ఈ చిత్రం. త్వరలో ఉత్తర అమెరికాలో జరగనున్న ట్రిబెకా చిత్రోత్సవంలోనూ ఈ చిత్రాన్ని ప్రదర్శించనున్నారు. వచ్చే నెల 22న ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

రెండు నెలల్లో నిరుద్యోగ భృతి

● సమరయోధుల పింఛను రూ.15వేలకు పెంపు ● స్వాతంత్ర్య వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు



జాతీయ జెండాకు వందనం సమర్పిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

ఈనాడు - తిరుపతి

రాష్ట్రంలో ఓ వైపు ఉద్యోగాలు సృష్టిస్తూనే మరో వైపు నిరుద్యోగులకు అండగా నిలబడేందుకు రెండు నెలల్లో నిరుద్యోగ భృతికి శ్రీకారం చుట్టనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వెల్లడించారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు దొరికే వరకూ అండగా ఉంటామని, భృతిని కల్పించడం ద్వారా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు వారికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. మంగళవారం తిరుపతిలోని తారకరామ మైదానంలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా సీఎం జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ఉద్యోగులు ఎంతో చక్కగా సహకరిస్తున్నారన్నారు. వారికి 43 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చామని తెలిపారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు వారు సహకరించాలని కోరారు.

"నవ్య భారత్‌ను నిర్మించేందుకు ప్రధాని నరేంద్రమోదీ అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుడుతూ ముందుకెళ్తున్నారు. ఏ దేశానికి లేని విధంగా యువత భారత్‌కు సొంతం. ప్రపంచంలో ఆంగ్లం ఎక్కువగా మాట్లాడేది భారత్‌లోనే. అందువల్ల దేశం ఒక నవ్య భారత్ కావడం పెద్ద కష్టం కాదు. ప్రస్తుతం నవ్యాంధ్ర నాలుగో ఏడాదిలో అడుగిడింది. రాష్ట్రాన్ని దేశంలోనే ప్రథమ స్థానంలో నిలబెట్టే శక్తి సామర్థ్యం మనందరికీ ఉంది. ఆ స్ఫూర్తితోనే ముందుకు వెళ్తున్నాం" అని ముఖ్యమంత్రి వివరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా స్వాతంత్ర్య వేడుకలను

> మహిళలు ఎవరికీ తక్కువ కాదు. వారికి తగిన భద్రత కల్పిస్తాం. రాష్ట్రంలో ఎక్కడా ర్యాగింగ్ లేదు. ఎక్కడైనా అలాంటి తప్పు పనులు చేస్తే రెండు నిముషాల్లోనే పట్టుకునే వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నాం.

> మహారాష్ట్ర, కర్ణాటకతోపాటు ఇప్పుడు తెలంగాణతో నీటిని పంచుకోవాల్సి ఉంది. అందుకే నదుల అనుసంధానానికి శ్రీకారం చుట్టాను. 2018లో పోలవరం ద్వారా నీటిని గ్రావిటీ ద్వారా తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. 2019కి ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలని భావిస్తున్నాం.

> రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న కేంద్ర సంస్థల్లో అనేకం ఇప్పటికే ప్రారంభమయ్యాయి. మరికొన్నింటికి చట్ట సభలో ఆమోదముద్ర వేయాల్సి ఉంది. ఇందుకోసం నిరంతరం ప్రయత్నిస్తున్నాం.

> రాయలసీమలోని అనంతపురం దేశంలోనే అత్యంత తక్కువ వర్షపాతం నమోదయ్యే జిల్లాలో రెండో స్థానంలో ఉంది. ఇప్పటికే రాయదుర్గం ఎడారిగా మారిపోయే పరిస్థితి నెలకొంది. రాయలసీమను రత్నాల సీమగా చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది.

జిల్లాల్లో నిర్వహిస్తున్నది కేవలం ఆంధ్రప్రదేశ్ మాత్రమేనని తొలుత కర్నూలు, ఆ తర్వాత విశాఖపట్నం, అనంతపురంలో నిర్వహించామని అన్నారు. ఇప్పుడు తిరుపతిలో ఇలాంటి వేడుక చేసుకోవడం మనందరి అదృష్టమన్నారు.

నీటితోనే భవిత

"నేను ముఖ్యమంత్రిగా ఎన్నికైన వెంటనే ప్రధాని నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారానికి వెళ్లాను. పోలవరం ప్రాజెక్టు పూర్తి కాకపోతే పూర్తిస్థాయిలో రాష్ట్రం నష్టపోతుందని వివరించాను. తెలంగాణలోని ఏడు ముంపు మండలాలను వెంటనే ఏపీకి బదలాయించాలని ఎన్డీఏ ప్రభుత్వాన్ని కోరాను. ప్రధాని స్పందించి వెంటనే తొలి మంత్రివర్గ సమావేశంలోనే దీనికి ఆమోదముద్ర వేశారు. ఆ వెంటనే పార్లమెంటు సమావేశాల్లో పెట్టారు. అందువల్లే ఇప్పుడు పోలవరం సాధ్యమవుతోంది" అని చంద్రబాబు వివరించారు. రాష్ట్రంలో రెండు ప్రధాన నదులు ఉన్నా నీటి ఇబ్బందులు ఉన్నాయని గోదావరి నుంచి నీరు ఇప్పటికీ సముద్రంలోకి వెళ్తుంటే మరోవైపు కృష్ణలోకి అసలు రావడం లేదని ఆగస్టు వచ్చినా శ్రీశైలానికి నీరు చేరుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. "రాష్ట్రంలోని నీటి ప్రాజెక్టుల కోసం రూ.43వేల కోట్లు ఖర్చు చేశాం. రానున్న మూడు నెలల్లోనే రూ.13వేల కోట్ల వ్యయంతో 28 ప్రాజెక్టులను పూర్తి చేస్తాం. ప్రతి మూడు రోజులకు ఒక ప్రాజెక్టు అందుబాటులోకి వస్తుంది. నీరు ఉంటేనే సంపద, నీరే ప్రగతి. అందువల్లే ఈ నెల 25 నుంచి 30వ తేదీ వరకూ 'జలసిరికి హారతి' పేరుతో ప్రత్యేక కార్యక్రమం చేపట్టనున్నాం. ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి" అని పిలుపునిచ్చారు.

సాగు రంగానికి ప్రాధాన్యం

నీటి సంరక్షణతోపాటు రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ముఖ్యమంత్రి

> హైదరాబాద్ నుంచి అమరావతికి వచ్చాం. అక్కడ మనకు అనేక ఆస్తులు ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రంతో మాట్లాడుకొని సమస్యలు పరిష్కరించుకోవాలి. ఒక వేళ వారు సహకరించకుంటే న్యాయస్థానం ద్వారానైనా ప్రజలకు న్యాయం చేయాల్సి ఉంది. ఆ దిశగా ఇప్పటికే చర్యలు చేపట్టాం. కేంద్రం, పక్క రాష్ట్రంతో సమస్యలను పరిష్కరించుకుని నవ్యాంధ్రను అభివృద్ధి దిశగా తీసుకెళ్తాం.

వెల్లడించారు. "రైతులను రుణ విముక్తి చేయడంతో పాటు వారు మరింత అభివృద్ధి సాధించేందుకు సాంకేతికతను వినియోగిస్తున్నాం. వ్యవసాయ అనుబంధ రంగాలను ప్రోత్సహిస్తున్నాం. పశువుల కోసం ప్రత్యేకంగా వసతి గృహాలను ఏర్పాటు చేసి వాటిని అక్కడ ఉంచాలని యోచిస్తున్నాం. రైతులకు ఎక్కువ ఆదాయం రావాలంటే పండ్ల తోటలకు పాధాన్యమివ్వాలి. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఆహార అలవాట్లు మారాయి. చిత్తూరు జిల్లా ఉద్యాన పంటల కేంద్రంగా మారాలి. రైతులను గౌరవించాలనే ఉద్దేశంతో వ్యవసాయ పనులు ప్రారంభమయ్యే సమయంలో ఏరువాక వంటి ప్రత్యేక కార్యక్రమం చేపట్టాం" అని వివరించారు. విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను ఒక విజ్ఞాన కేంద్రంగా తయారు చేస్తామన్నారు. అమరావతి, తిరుపతి, విశాఖపట్నంతో పాటు అన్ని జిల్లా కేంద్రాలు, ప్రధాన నగరాల్లోనూ విద్యారంగానికి అవసరమైన నిధులు కేటాయిస్తున్నామన్నారు.

సంక్షేమానికి పెద్దపీట

ప్రభుత్వం నిరుపేదల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు తీసుకొచ్చిందని విజయదశమి లోపు అన్ని నగరాల్లోనూ అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేయనున్నామని చంద్రబాబు వెల్లడించారు. "నిరుపేదలకు నెలకు రూ.1500 పింఛను నేరుగా వారి ఖాతాల్లోకే పంపిస్తున్నాం. విద్యార్థులకు సైతం నెలవారీగా ఉపకార వేతనాలు అందిస్తున్నాం. ఉప ప్రణాళిక కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ప్రజలకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించాం. బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేశాం. కాపులకు తొలిసారిగా బడ్జెట్‌లో రూ.వెయ్యి కోట్ల నిధులు కేటాయించాం. రాష్ట్రంలో ఎక్కువ పరిశ్రమలు స్థాపించడం ద్వారా పిల్లలకు ఉద్యోగాలు వస్తాయి. ఇందుకోసం పరిశ్రమలతోపాటు పర్యాటకాన్ని అభివృద్ధి చేస్తున్నాం"



మొదటి బహుమతి సాధించిన అటవీ శాఖ శకటం

అని వివరించారు. నగరాలతోపాటు పల్లెలూ పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపట్టామని ఇందు కోసం 2018 నాటికి అన్ని ఇళ్లకు మరుగుదొడ్లను నిర్మిస్తామని వెల్లడించారు. "స్వాతంత్ర్య దినోత్సవం రోజున మహనీయులను స్మరించుకోవాల్సి ఉంది. వారి త్యాగఫలమే నేడు మనం అనుభవిస్తున్నాం. అందువల్ల రాష్ట్ర ప్రభుత్వం తరఫున పింఛన్ తీసుకుంటున్న స్వాతంత్ర్య సమరయోధులకు రూ.7 వేల నుంచి రూ.15 వేలు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. వారి కుటుంబాలను ఆదుకోవాలనే ఈ నిర్ణయం తీసుకున్నాం. రాష్ట్రంలో నిరుపేదలు ఎక్కడైనా నివాసం ఉంటూ.. ఇళ్ల స్థలాలకు పట్టాలు లేకుంటే వాటిని క్రమబద్ధీకరిస్తాం. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయాలనే ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం" అని పేర్కొన్నారు.



హైదరాబాద్‌లోని జనసేన కార్యాలయంలో జెండా దిమ్మెకు శిరస్సు వంచి నమస్కరిస్తున్న పవన్‌కల్యాణ్



మంగళవారం సచివాలయం వద్ద జాతీయ జెండా ఆవిష్కరించి గౌరవ వందనం చేస్తున్న సభాపతి కోడెల శివప్రసాదరావు



జెండాకు వందన సమర్పణ చేస్తున్న ఏసీజే జస్టిస్ రమేశ్ రంగనాథన్



కుర్చీలో కూర్చొని కవాతును చూస్తున్న ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్

మహనీయుల త్యాగాలను మరవద్దు

● వారిని సదా స్మరించుకోవాలి
● స్వాతంత్ర్య వేడుకల్లో హైకోర్టు ఏసీజే రమేశ్ రంగనాథన్

ఈనాడు - హైదరాబాద్, అమరావతి

స్వాతంత్ర్య పోరాటంలో న్యాయవాదులు కీలకపాత్ర పోషించారని, వారి త్యాగాలను స్మరించుకోవాలని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి(ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్ చెప్పారు. బాలగంగాధర్ తిలక్, మహాత్మాగాంధీ, లాలా లజపతిరాయ్, అంబేడ్కర్, నెహ్రూ, సి.రాజగోపాలాచారి, బాబు రాజేంద్రప్రసాద్‌లు ప్రఖ్యాతిగాంచిన న్యాయవాదులని గుర్తుచేశారు. వీరేకాకుండా స్వాతంత్రోద్యమంలో మరికొందరు మహనీయులు చురుకైన పాత్ర పోషించారని, వారిపై తన తాత గొప్ప అభిమానం చూపేవారన్నారు. 71వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవారం ఉమ్మడి హైకోర్టులో నిర్వహించిన కార్యక్రమంలో ఏసీజే జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అంతకు ముందు ప్రసంగిస్తూ.. స్వాతంత్రోద్యమంలో దేశాయ్, మీనన్‌ల సేవలను కొనియాడారు. భారత చివరి ముగ్గురు వైస్రాయ్‌లకు రాజకీయ సంస్కరణల కమిషనర్‌గా, రాజ్యాంగ సలహాదారుగా వి.పి.మీనన్ సేవలందించారని గుర్తుచేశారు. సర్దార్ వల్లభాయ్ పటేల్, మీనన్‌లు స్వతంత్ర రాజ్యాలను భారతదేశంలో కలపడానికి కృషిచేశారన్నారు. వివిధ అంశాల్లో ప్రతిభ చూపిన హైకోర్టు సిబ్బంది పిల్లలకు ఈ కార్యక్రమంలో ప్రతిభ అవార్డులు ప్రదానం చేశారు. తెలంగాణ అడ్వొకేట్ జనరల్(ఏజీ) డి.ప్రకాశ్‌రెడ్డి, ఏపీ ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్, తెలంగాణ, ఏపీ హైకోర్టు న్యాయవాది సంఘాల అధ్యక్షులు జె.కనకయ్య, చల్లా ధనంజయలు పాల్గొని ప్రసంగించారు. సుప్రీంకోర్టు, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తులు, ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

త్వరలోనే శాసనసభ భవనానికి శంకుస్థాపన: స్పీకర్ కోడెల శివప్రసాదరావు

అమరావతిలో శాసనసభ సముదాయ భవనాల నిర్మాణానికి త్వరలోనే శంకుస్థాపన చేస్తామని శాసనసభ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాద్‌రావు తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వెలగపూడి సచివాలయ ప్రాంగణంలోని శాసనసభ భవనంపై త్రివర్ణ పతాకం ఎగురవేశారు. మహాత్ముడికి నివాళులర్పించారు. భారతదేశం అభివృద్ధి చెందుతున్న దేశం నుంచి అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. అభివృద్ధి సంక్షేమం రెండింటి మధ్య సమతుల్యత సాధించాల్సిన అవసరముందన్నారు. శాసనసభ ప్రత్యేక కార్యదర్శి పీవీకే రామాచార్యులు పాల్గొన్నారు.

శాసన మండలిలో...: శాసన మండలి భవనంపై మండలి ఉపాధ్యక్షులు రెడ్డి సుబ్రహ్మణ్యం త్రివర్ణ పతాకం ఎగురవేసి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. స్వాతంత్ర్యం సముపార్జించిపెట్టిన మహనీయుల త్యాగఫలాలను ఎన్నడూ మరువకూడదన్నారు.

సచివాలయంలో.. సచివాలయంలోని ఒకటో బ్లాకు ముందు త్రివర్ణ పతాకాన్ని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి లింగరాజు పాణిగ్రహి ఎగురవేసి, ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు.

భారత్ ప్రగతి పథంలో దూసుకెళ్తోంది: సుజనా చౌదరి

ప్రగతి పథంలో సూపర్ పవర్‌లా భారత్ ముందుకెళుతోందని కేంద్ర మంత్రి సుజనాచౌదరి అన్నారు. మంగళవారం ఎన్టీఆర్‌భవన్‌లో స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జాతీయ జెండాను, తెదేపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రమణ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. సుజనాచౌదరి మాట్లాడుతూ.. అంబేడ్కర్ స్ఫూర్తితో తెదేపా బడుగుల అభ్యున్నతికి అనేక కార్యక్రమాలు చేపట్టిందని తెలిపారు.

దేశం విలువ తెలియాలంటే చరిత్ర చదవాలి: పవన్‌కల్యాణ్

భారతదేశం విలువ తెలియాలంటే దేశ చరిత్ర, స్వాతంత్ర్యం కోసం పోరాడినవారి జీవిత చరిత్ర చదవాలని జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ చెప్పారు. మంగళవారం ఆయన హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేసి వందనం చేశారు. జెండా దిమ్మెకు శిరస్సు వంచి నమస్కరించారు. అనంతరం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. దేశంలో పరమతసహనం అలవరచుకోవాలని ఆకాంక్షించారు. ఈ దేశం అందరిదీ అనే భావన కలిగించడమే జనసేన ఉద్దేశమని స్పష్టంచేశారు.

ఒడిశా ముఖ్యమంత్రి నవీన్‌కు స్వల్ప అస్వస్థత

భువనేశ్వర్‌లోని మహాత్మాగాంధీ మార్గ్‌లో మంగళవారం నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వేదికపై ప్రసంగిస్తూ అస్వస్థతకు గురయ్యారు. ముందుగా ఆయన వివిధ దళాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. తర్వాత ప్రసంగం ప్రారంభించారు. కొద్దిసేపటికే నిల్చొలేక ఇబ్బందిపడ్డారు. దీంతో డీజీపీ కేబీ సింగ్, ఇతర భద్రతా సిబ్బంది ఆయనను అక్కడే ఉన్న కుర్చీలో కూర్చొబెట్టారు. అంబులెన్సును వేదిక వద్దకు తీసుకొచ్చారు. ఆయన అంబులెన్సులో ఎక్కలేదు. కాసేపు అలాగే కూర్చున్న తర్వాత తన వాహనంలో నవీన్ నివాస్‌కు చేరుకున్నారు. కేపిటల్ ఆస్పత్రి వైద్యులు అక్కడికి చేరుకుని చికిత్సలు నిర్వహించారు. ఉక్కపోత, వేడిని తట్టుకోలేక ముఖ్యమంత్రి స్వల్ప అస్వస్థతకు గురయ్యారని నవీన్ నివాస్ వర్గాలు ప్రకటించాయి. ముఖ్యమంత్రి కూడా తనకు ఎలాంటి అస్వస్థత లేదని తెలిపారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటల సమయంలో జయదేవ్ భవన్‌లో పోలీసులకు పతకాల ప్రదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.



పనితీరుకో పతకం!

ఈనాడు, తిరుపతి: విధి నిర్వహణలో అంకితభావం ప్రదర్శించిన పలువురు పోలీసు అధికారులను విశిష్ట సేవా పతకాలు వరించాయి. ఏడుగురు ప్రెసిడెంట్ మెడల్స్‌కు ఎంపికయ్యారు. వారిలో రైల్వేస్ అదనపు డీజీ కేఆర్‌ఎం.కిషోర్, ఏసీబీ డీఐజీ పి.హరికుమార్, కౌంటర్ ఇంటెలిజెన్స్ ఎస్పీ పీవీ రాధాకృష్ణతో పాటు కడప 11వ బెటాలియన్ స్పెషల్ కమాండెంట్ గంగుటూరు రాజకిషోర్‌బాబు సీఎం చేతుల మీదుగా వాటిని అందుకున్నారు. వీరితో పాటు ముఖ్యమంత్రి శౌర్యపతకాలను గ్రౌహౌండ్స్ సిబ్బంది ఇద్దరు అందుకున్నారు. విధి నిర్వహణలో ప్రతిభ చూపిన గ్రౌహౌండ్స్ డిప్యూటీ కమాండర్ బొల్లా వేణుగోపాల్ రెడ్డితో పాటు జూనియర్ కమాండో పెంకి శ్రీనివాసరావు మెడల్స్ స్వీకరించారు.



బళ్లారిలో 150 అడుగుల స్తూపంపై ముువ్వన్నెల రెపరెపలు

బళ్లారి (కర్ణాటక), న్యూస్‌టుడే: బళ్లారిలో 150 అడుగుల ఎత్తయిన స్తూపంపై 36 అడుగుల పొడవు, 24 అడుగుల వెడల్పున ముంబయిలో తయారు చేయించిన త్రివర్ణ పతాకాన్ని 71వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవారం ఎగురవేశారు. నగరం నడిబొడ్డున బెంగళూరు, హొసపేటె మార్గాలను కలిపే హిరేహళ్ రామయ్య గవియప్ప (హెచ్.ఆర్.జి.) కూడలిని ఇటీవల బళ్లారి అభివృద్ధి సంస్థ (బుడా) విస్తరించి ఈ స్తూపాన్ని ఏర్పాటు చేసింది.



తిరునగరి.. త్రివర్ణం ఎగిరి

● కరుణించిన ప్రకృతి
● ఆద్యంతం ఉల్లాసంగా స్వాతంత్ర్య వేడుకలు

ఈనాడు, తిరుపతి: తిరుపతి మురిసిపోయింది. తిరంగా సందడితో నిండుగా కనిపించింది. ఆధ్యాత్మిక జడిలో నిండిపోయిన నగరానికి దేశభక్తి సువాసన అదనపు ఆకర్షణను తీసుకొచ్చింది. వేయి గొంతులు ఒక్కటై మేరా భారత్ మహాన్ అని నినదించాయి. మొదటిసారిగా తిరుపతిలో నిర్వహించిన స్వాతంత్ర్య దిన రాష్ట్రస్థాయి వేడుకలు మంగళవారం ఉల్లాసంగా, ఉత్సాహంగా సాగాయి. ఈసారి ప్రత్యేక పోలీసుల సాహస ప్రదర్శనలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. తిరుపతిలో కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు అధికారుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. స్వాతంత్ర్య వేడుకలకు వర్షం అడ్డుపడుతుందన్న ఆందోళన వెంటాడింది. అయితే, మంగళవారం ఉదయం వరుణుడు శాంతించడంతో జెండా పండుగ ఆహ్లాదంగా సాగింది.

కచ్చితమైన షెడ్యూల్...: షెడ్యూలు ప్రకారం ఉదయం 8.40 గంటలకు పరేడ్ మొదలైంది. దళాలన్నీ ఒకొక్కటిగా మైదానంలోకి రావడంతో వేడుకలు మొదలయ్యాయి. ఉదయం 9 గంటలకు ముఖ్యమంత్రి జాతీయజెండాను ఆవిష్కరించారు. సాయుధ దళాలు, ఇతర ప్లాటూన్ల నుంచి ముఖ్యమంత్రి గౌరవవందనం స్వీకరించారు. మాజీ సైనికుద్యోగులు సైతం పరేడ్‌లో పాల్గొన్నారు. జాతీయ సమైక్యతలో భాగంగా తమిళనాడు నుంచి ఒక ప్లాటూన్ పాల్గొంది.

యువోత్సాహం...: యూనివర్సిటీలు, విద్యాసంస్థల విద్యార్థులతో మైదానమంతా కోలాహలంగా కన్పించింది. సీఎం వేదికకు ఎడమవైపున 10 గ్యాలరీలు, కుడి వైపున 13 గ్యాలరీలను విద్యార్థులకే కేటాయించారు. జనరల్ పాస్‌లన్నీ విద్యార్థులకే ఇచ్చారు. వీరికి త్రివర్ణపతాకం రంగుల్లో టీషర్టులు అందించడంతో గ్యాలరీల్లో ముువ్వన్నెల మురిపెం కనిపించింది.

సమ్మోహన విన్యాసాలు...: ప్రత్యేక పోలీసుదళం ప్రదర్శించిన సాహసకృత్యాలు ప్రధానాకర్షణగా నిలిచాయి. వారు ప్రదర్శించిన విన్యాసాలు రోమాంచితం చేశాయి. ద్విచక్రవాహనాలపై పలు ఆకృతుల్లో వారు బృందాలుగా రావడం, జీపును డ్రైవర్ లేకుండా నడిపిన తీరు ఆకట్టుకున్నాయి.

> 71వ స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా విశాఖలో 71 అడుగుల భారీ కేక్‌ను తయారుచేశారు. సిరిపురం ఫ్యూజన్ ఫుడ్ హోటల్లో మంగళవారం దీనిని ప్రదర్శించారు. కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఈ కార్యక్రమానికి హాజరై కేక్‌ను కోసారు.

వినూత్నంగా శకటాలు..

గతానికి భిన్నంగా ఈసారి ప్రభుత్వ శకటాలను కొత్త పద్ధతిలో ప్రదర్శించారు. కాన్సెప్టుల వారీగా తయారు చేశారు. స్వచ్ఛ ఆంధ్ర, పేదలకు సొంతింటి కల అంటూ పురపాలిక శాఖ రెండు, మహిళా సాధికారిత, ఉపాధిహామీ అంటూ గ్రామీణాభివృద్ధి శాఖ రెండు శకటాలను ప్రదర్శించారు. తితిదే శకటాన్నీ ప్రదర్శించారు. మొదటి బహుమతిని అటవీశాఖ, ద్వితీయ బహుమతిని జలవనరుల శాఖ, తృతీయ బహుమతిని విద్యాశాఖ శకటాలు సాధించాయి. శకటాలను సాయంత్రం నుంచి తిరుపతి వీధుల్లో తిప్పారు.



ప్రకాశం జిల్లా కేంద్రమైన ఒంగోలులో మంగళవారం స్వాతంత్ర్య దిన వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నారాయణ కాసేపు సరదాగా ఇలా సైకిలు తొక్కారు.



విన్యాసాల్లో భాగంగా ఓ కానిస్టేబుల్ చివరలో ద్విచక్రవాహనంపై నుంచి జారి పడిపోయారు. వాహనం గ్యాలరీ వద్దకు దూసుకెళ్లింది. ప్రేక్షకులు అడ్డుకున్నారు. ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు.

ఆ బాలుడు మృత్యుంజయుడు

విసుకొండ, ఉమ్మడివరం – న్యూస్‌టుడే

ఆ బాలుడు మృత్యుంజయుడయ్యాడు. బోరుబావిలో చిక్కుకున్న ఆ చిన్నారి దాదాపు పదిగంటల పాటు మృత్యువుతో పోరాడాడు. సహాయ చర్యల్లో పాల్గొన్న సిబ్బంది మంగళవారం అర్ధరాత్రి దాటాక 2.40 గంటలకు అతడిని బయటకు తీయడంతో అక్కడ ఉన్న వారంతా ఉద్వేగానికి గురయ్యారు. జయజయ ధ్వానాలు పలికారు. ఆ బాలుడు కూడా రెండు చేతులు ఊపాడు. ఓ వైపు వర్షం కురుస్తున్నప్పటికీ సహాయ సిబ్బంది చేపట్టిన నిర్విరామ కృషి ఫలించింది. పసిప్రాణాన్ని కాపాడింది. క్షణక్షణం ఉత్కంఠతో పాటు భయాందోళనను రెట్టింపు చేసిన మృత్యుగుంతపై చివరికి మానవ ప్రయత్నమే విజయం సాధించింది. బయటకు వచ్చిన వెంటనే చిన్నారికి కొద్దిగా నీరు తాగించారు. అనంతరం 108 వాహనంలో వైద్యులు, సిబ్బంది చికిత్స అందిస్తున్నారు. కళ్లలో వత్తులు వేసుకుని వేసి చూస్తున్న ఆ తల్లిదండ్రుల ఆనందానికి ఆవధుల్లేకుండా పోయింది. గుంటూరు జిల్లా వినుకొండ మండలం ఉమ్మడివరం గ్రామానికి చెందిన చంద్రశేఖర్ (ఏడాదిన్నర వయసు) మంగళవారం సాయంత్రం సుమారు 4.30 గంటల సమయంలో బోరుబావిలో పడిపోయాడు. బాలుడ్ని జిల్లా యంత్రాంగం, ఎన్డీఆర్ఎఫ్ దళాలు దాదాపు పది గంటల పాటు శ్రమించి సురక్షితంగా వెలికితీశారు. బోరుబావికి సమాంతరంగా 30 అడుగుల మేర గొయ్యి తవ్వారు. చిన్నారి బోరుబావిలో 15 అడుగుల లోతులో ఉన్నట్లు గుర్తించారు. ఈ క్రమంలో సమాంతరంగా తవ్విన గొయ్యి వైపు నుంచి బోరుబావికి 22 అడుగుల లోతులో రంధ్రం చేశారు. అక్కడి నుంచి అత్యంత అప్రమత్తంగా పైకి తవ్వుతూ బాలుడిని సురక్షితంగా వెలికితీశారు. ఆ బాలుడు భయపడకుండా ఉండటానికి బోరుబావిలోకి చరవాణిని పంపి కుటుంబ సభ్యులు, బంధువులతో మాట్లాడించారు. జిల్లా యంత్రాంగం యావత్తు సాయంత్రం నుంచి చివరి వరకు ఘటనా స్థలంలోనే ఉండి జోరువానను లెక్క చేయక రక్షణ చర్యలను చేపట్టారు.

ఏం జరిగిందంటే...: గ్రామానికి చెందిన మల్లికార్జునరావు భార్య అనూష కుమారుడిని తీసుకుని సాయంత్రం మూడింటి సమయంలో పశువుల మేత కోయడానికి పొలానికి వెళ్లింది. ఏడాది కిందట పొలంలో వేసిన బోరులో నీరు పడకపోవడంతో కేసింగ్‌పైపుతో సహా అలాగే వదిలేశారు. దానికి ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టలేదు. తల్లి గడ్డి కోస్తుండగా సుమారు వంద అడుగుల లోతున్న బోరు పక్కనే చిన్నారి ఆడుకుంటూ అందులో పడిపోయాడు. ఇది గమనించిన తల్లి పరుగున వెళ్లి చేయి అందుకోబోయినా చిన్నారి జారిపోయాడు. ఆమె రోదిస్తూ కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అప్రమత్తమయ్యారు. వెంటనే సమాచారాన్ని అధికారులకు తెలిపారు. పోలీసులు, 108, అగ్నిమాపక సిబ్బంది, రెవెన్యూ, వైద్యశాఖ సిబ్బంది గ్రామానికి చేరుకుని సహాయ చర్యలు చేపట్టారు. మొదట 108 సిబ్బంది బోరు రంధ్రంలోకి ప్రాణవాయువు వదిలారు. జాతీయ విపత్తు నిర్వహణ బలగాలు (ఎన్డీఆర్ఎఫ్) కూడా రంగంలోకి దిగాయి. బోరులో ఉన్న బాలుడిపై మట్టిపడకుండా వారు జాగ్రత్తలు తీసుకున్నారు. స్థానిక యంత్రాంగం బోరుకు సమాంతరంగా 22 అడుగుల లోతు గుంత తవ్వారు. 15 అడుగుల వద్దే బాలుడు ఇరుక్కుపోయాడని గుర్తించారు. అక్కడ బాలుడి అరుపులు వారికి వినిపించాయి. వీలయితే పైనుంచి లేదా కింది నుంచి బాలుడిని కాపాడటానికి ప్రయత్నించారు. రోబోటిక్ చేయిని వాడేందుకు సిద్ధమయ్యారు. జిల్లా కలెక్టర్ శశిధర్, గ్రామీణ ఎస్పీ అప్పలనాయుడు, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు గ్రామానికి చేరుకుని సహాయ చర్యలను పర్యవేక్షించారు.





బాలుడు పడ్డ బోరుబావి ★ తల్లిదండ్రులు అనూష, మల్లికార్జునరావు

దేవుడున్నాడయ్యా

బాలుని తల్లి అనూష అందరికీ నమస్కారం పెడుతూ... 'దేవుడున్నాడయ్యా...' అని పేర్కొన్నారు. ఆ తండ్రి... 'నా బిడ్డ బతికాడయ్యా... అందరికి దండం..' అంటూ ఆనందం వ్యక్తం చేశాడు. సహాయ చర్యలను పర్యవేక్షించిన మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ... 'ఇది అద్భుతమైన సంఘటన. సమష్టి విజయం. పసివాడు ప్రాణాలతో బయటపడ్డాడు. దీనికి కృషి చేసి అందరికీ అభినందనలు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిరంతరం పర్యవేక్షించారు. ఆ చిన్నారిని, తల్లిదండ్రులను సీఎం వద్దకు తీసుకువెళ్లనున్నాం...' అని పేర్కొన్నారు.



బోరుబావి నుంచి బాలుడిని బయటకు తీసిన సిబ్బంది అంతరచిత్రంలో బాలుడు చంద్రశేఖర్

ధమరా పోర్టులో ప్రమాదం.. అయిదుగురు కార్మికుల మృతి

- విధ్వంసానికి దిగిన కార్మికులు
- కార్యాలయానికి, వాహనాలకు నిప్పు

భువనేశ్వర్ అర్బన్, న్యూస్‌టుడే: ఒడిశాలోని భద్రక్ జిల్లాలో గల ధమరా పోర్టులో జరిగిన ప్రమాదంలో అయిదుగురు కార్మికులు మృతిచెందారు. ఈ ఘటన తీవ్రఉద్రిక్తతకు దారి తీసింది. ధరమా పోర్టు ప్రాంగణంలో బొగ్గు ఉండే యార్డ్‌లో మంగళవారం ఉదయం 10 నుంచి 11 గంటల సమయంలో ప్రమాదం జరిగింది. యార్డులో పెద్ద బొగ్గురాశి వర్షానికి తడిసిపోకుండా ఉండేందుకు దానిపై టార్పాలిన్ కవర్ కప్పేందుకు ఏడుగురు కార్మికులు వెళ్లారు. అదే సమయంలో ఆ బొగ్గు కిందకు జారిపోవడంతో కార్మికులు దానికింద చిక్కుకున్నారు. సమీపంలో ఉన్న కొంతమంది కార్మికులు వారిని రక్షించే ప్రయత్నం చేసినా అప్పటికే అయిదుగురు కార్మికులు మృతి చెందారు. మరో ఇద్దరు ఇంకా బొగ్గురాశి కిందే ఉండిపోయినట్లు తెలుస్తోంది. వీరి కోసం గాలిస్తున్నారు. ఈ ఘటన జరిగిన తర్వాత కార్మికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోర్టు కార్యాలయానికి నిప్పంటించారు, పోర్టు సీఈఓ సుబ్రత్ త్రిపాఠిపై దాడి చేశారు. కొన్ని లారీలకు కూడా నిప్పంటించారు, మరికొన్ని లారీలపై దాడి చేసి అద్దాలు పగలగొట్టారు. సమాచారం అందుకున్న కలెక్టర్ జ్ఞానదాస్, ఎస్పీ అనుప్ సాహులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. 3 ప్లటూన్ల పోలీసులను కాపలాగా ఉంచారు.





పోర్టు కార్యాలయానికి మంట పెట్టడంతో వెలువడుతున్న పొగ ★ కార్మికులు నిప్పంటించడంతో కాలిపోతున కారు

'ఆది'ని మంత్రిమండలి నుంచి బర్తరఫ్ చేయాలి: వైకాపా

ఈనాడు, అమరావతి: మంత్రి ఆదినారాయణరెడ్డిని వెంటనే మంత్రిమండలి నుంచి బర్తరఫ్ చేయాలని వైకాపా ఎమ్మెల్యేలు ఆదిమూలపు సురేష్, నారాయణ స్వామి, సునీల్‌కుమార్ డిమాండ్ చేశారు. "రాజ్యాంగంలో ఎస్సీలకు పదేళ్లు మాత్రమే రిజర్వేషన్ ఇస్తే ఇప్పుడు ఏడు పదుల సంవత్సరాలైనా వారు మారనే లేదు, ఎస్సీల వెనుకబాటుకు ఎస్సీలే కారణం, వారికి ఎంతో మేలు చేయాలని ఆలోచించినా సరిగా చదవరు, శుభ్రంగా ఉండరు, ఎస్సీల చేతిలో పట్టాభూమి ఉండదు" అని మంత్రి మాట్లాడారని ఆరోపించారు. పార్టీ ఫిరాయించి శాసనసభ్యత్వానికి రాజీనామా కూడా చేయకుండా రాజకీయంగా దిగజారి మంత్రి అయిన ఆదినారాయణరెడ్డి ఇప్పుడు స్వాతంత్ర్య దినోత్సవం నాడు దళితులనూ అవమానిస్తూ చేసిన వ్యాఖ్యలతో మనిషిగా కూడా దిగజారిపోయారు అని పేర్కొన్నారు.

తరగతి మారినా.. పురోగతి పూజ్యం

- 2వ తరగతి పాఠం చదవలేకపోతున్న 8వ తరగతి విద్యార్థులు
- అక్షరాలనూ గుర్తించలేని దైన్యం
- ఆంగ్ల వాక్యాలు అంతంతే
- 50 శాతం మందికే భాగహారాలు తెలుసు
- తెలుగు రాష్ట్రాల్లో చదువుల దుస్థితి ఇది
- 'ఏఎస్ఈఆర్-2016' అధ్యయనంలో వెల్లడి

ఈనాడు – అమరావతి

రెండో తరగతి పాఠం ఎనిమిదో తగరతి విద్యార్థికి చదవడం చాలా సులభం. అలాగే అనుకుని ఒక అధ్యయన సంస్థ కొన్ని ఊళ్లకెళ్లి అక్కడున్న విద్యార్థులను కూర్చొబెట్టి బోర్డుమీద ఈ పాఠాన్ని తాటికాయంత అక్షరాలతో రాసి చదవమని అడిగింది. అది కూడా చదవడం రాని ఎనిమిదో తరగతి విద్యార్థులు చాలా మంది ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారట. ఒక్క తెలుగు రాష్ట్రాల్లోనే కాదు దేశంలోని పలు రాష్ట్రాల్లోనూ ఇలాంటి దృశ్యాలే కనిపించేసరికి విస్తుపోవడం అధ్యయన సంస్థ వంతైంది. ఇంకా చెప్పాలంటే కాస్తో, కూస్తో తెలుగు రాష్ట్రాల విద్యార్థులే నయం. ఉత్తరాది రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, బీహార్ లాంటి చోట విద్యార్థులు కనీస స్థాయిలో కూడా చదవలేని దృశ్యాలు కళ్లకు కట్టాయి.

పాఠశాలల్లో విద్యార్థులు పాఠాలు ఎలా నేర్చుకుంటున్నారు? వారిలో పఠనా ప్రతిభ, గణితంలో వారి పాటవాలు ఎలా ఉన్నాయి అనే అంశాలమీద బేరీజు వేయడానికి 'ప్రథమ్' అనే స్వచ్ఛంద సంస్థకు చెందిన 'యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్ట్(ఏఎస్ఈఆర్)-2016' విభాగం దేశ వ్యాప్తంగా అధ్యయనం చేసి నివేదికను విడుదల చేసింది. ఒకటో తరగతి నుంచీ ఎనమిదో తరగతి విద్యార్థులను ఎంపిక చేసుకుని వారితో ఈ అధ్యయనం చేసింది. ఎనిమిదో తరగతికి వచ్చిన విద్యార్థులు కొంతమంది రెండో తరగతి అచ్చు పుస్తకంలోని పాఠాన్ని కూడా చదవలేని స్థితిలో ఉన్నారని తేల్చింది. కొంతమంది విద్యార్థులైతే చివరకు అక్షరాలను సైతం గుర్తించలేని దీన స్థితిలో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేసింది. ఏఎస్ఈఆర్ దేశంలోని 589 జిల్లాల్లో 17,473 గ్రామాలకెళ్లి అక్కడ మూడేళ్ల నుంచీ 16ఏళ్లలోపు వయసుండి బడికెళుతున్న 5,62,305 మంది విద్యార్థులతో ఈ అధ్యయనం నిర్వహించింది. ఇందులో ఆ సంస్థ వెల్లడించిన విషయాలు సాక్షాత్తూ కేంద్ర ప్రభుత్వానికి సైతం విస్తుగొలిపాయి. ఇటీవలే కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ఆర్థిక సర్వే రెండో భాగంలో ఈ అధ్యయనం గురించి ప్రత్యేకంగా ఉటంకిస్తూ పాఠశాలల్లో క్షీణిస్తున్న విద్యా ప్రమాణాల పట్ల అసంతృప్తి, ఆందోళన వ్యక్తం చేసింది. ఈ అధ్యయనం తెలుగు రాష్ట్రాలకు సంబంధించి కూడా విస్తుగొలిపే విషయాలు వెలుగు చూశాయి.

మనవాళ్లూ చదవలేకున్నారు

తెలుగు రాష్ట్రాల్లోనూ కనీసం తెలుగు అక్షరాలు గుర్తించలేని విద్యార్థులు ఈ అధ్యయనంలో కనిపించారు. ఐదో తరగతిలో ఇలాంటి వారు ఆంధ్రాలో 4.5, తెలంగాణలో 3.1 శాతం ఉన్నారు. ఎనిమిదో తరగతిలోనూ ఇలాంటి వారు ఉండటం మరింత ఆశ్చర్యం కలిగించింది. ఆంధ్రాలో 1.6, తెలంగాణలో 1.2శాతం మంది విద్యార్థులు ఇలా ఉన్నారని ఈ అధ్యయనం తెలిపింది. కొంతమంది అక్షరాలను గుర్తించగలిగినా కనీసం రెండక్షరాల పదాలను చదవలేకపోతున్నారు. ఎనిమిదో తరగతికి వచ్చినా కనీసం రెండో తరగతి పాఠం కూడా చదవడం రాని విద్యార్థులు ఆంధ్రాలో 22.2, తెలంగాణలో 24.2 శాతం కనిపించారు. ఇక మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌లో రాజస్థాన్, మధ్యప్రదేశ్, జార్ఖండ్, బీహార్ రాష్ట్రాల్లో 30 శాతం మంది ఎనిమిదో తరగతి విద్యార్థులు రెండో తరగతి పాఠం చదవలేకపోతున్నారు.

ఆంగ్లం అర్థమేకాదు

దేశంలోని విద్యార్థుల్లో వారి మాతృభాష చదువులే కాదు, ఆంగ్ల చదువులోనూ వారి ప్రతిభ ఏమంత ఆశాజనకంగా లేదని ఈ అధ్యయనం పేర్కొంది. తెలుగు రాష్ట్రాల్లోని ఎనిమిదో తరగతి విద్యార్థులు చాలా మంది ఇంగ్లిషు పాఠంలోని వాక్యాలు చదవలేకపోతున్నారు. ఆంధ్రాలో 28.7, తెలంగాణలో 31.9 శాతం మంది విద్యార్థులు ఇలా ఇంగ్లిషు పాఠం చదవలేకపోతున్నారట. ఇక ఏడో తరగతిలో అయితే ఇలాంటి వారు రెండు రాష్ట్రాల్లోనూ 40 శాతంపైగానే ఉన్నారు. ఇంగ్లిషు అక్షరాలను గుర్తించలేని విద్యార్థులు కూడా పలు తరగతుల్లో గణనీయమైన శాతాల్లోనే కనిపించారు.

'తీసి'వేత దాటలేక

గణితంలోనూ విద్యార్థులు తడబడుతున్నారు. ఎనిమిదో తరగతి విద్యార్థుల్లో సగం మంది 'తీసివేత'లను దాటి భాగహారాలు కూడా చేయలేని స్థితిలో ఉన్నారు. కేవలం 50.4 శాతం మంది విద్యార్థులు మాత్రమే ఆంధ్రాలో భాగహారాలు చేస్తుంటే 31.3 శాతం మంది విద్యార్థులు తీసివేతలు చేయగలుగుతున్నారు. తెలంగాణలో కొంత పరిస్థితి మెరుగ్గా ఉంది. అక్కడ ఎనిమిదో తరగతి విద్యార్థుల్లో 55.1 శాతం మంది భాగహారాలు దాటి గణిత సమస్యలు పరిష్కరిస్తుంటే 27.2 శాతం మంది మాత్రం తీసివేతలు చేయగలుతున్నారు. ఏడో తరగతి విద్యార్థుల్లో ఈ ప్రతిభ ఉన్నవారు మరింత తక్కువ మంది కనిపించారు. రెండు రాష్ట్రాల్లోనూ ఎనిమిదో తరగతి విద్యార్థుల్లో ఒకటి నుంచి 9లోపు అంకెలను కూడా గుర్తించలేని విద్యార్థులు ఒకశాతం ఉండటం విస్తుగొలిపే అంశమే.



ఆంధ్రప్రదేశ్ - తెలుగు (గణాంకాలు శాతాల్లో)

తరగతి	అక్షరం గుర్తించలేని వారు	అక్షరం చదవగలిగిన వారు	పదాలు	1వ తరగతి పాఠం	రెండో తరగతి పాఠం చదివేవారు
4	4.5	8.4	20.1	22.9	44.1
5	4.5	7.3	11.5	21.6	55.1
6	2.4	4.2	11.2	22.6	59.6
7	2.3	3.1	7.6	17.6	69.4
8	1.6	2.4	4.3	13.8	77.8

గణితం

తరగతి	1–9 అంకెలు గుర్తించని వారు	అంకెలు గుర్తించిన వారు	తీసివేతలు వచ్చినవారు	భాగహారాలు తెలిసినవారు
4	1.4	32.2	41.1	24.4
5	2.7	28.4	31.7	37.2
6	1.7	21.8	34.1	42.5
7	1.4	23.8	33.5	41.5
8	1.0	17.3	31.3	50.4

ఇంగ్లీషు

తరగతి	అక్షరాలు గుర్తించని వారు	చిన్న అక్షరాలు	చిన్న పదాలు	సులభ వాక్యాలు చదివేవారు
4	11.6	20.6	27.5	40.3
5	8.6	15.3	28.8	47.3
6	8.8	12.5	21.3	57.5
7	6.4	12.6	21.0	60.0
8	3.8	9.4	15.5	71.3

తొలిరోజు ఆకట్టుకోని ఆర్గానిక్, నర్సరీ మేళా



డ్రాగన్ పండ్లు

ఈనాడు, అమరావతి: విజయవాడలో మంగళవారం ప్రారంభమైన ఆర్గానిక్, నర్సరీ మేళా తొలిరోజు నిరాశ మిగిల్చింది. ఇందులో పెద్ద ఎత్తున ఉత్పత్తులు, ఫలపుష్ప జాతుల మొక్కలను చూడొచ్చని నగర ప్రజలు, రైతులు తరలివచ్చినా...ఆశించిన స్థాయిలో లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తమైంది. ప్రత్యేకంగా స్టాల్స్ ఉంటాయి, శీతల వాతావరణంలోనే మొక్కలు, పండ్ల ప్రదర్శన ఉంటుందని చెప్పినా అక్కడ అలా లేదని పలువురు రైతులు చెబుతున్నారు. మైదానం చిన్నది కావడంతో నర్సరీలు, ఆర్గానిక్ ఉత్పత్తిదారులు ఎక్కువ మంది పాల్గొనేందుకు వీల్లేని విధంగా తయారైంది. ఉద్యానశాఖ అధికారులు మాత్రం బుధవారం నుంచి ఎక్కువ మంది వస్తారని సమాధానమిస్తున్నారు. ఈ నెల 18 వరకు ప్రదర్శన జరగనుంది.


డ్రాగన్ పండుపై ఆసక్తి..: ప్రదర్శనలో ఉన్నవాటిలో డ్రాగన్ మొక్కలు, పండ్లు అందర్నీ ఆకర్షిస్తున్నాయి. ఈ పండ్ల గుజ్జులో ఔషధగుణాలు ఉండటంతో ఎక్కువమంది మొక్కల కొనుగోలుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఒక్కో కాయ 600 గ్రాముల వరకు ఉంటుంది. ఏడాదికి కాపు మొదలవుతుంది. శుభకార్యాల సమయంలోనూ ఇవి కావాలని ఆర్డర్లు వస్తుంటాయని రైతు బి.రవీంద్ర తెలిపారు. జూన్ నుంచి పంట మొదలై సెప్టెంబరు వరకు వస్తుంది. ఇంటిపైన కూడా పెంచుకునే అవకాశం ఉంటుంది.

అమృత జామ..: ఇళ్ల ముందే కుండీల్లో పెంచుకునే రకాల్లో అమృత జామ ఆకట్టుకుంటోంది. ఆరు నెలల్లో కాపుకొచ్చే ఈ రకం మూడు అడుగుల ఎత్తు పెరగ్గానే కాయలనివ్వడం ప్రారంభిస్తోంది. నర్సరీల్లో ఈ మొక్కలను అందిస్తున్నారు. దీనితోపాటు తీపి నిమ్మ, టేబుల్ నిమ్మ మొక్కలు కూడా అందుబాటులో ఉన్నాయి.



కుండీలో పెంచుకునే జామ

జుట్టు పెరిగేందుకు తోడ్పడే చికిత్స



లాస్ ఏంజెలిస్: వెంట్రుకల రంధ్రాల్లోని మూలకణాలను క్రియాశీలంచేసే విధానాన్ని శాస్త్రవేత్తలు కనిపెట్టారు. దీంతో జుట్టు పెరుగుదలకు తోడ్పడే శక్తిమంతమైన ఔషధాలకు మార్గం సుగమమైంది. చర్మంపై వెంట్రుకల రంధ్రాల్లో ఉండే మూలకణాలు దీర్ఘకాలం జీవిస్తాయి. జుట్టు పెరగడంలో ఇవి ప్రముఖ పాత్ర పోషిస్తాయి. వీటిని చాలా అంశాలు ప్రభావితం చేస్తుంటాయి. దీంతో ఒక్కోసారి ఇవి పూర్తిగా నిద్రాణ స్థితిలోనే ఉండిపోతుంటాయి. ఫలితంగా జుట్టు పెరగకుండా ఆగిపోతుంది. ఈ కణాల జీవక్రియా విధానం చర్మకణాల కంటే భిన్నమైనదని తాజాగా అమెరికాలోని కాలిఫోర్నియా వర్సిటీ పరిశోధకులు గుర్తించారు. సాధారణ కణాలు ఎంజైమ్‌ల సాయంతో పోషకాలను విచ్ఛిన్నం చేస్తాయి. దీంతో వాటికి అవసరమైన శక్తి(మెటబోలైట్‌లను)ని సమకూర్చుకుంటాయి. అయితే వెంట్రుకల రంధ్రాల్లోని మూలకణాలు మాత్రం రక్తంలోని గ్లూకోజ్‌ను తీసుకుంటున్నట్లు పరిశోధకులు గుర్తించారు. ఇవి పైరువేట్‌గా పిలిచే మెటబోలైట్లను ఉత్పత్తిచేస్తున్నట్లు కనిపెట్టారు. పైరువేట్లు కణ కేంద్రంలోకి వెళ్లి లాక్టేట్‌గా మారి శక్తిని అందిస్తున్నట్లు తేల్చారు. ఎక్కువ లాక్టేట్ కేంద్రానికి అందితే మూలకణాలు క్రియాశీలమై.. వెంట్రుకలు వేగంగా పెరిగేందుకు తోడ్పడతాయా? అనే అంశంపై పరిశోధకులు దృష్టి కేంద్రీకరించారు. దీని కోసం ఎలుకల్లో జన్యు పరిజ్ఞానాన్ని ఉపయోగించి లాక్టేట్ ఉత్పత్తిని నియంత్రించారు. దీంతో వాటిలో వెంట్రుకల పెరుగుదల ఆగిపోయింది. అనంతరం లాక్టేట్ ఉత్పత్తిని పెంచగా.. కొత్త వెంట్రుకలు మొలవడం గమనించారు. 'లాక్టేట్ స్థాయిలను నియంత్రించడంతో వెంట్రుకల రంధ్రాల్లోని మూలకణాలను ప్రభావితం చేయొచ్చని తొలిసారిగా గుర్తించాం'అని పరిశోధనలో పాలుపంచుకున్న విలియమ్ లోరీ తెలిపారు.

గుండె గాయాలను మాన్పే పట్టీ



టొరంటో: గుండె గాయాలను మాయంచేసే చిట్టి పట్టీని శాస్త్రవేత్తలు అభివృద్ధిచేశారు. తపాలా బిళ్ల కంటే చిన్నగా ఉండే దీన్ని నేరుగా గుండెపై అంటించే వీలుంది. గుండె కణజాలాన్ని హృద్రోగాలు దెబ్బతీస్తాయి. దీన్ని పూర్వస్థితికి తీసుకొచ్చేందుకు వైద్యులు శస్త్రచికిత్సలు నిర్వహిస్తుంటారు. వీటితో ఒక్కోసారి కొత్త ముప్పులు చుట్టుముడతాయి. వీటిని అడ్డుకోవడమే లక్ష్యంగా కెనడాలోని టొరంటో వర్సిటీ నిపుణులు తాజా పట్టీని అభివృద్ధిచేశారు. 'ఆంజియో చిప్'గా పిలుస్తున్న దీనిలో సూక్ష్మ గుండె కణజాలం, రక్తనాళాలు ఉన్నాయి. వీటిని సిరంజిల సాయంతో రోగికి ఎక్కిస్తేచాలు. ఇవి రోగి గుండెపై అతుక్కుని పట్టీలా పరుచుకుంటాయి. దెబ్బతిన్న కణజాలాన్ని బాగుచేస్తాయి.

వ్యాధులను నిర్ధారించే 3డీ 'చిప్ ప్రయోగశాల'



వాషింగ్టన్: వ్యాధులను నిర్ధారించే ఓ చిట్టి ప్రయోగశాలను చిప్‌పై పరిశోధకులు అభివృద్ధిచేశారు. ఇది రక్తంలోని వ్యాధికారక బయోమార్కర్లను మెరుగ్గా గుర్తించడం విశేషం. దీనిలో 18*20 మైక్రోమీటర్ల వైశాల్యంలో సూక్ష్మ విభాగాలున్నాయి. వీటిని అధునాతన 3డీ పరిజ్ఞానంతో ముద్రించారు. వీటి గుండా రక్త నమూనా ప్రసరించేటప్పుడు... అతినీలలోహిత కాంతిని ప్రసరించే సూక్ష్మ ఎల్ఈడీలతో వ్యాధికారక బయోమార్కర్లను గుర్తించొచ్చు. తక్కువ ధరల్లోనే ఈ చిప్ ప్రయోగశాలలు అందుబాటులోకి వస్తాయని పరిశోధనలో పాలుపంచుకున్న అమెరికాలోని బ్రింగ్‌హామ్ యంగ్ వర్సిటీ పరిశోధకులు గ్రెగ్ నోర్డిన్ తెలిపారు.

వైరస్ దాడిపై '3డీ సినిమా'




వాషింగ్టన్: వైరస్ దాడిపై పరిశోధకులు ఓ 3డీ సినిమా రూపొందించారు. ఆరోగ్యవంతమైన కణాలపై దాడికి వైరస్ సిద్ధమవుతున్న దృశ్యాలు దీనిలో కనిపిస్తున్నాయి. కణాలు స్పందించే తీరుపై మెరుగైన అవగాహన, వైరస్‌లపై పోరాడే కొత్త చికిత్సా విధానాలకు ఈ పరిశోధన బాటలు పరుస్తోంది. అమెరికాలోని విస్కాన్సిన్-మిల్‌వాకీ వర్సిటీ నిపుణులు దీన్ని చేపట్టారు. అధునాతన ఎక్స్-రే ఫ్రీ ఎలక్ట్రాన్ లేజర్ (ఎక్స్ఎఫ్ఈఎల్)ల సాయంతో వారు లక్షలకొద్దీ వైరస్‌ల చిత్రాలను తీశారు. వీటిని సరైన క్రమంలో అమర్చేందుకు అల్గారిథమ్‌లను సిద్ధంచేశారు. అధునాతన 3డీ పరిజ్ఞానంతో దీన్ని సినిమాగా రూపొందించారు.

పొగాకు మొక్కల్లో.. పోలియో టీకా ఉత్పత్తి



లండన్: పోలియో టీకాను మొక్కల సాయంతో పరిశోధకులు ఉత్పత్తిచేశారు. దీని కోసం మొక్కల జీవక్రియలను వారు ఆధీనంలోకి తీసుకున్నారు. టీకా తయారీలో విప్లవాత్మక మార్పులకు బాటలు పరుస్తున్న ఈ పరిశోధనను బ్రిటన్‌లోని ఆక్స్‌ఫర్డ్ వర్సిటీ, జాన్ ఇన్నెస్ సెంటర్‌ల నిపుణులు చేపట్టారు. తొలుత పొగాకు మొక్కలకు ఇన్ఫెక్షన్ కలుగచేసే వైరస్‌లను వారు నియంత్రణలోకి తీసుకున్నారు. తాము చెప్పినవిధంగా నడుచుకునేలా వీటిలో జన్యుమార్పులు చేశారు. అనంతరం మట్టిలోని బ్యాక్టీరియాతో కలిపి వీటిని మొక్కలకు చేరవేశారు. దీంతో మొక్కల ఆకులను నకిలీ పోలియో వైరస్ తయారీకి ఉపయోగించుకోగలిగారు. ఇవి అచ్చంగా వైరస్‌లానే కనిపిస్తున్నా.. ఇన్ఫెక్షన్‌కు గురిచేయవు. వ్యాధి నిరోధక శక్తిని ప్రేరేపించడంలో క్రియాశీలంగా పనిచేస్తాయి.

ఏకబిగిన టీవీ షోల వీక్షణ వల్ల నిద్రలేమి



లండన్: టీవీ షోలను ఏకబిగిన వీక్షించే అలవాటు ఉన్నవారిలో నిద్ర నాణ్యత దెబ్బతిని.. అలసట, నిద్రలేమి కలిగే అవకాశాలున్నాయని పరిశోధకులు తెలిపారు. సుదీర్ఘ వీక్షణ అనంతరం ఏర్పడుతున్న మేధోపరమైన అప్రమత్తత ఈ పరిస్థితికి కారణమవుతున్నట్లు పేర్కొన్నారు. బెల్జియంలోని ల్యూవెన్ విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకులు కొంతమంది యువతీయువకులపై సర్వే నిర్వహించి.. ఈ విషయాలను వెల్లడించారు. టీవీలు, ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్‌లు, ఇతర పరికరాల్లో 3 నుంచి 8 గంటలపాటు టీవీ షోలను చూస్తున్నవారిని అతిగా వీక్షిస్తున్నవారి కింద పరిశోధకులు పరిగణించారు. తమ సర్వేలో పాల్గొన్నవారిలో 80 శాతం మంది తాము అతిగా టీవీ షోలను వీక్షిస్తున్నట్లు అంగీకరించారని వారు తెలిపారు. వీరిలో 52శాతం మంది తాము ఏకబిగిన 3 నుంచి 4 ఎపిసోడ్లు చూస్తున్నట్లు పేర్కొన్నారని తెలిపారు. ఇలా అతిగా వీక్షిస్తున్నవారిలో 98 శాతం మంది నాణ్యమైన నిద్రలేక సమస్యలు ఎదుర్కొంటున్నారని పరిశోధకులు వెల్లడించారు. ఆసక్తికరమైన టీవీ షోల వల్ల వీక్షకుల్లో నిద్రకు ముందు కూడా మేధోపరమైన అప్రమత్తత కొనసాగుతోందని.. వారు నిద్రలోకి జారుకోకుండా అది అడ్డుకుంటుందని పరిశోధకులు తెలిపారు. ఈ అప్రమత్తతను తగ్గించి విశ్రాంతపరిచే చికిత్సలు, చిట్కాలు పాటిస్తే ప్రయోజనం కలగవచ్చని పేర్కొన్నారు.

ఛాంపియన్



ఆనంద్ హవాకు తెరపడ్డాక.. కార్ల్‌సన్ తిరుగులేని ఆధిపత్యంతో ప్రపంచ ఛాంపియన్ అయ్యాక.. హోరాహోరీ చెస్ సమరాలు అరుదైపోయాక.. చెస్ ప్రపంచంలో ఏదో తెలియని నిర్లిప్తత.. అనాసక్తి! కానీ 'నేను మళ్లీ వస్తున్నా' అని అతను ప్రకటించడం ఆలస్యం.. స్తబ్దుగా ఉన్న చెస్ ప్రపంచంలో ఒక అలజడి! అతను రంగంలోకి దిగగానే అందరిలోనూ తెలియని ఆసక్తి! కొన్నేళ్లుగా చెస్ చర్చలు ఆపేసిన వాళ్లలోనూ మళ్లీ ఉత్సాహం! ఎలా ఆడతాడో.. ఏం గెలుస్తాడో తర్వాత.. 'కింగ్ ఈజ్ బ్యాక్' అంటూ చెస్ ప్రియుల్లో ఒక రకమైన ఉత్తేజం!

ఈ అలజడి.. ఈ ఆసక్తి.. ఈ ఉత్సాహం.. ఈ ఉత్తేజం వెనుక ఉన్నది.. గ్యారీ కాస్పరోవ్! ఐతే రెండు దశాబ్దాల పాటు ప్రపంచ చెస్‌ను శాసించినందుకు మాత్రమే అతడింతగా జనాల దృష్టిని ఆకర్షించలేదు. ఆటలో అయినా.. ఆటేతర విషయాల్లో అయినా.. అతడి ప్రతి అడుగూ విలక్షణం! కార్పోవ్ లాంటి దిగ్గజాన్ని మట్టికరిపించి 22 ఏళ్లకే ప్రపంచ ఛాంపియన్ అయినా.. చెస్‌ను నడిపించే ఫిడెనే ఎదిరించి తనే ఒక సమాంతర చెస్ వ్యవస్థను నడిపినా.. రిటైర్మెంట్ తర్వాత రాజకీయాల్లోకి అడుగుపెట్టి పుతిన్‌నే వ్యతిరేకించినా.. ఇప్పుడు 54 ఏళ్ల వయసులో అనూహ్యంగా ఆటలోకి పునరాగమనం చేసినా.. ఇలా కాస్పరోవ్ ఏం చేసినా విలక్షణమే.

తానే రాజు తానే మంత్రి

చెస్ ప్రపంచంలోకి కాస్పరోవ్ ఆగమనమే సంచలనం. పదేళ్ల వయసులో ప్రఖ్యాత బోత్వినిక్ చెస్ స్కూల్‌లో చేరి శిక్షణ పొందిన కాస్పరోవ్.. 12 ఏళ్ల వయసులోనే విపరీతమైన పోటీలో సోవియట్ జూనియర్ ఛాంపియన్‌షిప్ గెలిచాడు. 1980లో 17 ఏళ్ల వయసులో జూనియర్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ నెగ్గిన కాస్పరోవ్.. 20 ఏళ్లకే ప్రపంచ రెండో ర్యాంకుకూ చేరాడు. ఎనిమిదేళ్లుగా ప్రపంచ నంబర్‌వన్‌గా కొనసాగుతున్న కార్పోవ్‌ను తప్ప అందరినీ వెనక్కి నెట్టేశాడు కాస్పరోవ్.

అతడి దెబ్బకు8 కిలోలు తగ్గాడు..: అప్పటికి కార్పోవ్ పదేళ్లుగా ప్రపంచ ఛాంపియన్‌గా కొనసాగుతున్నాడు. నంబర్‌వన్ ర్యాంకూ అతడిదే. ప్రపంచ చెస్ చరిత్రలోనే కార్పోవ్‌ను మించిన క్రీడాకారుడు లేడంటూ అతణ్ని కీర్తిస్తున్నారు. అలాంటి స్థితిలో 33 ఏళ్ల కార్పోవ్‌తో 1984 ప్రపంచ ఛాంపియన్‌షిప్ మ్యాచ్‌కు అర్హత సాధించాడు కాస్పరోవ్. 21 ఏళ్ల ఈ కుర్రాడి బలమేంటన్నది ఆ టోర్నీతోనే మొత్తం ప్రపంచానికి తెలిసింది. ఈ టోర్నీ ఐదు నెలల పాటు సాగడం విశేషం. ఎవరు ముందు ఆరు విజయాలు సాధిస్తే వారితే టైటిల్ కాగా.. 9 గేమ్‌లు ముగిసేసరికే కార్పోవ్ 4-0తో ఆధిక్యం సాధించడంతో కాస్పరోవ్ చిత్తుగా ఓడటం ఖాయమనుకున్నారు. ఆ స్థితిలో కాస్పరోవ్ పుంజుకుని కార్పోవ్‌ను ఏడిపించిన తీరు.. చరిత్రలో నిలిచిపోయేదే. వరుసగా 17 గేమ్‌లను డ్రా చేయడం ద్వారా కార్పోవ్ ఆత్మవిశ్వాసాన్ని దెబ్బ తీసిన కాస్పరోవ్.. తర్వాత కూడా పట్టు కొనసాగించాడు. 48 గేమ్‌లు అయినా ఫలితం తేలలేదు. అప్పటికి 40 గేమ్‌లు డ్రా కాగా.. కార్పోవ్ 5-3తో ఆధిక్యంలో నిలిచాడు. ఆ స్థితిలో నిర్వాహకులు వివాదాస్పద రీతిలో మ్యాచ్ ఆపేసి కార్పోవ్‌ను విజేతగా ప్రకటించారు. కాస్పరోవ్ దెబ్బకు శారీరకంగా, మానసికంగా శక్తి హీనుడైన కార్పోవ్.. ఈ ఐదు నెలల్లో 8 కిలోల బరువు తగ్గడం విశేషం.



ఆరు నెలల తర్వాత అదే కార్పోవ్‌ను ఓడించి 22 ఏళ్లకే ఛాంపియన్ అయి ఈ ఘనత సాధించిన అత్యంత పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించాడు. కార్పోవ్‌పై గెలిచాక రెండు దశాబ్దాల పాటు కాస్పరోవ్‌కు ఎదురే లేదు. అతడిపై పైచేయి సాధించింది ఒక్కరే. అతను.. క్రామ్నిక్. అతడు క్లాసిక్ చెస్‌లో కాస్పరోవ్‌పై ఐదు గేమ్‌లు గెలిచి, నాలుగింట్లో ఓడాడు. కార్పోవ్‌తో 158 సార్లు తలపడ్డ కాస్పరోవ్.. అతడిపై 28 సార్లు నెగ్గి, 21 సార్లు ఓడాడు. ఐదుసార్లు ప్రపంచ ఛాంపియన్ ఆనంద్‌కు కూడా కాస్పరోవ్‌పై గొప్ప రికార్డేమీ లేదు.

మొండిఘటమే..: కాస్పరోవ్ కెరీర్లో వివాదాలకూ లోటు లేదు. మ్యాచ్‌ల సమయంలో విచిత్ర ప్రవర్తనతో ప్రత్యర్థుల్ని మానసికంగా దెబ్బ తీయడానికి అతను చేసే ప్రయత్నాల సంగతి తెలిసిందే. కెరీర్లో పతాక స్థాయిలో ఉన్నపుడు చెస్‌ను నడిపించే ఫిడెనే ఎదిరించి.. దానికి పోటీకి ప్రొఫెషనల్ చెస్ సంఘం (పీసీఏ)ను ఏర్పాటు చేసి ప్రత్యేకంగా ప్రపంచ చెస్ టోర్నీ నిర్వహించాడు. ఆనంద్ సహా అప్పటి ప్రముఖ క్రీడాకారుల్ని అందులో ఆడించి తన పంతం నెగ్గించుకున్న మొండిఘటం కాస్పరోవ్. ఐతే స్పాన్సర్ వెనక్కి తగ్గడంతో దాన్ని ఆపేయాల్సి వచ్చింది.

ఆనంద్‌తో ఆ గేమ్ చూశారా?

కాస్పరోవ్‌తో ఆనంద్ చెస్ వైరం ఆసక్తికరం. అతడిపై విషీ పైచేయి సాధించకపోయినా.. గట్టి పోటీనే ఇచ్చాడు. కాస్పరోవ్‌తో 48 క్లాసిక్ గేమ్‌ల్లో తలపడ్డ ఆనంద్ మూడింట్లో నెగ్గి 15 గేమ్‌లు ఓడాడు. 30 డ్రా అయ్యాయి. ర్యాపిడ్ గేముల్లో 5 నెగ్గి.. 10 ఓడాడు. 13 గేమ్‌లు డ్రా అయ్యాయి. వీళ్లిద్దరి మధ్య అత్యంత ఆసక్తికరంగా సాగిన మ్యాచ్ అంటే.. 1996 బ్లిట్జ్ చెస్ ఫైనలే. టైబ్రేక్‌కు దారి తీసిన ఈ ఫైనల్లో మొదటి గేమ్ డ్రా అయింది. రెండో గేమ్ ఆరంభంలో కాస్పరోవే ఆధిపత్యం చలాయించాడు. ఐతే కీలక సమయాల్లో అద్భుతమైన ఎత్తులతో ప్రత్యర్థుల్ని ఉక్కిరి బిక్కిరి చేసే కాస్పరోవే.. 33వ ఎత్తు దగ్గర పెద్ద తప్పిదం చేసి ఆనంద్‌కు దొరికిపోయాడు. ఆ తప్పిదాన్ని సొమ్ము చేసుకుని ఈ థ్రిల్లర్ గేమ్‌ను నెగ్గి టైటిల్ ఎగరేసుకుపోయాడు ఆనంద్. ఆ 33వ ఎత్తు దగ్గర తప్పిదం చేసినట్లు క్షణాల్లో గ్రహించి కాస్పరోవ్ ఇచ్చిన హావభావాల్ని చెస్ ప్రేమికులు అంత సులువుగా మరిచిపోలేరు. యూట్యూబ్‌లోకి వెళ్లి ఆ గేమ్‌ను చూస్తే కలిగే థ్రిల్లే వేరు.

కంప్యూటర్ × కాస్పరోవ్

ఐబీఎం సంస్థ తయారు చేసిన ప్రత్యేకమైన చెస్ కంప్యూటర్‌తో కాస్పరోవ్ పోరు అతడి కెరీర్లో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన విషయం. శాస్త్రవేత్తలు, చెస్ నిపుణుల సాయంతో ఈ కంప్యూటర్‌ను తయారు చేసి కాస్పరోవ్ మీద పోటీకి దించింది ఐబీఎం. 1996లో జరిగిన మొదటి పోరులో కాస్పరోవ్ 4-2తో గెలిచాడు. ఐతే తర్వాతి ఏడాది ఐబీఎంకంప్యూటర్‌ను మరింత అభివృద్ధి పరిచి.. బరిలోకి దించింది. ఆ మ్యాచ్‌లో కాస్పరోవ్ 2.5-3.5 తేడాతో ఓడాడు. ఐతే గేమ్‌ల సందర్భంగా మానవ ప్రమేయం కూడా తోడవడం వల్లే తాను ఓడానని, రీమ్యాచ్ నిర్వహించాలని కాస్పరోవ్ డిమాండ్ చేశాడు. కానీ అందుకు ఒప్పుకోని ఐబీఎం.. ఆ కంప్యూటర్‌ను నాశనం చేసింది. 'మ్యాన్ వెర్సస్ మెషీన్' పేరుతో దీనిపై ఒక డాక్యుమెంటరీ కూడా తయారవడం విశేషం.

రిటైరయ్యాక..

రెండు దశాబ్దాల పాటు ఆధిపత్యం చలాయించిన కాస్పరోవ్ 2005లో చెస్ నుంచి వైదొలిగాడు. చెస్‌లో ఇంకేదో సాధించాలన్న లక్ష్యాలేమీ లేకపోవడం వల్లే తాను వైదొలుగుతున్నట్లు ప్రకటించాడు. రిటైరయ్యాక అతనేమీ ఖాళీగా ఉండిపోలేదు. కొందరు ఛాంపియన్లను తయారు చేశాడు. ప్రస్తుత ఛాంపియన్ కార్ల్‌సన్ కూడా అతడి వద్ద శిక్షణ పొందినవాడే. ఆనంద్‌కు సైతం 2010 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌కు ముందు కాస్పరోవ్ సాయం చేశాడు. తర్వాత ఆనంద్‌ను కార్ల్‌సన్ ఢీకొనేటపుడు అతడికి అండగా ఉన్నాడు. మూడేళ్ల కిందట ఫిడె అధ్యక్ష పదవికి కాస్పరోవ్ పోటీ పడి, ఓడిపోయాడు. రిటైర్మెంట్ తర్వాత చెస్‌పై పుస్తకాలు రాసిన కాస్పరోవ్.. రాజకీయాల్లోనూ అడుగుపెట్టాడు. చెస్‌ను ఎంతో అభిమానించే రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను నియంతగా అభివర్ణిస్తూ, గట్టిగా వ్యతిరేకించిన ప్రముఖుల్లో కాస్పరోవ్ ఒకడు. మానవహక్కుల కార్యకర్తగా, రాజకీయవేత్తగా కొనసాగుతూనే ఆటతో అనుబంధాన్ని కొనసాగించిన కాస్పరోవ్.. 12 ఏళ్ల విరామానంతరం పోటీ చెస్‌లోకి రావడం ఆశ్చర్యమే.

కోహ్లి సేన జెండా ఎగరేసింది



పల్లెకెలె: టెస్టు సిరీస్‌లో శ్రీలంకను 3-0తో వైట్‌వాష్ చేసిన ఉత్సాహంలో ఉన్న భారత క్రికెట్ జట్టు.. మంగళవారం 70వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంది. కెప్టెన్ కోహ్లి, చీఫ్ కోచ్ రవిశాస్త్రితో పాటు జట్టు సభ్యులు, సహాయక సిబ్బంది జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. "దేశ ప్రజలందరికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు. భారతీయుడనైనందుకు ప్రతిరోజూ హృదయం ఉప్పొంగుతోంది. స్వాతంత్ర్య దినోత్సవం నాకింకా ప్రత్యేకం. ఆ రోజు మా నాన్న పుట్టినరోజు కూడా. చిన్నప్పుడు స్వాతంత్ర దినోత్సవం నాడు స్నేహితులతో కలిసి దిల్లీ వీధుల్లో గాలిపటాలు ఎగరేసి ఆడుకున్న రోజులు ఇంకా గుర్తున్నాయి. ఆ రోజు అన్ని చోట్లా భారత జెండా ఎగురుతుంటే చాలా చాలా ఆనందంగా అనిపించేది" అని కోహ్లి ట్విటర్‌లో తన అనుభూతుల్ని పంచుకున్నాడు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మాజీ పాకిస్థాన్ క్రికెటర్ షాహిద్ అఫ్రిది సామాజిక మాధ్యమం ద్వారా భారతీయులకు తన సందేశాన్ని తెలిపాడు. "భారత్‌కు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు. ఓర్పు, ప్రేమ, శాంతి కోసం రెండు దేశాలు కలిసి పనిచేయాలి. మానవత్వాన్ని పెంపొందించుకోవాలి" అని ట్వీట్ చేశాడు.

దోస్త్ మేరా దోస్త్



ముంబయి: తిరుగులేని ఆటతీరును ప్రదర్శించిన టీమ్‌ఇండియా మొట్టమొదటిసారి విదేశాల్లో ఓ సిరీస్‌ను 3-0తో చేజిక్కించుకుంది. కోహ్లీసేన రెట్టించిన ఉత్సాహంతో వన్డే సిరీస్‌కు సన్నద్ధమవుతోంది. ఐతే జట్టు ఇంతగా విజయవంతం కావడానికి కారణమేంటన్నది ఆసక్తి కలిగించే ప్రశ్న ? దీనిపై కోహ్లి స్పందిస్తూ.. తాము సీనియర్, జూనియర్ అన్నట్లు కాకుండా కలిసి ఆడుతున్న స్నేహితుల్లా ఉంటామని చెప్పాడు. "ఫలానా 'ఎక్స్' ఎన్ని మ్యాచ్‌లు ఆడాడు లేదా ఫలానా 'వై ఆడాడా అని కూడా డ్రెస్సింగ్‌రూమ్‌లో మేం ఆలోచించం. ప్రతి రోజూ ఎవరిని చూస్తామన్నదే ముఖ్యం. మా బృందంలో ఎవరైనా ఎవరి గురించైనా జోక్ చేయొచ్చు. మా జట్టుకు సంబంధించి నాకు చాలా గర్వంగా అనిపించే అంశమిదే" అని కోహ్లి అన్నాడు. "భిన్న వ్యక్తిత్వాలున్నా మేం ఒకరిని ఒకరం అంగీకరించాం. అందుకే తాము భిన్నంగా చేయాల్సిందేమీ లేదని ఆటగాళ్లు భావిస్తారు. డ్రెస్సింగ్‌రూమ్‌లో వాతావరణం అలా ఉంటే పరిణతి చెందడానికి ఆటగాళ్లు తక్కువ సమయం తీసుకుంటారు. ఎందుకంటే జట్టు నుంచి వారిపై ఎలాంటి ఒత్తిడీ ఉండదు" అని కోహ్లి అన్నాడు.

రాహుల్‌కు కెరీర్ అత్యుత్తమ ర్యాంకు



దుబాయ్: టీమ్‌ఇండియా ఓపెనర్ లోకేశ్ రాహుల్ కెరీర్ అత్యుత్తమ ర్యాంకు సాధించాడు. మంగళవారం ప్రకటించిన ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో బ్యాట్స్‌మెన్ విభాగంలో రాహుల్ రెండు స్థానాలు మెరుగుపర్చుకుని 9వ ర్యాంకు సొంతం చేసుకున్నాడు. శ్రీలంకతో టెస్టు సిరీస్‌లో 358 పరుగులు చేసిన ఓపెనర్ శిఖర్ ధావన్ 10 స్థానాలు మెరుగై 28వ ర్యాంకు సాధించాడు. టెస్టుల్లో ధావన్‌కు ఇదే అత్యుత్తమ ర్యాంకు. చివరి టెస్టులో సెంచరీతో చెలరేగిన హార్దిక్ పాండ్య 45 స్థానాలు మెరుగై కెరీర్‌లో అత్యుత్తమంగా 68వ ర్యాంకు సాధించాడు. పుజారా 4వ, విరాట్ కోహ్లి 5వ, రహానె పదో ర్యాంకుల్లో ఉన్నారు. బౌలింగ్ విభాగంలో రవీంద్ర జడేజా ప్రథమ, ఆర్.అశ్విన్ మూడో స్థానాల్లో కొనసాగుతున్నారు. ఆల్‌రౌండర్లలో జడేజా నంబర్‌వన్ స్థానాన్ని కోల్పోయి రెండో స్థానానికి పడిపోయాడు. షకీబల్ హసన్ (బంగ్లాదేశ్) ప్రథమ స్థానం సాధించాడు. అశ్విన్ మూడో ర్యాంకులో ఉన్నాడు. ఇక 125 పాయింట్లతో టీమ్‌ఇండియా నంబర్‌వన్ టెస్టు జట్టుగా కొనసాగుతోంది.

శ్రీశాంత్ నాలుగేళ్ల తర్వాత..



కోచి: జీవితకాల నిషేధం నుంచి ఇటీవలే విముక్తుడైన క్రికెటర్ శ్రీశాంత్ నాలుగేళ్ల తర్వాత మైదానంలో అడుగుపెట్టాడు. ఓ ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో ఓ జట్టుకు నాయత్వం వహించాడు. మ్యాచ్ చూసేందుకు జనం కూడా చెప్పుకోదగ్గ సంఖ్యలోనే హాజరయ్యారు. కెరీర్ ఆరంభంలో శ్రీశాంత్ తన ప్రతిభకు మెరుగులు దిద్దుకున్న మైదానంలోనే మ్యాచ్ జరిగింది. శ్రీశాంత్ మైదానంలో అడుగుపెట్టగానే రెండు జట్ల సభ్యులు అతడికి గులాబీలను బహూకరించారు. స్పాట్ ఫిక్సింగ్ కుంభకోణానికి సంబంధించి బీసీసీఐ శ్రీశాంత్‌పై విధించిన జీవితకాల నిషేధాన్ని ఈ నెల 7న కేరళ హైకోర్టు ఎత్తివేసిన సంగతి తెలిసిందే. "మళ్లీ మైదానంలో అడుగుపెట్టినందుకు సంతోషంగా ఉంది. నా కెరీర్ ఆరంభించిన మైదానంలోనే పునరాగమనం చేస్తున్నా. ఇక్కడి నుంచి తిరువనంతపురం, అక్కడి నుంచి టీమ్ ఇండియాకు చేరుకోవాలనుకుంటున్నా" అని శ్రీశాంత్ చెప్పాడు.

హారిక శుభారంభం



అబుదాబి: భారత గ్రాండ్ మాస్టర్ ద్రోణవల్లి హారిక అబుదాబి అంతర్జాతీయ చెస్ మాస్టర్స్ టోర్నీలో శుభారంభం చేసింది. మంగళవారం తొలి రౌండ్లో భారత్‌కే చెందిన మిథిల్ అజ్గోన్‌కర్‌పై విజయం సాధించింది. తెల్లపావులతో ఆడిన హారిక.. 34 ఎత్తుల్లో మిథిల్‌ను ఓడించింది. తన తర్వాతి రౌండ్లో మూడో సీడ్ మమెడోవ్ (అజెర్బైజాన్)తో హారిక పోటీ పడనుంది. ఈ టోర్నీలో విజేతలుగా నిలిచిన వారికి రూ.4.8 లక్షల ప్రైజ్‌మనీ లభించనుంది. రెండో స్థానంలో నిలిచిన వారు రూ.3.5 లక్షలు పొందుతారు.

ఆనంద్ ఓటములతో.. కాస్పరోవ్ డ్రాలతో



సెయింట్ లూయిస్ (అమెరికా): ప్రపంచ మాజీ ఛాంపియన్ విశ్వనాథన్ ఆనంద్ సెయింట్ లూయిస్ ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ టోర్నమెంట్‌ను పేలవంగా ఆరంభించాడు. తొలి రోజు రెండు గేముల్లో అతడు పరాజయం పాలయ్యాడు. మొదటి రౌండ్లో హికారు నకమురా (అమెరికా) చేతిలో కంగుతిన్న ఆనంద్.. మూడో రౌండ్లో లెవోన్ అరోనియన్ (అర్మేనియా) చేతిలో ఓడిపోయాడు. లొనియర్ డొమింగ్వెజ్ (క్యూబా)తో రెండో రౌండ్‌ను ఆనంద్ డ్రాగా ముగించాడు. మూడు రౌండ్లు ముగిసేసరికి ఫాబియానో కర్వానా (అమెరికా), కాంగ్ లియామ్ (వియత్నాం), నెపోమ్నియాచి (రష్యా), అరోనియన్‌లు నాలుగు పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నారు. ఐతే చెస్ దిగ్గజం గారీ కాస్పరోవ్ 12 ఏళ్ల తర్వాత పునరాగమనం చేయడమే తొలి రోజు ఆటలో అతి పెద్ద విశేషం. అతడు తన ఆటతో ఫర్వాలేదనిపించాడు. కర్జాకిన్ (రష్యా), నకముర, డొమింగ్వెజ్‌లతో గేమ్‌లను డ్రాగా ముగించాడు. రెండో రోజు ఆటలో కాస్పరోవ్‌ను ఆనంద్ ఢీకొంటాడు.

పుణెరి చేతిలో బెంగాల్ చిత్తు

అహ్మదాబాద్: ప్రొ కబడ్డీ లీగ్‌లో మంగళవారం పుణెరి పల్టాన్ జట్టు 34-17తో బెంగాల్ వారియర్స్‌ను చిత్తుగా ఓడించింది. పుణెరి తరపున డిఫెండర్లు సందీప్ నర్వాల్ (7 పాయింట్లు), గిరీష్ ఎర్నాక్ (4 పాయింట్లు).. రైడర్ మోరె (6 పాయింట్లు) రాణించారు. బెంగాల్ తరపున రైడర్ మణిందర్ సింగ్ (6 పాయింట్లు), డిఫెండర్ రణ్‌సింగ్ (7 పాయింట్లు)లు ప్రధాన స్కోరర్లు. ఆరంభంలో పోరు హోరాహోరీగానే సాగింది. పది నిమిషాల ఆట పూర్తయ్యేసరికి రెండు జట్లు 5-5తో సమంగా నిలిచాయి. ఐతే పుణెరి క్రమంగా జోరు పెంచింది. 15వ నిమిషంలో ప్రత్యర్థిని ఆలౌట్ చేసి 12-5తో ఆధిక్యం సంపాదించింది. విరామానికి 17-10తో ఆధిక్యంలో నిలిచిన పుణెరి.. తర్వాత కూడా అదే జోరు కొనసాగించింది. మరోసారి బెంగాల్‌ను ఆలౌట్ చేసింది 24-11తో ఆధిక్యంలో నిలిచింది. ఆఖరి వరకు అదే జోరును ప్రదర్శించింది. మరో మ్యాచ్‌లో గుజరాత్ ఫార్చూన్‌జెయింట్స్ 27-24తో బెంగళూరు బుల్స్‌పై విజయం సాధించింది.



ప్రో కబడ్డీలో ఈనాడు

హరియాణా స్టీలర్స్ × తమిళ్ తలైవాస్ రాత్రి 8 గంటలకు
గుజరాత్ ఫార్చ్యూన్‌జెయింట్స్ × తెలుగు టైటాన్స్ రాత్రి 9 గంటలకు
ప్రసారం: స్టార్‌స్పోర్ట్స్ 2లో; వేదిక అహ్మదాబాద్.

దక్షిణాఫ్రికా-ఎ చేతిలో భారత్-ఎ చిత్తు

ప్రిటోరియా: దక్షిణాఫ్రికా-ఎతో తొలి అనధికార టెస్టు మ్యాచ్‌లో భారత్-ఎ 235 పరుగుల భారీ తేడాతో చిత్తుగా ఓడింది. 447 పరుగుల ఛేదనలో ఓవర్‌నైట్ స్కోరు 192/6తో మంగళవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్-ఎ.. మరో 19 పరుగులు మాత్రమే జోడించి ఆలౌటైంది. పేసర్ జూనియర్ డలా (5/36) విజయంలో కీలకపాత్ర పోషించాడు. దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 346 పరుగులు చేయగా, భారత్ 120 పరుగులకే కుప్పకూలింది. దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 220/5 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఈ గెలుపుతో సఫారీ జట్టు రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచింది.

నెదర్లాండ్స్‌పై భారత్ విజయం

ఆమ్‌స్టర్‌డమ్: ప్రపంచ నాలుగో ర్యాంకర్ జట్టు నెదర్లాండ్స్‌కు భారత హాకీ జట్టు మరో షాకిచ్చింది. వరుసగా రెండో మ్యాచ్‌లో నెదర్లాండ్స్‌ను చిత్తుచేసి రోబో సూపర్ సిరీస్‌ను కైవసం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో భారత్ 2-1తో నెదర్లాండ్స్‌పై విజయం సాధించింది. నాలుగో నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను గుర్జంత్‌సింగ్ గోల్‌గా మలిచి భారత్ ఖాతా తెరిచాడు. మరో 14 నిమిషాల్లో మ్యాచ్ ముగుస్తుందనగా మన్‌దీప్‌సింగ్ పెనాల్టీ కార్నర్ గోల్‌తో భారత్ ఆధిక్యాన్ని 2-0కు పెంచాడు. 58వ నిమిషంలో నెదర్లాండ్స్ ఆటగాడు సాండెర్ పెనాల్టీ కార్నర్ గోల్ చేసినా.. 2-1తో భారత్ విజేతగా నిలిచింది.


రావమ్మ.. మరియమ్మ!



శరపోవాకు యుఎస్ ఓపెన్ వైల్డ్‌కార్డ్

న్యూయార్క్: నిషేధం తొలగాక తిరిగి గ్రాండ్‌స్లామ్‌లో ఆడాలని తపిస్తోన్న రష్యా రాణి మరియా శరపోవా ఆశ ఎట్టకేలకు తీరింది. ఆమెకు యుఎస్ ఓపెన్ వైల్డ్‌కార్డ్ లభించింది. నిషిద్ధ ఉత్ప్రేరకం వాడినందుకు 15 నెలల నిషేధానికి గురైన శరపోవా ఏప్రిల్‌లో తిరిగి కోర్టులో అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. ఐతే నిషేధం తొలగినా ఫ్రెంచ్ ఓపెన్ నిర్వాహకులు ఆమెకు వైల్డ్‌కార్డ్ ఇచ్చేందుకు తిరస్కరించారు. చాలా మంది ఆటగాళ్లు కూడా వైల్డ్‌కార్డ్ ద్వారా ఆమె ఆగమనాన్ని వ్యతిరేకించారు. గాయం కారణంగా వింబుల్డన్ క్వాలిఫయింగ్ టోర్నీ నుంచి శరపోవా తప్పుకుంది. ఐతే నిషేధం పూర్తయ్యాక వైల్డ్‌కార్డ్‌లతోనే స్టట్‌గార్ట్, మాడ్రిడ్, రోమ్ వంటి టోర్నీల్లో ఆడిన ఆమె ప్రస్తుతం ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 148వ ర్యాంకులో ఉంది.

టైగర్‌వుడ్స్ శరీరంలో ఐదు రకాల డ్రగ్స్



లాస్‌ఏంజెలెస్: అమెరికా గోల్ఫ్ దిగ్గజం టైగర్‌వుడ్స్ శరీరంలో ఐదు రకాల డ్రగ్స్ ఆనవాళ్లు ఉన్నట్లు తేలింది. గత మేలో కారులో స్పృహ కోల్పోయి ఉన్న టైగర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అతని మూత్రాన్ని పరీక్షించిన అనంతరం మెడికల్ రిపోర్ట్ ఆధారంగా పోలీసుల వివరాలు వెల్లడించారు. అతని శరీరంలో చాలా శక్తిమంతమైన పెయిన్ కిల్లర్స్ హైడ్రోకోడోన్, హైడ్రోమోర్ఫోన్, వీటితో పాటు ఆల్ప్రోజోం, నిద్ర కోసం ఉపయోగించే జోల్పిడెం, టీహెచ్‌సీ అవశేషాలు ఉన్నట్లు గుర్తించారు. "ఇంతకుముందు చెప్పినట్లుగానే డాక్టర్ల సహాయంతో నేను మందులు తీసుకుంటున్నాను. కానీ ఇటీవల వెన్నునొప్పి, నిద్రలేమిని తప్పించుకోవడానికి సొంతంగా మందులు మొదలుపెట్టాను. డాక్టర్లు చెప్పకుండా మందులు వాడడం తప్పు" అని వుడ్స్ అన్నాడు.



వరదలకు భయపడి పశ్చిమ బెంగాల్‌లోని దక్షిణ దినాజ్‌పూర్‌లో బలుర్‌ఘాట్‌కు సమీపాన గల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలిపోతున్న దృశ్యం

తెరిపిన పడని వరద బాధిత రాష్ట్రాలు

దిల్లీ: వరదలకు విలవిల్లాడుతున్న బిహార్, అసోంలలో పరిస్థితులు కుదుట పడడం లేదు. అసోంలో మృతుల సంఖ్య మరింత పెరగ్గా, లక్షలాది మంది ఇంకా నిరాశ్రయులుగానే ఉన్నారు. రైళ్ల రాకపోకలకు తీవ్రంగా అంతరాయం కలుగుతోంది. బిహార్‌లో మృతుల సంఖ్య 56కి చేరింది. పశ్చిమ బెంగాల్ మాత్రం కాస్త తెరిపిన పడుతోంది. కొన్ని ప్రాంతాలు మినహా ఎక్కడా పెద్దగా వర్షాలు కురియలేదు. నదులు కూడా శాంతిస్తున్నాయి.



గువాహటికి, మోరిగావ్ జిల్లాలో వరదలకు రోడ్డు కొట్టుకు పోవడంతో సాయం కోసం ఎదురుచూస్తున్న గ్రామస్థులు

ఉత్తరాఖండ్‌లో కొనసాగుతున్న గాలింపు

దేహ్రాదూన్: ఉత్తరాఖండ్‌లోని పిథోడ్‌గఢ్ జిల్లాలో రెండుసార్లు స్వల్ప వ్యవధిలో కుంభవృష్టి కురవడంతో ఆరుగురు సైనికులు సహా గల్లంతైన 10 మంది కోసం గాలింపు కొనసాగుతోంది. ఎడతెగని వానల కారణంగా సహాయక చర్యలకు తీవ్ర అంతరాయం వాటిల్లుతోంది.

నేపాల్‌లో మృతులు 120

కాఠ్‌మాండూ: నేపాల్‌లో వరద మృతుల సంఖ్య 120కి చేరింది. అనేక ప్రాంతాల్లో ప్రజా జీవనానికి తీవ్ర అంతరాయం కొనసాగుతోంది.

గోసంరక్షణవాదుల దాడులు పెరిగాయి

- **2016లో 300 హింసాత్మక ఘటనలు**
- **భారత్‌లో మత స్వాతంత్ర్యంపై అమెరికా ప్రభుత్వ నివేదిక**

వాషింగ్టన్: గోసంరక్షణ పేరుతో మతపరంగా అల్పసంఖ్యాకులైన వర్గాలపై భారతదేశంలో దాడులు అధికమయ్యాయని అమెరికా ప్రభుత్వ నివేదిక ఒకటి అభిప్రాయపడింది. 2016కి సంబంధించి 'అంతర్జాతీయ మత స్వాతంత్ర్యం' అనే అంశంపై రూపొందించిన ఈ అధికారిక నివేదికను విదేశీ వ్యవహారాల మంత్రి రెక్స్ టిల్లర్సన్‌ను విడుదల చేశారు. డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వెలువరించిన తొలి అధికారిక నివేదిక ఇది. భాజపా నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అల్పసంఖ్యాక వర్గాలపై, వారి ప్రార్థనా స్థలాలపై హిందూమత జాతీయవాదుల దాడులు, హింసాత్మక ఘటనలు పెరిగిపోయాయని పౌరసమాజం సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని నివేదిక పేర్కొంది. దేశవ్యాప్తంగా మతమార్పిడులు అధికమయ్యాయని, వ్యక్తిగత హక్కులతో పాటు మత విశ్వాసాలను పాటించే స్వేచ్ఛకూ ఆటంకం కలుగుతుందని నివేదిక ఆరోపించింది. గోసంరక్షణ పేరుతో ప్రధానంగా ముస్లింలే లక్ష్యంగా సామూహిక దాడులు జరుగుతున్నాయని పేర్కొంది. దాడులకు పాల్పడిన వారిని అరెస్టు చేయటం, విచారణ జరిపి శిక్షించటంలో అధికార యంత్రాంగం తరచూ విఫలమవుతుందని విమర్శించింది. క్రిస్టియన్లు లక్ష్యంగా 2015లో 177 దాడులు జరగ్గా 2016లో వాటి సంఖ్య 300 పెరిగిపోయాయన్న ఎవలాంజికల్ ఫెలోషిప్ ఆఫ్ ఇండియా నివేదికను ఉటంకించింది. ముమ్మారు తలాక్‌తో ముస్లిం మహిళలు తీవ్ర వివక్షకు గురవుతున్నారని, తలాక్ చెల్లుబాటును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో దాఖలైన వ్యాజ్యాన్నీ, దీనిపై ముస్లిం వర్గాల స్పందన, ప్రతిస్పందనలనూ అమెరికా ప్రభుత్వ నివేదిక ప్రస్తావించింది.

పాక్ కాల్పుల్లో మహిళకు గాయాలు

శ్రీనగర్: నియంత్రణ రేఖ వెంబడి జమ్మూ-కశ్మీర్‌లో వరుసగా మూడో రోజు పాకిస్థాన్ సైన్యం కాల్పుల విరమణ ఒప్పందానికి తూట్లు పొడించింది. ఈమేరకు ఉరి సెక్టార్‌లో మంగళవారం కాల్పులకు దిగడంతో ఓ మహిళకు తూటా గాయాలయ్యాయి. ఎలాంటి కవ్వింపు లేకుండా పాక్ సైనికులు రెండు చోట్ల కాల్పులు జరిపినట్లు సైనికాధికారి ఒకరు తెలిపారు.

అఫ్గాన్‌ను అమెరికా వీడాలి

కాబూల్: అఫ్గానిస్థాన్‌ను అమెరికా వీడి వెళ్లాలంటూ యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు తాలిబన్లు లేఖ రాశారు. అఫ్గాన్‌లో అమెరికా వ్యూహాన్ని సమీక్షించాలని ట్రంప్ ఆదేశించారని, తద్వారా తనకు ముందు అధ్యక్షులుగా చేసిన నాయకులు అఫ్గాన్‌లో చేసిన తప్పిదాలను ఆయన గుర్తించారని చెప్పారు.

అవగాహనలేమితో భారత్‌లో మహమ్మారిగా మారుతున్న రొమ్ము క్యాన్సర్

లండన్: భారత్‌లో అవగాహనలేమి కారణంగా రొమ్ము క్యాన్సర్‌ను ముందుగా గుర్తించే చర్యలు కొరవడుతున్నాయని.. ఫలితంగా ఆ వ్యాధి మహమ్మారిగా మారుతోందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మహిళలు త్వరగా వైద్యసాయం పొందాలంటే.. పురుషులకూ అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. బ్రిటన్‌లోని పోర్ట్స్‌మౌత్ విశ్వవిద్యాలయ పరిశోధకులు ఓ అధ్యయనం జరిపి.. ఈ విషయాలను వెల్లడించారు. భారత్‌లో రొమ్ము క్యాన్సర్ పట్ల అవగాహన స్థితిని వారు గమనించారు. సాంస్కృతిక, మతపరమైన కారణాలతో పురుష వైద్యులను కలిసేందుకు మహిళలు వెనుకాడుతున్నారని.. కుటుంబ సభ్యులపై అతిగా ఆధారపడుతుండటం కూడా వ్యాధిని గుర్తించే చర్యలు తీసుకోవడంలో జాప్యానికి కారణమవుతోందని చెప్పారు. అవగాహన కల్పించేందుకు సంప్రదాయ ప్రచార కార్యక్రమాల కన్నా ఆశా కార్యకర్తలే (కమ్యూనిటి నర్సులు) ఉత్తమమైన మార్గమని పరిశోధకులు అన్నారు. పాఠశాలల్లోనూ అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని.. ప్రచార మాధ్యమాలను వాడుకోవాలని సూచించారు. 2012లో భారత్‌లో 70వేల మంది మహిళలు రొమ్ము క్యాన్సర్‌తో మృత్యువాతపడ్డారు. 2020కి ఈ సంఖ్య 76వేలకు చేరుతుందని.. వ్యాధికి గురవుతున్న సగటు వయసు 50 ఏళ్ల నుంచి 30 ఏళ్లకు తగ్గిపోతుందని అంచనాలు ఉన్నాయి.

31న నింగిలోకి ఐఆర్ఎన్ఎస్ఎస్-1హెచ్ ఉపగ్రహం

- **2018 మార్చిలోగా చంద్రయాన్-2 రాకెట్ ప్రయోగం**
- **అక్టోబరులో అంతరిక్ష వారోత్సవాలు**
- **షార్‌లో మరో రెండు భారీ ప్రాజెక్టులు: కున్హికృష్ణన్**

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: శ్రీహరికోట రాకెట్ కేంద్రం(షార్) పరిధిలో మరో రెండు భారీ ప్రాజెక్టులు నిర్మాణం కానున్నాయని షార్ సంచాలకులు కున్హికృష్ణన్ పేర్కొన్నారు. శ్రీహరికోటలో మంగళవారం ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. శ్రీహరికోటలో ఘన ఇంధన కర్మాగారంలో ఏఎస్ఎంపీ నిర్మాణానికి రూపకల్పన చేస్తున్నామని వివరించారు. ఇందులో 29 రకాల వసతులు సమకూరనున్నాయన్నారు. ఇది పూర్తయితే ఏడాదికి 12 పీఎస్ఎల్వీ రాకెట్లకు ఇంధనం అందించగలమని ఆశాభావం వ్యక్తం చేశారు. పీఎస్ఎల్‌వీ ఇంటిగ్రేషన్ ఫెసిలిటీ (పీఐఎఫ్) ప్రాజెక్టు త్వరలో అందుబాటులోకి రానుందని, దీని ద్వారా ఏడాదికి 15 పీఎస్ఎల్‌వీ రాకెట్లను నింగిలోనికి పంపే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఈ నెల 31న పీఎస్ఎల్‌వీ-సీ39 రాకెట్ ద్వారా ఐఆర్ఎన్ఎస్ఎస్-1హెచ్ ఉపగ్రహాన్ని నింగిలోనికి పంపుతున్నట్లు కున్హికృష్ణన్ వివరించారు. గతంలో పంపిన ఐఆర్ఎన్ఎస్ఎస్-1ఏ ఉపగ్రహం స్థానంలోకి దీన్ని పంపి సేవలు అందుబాటులోకి తీసుకురానున్నామన్నారు. ఈఏడాది చివరిలోగా రెండు పీఎస్ఎల్‌వీ, ఒక జీఎస్ఎల్‌వీ ప్రయోగాలను చేయనున్నామని చెప్పారు. 2018 మార్చిలోగా చంద్రయాన్-2 రాకెట్‌ను నింగిలోకి పంపాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నట్టు చెప్పారు. షార్‌లో రెండో వాహక అనుసంధాన భవనాన్ని ఆరు నెలల్లో అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన వివరించారు. దీని ఎత్తు 96 మీటర్లు ఉండగా 82 మీటర్ల నిర్మాణం పూర్తికావొచ్చిందని చెప్పారు. ఈ ఏడాది అక్టోబరులో అంతరిక్ష వారోత్సవాలను రాష్ట్రంలోని 13 జిల్లాలతో పాటు తమిళనాడులో ఐదుచోట్ల, ఒడిశాలోని భువనేశ్వర్‌లో కూడా నిర్వహిస్తామని కున్హికృష్ణన్ చెప్పారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2015-17 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00